www.andhrajyothy.com వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 262

శనివారం | 6-1-2024 | పేజీలు: 14

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 12.43 తదుపరి ఏకాదశి; నక్షత్రం: స్వాతి రా. 9.24 తదుపరి విశాఖ; వర్జ్యం: తె. 3.10-4.49; దుర్ముహూర్తం: ఉ. 6.51-8.19; అమృతఘడియలు: మ. 12.01-1.43; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.51

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆసియా కుబేరుడు అదానీ

ఒక్కరోజే 770 కోట్ల డాలర్లు పెరిగి

9,760 కోట్ల డాలర్లకు చేరిన సంపద

ప్రపంచ రిచ్ లిస్ట్‌లో 12వ స్థానం

సంపదలో అంబానీని దాటేశాడు 10

ఐవీ బదులు నీళ్లు

ఇంజెక్షన్లు అమ్ముకుని బదులుగా నీళ్లు నింపిన నర్సు 2

అమెరికాలోని ఓ ఆస్పత్రిలో 10 మంది రోగులు మృతి!

మా ఇద్దరికీ సంబంధాలు సరిగా లేవు

నా రాజకీయ ఆకాంక్షలను తొక్కిపెట్టాడు

ఏపీలో జగన్ పాలన అస్తవ్యస్తం

ఎవరినీ కలవరు... ప్యాలెస్‌కే పరిమితం

ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో షర్మిల భేటీ

కర్తవ్య బోధ చేసిన అధిష్ఠానం పెద్దలు

పీసీసీ చీఫ్, కర్ణాటక నుంచి రాజ్యసభ?

రాహుల్ సమక్షంలో ఉన్నారని వెల్లడి!

కాంగ్రెస్ పూర్వవైభవానికి కార్యాచరణ

అన్నతో 'ఢీ'!

జగన్‌ను అధికారం నుంచి దించేయడమే లక్ష్యం

కాంగ్రెస్ పెద్దలకు షర్మిల స్పష్టీకరణ!

త్వరలో జనంలోకి షర్మిల

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

'జగనన్న వదిలిన బాణం'... దిశ మార్చుకుని జగన్‌పైకే వదిలిన బాణంలా మారుతోంది. కాంగ్రెస్ కండువా కప్పుకొన్న సీఎం జగన్ సోదరి షర్మిల... ఏపీలో జగన్‌ను గద్దెదించి, కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు సంపూర్ణంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. వైఎస్సార్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన షర్మిల... శుక్రవారం హైదరాబాద్ తిరిగి వెళ్లే ముందు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కీలక చర్చలు జరిపారు. ఖర్గేతో జరిగిన

మిగతా 11వ పేజీలో...



శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో షర్మిల




కనిగిరి సభకు హాజరైన జనం.. ఢంకా మోగిస్తున్న చంద్రబాబు

నియంతను సాగనంపుదాం..

రా.. కదలిరా!

ప్రజలకు చంద్రబాబు పిలుపు



జగన్ ఒక్క చాన్స్ అంటూ వచ్చాడు

రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు

13 లక్షల కోట్ల అప్పులు చేశాడు

ఒక్కరికీ ఉపాధి కల్పించలేదు

జాబ్ కేలెండర్ అన్నాడు.. ఎవరికి ఉద్యోగాలిచ్చాడు?

జగన్‌ను రాజకీయాల నుంచి శాశ్వతంగా లేకుండా చేయాలి

మళ్లీ సైకిల్ పాలన తేవాలి

మన భవిష్యత్ మన చేతుల్లోనే

కనిగిరి బహిరంగ సభ నుంచి టీడీపీ అధినేత పిలుపు

ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకున్న ఎమ్మెల్యేలు, మంత్రులను జగన్ ఇతర నియోజకవర్గాలకు మార్చుతున్నాడు. ఈ ఇంట్లో పనికిరాని చెత్త ఆ ఇంట్లో పనికొస్తుందా?

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు. అయితే ఈ సీఎం అప్పులు తెచ్చి బటన్ నొక్కడం తప్ప అభివృద్ధి పట్టించుకోలేదు.

- చంద్రబాబు

ఒంగోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అన్నది లేకుండా చేసిన నియంత ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి.. మళ్లీ మంచి రోజులు రావాలని రాష్ట్ర ప్రజలంతా సంకల్పం తీసుకోవాలని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు పిలుపిచ్చారు. అక్రమ కేసులు, దాడులతో తెలుగు సమాజాన్ని భయపెడుతున్న సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడం టీడీపీ, జనసేన నాయకులది మాత్రమే కాదని.. ప్రజలందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. 'రా.. కదలిరా' పేరుతో చేపట్టిన ఎన్నికల శంఖారావ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రకాశం

మిగతా 11వ పేజీలో...

నాడు పెట్టుబడులు, పరిశ్రమలు..

నేడు గంజాయి, డ్రగ్స్

నాటి టీడీపీ పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తే.. నేడు గంజాయి, డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని చంద్రబాబు ధ్వజమెత్తారు. 'విశాఖలో

మిగతా 11వ పేజీలో...

కావాలి.. రావాలి..

మంగళవారం!

అందరికీ 'ట్యాక్స్ డే'.. జగన్‌కేమో 'అప్పు.. డే'

32/39

ఈ ఆర్థిక సంవత్సరంలో 39 మంగళవారాలు

32 మంగళవారాలు ఆర్బీఐ నుంచి అప్పులు

ఆర్థిక శాఖకు రెండే రెండు పనులు! ఒకటి... శుక్రవారం రాగానే అప్పు కోసం ఆర్బీఐకి ఇండెంట్ పెట్టి... మంగళవారం ఆ అప్పు తెచ్చుకోవడం! రెండు... అప్పుల పరిమితి ముగియగానే ఢిల్లీ చుట్టూ చెప్పులరిగేలా తిరిగి, అదనపు అప్పులకు అనుమతి తెచ్చుకోవడం.

నాలుగున్నరేళ్లుగా ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇచ్చిన దాఖలాలే లేవు. మరి... తెచ్చిన అప్పులన్నీ ఎటు పోతున్నాయో!

టీడీపీ హయాంలోనూ అప్పులు తెచ్చారు. కానీ... బాధ్యతాయుతంగా! ఆ అప్పులను శాశ్వత ఆస్తులను సమకూర్చడానికి, ఆదాయం పెంచడానికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు, మౌలిక వసతుల అభివృద్ధికి ఉపయోగించారు.



ఆర్బీఐ నుంచి తెచ్చిన అప్పే రూ.58,450 కోట్లు

మిగిలిన అప్పులూ కలిపితే దాదాపు లక్ష కోట్లు

కేవలం తొమ్మిది నెలల్లో పెంచిన రుణ భారమిది

అభివృద్ధికి ఖర్చు చేయకుండా 'నిరర్థక' భారం

ఏటేటా పడిపోతున్న అభివృద్ధి వ్యయం

2022-23లో కేవలం 30 శాతమే!

మరి... తెస్తున్న అప్పులతో ఏం చేస్తున్నట్లు?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

విమర్శించని నోరు... అరవని కుక్క ఉండదు! ఇది రజనీకాంత్ తాజా డైలాగ్! అలాగే... ఏపీలో అప్పు తీసుకురాని మంగళవారం కూడా లేదు!

బడి పిల్లలు ఆదివారం కోసం ఎదురు చూసినట్లు... సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శనివారం కోసం ఎదురు చూసినట్లు..

జగన్ సర్కారు మంగళవారం కోసం ఆశగా, ఆబగా, ఆత్రంగా ఎదురు చూస్తుంది! జనమందరికీ ఇది 'ట్యాక్స్ డే'! జగన్‌కు మాత్రం ఇది 'అప్పు.డే!' ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటిదాకా 39 మంగళవారాలు వచ్చాయి. ఇందులో 32 మంగళవారాలు ప్రభుత్వం బాండ్ల వేలం ద్వారా అప్పు తెచ్చింది. 7 మంగళవారాలు మాత్రం ఎందుకు వదిలేశారంటారా!? దానికీ కారణం ఉంది. అప్పుల పరిమితి ముగిసిపోవడం వల్ల. కేంద్రం నుంచి కొత్త అప్పులకు

మిగతా 12వ పేజీలో...



భారతీ సిమెంట్స్‌కు సుప్రీం షాక్

ఈడీ జప్తు చేసిన ఎఫ్‌డీల విడుదలకు నో

టీ-హైకోర్టు ఉత్తర్వుల కొట్టివేత

న్యూఢిల్లీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): భారతీ సిమెంట్స్‌కు సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసిన రూ.150 కోట్ల ఎఫ్‌డీలను విడుదల చేయాలని ఆదేశిస్తూ తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొట్టివేసింది. బ్యాంకు గ్యారెంటీలను తీసుకుని ఎఫ్‌డీలను విడుదల చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ

మిగతా 12వ పేజీలో...

మరికొందరికి టికెట్ల నిరాకరణ

వైసీపీలో పెరిగిన రచ్చ

జగన్‌కు 'కాపు' గుడ్‌బై!

నమ్మించి గొంతు కోశారు

దరిద్రపు సర్వేల పేరుతో నో అంటారా?

స్వతంత్రంగా బరిలోకి దిగుతా

రాయదుర్గం ఎమ్మెల్యే ప్రకటన

మంత్రి జయరాంకూ జగన్ ఝలక్

ఎంపీగా పోటీ చేయాలని సూచన

గుంటూరుకు మారాలని 'లావు'కూ..

పేట నుంచైతేనే పోటీ చేస్తానన్న ఎంపీ 11



వైసీపీలో టికెట్ల రచ్చ మరింత పెరిగింది. సీట్లపై తాడేపల్లి ప్యాలెస్ నుంచి వస్తున్న ఆదేశాలతో అసంతృప్తులు రగులు తున్నారు. శుక్రవారం మరో ఎమ్మెల్యే పార్టీకి గుడ్‌బై చెప్పారు.

వివేకా హత్యలో శివశంకర్‌రెడ్డిదే కీలక పాత్ర

ఆధారాల చెరిపివేతకే పరిమితం కాదు

హత్యకు ముందు రెక్కీ నిర్వహించారు

కుట్ర అమలు చేసేందుకు డబ్బులిచ్చారు 12

మా ప్రాణాలకు సైతం ముప్పుంది: సునీత

సాక్షులను బెదిరించారు: సీబీఐ అధికారులు

ఆధారాల చెరిపివేతకే జైలా: శివశంకర్

బెయిల్ పిటిషన్‌పై టీ-హైకోర్టు తీర్పు రిజర్వు

సర్కారుపైకి చీమలదండు

చిరుద్యోగుల కదనంతో అలజడి

ఇప్పటికే సమ్మెలో అంగన్వాడీలు

మున్సిపల్ వర్కర్లదీ అదే బాట

సమగ్రశిక్ష, కేజీబీవీ ఉద్యోగులూ...

సంక్రాంతి లోపు జీతాలు పెంచాలి

లేకుంటే రాష్ట్రంలో పనులు ఆపేస్తాం

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల అల్టిమేటం

ఎన్నికల వేళ జగన్ ప్రభుత్వానికి సెగ 3



బెజవాడలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

ఎల్లుండి నుంచి ఆర్టీసీ ఉద్యోగుల పోరుబాట

కో.. అంటే కోటి..!

» ఐఐటీ బాంబే విద్యార్థులకు భారీ జీతాలు.. 85 మంది ఎంపిక

ముంబయి, జనవరి 5: సుమారు 85 మంది ఐఐటీ బాంబే విద్యార్థులు మొదటి దశ ప్లేస్‌మెంట్లలో కోటి రూపాయలకు పైగా వార్షిక వేతనాలతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సంవత్సరం ప్లేస్‌మెంట్లలో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి ఎక్కువమంది అత్యధిక వేతనాలతో ఎంపికయ్యారు. మొదటి దశ ప్లేస్‌మెంట్లకు సంబంధించిన నివేదికను ఐఐటీ బాంబే గురువారం రాత్రి విడుదల చేసింది. మొదటి దశ ప్లేస్‌మెంట్లలో విద్యార్థులు సగటున 36.9 లక్షల వార్షిక వేతనంతో ఎంపికవగా.. గతేడాది ఇది రూ.32.25 లక్షలుగా ఉంది. మరోవైపు అల్గో ట్రేడింగ్ కారణంగా దెబ్బతిన్న ఆర్థిక రంగంలో గతేడాది సగటు వార్షిక వేతనంతో పోలిస్తే 22% తగ్గుదల నమోదైంది. గతేడాది ఈ విభాగంలో రూ.41.7 లక్షల ప్యాకేజీ ఉండగా.. ఈ ఏడాది రూ.32.4 లక్షలకు పరిమితమైంది. గతేడాదితో పోలిస్తే మొదటి దశ క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఐటీ, సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్ విభాగాల్లో వేతనాలు స్వల్పంగా పెరిగాయి.

కొవిడ్‌తో ఒక్కరోజులో 12 మంది మృతి

» కొత్తగా 761 కేసులు: కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ, జనవరి 5: దేశంలో మరోసారి కొవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఒక్కరోజులో 761 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లోనే 12 మంది చనిపోయారని కేంద్ర ఆరోగ్యశాఖ శుక్రవారం వెల్లడించింది. కేరళలో అయిదుగురు, కర్ణాటకలో నలుగురు, మహారాష్ట్రలో ఇద్దరు, ఉత్తరప్రదేశ్‌లో ఒక్కరు మహమ్మారికి బలయ్యారు. ఈ క్రమంలో దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4,334కు చేరిందని, రికవరీ రేటు 98.81 శాతంగా ఉందని ఆరోగ్యశాఖ తెలిపింది. మరోవైపు దేశంలో కొవిడ్-19 ఉపవేరియంట్ జేఎన్.1 కేసులు గురువారం నాటికి 619కు చేరాయని అధికారులు వెల్లడించారు.

ప్రకాశంలో మూడు కేసులు

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 5: ప్రకాశం జిల్లాలో శుక్రవారం మూడు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఒంగోలు దేవుడు చెరువుకు చెందిన యువకుడికి, మండల కేంద్రమైన మద్దిపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు, పొదిలి మండలం ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలోని కంభాలపాడుకు చెందిన మరొకరికి వైరస్ సోకింది.

ఐవీ బదులు నీళ్లు

» ఇంజెక్షన్లు అమ్ముకుని బదులుగా నీళ్లు నింపిన నర్సు

» అమెరికాలోని ఓ ఆస్పత్రిలో 10 మంది రోగులు మృతి!

మెడ్‌ఫర్, జనవరి 5: రోగులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన ఓ నర్సు క్రూరంగా ప్రవర్తించింది. తన దొంగతనాలను కప్పిపుచ్చుకునేందుకు ఐవీ ఇంజెక్షన్లలో ఔషధానికి బదులు నీళ్లు నింపి రోగులకు ఇచ్చింది. ఆ నర్సు చేసిన పనికి అమెరికాలోని ఓ ఆస్పత్రిలో కనీసం 10 మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. ఒరెగాన్ రాష్ట్రం మెడ్‌ఫర్డ్‌లోని అసంటే రోగ్ రీజనల్ మెడికల్ సెంటర్‌లో ఈ ఘటన జరిగింది. నొప్పి నుంచి ఉపశమనానికి రోగులకు ఐవీ(నరానికి ఇచ్చే ఇంజెక్షన్) ద్వారా ఇచ్చే ఫెంటనిల్ అనే ఔషధం స్థానంలో ఆ నర్సు నీటిని నింపింది. ఆస్పత్రి నుంచి ఫెంటనిల్ ఔషధాలను మాయం చేసిన ఆ నర్సు.. తన తప్పు కప్పిపుచ్చుకునేందుకు ఈ పనికి పాల్పడింది. సదరు నర్సు 2022 నుంచే ఔషధం స్థానంలో నీళ్లు నింపిన ఇంజెక్షన్లను రోగులకు ఇస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.



రామమందిర ప్రారంభోత్సవం..
ఇక్బాల్ అన్సారీకి ఆహ్వానం



అయోధ్య, జనవరి 5: రామమందిర ప్రారంభోత్సవానికి హాజరు కావాలంటూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్.. రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసులో కక్షిదారు అయిన ఇక్బాల్ అన్సారీకి కూడా శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేసింది. ట్రస్టు సభ్యులు రామ్‌పథ్ సమీపంలోని కోటియా పంజి టోలాలోని ఆయన ఇంటికి వెళ్లి, ఆహ్వాన పత్రికను అందజేశారు. దీనిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయోధ్య హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కులందరి ప్రాంతమని, ఇక్కడ అందరం సంతోషంగా ఉన్నామని తెలిపారు. కాగా అయోధ్య-బాబ్రీ మసీదు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ముస్లింలు గౌరవిస్తారని గతంలో అన్సారీ పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిర భూమి పూజ మొదటి ఆహ్వానాన్ని కూడా ఇక్బాల్ అన్సారీకే అందజేశారు.

అయోధ్య ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు

న్యూఢిల్లీ, జనవరి 5: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య పట్టణంలో ఉన్న విమానాశ్రయానికి 'మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం, అయోధ్యధామ్' అనే పేరు పెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అయోధ్య ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ విమానాశ్రయం హోదా కల్పిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. దీనివల్ల దేశ విదేశాలకు చెందిన యాత్రికులు, భక్తులు అయోధ్యకు తరలివస్తారని.. తద్వారా అయోధ్య గొప్ప పుణ్యక్షేత్రంగానేగాక ఆర్థికకేంద్రంగానూ మారుతుందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. క్యాబినెట్ నిర్ణయంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేస్తూ.. 'పవిత్ర నగరం అయోధ్యను యావత్ ప్రపంచంతో అనుసంధానించటానికి మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది' అని పేర్కొన్నారు. ప్రధాని అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు ఇతర నిర్ణయాలు కూడా తీసుకున్నారు. భూ విజ్ఞానశాస్త్ర పరిశోధనలకు సంబంధించిన ఐదు వేర్వేరు పథకాలను కలుపుతూ పృథ్వీ విజ్ఞాన్ అనే కొత్త పథకానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.

జమిలి ఎన్నికలపై 15లోగా సలహాలివ్వండి

న్యూఢిల్లీ, జనవరి 5: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'పై మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ జమిలి ఎన్నికలపై ప్రజల సలహాలు, సూచనలను ఆహ్వానించింది. దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు గాను ప్రస్తుత చట్టాల్లో చేయాల్సిన మార్పులకు సంబంధించి సలహాలు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రజలు తమ సలహాలను onoe.gov.in వెబ్‌సైట్‌లో లేదా schlc@gov.in కు ఈ-మెయిల్ ద్వారా ఈ నెల 15లోగా పంపాలని తెలిపింది. 15వ తేదీ వరకు అందిన సలహాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని, వాటినే కమిటీ పరిశీలిస్తుందని వెల్లడించింది.

డీకే శివకుమార్‌పై హైకోర్టుకు వెళ్లిన సీబీఐ

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై దర్యాప్తునకు అనుమతించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ సీబీఐ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. గతంలో సీబీఐకి ఇచ్చిన అనుమతులను కర్ణాటక క్యాబినెట్ ఇటీవలే రద్దు చేసింది. కేసును లోకాయుక్తకు అప్పగించింది. దీన్ని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం.. డివిజన్ బెంచ్‌కు రిఫర్ చేసింది.

మెడికల్ కాలేజీల్లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్

న్యూఢిల్లీ, జనవరి 5: పరిశోధనలు, క్లినికల్ నైపుణ్యాలను ప్రోత్సహించే దిశగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) కీలక నిర్ణయం తీసుకుంది. తన ఆధ్వర్యంలోని వైద్య కళాశాలల్లో తొలిసారిగా పోస్ట్-డాక్టోరల్ ఫెలోషిప్ కోర్సులను ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు వైద్య సంస్థలు వైద్యులకు శిక్షణ ఇచ్చేందుకు తమ స్థాయిలో కోర్సులను రూపొందించగా.. ఎన్ఎంసీ వాటిని ఆమోదించేది. కాగా, ఎన్ఎంసీ.. ఇటీవల 'పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్-2023'ని నోటిఫై చేసింది. తాజా నిబంధనల ప్రకారం.. పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం ప్రతిపాదిత నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్ట్స్) అమల్లోకి వచ్చేవరకు ప్రస్తుత నీట్-పీజీ కొనసాగుతుంది.

అరేబియాలో హైజాక్ హైడ్రామా!

న్యూఢిల్లీ, జనవరి 5: అరేబియా సముద్రం సోమాలియా తీరంలో హైజాక్‌కు గురైన కార్గో నౌకను భారత నావికాదళం చుట్టుముట్టి బందీలను కాపాడింది. నేవీ చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ చూసి కంగుతిన్న హైజాకర్లు పారిపోయారు. నౌకలోని 15 మంది భారత సిబ్బందితో సహా మొత్తం 21 మందిని కమాండోలు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. బ్రెజిల్ నుంచి బహ్రెయిన్‌కు బయలుదేరిన 'ఎంవీ లీలా నోర్ఫోక్' అనే కార్గో నౌక గురువారం సాయంత్రం సోమాలియా తీరానికి చేరగా.. అందులోకి అక్రమంగా ప్రవేశించిన సాయుధులైన దుండగులు దాన్ని హైజాక్ చేశారు. ఈ విషయాన్ని యూకే మేరీటైమ్ ట్రేడ్ ఆపరేషన్ (యూకేఎంటీఓ) ధ్రువీకరించింది. భారత నేవీకి సమాచారం ఇచ్చింది. అప్రమత్తమైన నేవీ.. యుద్ధనౌక ఐఎన్ఎస్ చెన్నైతో పాటు హెలికాప్టర్లు, ఓ ఎయిర్‌క్రాఫ్ట్, ప్రిడేటర్ డ్రోన్లను రంగంలోకి దింపింది. నేవీ హెచ్చరికలకు భయపడి హైజాకర్లు తమ ప్రయత్నాన్ని విరమించుకొని పారిపోయారని అధికారులు వెల్లడించారు.

ఈడీ అధికారులపై దాడి

» బెంగాల్‌లో రెచ్చిపోయిన టీఎంసీ మద్దతుదారులు


దాడిలో ధ్వంసమైన కారు... తీవ్రంగా గాయపడిన ఈడీ అధికారి

కోల్‌కతా, జనవరి 5: రేషన్ కుంభకోణం నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ నేత షాజహాన్ షేక్ ఇంట్లో సోదాలు చేసేందుకు వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులపై.. ఆయన అనుచరులు, టీఎంసీ మద్దతుదారులు తీవ్రదాడికి పాల్పడ్డారు. వారితోపాటు వచ్చిన సీఆర్పీఎఫ్ జవాన్లపైన, అక్కడున్న మీడియాపైనా దాడి చేసి, వారి వాహనాలనూ ధ్వంసం చేశారు. పశ్చిమబెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల జిల్లా సందేశ్‌ఖాలీ ప్రాంతంలో జరిగిందీ ఘటన. రేషన్ కుంభకోణానికి సంబంధించి ఈడీ అధికారులు శుక్రవారం బెంగాల్ వ్యాప్తంగా 15చోట్ల ఏకకాలంలో సోదాలు చేశారు. బెంగాల్ మంత్రి జ్యోతిప్రియ మాలిక్‌కు సన్నిహిత అనుచరుడిగా పేరున్న షాజహాన్ ఇల్లు కూడా వాటిలో ఒకటి. శుక్రవారం సోదాల నిమిత్తం ఈడీ బృందం అక్కడికి చేరుకునేసరికి తాళం వేసి ఉంది. తాళం తీయడం కోసం వారు షాజహాన్‌కు, ఆయన కుటుంబసభ్యులకు పలుమార్లు ఫోన్ చేసినా ఎవరూ ఫోన్ తీయలేదు. దాదాపు గంట తర్వాత.. అధికారులు ఆ ఇంటి తాళం పగలగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో షాజహాన్ అనుచరులు, స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని అధికారులను ఘెరావ్ చేశారు. వారిపై దాడికి దిగారు. దీంతో అధికారులు ఆటోలు, బైకులు ఇలా ఏది దొరికితే ఆ వాహనం ఎక్కి ప్రాణాలు అరచేత పెట్టుకుని ఆ ప్రదేశానికి దూరంగా వెళ్లిపోయారు. 800 నుంచి 1000 మంది లాఠీలు, రాళ్లు, ఇటుకలతో ఈ దాడిలో పాల్గొన్నారని.. తమ అధికారులు ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని ఈడీతెలిపింది. అధికారుల మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు , వారి జేబుల్లో ఉన్న డబ్బు, పర్సులను సైతం.. దాడికి పాల్పడ్డ మూక ఎత్తుకుపోయినట్టు వెల్లడించింది. ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది.

గవర్నర్ ఆగ్రహం..

జరిగిన ఘటనపై బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని ఎన్నికల ముందు జరిగే హింసగా అభివర్ణించిన బోస్.. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఆటవిక దాడులను ఆపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వ్యాఖ్యానించారు. ఘటనపై కేంద్రం జోక్యం చేసుకుని, ఎన్ఐఏతో దర్యాప్తు జరిపించాలని విపక్ష నేత సువేందు అధికారి అభిప్రాయపడ్డారు. ఇక.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ దాడిని దురదృష్టకరంగా అభివర్ణించింది. ఈడీ తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించింది.

పవార్ మనుమడి కంపెనీలో సోదాలు

ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ సోదరుని మనుమడు, ఆ పార్టీ ఎమ్మెల్యే రోహిత్‌పవార్ కంపెనీలో ఈడీ శుక్రవారం సోదాలు చేసింది. బారామతి ఆగ్రో అనే కంపెనీకి ఆయన సీఈఓగా వ్యవహరిస్తున్నారు. కంపెనీకి సంబంధించి కనీసం ఆరు స్థలాల్లో సోదాలు జరిగాయి. మహారాష్ట్ర సహకార బ్యాంకు నుంచి తీసుకున్న రుణాల మళ్లింపులో మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ రోహిత్‌పవార్‌పై కేసు నమోదు చేసింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యే నివాసంలో ఈడీ సోదాలు

» రూ.5 కోట్ల నగదు, 5 కిలోల బరువున్న మూడు బంగారం బిస్కెట్లు స్వాధీనం

» 100 బాటిళ్ల విదేశీ మద్యం కూడా..

న్యూఢిల్లీ, జనవరి 5: మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై హరియాణాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పన్వర్ నివాసంలో ఈడీ జరిపిన సోదాల్లో భారీగా నగదు, బంగారం లభ్యమైంది. సోనేపట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన మైనింగ్ వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారంలో అక్రమ మార్గాల ద్వారా నగదు సంపాదించారంటూ 2013లో ఈడీతో పాటు, రాష్ట్ర పోలీసులు పలు కేసులు నమోదు చేశాయి. పన్వర్ ఇళ్లల్లో రూ.5 కోట్ల నగదు, 4-5 కిలోల బరువు ఉన్న మూడు బంగారం బిస్కెట్లు, అక్రమంగా తీసుకొచ్చిన విదేశీ తుపాకులు, 300 తూటాలు, 100 బాటిళ్ల విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొంది. గురు, శుక్రవారాల్లో ఈ సోదాలు జరిగాయి. గురువారం 15-20 మంది ఈడీ అధికారులు ఆరు వాహనాల్లో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు.

మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు లేదు

» స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

చెన్నై, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిఫారసు లేకుండా ఏ మంత్రినీ తొలగించే అధికారం గవర్నర్‌కు లేదంటూ మద్రాసు హైకోర్టు వెలువరించిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. తమిళనాడులో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో సెంథిల్‌బాలాజీ రవాణా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కొందరికి ఆ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించారనే నేరారోపణలపై ఈడీ ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సెంథిల్‌బాలాజీ తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరి ఓపెన్‌హార్ట్ సర్జరీ చేసుకుని కోలుకున్న తర్వాత పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. సెంథిల్‌బాలాజీ అనారోగ్య కారణాల దృష్ట్యా ఆయన్ని శాఖ లేని మంత్రిగా కొనసాగిస్తూ గతేడాది జూన్ 16న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే రోజున సెంథిల్‌బాలాజీని శాఖ లేని మంత్రిగా కొనసాగించేందుకు వీలులేదంటూ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి డిస్మిస్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కొద్దిసేపటికే మళ్లీ ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. ఈ పరిస్థితుల్లో సెంథిల్‌బాలాజీని శాఖ లేని మంత్రిగా కొనసాగిస్తూ ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులను, గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాది ఎంఎల్ రవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు శాఖ లేని మంత్రిగా సెంథిల్‌బాలాజీని కొనసాగించాలా వద్దా అనే విషయంపై తుది నిర్ణయం ముఖ్యమంత్రిదేనని స్పష్టం చేసింది. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. సీఎం అనుమతి, సిఫారసు లేకుండా ఏ మంత్రినీ రాష్ట్ర గవర్నర్ తొలగించే ఆస్కారమే లేదని, ఆ అధికారం వారికి లేదని స్పష్టం చేసింది.

వీవీప్యాట్‌లను తెచ్చింది కాంగ్రెస్సే

» వాటిపై సందేహాలు అవసరం లేదు: ఈసీ

న్యూఢిల్లీ, జనవరి 5: వీవీప్యాట్‌లపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) తోసిపుచ్చింది. జైరాం వ్యాఖ్యల్లో సహేతుకత లేదని, కొత్త కారణాలు కూడా చూపించలేదని పేర్కొంటూ ఆయన వ్యాఖ్యలను ఖండించింది. వీవీప్యాట్లు, స్లిప్పుల విధానాన్ని 2013లో కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిందని ఈసీ తెలిపింది. ఈవీఎంలపైనా పూర్తి విశ్వసనీయత ఉందని పేర్కొంది. ఈవీఎంలను, వీవీప్యాట్ స్లిప్పులను పరిశీలించేందుకు ఇండియా కూటమి ప్రతినిధి బృందాన్ని అనుమతించాలని కోరుతూ జైరాం రమేశ్ డిసెంబరు 30న లేఖ రాసిన నేపథ్యంలో ఈసీ ఈ మేరకు స్పందించింది. మాక్ పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు అన్ని దశల్లోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించింది. ఈవీఎంలను ట్యాంపరింగ్, హ్యాకింగ్ చేయకుండా ప్రతి చిన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని కట్టుదిట్టమైన వ్యవస్థతో ముందుకు సాగుతున్నామని తెలిపింది. మరోవైపు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ విమర్శలు గుప్పించారు. ఈవీఎంలు ఇప్పుడున్న స్థితిలోనే వచ్చే ఎన్నికల్లో వినియోగిస్తే అధికారం మళ్లీ బీజేపీకే దక్కుతుందని వ్యాఖ్యానించారు. అంతేకాదు, వీవీప్యాట్ స్లిప్పులను కూడా లెక్కించాలని ఆయన సూచించారు. కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం నుంచి దేశవ్యాప్తంగా పర్యటించనుంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా రాష్ట్రాల్లో సన్నద్ధతను పరిశీలించనుంది. తొలుత ఏడవ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో ఈసీ పర్యటించనుంది. ఈ బృందంలో ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయెల్ ఉండనున్నారు.

ఆశలన్నీ యూపీపైనే!


ఆ రాష్ట్రంలో 11రోజుల పాటు భారత్‌జోడో న్యాయ యాత్ర

» రాహుల్ యాత్ర రూట్‌మ్యాప్‌లో అయోధ్య లేకపోవడంపై చర్చలు

న్యూఢిల్లీ, జనవరి 5: దేశ రాజకీయాల్లో ఉత్తరప్రదేశ్ అత్యంత కీలకం. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరిగే 543 సీట్లలో ఈ రాష్ట్రంలో అత్యధికంగా 80 స్థానాలు ఉన్నాయి. 2014లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ఇక్కడ ఏకంగా 73 సీట్లు గెలుచుకుంది. ఇక 2019లో 64 స్థానాల్లో విజయం సాధించింది. అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న బీజేపీకి చెక్ పెట్టడానికి యూపీపై దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి ఒక్క ఎంపీ మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో యూపీలో గత వైభవాన్ని తిరిగి సాధించే దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. జనవరి 14న రాహుల్‌గాంధీ చేపట్టనున్న భారత్ జోడో న్యాయ యాత్ర ఈ రాష్ట్రంలోనే అత్యధికంగా 11 రోజుల పాటు సాగేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ వ్యవధిలో ఆయన 1,074 కిలోమీటర్లలో విస్తరించి ఉన్న 20 జిల్లాల్లో పర్యటించనున్నారు. రాహుల్ చేపట్టిన తొలివిడత భారత్ జోడో యాత్ర రూట్ మ్యాప్‌లో తొలుత యూపీ లేదు. చివరి నిమిషంలో ఈ రాష్ట్రాన్ని కూడా చేర్చారు. అప్పట్లో కేవలం మూడు జిల్లాల్లో మాత్రమే ఆయన పర్యటించారు. ఈసారి మాత్రం రెండో విడత యాత్ర కీలక నియోజకవర్గాల మీదుగా సాగేవిధంగా అధిష్ఠానం జాగ్రత్తలు తీసుకుంది. అయితే రామమందిరం నిర్మాణాన్ని ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా ఉపయోగించుకోవాలని బీజేపీ భావిస్తున్న అయోధ్య స్థానంలో యాత్ర చేయకూడదని రాహుల్ తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. రాహుల్ యాత్రను అయోధ్యకు మళ్లించే అవకాశాలు కూడా కొట్టిపారేయలేమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

వారాణసీలో మోదీని ఢీకొట్టేదెవరు?

ప్రధాని మోదీ నియోజకవర్గమైన వారాణసీలో ప్రియాంక పోటీచేయాలని ఇటీవల మమతా బెనర్జీ ప్రతిపాదించారు. కానీ గాంధీల విషయంలో అంత రిస్క్ తీసుకోవడానికి పార్టీ సిద్ధంగా లేదని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా, ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటలైన అమేఠీ, రాయ్‌బరేలీని తిరిగి చేజిక్కించుకోవడమే లక్ష్యంగా ఈ స్థానాల్లో భారత్ జోడో న్యాయ యాత్ర సాగనుంది. గత ఎన్నికల్లో ఇక్కడ స్మృతి ఇరానీ... రాహుల్‌ను చిత్తుగా ఓడించారు. ఇప్పుడు స్మృతిపై పోటీకి ప్రియాంక పేరును కూడా పరిశీలిస్తున్నారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి గెలిచిన సోనియా ఆ తర్వాత నియోజకవర్గంలో అంతగా పర్యటించలేదు. ఈసారి ఇక్కడ రాహుల్ పోటీ చేసే అవకాశం ఉందని చెప్తున్నారు.



అభ్యర్థుల వడపోతకు స్క్రీనింగ్ కమిటీలు

లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల పేర్లను వడపోయటానికి కాంగ్రెస్ ఐదు స్క్రీనింగ్ కమిటీలను శుక్రవారం ఏర్పాటు చేసింది. దీనికోసం రాష్ట్రాలను, యూటీలను ఐదు క్లస్టర్లుగా విభజించి, ఒక్కో క్లస్టర్‌కు బాధ్యులను నియమించింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, లక్షద్వీప్, పుదుచ్చేరిలతో కూడిన క్లస్టర్‌కు స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా హరీశ్ చౌదరి, సభ్యులుగా జిగ్నేశ్ మేవానీ, విశ్వజీత్ కదమ్‌లను నియమించింది. ఏపీ, మహారాష్ట్ర, గోవా, ఒడిశా, అండమాన్ నికోబార్ దీవులు మరో క్లస్టర్‌గా ఉంటాయి. దీనికి మధుసూదన్ మిస్త్రీ సారథ్యం వహిస్తారు. మరోవైపు కాంగ్రెస్ మహిళా, విద్యార్థి విభాగాలకు కొత్త సారథులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. మహిళా కాంగ్రెస్‌కు అల్కా లాంబాను, ఎన్ఎస్‌యూఐకి వరుణ్ చౌదరిని అధ్యక్షులుగా నియమించారు.

మాగుంట చూపు టీడీపీ వైపు!!



» మాజీ మంత్రి బాలినేనితో ఎంపీ మంతనాలు

» ఇద్దరూ కలిసే పయనించాలని నిర్ణయం?

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)

ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి. ఒంగోలు ఎంపీ టికెట్ ఇవ్వాలంటే చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌ను తిట్టాలంటూ జగన్ విధించిన షరతులను తిరస్కరించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి టీడీపీ వైపు దృష్టిసారించినట్లు తెలిసింది. ఆ పార్టీకి చెందిన ఒకరిద్దరు ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. సీఎం జగన్ తనను పక్కనపెట్టారని కొంతకాలంగా వాపోతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాగుంట కలిసి ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అదే సమయంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి కూడా మాగుంటతో టచ్‌లో ఉండడం విశేషం. ఈ పరిస్థితుల్లో ఒంగోలు లోక్‌సభ స్థానానికి దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్ పేరును వైసీపీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒంగోలు అసెంబ్లీకి మీ కుమారుడిని పోటీచేయించాలని మాజీమంత్రి శిద్దా రాఘవరావుకు జగన్ సూచించారు. మహీధరరెడ్డికి కూడా చంద్రబాబు, పవన్, లోకేశ్‌ను తిట్టాలని షరతు విధించడం, ఆయన తిరస్కరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాగుంట.. తన రాజకీయ భవితవ్యంపై శరవేగంగా అడుగులు వేసినట్లు తెలుస్తోంది. వైసీపీ నుంచి టికెట్ లేదన్న సంకేతాలు అందడంతో టీడీపీ నుంచి అందిన సంకేతాన్ని స్వీకరించినట్లు తెలిసింది. తదనుగుణంగా చంద్రబాబుతో మాట్లాడారని సమాచారం. గురువారం సాయంత్రం, శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో బాలినేనితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. జగన్ వైఖరితో తీవ్ర అసంతృప్తితో ఉన్న బాలినేని కూడా ప్రత్యామ్నాయం దొరికితే వెళ్లిపోయే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆయన కూడా టీడీపీలోకి వస్తే సముచిత స్థానం కల్పించే విధంగా వారి మధ్య చర్చలు జరిగాయని, ఆ విషయాన్ని టీడీపీ అధిష్ఠానానికి కూడా చేరవేశారని, దీనిని టీడీపీ సీనియర్ నేతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాగా, నెల్లూరు జిల్లాకు చెందిన వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితోనూ మాగుంట మంతనాలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. వేమిరెడ్డి టీడీపీలో చేరితే ఆయనకు నెల్లూరు పార్లమెంటు టికెట్.. లేదంటే రాజ్యసభ సీటు ఇస్తామని టీడీపీ నుంచి ఆఫర్ ఉన్నట్లు సమాచారం. లేకుంటే మాగుంట కుమారుడు రాఘవరెడ్డికి నెల్లూరు లోక్‌సభ ఇస్తామని టీడీపీ నుంచి సంకేతాలు అందినట్లు తెలుస్తోంది.

వేణుగోపాల్, రాంబాబుతో జగన్ భేటీ

శుక్రవారం సాయంత్రం తాడేపల్లిలో దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబులతో జగన్ విడివిడిగా మాట్లాడారు. దర్శి టికెట్ ఇవ్వనని వేణుగోపాల్‌కు చెబుతూనే.. ఒంగోలు లోక్‌సభ, ఒంగోలు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని ప్రస్తావించినట్లు తెలిసింది. రాంబాబుతో మాత్రం.. 'ఎన్నికల్లో పోటీచేయనని ఎందుకు ప్రకటన చేశారు? నన్ను కలిసి చెప్పాల్సింది కదా' అని జగన్ అన్నట్లు సమాచారం. రాంబాబు స్పందించి.. 'మిమ్మల్ని కలవాలని అపాయింట్‌మెంట్ అడిగాను.. కానీ ఇవ్వలేదు, అందుకే నా నిర్ణయాన్ని ప్రకటించా' అని చెప్పారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై చర్చ

కనిగిరి సభలో చంద్రబాబు మాట్లాడుతూ తనను, పవన్‌ను తిడితే టికెట్ ఇస్తానంటూ జగన్ చేసిన ప్రతిపాదన సంస్కారరాహిత్యమని చెప్పారు. 'ఇదే ప్రాంతానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు దానిని తిరస్కరించడం వారి సంస్కారానికి నిదర్శనం. అందుకు వారిని అభినందిస్తున్నా, మీరూ వారిని అభినందించాలి' అని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబును పోటీ చేయకుండా వెళ్లేవరకు తీసుకొచ్చారని.. బాలినేనిని అడ్రస్‌లేకుండా చేశారని వ్యాఖ్యానించారు. మాగుంట, మహీధరరెడ్డికి కితాబిస్తూ బాలినేని, రాంబాబుపై విమర్శలు చేయకపోవడం.. మారనున్న రాజకీయ సమీకరణల్లో భాగమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కలిసి ఉంటేనే కలదు విజయం

» గట్టిపడుతున్న టీడీపీ,జనసేన బంధం

» అధినేతల సూచనలతో ఉమ్మడి భేటీలు



అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : 'వైసీపీని ఓడించడమే లక్ష్యంగా కలిసి పనిచేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బాటలో మనమూ నడుద్దాం. వారి సూచనల మేరకు వైసీపీ ఓటమి కోసం పని చేద్దాం. నియోజకవర్గంలో సీటు ఏ పార్టీకి వచ్చినా అందరం కలిసి పనిచేసి గెలుద్దాం" అంటూ జిల్లాల్లో టీడీపీ, జనసేన నాయకులు సంకల్పం చెప్పుకొంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా జనసేన- టీడీపీ నాయకులు ఉమ్మడి సమావేశాలు నిర్వహిస్తున్నారు. గోదావరి జిల్లాల్లో ఇప్పటికే ఈ పని మొదలుకాగా, గురువారం తిరుపతిలో ఇదే లక్ష్యంతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇరు పార్టీల కీలక నేతలతో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు హాజరయ్యారు. సమావేశంలో అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. పార్టీ అధ్యక్షుల ఆదేశాల మేరకు పని చేద్దామని నిర్ణయించారు. ఈ సమావేశానికి టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, విజయకుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, ఇతర నాయకులు; జనసేన తరపున హరిప్రసాద్, కిరణ్ రాయల్ తదితర నేతలు హాజరయ్యారు. ఇలాంటి సమావేశాల వల్ల ఇరు పార్టీల నాయకుల మధ్య సఖ్యత ఏర్పడడంతోపాటు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నేతలు అభిప్రాయపడ్డారు. ఇదే తరహాలో కాకినాడ రూరల్, మండపేట, రాజమండ్రిలో ఇప్పటికే భేటీ అయ్యారు. ప్రస్తుతం ఇరువర్గాల మధ్య ఏవైనా మనస్పర్థలు ఉన్నా వాటిని పక్కనపెట్టి కలిసి అడుగులు వేయాలని నిర్ణయించారు. సీటు ఏ పార్టీ గెలిచినా ఇరు పార్టీల కేడర్లకు సమ ప్రాధాన్యత ఇవ్వాలన్న దానిపై కూడా చర్చించుకున్నారు. గోదావరి జిల్లాల్లో జరుగుతున్న సమావేశాల్లో జనసేన నేతలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ గత నెల మూడురోజుల పాటు కాకినాడలో బసచేశారు. ఈ సమయంలో ఉమ్మడి గోదావరి జిల్లాల నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. గెలుపు కోసం టీడీపీ నాయకులతో కలిసి పని చేయాలని సూచించారు. సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాల్లో అందరూ కలిసి పాల్గొనాలని నిర్దేశించారు. పొత్తుల్లో భాగంగా జనసేనకు వచ్చిన సీట్లు మొత్తం కచ్చితంగా గెలిచి తీరాలని నాయకులకు గట్టిగానే చెప్పారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పని చేస్తేనే అది సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. సంక్రాంతి తర్వాత పవన్ రాయలసీమపైనా దృష్టిసారిస్తారని చెబుతున్నారు.

అంగన్వాడీల ఉడుంపట్టు



అనంతపురంలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

- 25వ రోజు ఉధృతంగా కొనసాగిన సమ్మె
- గుంతకల్లు, సత్యవేడు ఎమ్మెల్యేలకు నిరసన సెగ
- ముఖ్యమంత్రి మొండోడు.. అన్నంత పనీ చేస్తాడు..
- నా మాట విని విధుల్లో చేరండి..
- అంగన్వాడీలకు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి హితవు
- కర్నూలులో సీఎం దిష్టిబొమ్మకు శవయాత్ర
- రాయచోటిలో జగన్‌కు ఓటేసినందుకు గుంజీలు
- వెంకటగిరిలో సామాజిక బస్సు యాత్ర అడ్డగింత

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు ఉడుంపట్టు పట్టారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం 25వ రోజు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి నిరసన సెగ తగిలింది. కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు పామిడికి వచ్చిన ఎమ్మెల్యేని కార్మికులు అడ్డుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమ్మె విరమించి వెంటనే విధుల్లో చేరాలని, లేకపోతే ఉద్యోగాలు పోతాయన్నారు. 'నేను మీ మంచి కోరి చెబుతున్నా. మీరు సమ్మె చేయడం తప్పు. మరోలా అనుకోవద్దు. సమ్మెకు ఈ రోజే చివరి రోజు. డ్యూటీలో జాయిన్ అవ్వండి. లేదంటే మీ ఉద్యోగాలు పోతాయి. ముఖ్యమంత్రి మొండోడు. చెప్పిందే చేస్తాడు' అని ఎమ్మెల్యే అన్నారు. 'మీరు అడగకుండానే గౌరవ వేతనాన్ని రూ.11,500కు పెంచాడు' అని జగన్ గురించి గొప్పలు చెప్పే ప్రయత్నం చేయగా, అంగన్వాడీలు అడ్డుకున్నారు. చంద్రబాబు రూ.10,500 ఇచ్చారని, జగన్ రూ.1000 మాత్రమే పెంచారన్నారు. 'మీ సమస్యలపై చర్చిస్తున్నాం. 2, 3వేలు పెంచితే మంచిదని చెబుతున్నాం. ముఖ్యమంత్రి నాకు రోజూ దొరకరు. కలిసినప్పుడు కచ్చితంగా మీ సమస్యలను వివరిస్తా' అని ఆయన చెప్పడంతో కార్మికులు వెనుతిరిగారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు నోటికి, చేతులకు నల్ల రిబ్బన్ కట్టుకుని మోకాళ్లపై నిలబడి, గోరంట్లలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కర్నూలు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో సీఎం దిష్టిబొమ్మను శవంలా చిత్రీకరించి మంచం వేసి శవజాగరణ చేశారు. పాడె ఏర్పాటుచేసి భోరున విలపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. శవయాత్ర చేసి దహనం చేసేందుకు సిద్ధమైన అంగన్వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో యూనియన్ నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. నెల్లూరు ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు సంఘీభావం తెలిపారు. పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చొని దండాలు పెడుతూ, సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో దీక్షా శిబిరం వద్ద మెడకు చీర కొంగులను బిగించుకుని ఆందోళన చేపట్టారు. పాలకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, కోలాటం ప్రదర్శనతో నిరసన వ్యక్తంచేశారు. కాగా, సీతంపేట సమ్మె శిబిరంలో కోతాం గ్రామానికి చెందిన అంగన్వాడీ హెల్పర్ ఎస్.శిరీష తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయారు. తోటి కార్యకర్తలు ఆమెకు సపర్యలు చేసి, స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ఒంటికాలిపై నిలబడి, వేంపల్లెలో మోకాళ్లపై కూర్చుని, పోరుమామిళ్లలో గోవింద నామాలు పెట్టుకుని నిరసన తెలిపారు. కొండాపురంలో చేతుల్లో వేప మండలతో ఆందోళన వ్యక్తం చేశారు. రాయచోటిలో జగన్‌కు ఓటేసినందుకు గుంజీలు తీస్తూ పశ్చాత్తాపం ప్రకటించారు. మదనపల్లె, లక్కిరెడ్డిపల్లెలో నల్లబెలూన్లతో నిరసన తెలిపారు. వాల్మీకిపురంలో మోకాళ్లపై కూర్చుని ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో వైసీపీ నేతలు నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. బస్సు దగ్గరకు వెళ్లకుండా పోలీసులు అడ్డుపడటంతో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో తిరుపతి ఎంపీ గురుమూర్తి బస్సు దిగి వారి నుంచి వినతిపత్రం స్వీకరించారు. బీఎన్ కండ్రిగ మండల కేంద్రంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వాహనాన్ని అంగన్వాడీ సిబ్బంది అడ్డుకుని, వినతిపత్రం అందజేశారు. సూళ్లూరుపేటలో ఆర్టీసీ బస్టాండు నుంచి చెంగాళమ్మ ఆలయం వరకూ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వం మనసు మార్చాలంటూ అమ్మవారికి మొక్కుకున్నారు. సత్యవేడులో నోటీసు ప్రతులను ఉద్యోగులు తగులబెట్టారు. గూడూరులో గొబ్బెమ్మలు ఆడి నిరసన వ్యక్తం చేశారు.

11వ రోజు కొనసాగిన 'మున్సిపల్' సమ్మె

- అనంతలో అరగుండు, అరమీసంతో నిరసన
- పలుచోట్ల నడిరోడ్డుపై పొర్లుదండాలు
- ఏలూరులో మున్సిపల్ కార్మికుల అరెస్టు



విజయవాడలో ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అనంతపురం క్రైం, జనవరి 5: మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె 11వ రోజు శుక్రవారం కొనసాగింది. సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరపాలిక ఎదుట మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు బండారు ఎర్రిస్వామి అరగుండు, అరమీసంతో నిరసన తెలిపారు. కార్మికులు నగరంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నగరపాలిక ఎదుట నడిరోడ్డుపై పొర్లుదండాలు పెట్టారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నడిరోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. నంద్యాలలో కార్మికులు పొర్లుదండాలు పెడుతూ సీఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలి స్వామీ అంటూ భగవంతుడిని వేడుకున్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో, శ్రీకాకుళం, కడప జిల్లా బద్వేలులో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు పొర్లుదండాలు పెట్టారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ఎదుట గుండు కొట్టించుకుని నిరసన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మున్సిపల్ కార్మికులు వంటావార్పుతో నిరసన తెలిపారు. ఏలూరులో ప్రైవేటు పనివారితో పారిశుధ్య పనులు చేయించడానికి అధికారులు క్లాప్ వాహనాలను బయటకు తీస్తుండగా సమ్మె చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసు బలగాలు కార్మికులను ఈడ్చిపడేశాయి. మహిళా కార్మికులను మగ పోలీసులు రోడ్లపై ఈడ్చుకెళ్ళి వ్యాన్ ఎక్కించి ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మిగిలిన కార్మికులంతా పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించడంతో సాయంత్రం వదిలివేశారు.

భగ్గుమన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

- సమగ్ర శిక్ష కార్యాలయం ముట్టడి
- అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు
- 1,500 మంది ఉద్యోగుల అరెస్టు

అమరావతి(ఆంధ్రజ్యోతి)/విజయవాడ(ఆటోనగర్), జనవరి 5: సమగ్ర శిక్షాభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు చేపట్టిన 'చలో విజయవాడ' ఉద్రిక్తంగా మారింది. కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వంపై భగ్గుమన్నారు. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 3వేల మంది తరలివచ్చి విజయవాడలోని సమగ్రశిక్ష ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. అప్రమత్తమైన పోలీసులు ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి అడ్డుకున్నారు. దీంతో ఉద్యోగులు, పోలీసుల మధ్య తోపులాటలు జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భారీగా చేరుకున్న ఉద్యోగులు తీవ్రస్థాయిలో ముట్టడికి ప్రయత్నించారు. దాదాపు మధ్యాహ్నం వరకూ ఉద్యోగులు రోడ్లపై నిరసనలు కొనసాగించారు. 1,500 మందికి పైగా ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. పీఎస్‌ల్లో సాధ్యం కాదని నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో కల్యాణ మండపాలు తీసుకుని అక్కడ నిర్బంధించారు. దీంతో కల్యాణ మండపాల్లోనే ఉద్యోగులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సమ్మె నోటీసిచ్చి నెల దాటినా ఇంతవరకు తమ డిమాండ్లను నెరవేర్చకుండా, కనీసం చర్చలకు పిలవకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.



విజయవాడలో ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగి చేయి పట్టి లాగుతున్న సీఐ కాశీ విశ్వనాథ్

ప్రభుత్వం చెప్పిందే చేస్తున్నాం..

తొలుత ఉద్యోగులను కలిసేందుకు నిరాకరించిన సమగ్రశిక్ష ఎస్పీడీ... ఉద్యోగులు భారీగా తరలి రావడంతో చివరికి వారితో మాట్లాడారు. ఉద్యోగులను తొలగించే విషయంలో ప్రభుత్వం చెప్పిందే తాను చేస్తున్నానని, అవి ప్రభుత్వ ఆదేశాలని తెలిపారు. త్వరలో మళ్లీ చర్చలకు పిలుస్తామన్నారు.

సర్కారుపై చీమలదండు!

చిరుద్యోగులు, కార్మికుల దండయాత్ర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అంగన్వాడీల నిరసనలతో మొదలైంది. మున్సిపల్ కార్మికుల సమ్మెతో ఊపందుకుంది. సమగ్రశిక్ష, కేజీబీవీ టీచర్లు, ఆశాలు, వలంటీర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్ఏలు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది... ఇలా ఒక్కో శాఖ ఉద్యోగులు సమ్మె బావుటా ఎగురవేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు, నిరసనలతో ప్రభుత్వానికి సెగ పుట్టిస్తున్నారు. సరిగ్గా ఎన్నికల ముందు మొదలైన ఈ ఆందోళనలు జగన్ సర్కారుకు కాకపుట్టిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక లోకం కదం తొక్కుతోంది. నాలుగున్నరేళ్ల పాటు ఓర్పుతో భరించిన చిరుద్యోగులు తమ సమస్యలు తీర్చాలంటూ ప్రభుత్వంపై చీమలదండులా దండయాత్రకు సిద్ధమయ్యారు. అధికారంలోకి వచ్చేందుకు అప్పట్లో సీఎం జగన్ ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, వాటిని వెంటనే అమలు చేయాలని ఒత్తిడి పెంచుతున్నారు.



విజయవాడలో చంటి బిడ్డతో రోడ్డుపై బైఠాయించిన ఎస్ఎస్ఏ మహిళా ఉద్యోగి

సచివాలయ ఉద్యోగులపై భారం

అంగన్వాడీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు ఇప్పటికే సమ్మె బాట పట్టారు. దీంతో ఆ పనుల భారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై పడింది. పనిభారంతో వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు పోషకాహారం అందించే అంగన్వాడీ సిబ్బంది పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోంది. రోడ్డెక్కిన అంగన్వాడీలకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. బయటవారిని తీసుకొచ్చి పనుల్లోకి దించుతుండటంతో పారిశుధ్య కార్మికులు ప్రభుత్వంపై అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. మరోవైపు ఉద్యమాల తీవ్రతను తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. కార్మికులను రెచ్చగొట్టేలా నేతలు వ్యాఖ్యలు చేస్తుండటంతో ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఫీల్డ్ అసిస్టెంట్ల అల్టిమేటం

ఉపాధి కూలీలకు ఏటా 22కోట్ల పనిదినాలు కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు.. జగన్ తమకిచ్చిన హామీలు నెరవేర్చాలని పట్టుబడుతున్నారు. సంక్రాంతి లోగా జీతాలు పెంచకపోతే ఉపాధి పనులు నిలిపేస్తామని అల్టిమేటం ఇచ్చారు. గురువారం సుమారు వెయ్యి మంది ఫీల్డ్ అసిస్టెంట్లు తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్ ముందు ధర్నా నిర్వహించారు. వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన సెర్ప్ ఉద్యోగులకు 23% పీఆర్సీ అమలు చేయడంతో తమకు కూడా వర్తింపజేస్తారని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర క్షేత్రస్థాయి ఉద్యోగులు గంపెడాశతో ఉన్నారు. అయితే మెటీరియల్ నిధులు సరిపడా లేనందున పీఆర్సీ అమలు సాధ్యంకాదని ఉన్నతాధికారులు పేర్కొన్నట్లు తెలిసింది. పీఆర్సీ ఆశలు సన్నగిల్లడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ధర్నాకు దిగారు.

సీసీఎల్ఏ కార్యాలయం వద్ద వీఆర్ఏల ధర్నా

మున్సిపల్ కార్మికులు ఇప్పటికే పూర్తిస్థాయిలో సమ్మెలో ఉన్నారు. త్వరలో మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులను కూడా రంగంలోకి దించనున్నారు. అదే జరిగితే పట్టణాల్లో నీటి సరఫరా కూడా నిలిచిపోనుంది. తమ సమ్మె తీవ్రరూపం దాల్చితే ప్రభుత్వం విలవిల్లాడటం ఖాయమని కార్మికులు హెచ్చరిస్తున్నారు. ఇక సర్వశిక్షా అభియాన్‌కు సంబంధించి కేజీబీవీ టీచర్లు సుమారు 20వేల మంది సమ్మెలో కొనసాగుతున్నారు. ఆశా వర్కర్లు 42వేల మంది కూడా జీతం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయం వద్ద వేల మంది వీఆర్ఏలు ధర్నా నిర్వహించారు. జగన్ ఇచ్చిన హామీ మేరకు రూ.500 డీఏ అమలు చేయాలని కోరారు. హామీలు అమలు చేయకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. మరోవైపు టైటిల్ యాక్ట్‌కు సంబంధించిన చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కోర్టుల వద్ద న్యాయవాదుల నిరసనలు మిన్నంటుతున్నాయి. గతంలో తొలగించిన 1,200మంది పారా మెడికల్ సిబ్బందిని తిరిగి నియమిస్తామని గత ఎన్నికల ముందు జగన్ హామీ ఇచ్చారు. నాలుగున్నరేళ్లు అవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలంటూ వారు కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల గుర్రు

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలువురు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను గత ప్రభుత్వంలో నియమించారన్న సాకుతో ఇంటికి పంపించారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ప్రతినెలా ఠంచనుగా జీతాలిస్తామని చెప్పినా అవేవీ నెరవేరలేదు. దీంతో రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు నాలుగు లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. గత ప్రభుత్వం పెంచిన జీతాలను కూడా ఈ సర్కారు తగ్గించిందని మండిపడుతున్నారు. పోరాటానికి దిగి తమ డిమాండ్లను సాధించుకోవాలన్న యోచనలో ఉన్నారు.

వలంటీర్ల నిరసనలు

ఉద్యోగులతో పాటు గ్రామ, వార్డు వలంటీర్లు సైతం జగన్ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు. రూ.5వేల వేతనాలిచ్చి వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని వాపోతున్నారు. సీఎం మానసపుత్రిక అయిన సచివాలయం పరిధిలో పనిచేస్తున్న తమను ఈ ప్రభుత్వం బానిసలుగా చూస్తోందని మండిపడుతున్నారు. ఎక్కడికక్కడ సమ్మెకు వెళ్తామంటూ నోటీసులు ఇస్తున్నారు. మరోవైపు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సైతం పెరిగిన పని భారంతో విసిగిపోతున్నారు. దీనికితోడు వైసీపీ స్థానిక నేతలు, ఎమ్మెల్యేల ఒత్తిడి తట్టుకోలేక పోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అన్ని వర్గాల నుంచి ప్రభుత్వంపై ఆగ్రహజ్వాలలు పెల్లుబుకుతున్నాయి.



కర్నూలులో ప్రభుత్వానికి పాడె కట్టి.. విలపిస్తున్న అంగన్వాడీలు



వెంకటేశ్వర మెట్టలో జాగారపు చిన్న కుటుంబానికి రూ.3 లక్షల చెక్ అందజేస్తున్న భువనేశ్వరి

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం

- చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందిన వారికి భువనేశ్వరి భరోసా
- ఆరు కుటుంబాలకు పరామర్శ...
- ఒక్కో కుటుంబానికి 3 లక్షల సాయం

విశాఖపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కేడర్‌కు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి భరోసా ఇచ్చారు. 'నిజం గెలవాలి' యాత్ర రెండో దశలో భాగంగా ఆమె శుక్రవారం నగరంలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మనస్తాపానికి గురై మృతి చెందిన ఆరుగురి కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర మెట్టలో జాగారపు చిన్న, జ్ఞానాపురానికి చెందిన మలిశెట్టి రమణ, ఉత్తరం నియోజకవర్గ పరిధి తాటిచెట్లపాలెంలో పంచిరెడ్డి కనకరాజు, గాజువాక నియోజకవర్గ పరిధిలోని అజీమాబాద్‌లో కోరుకొండ మంగ, భానోజీతోటలో సరోజిని, షీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి కుటుంబాలను ఆమె పరామర్శించి రూ.3 లక్షల చొప్పున సాయం అందజేశారు. ప్రతిచోట మృతుని చిత్రపటానికి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చుతూ ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ కుటుంబంలో ఎవరికి ఇబ్బంది వచ్చినా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. అనంతరం హైదరాబాద్ పయనమయ్యారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, పంచుమర్తి అనురాధ, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పోరుబాట

- ఎల్లుండి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

విజయవాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై పోరుబాట పట్టేందుకు ఆర్టీసీ ఉద్యోగులు సిద్ధమయ్యారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్ఎంయూ నేతృత్వంలో శుక్రవారం అగ్రనేతలు, జిల్లా నేతలు వర్చువల్‌గా సమావేశమయ్యారు. సమస్యలపై సమరశంఖం పూరించాలని నిర్ణయించారు. ఈ నెల 8న అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్ల దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

గోదావరి తీరంలో ఘనంగా

తెలుగు పండుగ

- 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు ప్రారంభం
- దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగుకు ప్రత్యేక విశిష్టత
- ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్
- రెండు రాష్ట్రాలూ మాతృభాషను చంపేస్తున్నాయి: స్వరూపానందేంద్ర
- పండితులు, విద్వాంసులు బద్ధకం వీడాలి: రామ్‌మాధవ్

రాజమహేంద్రవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు భాషకు ప్రత్యేక విశిష్టత ఉందని ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా రాజమహేంద్రవరంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు శుక్రవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. విశ్వభూషణ్ హరిచందన్ జ్యోతి ప్రజ్వలన చేసి సభలకు అంకురార్పణ చేశారు. ఆయన మాట్లాడుతూ ఒకే వేదిక మీదకు భాషా సంపన్నులైన ఉద్దండులు వేర్వేరు రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి కూడా వచ్చి పాల్గొనడం విశేషమన్నారు. అలాగే రామాయణ, మహాభారతాల్లోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ గురించి విశదీకరించారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అభిభాషణం చేస్తూ తెలుగు భాష పట్ల రెండు తెలుగు రాష్ట్రాలూ అనుసరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. తెలుగు భాషను బ్రతికించాలన్నారు. బీజేపీ జాతీయ నేత రామ్‌మాధవ్ మాట్లాడుతూ 'ప్రపంచంలో అన్ని భాషలూ గొప్పవే. తల్లులందరూ గొప్పవారే. అయితే మన తల్లి పట్ల ఎంతటి అభిమానం ఉంటుందో అలాగే మన మాతృభాష పట్ల అభిమానం ఉండడం సహజమే కాకుండా అవసరం కూడా. తెలుగుభాష చాలా గొప్ప భాష. ప్రపంచంలో ఇన్ని అక్షరాలు ఉన్న భాషలు వేరే లేవు. అవధానాల భాష తెలుగు భాష. ఈ అవధాన ప్రక్రియ కేవలం తెలుగులోనే ఉంది' అని కొనియాడారు. తెలుగు భాష పరిరక్షణ కోసం పండితులు, విద్వాంసులు కొద్దిగా బద్ధకం వదిలిపెట్టి ప్రయత్నించాలని ఆయన కోరారు. డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ సర్‌ఆర్థర్ కాటన్, చార్లెస్ ఫిలిప్ బ్రౌన్, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం మనకు ప్రాతఃస్మరణీయులన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్‌ని గజల్ శ్రీనివాస్ పునరుజ్జీవింపచేశాడని, చైతన్యరాజు కళలను పోషిస్తూ పూర్వపు రోజులను గుర్తు తెస్తున్నారని ప్రశంసించారు. తెలుగు భాషా వికాసానికి విశేష సేవలందించిన మహనీయుల నమూనా విగ్రహాలు, తిరుమల సహా పది దేవాలయాల నమూనాలు ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధాన వేదిక కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆదికవి నన్నయ వేదికలో అష్టావధానం, పద్యకవిత, గద్య కవిత, అవధాన సాహిత్య వాగ్గేయకార సాహిత్య సదస్సులను నిర్వహించారు. దివంగతులైన తెలుగు వెలుగుల కుటుంబ సభ్యులు, వారసులకు, వివిధ రంగాల ప్రముఖులకు పూర్ణకుంభ పురస్కారాల ప్రదానం సాయంత్రం జరిగింది.



విశ్వభూషణ్ హరిచందన్‌ను సత్కరిస్తున్న స్వరూపానందేంద్ర

పింఛను ఆపారు.. ప్రాణం తీశారు!

- వైసీపీ నేతలిచ్చిన చీర తీసుకోలేదని సొమ్ము నిలిపివేత
- సచివాలయం వద్ద నిలదీస్తూ కుప్పకూలిన వృద్ధుడు
- చనిపోయాక వేలిముద్ర తీసుకుని సొమ్ము పంపిణీ

శాంతిపురం, జనవరి 5: తనకు పదేళ్లుగా వస్తున్న పింఛను ఇప్పుడెందుకు రాలేదంటూ సచివాలయంలో అధికారులను నిలదీస్తూ ఓ వృద్ధుడు కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి కన్నుమూశారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ పరిధిలోని శాంతిపురం మండలం చెంగుబల్ల సచివాలయ పరిధిలోని సోగడబల్ల గ్రామానికి చెందిన సర్దార్ సాబ్(75)కు పదేళ్లుగా పింఛను వస్తోంది. ఈ నెల రెండో తేదీన వీరి గ్రామంలో వైసీపీ ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ ఇంటింటికీ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సర్దార్ సాబ్ ఇంటికి వెళ్లగా వారు చీరను తిరస్కరించారు. ఈ నెల మూడో తేదీన మండల సచివాలయం వద్ద.. పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఆరోజు ఆయనకు పింఛను అందలేదు. దీంతో 4న వలంటీరును కలిసి పింఛను అడగ్గా.. రాలేదని చెప్పారు. అదే రోజు సాయంత్రం సచివాలయానికి వెళ్లిన సర్దార్ సాబ్.. తనకు పెన్షన్ ఎందుకు రాలేదని తీవ్ర ఆవేదనతో ఉద్యోగులను నిలదీశారు. ఉద్యోగులతో వాగ్వాదం జరుగుతుండగానే అక్కడే కుప్పకూలారు. అక్కడివారు 108 అంబులెన్సులో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చాక.. వేలి ముద్ర తీసుకుని పింఛను ఇచ్చినట్లు కుటుంబీకులు రోదిస్తూ చెప్పారు.



సర్దార్ సాబ్

స్వల్ప అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన తమ్మినేని

శ్రీకాకుళం/వెంకోజీపాలెం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం స్వల్ప అస్వస్థతకు గురికావడంతో విశాఖ మెడికవర్ ఆస్పత్రిలో చేరారు. గురువారం ఆమదాలవలస నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం ఆయన స్వల్పంగా అస్వస్థతకు గురవడంతో శ్రీకాకుళంలో మెడికవర్ ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి, హెవీ డీహైడ్రేషన్ మినహా ఇతరత్రా సమస్యలేమీలేవని వెల్లడించారు. ఈ క్రమంలో శుక్రవారం ఆయన మరిన్ని ఉన్నతవైద్య పరీక్షలు నిమిత్తం విశాఖలోని మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. జ్వరం ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జైల్లోనూ కులవివక్షే!

జైళ్లలోనూ కులవివక్ష అమలయ్యే రీతిలో పదమూడు రాష్ట్రాల్లోని ప్రిజన్ మాన్యువల్స్ ఉన్నాయంటూ దాఖలైన ప్రజాప్రయోజనవ్యాజ్యం మీద మూడురోజుల క్రితం సుప్రీంకోర్టు స్పందించింది. ఖైదీలకు వారి కులం ప్రాతిపదికన వివిధ పనులు కేటాయించేందుకు, వారు ఉండాల్సిన బ్యారక్స్‌ను నిర్ణయించేందుకు ఈ మాన్యువల్స్‌లో ఉన్న నిబంధనలు ఉద్దేశిస్తున్నాయంటూ దాఖలైన ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని ముగ్గురు సభ్యుల బెంచ్ కేంద్రప్రభుత్వానికీ, రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్నవాటిలో రెండు తెలుగు రాష్ట్రాలూ ఉన్నాయి.

'ద వైర్' జర్నలిస్టు సుకన్యశాంత దాఖలు చేసిన ఈ పిటిషన్ ఈ వివక్ష మూడురూపాలుగా అమలు జరుగుతోందని పేర్కొంది. కులం ఆధారంగా పనులు అప్పగించడం, వేర్వేరు బ్యారెక్స్ కేటాయించడం, డీ నోటిఫైడ్ ట్రైబ్స్, హాబిట్యువల్ అఫెండర్స్ పేర్లతో కొందరు ఖైదీలపట్ల ప్రత్యేక వివక్ష ప్రదర్శించడం పిటిషన్‌దారు ప్రధానంగా ప్రస్తావించారు. ఇటువంటి వివక్షాపూరిత విధానం అమల్లో ఉన్నట్టు తనకు తెలియదని, ఇది ఆమోదయోగ్యమైన విధానం కాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఆశ్చర్యపోయినప్పుడు, ఈ విషయంలో కోర్టుకు మీ సహకారం చాలా అవసరం అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానిస్తే, మెహతా అంగీకరించారు. ఈ రాష్ట్రాల్లోని జైల్‌మాన్యువల్స్ అన్నింటినీ క్రోడీకరించి నాలుగువారాల్లో తనముందు ఉంచాల్సిందిగా న్యాయస్థానం పిటిషనర్ తరఫు న్యాయవాది మురళీధర్‌ను ఆదేశించింది.

ఈ జైల్ మాన్యువల్స్ నిబంధనలు కులవివక్షను పాటించడంతోపాటు, దళితుల్లో నిర్బంధపు చాకిరీని అమలుచేస్తున్నాయని, రాజ్యాంగంలోని 14, 15, 17, 23 అధికరణలను ఉల్లంఘిస్తున్న ఈ నిబంధనలను రాజ్యాంగహితంగా మార్చవలసిన అవసరం ఉన్నదని పిటిషన్‌దారు అభ్యర్థించారు. జైళ్ళ నిర్వహణ రాష్ట్రాల పరిధిలో ఉంటూ, గత కొన్ని దశాబ్దాలుగా మాన్యువల్స్‌లో ప్రగతిశీలకమైన మార్పుచేర్పులు కొన్ని జరిగినప్పటికీ ఇంకా చాలా రాష్ట్రాల్లో వివక్షాపూరిత నిబంధనలు మిగిలిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. ఉదాహరణకు, మధ్యప్రదేశ్ జైల్ మాన్యువల్ మానవమలాన్ని చేత్తో ఎత్తిపోయడం, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటివి షెడ్యూల్డ్ కులానికి చెందిన మెహతర్‌లు నిర్వహిస్తారని స్పష్టంచేస్తోంది. రాజస్థాన్ జైల్‌మాన్యువల్‌లోనూ ఇటువంటి పలురకాల వివక్షలుంటే, మూడేళ్ళ క్రితం 'ది వైర్' కథనం ఆధారంగా ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు డెబ్బయ్యేళ్ళ తరువాత రూల్‌బుక్‌లో మార్పులు జరిగాయి, కులాధారిత ప్రస్తావనలు తొలగిపోయాయి. ఇతర రాష్ట్రాలకు ఈ మార్పులు పట్టని విషయాన్ని ఈ పిటిషన్ గుర్తుచేసింది. తుడవడం, కడగడం వంటివి దళితులు చేస్తారని, క్షురకుల వంటి క్లాస్–ఎ కింద వర్గీకరించిన కులాలవారు మాత్రమే వంటచేయాలని పశ్చిమబెంగాల్ జైల్‌కోడ్ చెబుతోంది. డీనోటిఫైడ్ ట్రైబ్స్ విషయంలో, కేవలం వారి పుట్టుక ఆధారంగా ఈ జైళ్ళ మాన్యువల్స్ మరింత దుర్మార్గమైన వివక్షను ప్రదర్శిస్తున్నాయి. సమాజంలో వారు ఎదుర్కొంటున్న వివక్ష, జైళ్ళకు పోయిన తరువాత కూడా వారిని వెంటాడుతున్నదని మురళీధర్ కోర్టుకు తెలియచేశారు. తిరునల్వేలి కారాగారంలో ఆధిపత్యకులానికి చెందిన దేవర్‌లను ఆ కులస్తులకు చెందిన బ్యారక్‌లోకే పంపుతారు. అలాగే, ఎస్సీలైన పల్లార్ కులస్తులను వారికోసం ప్రత్యేకించిన బ్యారక్‌లోనే ఉంచుతారు. 2011లో అరుళ్ అనే ఒక పిటిషన్‌దారు ఈ అంశాన్ని మద్రాస్ హైకోర్టు దృష్టికి తెచ్చినప్పుడు, కులవైరాలు, వైషమ్యాలను నివారించడానికి ఈ విధానం తప్పనిసరి అని ఆ రాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకుంది. విచిత్రం ఏమిటంటే, మద్రాస్ హైకోర్టు దానిని ఆమోదించింది. ఆ ఆదేశాలను కూడా పిటిషనర్ ఇప్పుడు సవాల్ చేశారు.

జైళ్ళ మాన్యువల్స్‌లో అనాదిగా కొనసాగుతున్న పలురకాల వివక్షలను వెలికితీసిన 'ది వైర్' కథనాలు ప్రశంసనీయమైనవే గాక, సదరు జర్నలిస్టు ఈ పిటిషన్ ద్వారా వాటిని సరిదిద్దేందుకు సంకల్పించడం అభినందించాల్సిన విషయం. నోటీసులు అందుకున్న కేంద్రప్రభుత్వం, ఆయా రాష్ట్రాలు సానుకూలంగా స్పందించి సుప్రీం-

సంతోషం సంపన్నులకే సొంతం!



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

కొత్త సంవత్సరం (2024)లో ఇది నా మొదటి కాలమ్. గత ఏడాది నా చివరి కాలమ్ (డిసెంబర్ 30, 'పార్లమెంటు ప్రాధాన్యం తగ్గిస్తున్నారా?')ను, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ముగించాను. ప్రతీ ఒక్కరికి నా శుభాకాంక్షలు మళ్లీ తెలుపుతున్నాను. అందరూ బాగుండాలన్నదే నా శుభ కామన. అయితే దేశ వాస్తవాలు శుభస్కరంగా ఉన్నాయా?

అనేక అంశాల కలయికే ఆనందం. మన సువిశాల భారతావనిలో 142 కోట్ల మంది వ్యక్తులు ఉన్నారు. ధనికులు—దరిద్రులు, కులీనులు — శ్రామికులు, ప్రభువులు — సామాన్యులు... ఇలా ఎన్నో ఆర్థిక, సామాజిక, రాజకీయ తారతమ్యాలు వారిలో కనిపిస్తాయి. మరి ఈ సంఖ్యానేక సహోదర భారతీయులలో ఎంతమంది సంతోషంగా ఉన్నారు? జీవనానందం కృశించిపోతున్న వారు ఎందరు? ఈ వాస్తవాలను నేను తెలుసుకోవాలనుకుంటున్నాను.

ఇటీవలి రోజుల్లో నేను అనేక పత్రికా వ్యాసాలు చదివాను. ఈ దేశ పౌరులు ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో విలసిల్లుతున్నారని మహారాజశ్రీ మోదీ సర్కార్ అతిశయంతో పదే పదే చెప్పుకోవడాన్ని ఆ వ్యాసాలన్నీ గట్టిగా సమర్థించాయి. వాటి వాదనకు ప్రాతిపదిక ఏమిటి? ఇండియా, అదే మన భారత్ ఒక అపూర్వ ఆర్థికాభివృద్ధిని సాధించింది, ఆ పురోగతిని మరింతగా వేగవంతం చేసుకొంటోంది. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే ఆ అసాధారణ ఆర్థిక సమున్నతి ఫలాలు సమాజంలోని ప్రతీ ఒక్కరికీ అందుతున్నాయి— ఇదీ ఆ వ్యాసకర్తల మాట.

నిజమే, భారత ఆర్థిక వ్యవస్థ తన శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా ప్రదర్శిస్తోంది. అయితే అది ఇప్పుడు సాధిస్తున్న అభివృద్ధి, ఇంతకు ముందు మనం ఎన్నడు చూడని రీతిలో సంభవిస్తోందా? లేదు, కచ్చితంగా అలా జరగడం లేదు. 'ఆర్థికాభివృద్ధి స్వర్ణ యుగం' గురించి మాట్లాడాలంటే అది నిస్సందేహంగా యూపీఏ ప్రభుత్వ జమానా (కాలం)లో మాత్రమే ఉన్నది. డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ మొదటి హయాంలో 2005–08 సంవత్సరాల మధ్య మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వార్షిక వృద్ధిరేట్లు వరుసగా మూడు సంవత్సరాల పాటు 9.5; 9.6, 9.3 శాతంగా నమోదయ్యాయి. మరి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో గత తొమ్మిది సంవత్సరాలుగా సగటున 5.7 శాతం వార్షిక వృద్ధిరేటుతో మాత్రమే మన జీడీపీ పెరుగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదల 6.5 శాతంగా ఉండగలదనేది మన ప్రభుత్వ ఆర్థికవేత్తల అంచనా. పోనీ, దీన్ని సైతం అదనంగా చేర్చుకుని గణిస్తే తేలేదేమిటి? గత తొమ్మిది సంవత్సరాల మోదీ పాలనలో వార్షిక వృద్ధిరేటు 5.8 శాతం మాత్రమే! మరి ఈ ఆర్థికాభ్యుదయం గతంలో మనం ఎన్నడు చూడనిది ఎలా అవుతుంది? ప్రస్తుత పురోగతి అద్భుతమైనది కానే కాదు. కాకపోతే అది సంతృప్తికరమైన పెరుగుదల, సందేహం లేదు. అయినా ఈ ఆర్థికాభివృద్ధి విస్తృతమైనదేమీ కాదు, పెరుగుతోన్న అవసరాలను తీర్చగల సామర్థ్యమున్నదీ కాదు. మరి ఇదెలా అపూర్వమైన ఆర్థికాభివృద్ధి అవుతుంది?

ప్రధాని మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు అల్ప ప్రత్యక్ష పన్నులు, అధికతర పరోక్ష పన్నుల వైపే మొగ్గు చూపుతున్నాయి. ఉపరితల రహదారులు, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాల నిర్మాణం, అభివృద్ధికై మూలధన పెట్టుబడులను భారీ పరిమాణంలో పెడుతోంది. అయితే విద్యా వైద్యరంగాలకు కేటాయింపులను తగ్గిస్తోందన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. ఏమైనా ఈ సంతృప్తికరమైన ఆర్థికాభివృద్ధి కొన్ని వర్గాలను సంతోషంగా ఉంచుతున్నదనడంలో సందేహం లేదు. మరి వీరెవరో చూడండి: బడా, మధ్యతరహా కార్పొరేట్ అధిపతులు; అత్యధిక నికర ఆదాయపరులు; బ్యాంకర్లు; స్టాక్ మార్కెట్ మదుపర్లు, వ్యాపారులు, దళారులు; వ్యాపార, వాణిజ్య దిగ్గజాలు; జడ్జీలు, చార్టర్డ్ అకౌంటెంట్‌లు, డాక్టర్లు, న్యాయవాదులు మొదలైన వృత్తి నిపుణులు; విశ్వవిద్యాలయ ఆచార్యులు, కళాశాల అధ్యాపకులు; ప్రభుత్వ ఉద్యోగులు; భూస్వాములు; వడ్డీ వ్యాపారులు.

ఇది భారతీయ సమాజ జీవనంలోని ఆశామయ దృశ్యం. ఇప్పుడు నిరాశామయ దృశ్యాన్ని మరింత విపులంగా చూద్దాం. పలు వర్గాలవారు అభివృద్ధిలో వెనుకబడిపోయారు. మరెన్నో వర్గాల సంక్షేమాన్ని అభివృద్ధి ఆరాటంలో పూర్తిగా వదిలివేస్తున్నారు. మరి ఈ వర్గాల వారే దేశ జనాభాలో అత్యధికంగా ఉన్నారు. అభివృద్ధిలో వెనుకబడినవారు 82 కోట్లకు పైగానే ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు 5 కిలోలు చొప్పున ఆహారపదార్థాలను ఉచితంగా ఇస్తున్నారు. ఉచిత ఆహార పంపిణీ పథకం ఆర్థికాభివృద్ధి లేదా సౌభాగ్య సమృద్ధిని సూచించదు. అటువంటి వితరణ గౌరవప్రదమైనది కాదు. ఉచిత ఆహార పంపిణీ అనేది పోషకాహార లోపం, ఆకలి మంటలకు చిహ్నమని నిక్కచ్చిగా చెప్పక తప్పదు. దేశ జనాభాలో సగం కుటుంబాలు బియ్యం లేదా గోధుమలు మొదలైన ప్రాథమిక ఆహార పదార్థాలను సైతం ఎందుకు కొనుగోలు చేసుకోలేకపోతున్నాయి? అల్పాదాయం, లేదంటే నిరుద్యోగిత. ఈ రెండే అసలు కారణాలు. మరి ఈ రెండు తీవ్ర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి ఒక విధానమే లేదు! సమస్యల పరిష్కారం పట్ల విధాన రాహిత్యం అనేది పాలకుల నిర్లక్ష్యాన్ని మాత్రమే సూచిస్తుంది.

పేదల సంక్షేమాన్ని మోదీ ప్రభుత్వం ఎంతగా ఉపేక్షిస్తుందో గ్రామీణ ఉపాధి హామీ పథకమే ఒక ఉదాహరణ. చాలా అల్పంగా ఉన్న కుటుంబ ఆదాయాన్ని పెంపొందించేందుకు, ఆ స్వల్ప రాబడికి ఇంకా మరికొంత సమకూర్చేందుకు ఉద్దేశించిన 'గ్రామీణ ఉపాధి హామీ' పట్ల మోదీ సర్కార్ మొదటి నుంచీ వ్యతిరేకంగానే ఉన్నది. ఏప్రిల్, 2022 నుంచి, ఆ పథకం కింద నమోదయిన గ్రామీణ కార్మికుల జాబితా నుంచి 7.6 కోట్ల మందిని తొలగించింది. సరికొత్తగా ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతిని ప్రవేశపెట్టిన ఫలితంగా గ్రామీణ ఉపాధి హామీ నమోదిత కార్మికులలో 8.9 కోట్ల మంది, పనులు పొందిన 1.8 కోట్ల మంది కార్మికులు గ్రామీణ ఉపాధి హామీ లబ్ధికి అనర్హులయ్యారు. పేదల పొట్టకొట్టే ఈ పరిణామం పూర్తిగా గర్హనీయం కాదా? ఉపాధి పనులు లభించని పక్షంలో ఈ కోట్లాది గ్రామీణ శ్రామికులు ఎలా బతకాలి? జీవనాధారాలను కోల్పోయిన వారు సంతోషంగా ఎలా ఉండగలుగుతారు?



నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ స్వల్ప స్థాయిలో అభివృద్ధిని సాధించింది. ఆ ప్రగతి ఫలాలూ సమాజంలోని అన్ని వర్గాల వారికీ అందలేదు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత సమస్యలను పరిష్కరించడంలో మోదీ సర్కార్ విధానాలు విఫలమవడం వల్లే ఈ దుస్థితి. ప్రస్తుత ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉన్న విధానాలు సంపన్నుల కోసం, సంపన్నుల చేత రూపొందించబడి సంపన్నులచే అమలవుతున్నాయి. పైగా అవి సంపన్నులలో బిలియనీర్లు, కుబేరులకు మాత్రమే అనుకూలంగా ఉంటున్నాయి.

పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోన్న మరో ప్రధాన వర్గం ఉద్యోగాలు లేనివారు. అంటే నిరుద్యోగిత సుడిలో చిక్కుకున్న వారు. ప్రభుత్వం ఇంకెంత మాత్రం ఉద్యోగాల సృష్టి గురించి మాట్లాడడం లేదు. స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని పదే పదే మాట్లాడడం ద్వారా ప్రజలను ముఖ్యంగా నిరుద్యోగులను భ్రమల్లో ఉంచవచ్చని పాలకులు భావిస్తున్నట్లుగా ఉన్నది. బాలలు పాఠశాల విద్యాభ్యాసంలో ఏడు లేదా ఎనిమిది సంవత్సరాలు గడిపే సమాజంలో ఎటువంటి నైపుణ్యాల శిక్షణ లేకుండా స్వయం ఉపాధి కల్పించుకోవడమంటే వాస్తవంగా నిరుద్యోగంలో కునారిల్లడమే. స్వయం ఉపాధి కల్పించుకున్నట్టుగా చెప్పబడుతున్న యువతీయువకులు క్రమబద్ధమైన పని అవకాశాలు కొరవడినవారే. దీనర్థం వారికి ఒక క్రమబద్ధమైన ఆదాయం లేదా వేతనం లేనివారే. ఇది నిష్ఠుర సత్యం. మరి ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితులలో క్రమబద్ధమైన వేతనాలు పొందే వారితో ఈ 'స్వయం పోషకుల' జీవన స్థితిగతులను పోల్చి చూడండి. ఈ అభాగ్యుల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థమవుతుంది. యువజనులలో నిరుద్యోగిత రేటు 10 శాతంగా ఉన్నది. 25 సంవత్సరాల వయసు లోపు పట్టభద్రులలో నిరుద్యోగిత 42 శాతంగా ఉన్నది! మరి ఈ లక్షలాది యువజనులు సంతోషంగా ఉండడం ఎలా సాధ్యం?

సంతోషదాయక బతుకులు లేని జనశ్రేణులన్నీ ద్రవ్యోల్బణ పీడితులే. అంటే దేశ సంపదలో 60 శాతానికి ఆసాములు, జాతీయ ఆదాయంలో 57 శాతాన్ని ఆర్జిస్తున్న ఉన్నతస్థాయి 10 శాతం మంది మినహా మిగతా వారందరూ ఆనందప్రదమైన జీవితాలు లేనివారే. 2022లో సగటు ద్రవ్యోల్బణం 6.7 శాతం. 2023లో అది 2నుంచి 6 శాతం ఎగువ అవధిని మించిపోయింది. 2023 నవంబర్‌లో ద్రవ్యోల్బణం 5.55 శాతంగా ఉన్నది. ఆహార ద్రవ్యోల్బణం ప్రస్తుతం 7.7 శాతంగా ఉన్నది. ద్రవ్యోల్బణం ఇంకా పెరుగుతుందని ఆర్బీఐ బులెటిన్ (డిసెంబర్, 2023) వెల్లడించింది. ద్రవ్యోల్బణం అనివార్యంగా వినియోగం, కుటుంబ పొదుపుల తగ్గుదలకు, కుటుంబ రుణాల పెరుగుదలకు కారణమవుతుంది. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ బాధ్యతను వదిలివేసింది. ఆర్బీఐకి ఆ బాధ్యతను అప్పగించింది. మరి పరోక్ష పన్నులను తగ్గించేందుకు మన కేంద్ర బ్యాంకు పూర్తిగా ప్రతికూలం. పరోక్ష పన్నులను తగ్గించని పక్షంలో పేదలపై ధరల పెరుగుదల భారం ఎలా తగ్గుతుంది?

నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ స్వల్ప స్థాయిలో అభివృద్ధిని సాధించింది. అయితే ఆ ప్రగతి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాల వారికీ అందలేదు. కారణమేమిటి? మోదీ సర్కార్ అనుసరించిన విధానాలు ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత సమస్యలను పరిష్కరించడంలో విఫలమవడంవల్లే కాదూ? మరొక ముఖ్య వాస్తవాన్ని కూడా మనం విస్మరించకూడదు. మోదీ ప్రభుత్వానికి మార్గదర్శకంగా ఉన్న విధానాలను సంపన్నుల కోసం, సంపన్నుల చేత రూపొందించబడి సంపన్నులచే అమలవుతున్నాయి. పైగా ఆ విధానాలు సంపన్నులలో బిలియనీర్లు, కుబేరులకు మాత్రమే అనుకూలంగా ఉంటున్నాయి. సంపద కేంద్రీకృతమయ్యేందుకు మాత్రమే అవి దోహదం చేస్తున్నాయి. కొత్త సంవత్సరం కొంత మందిని మాత్రమే సంతోషభరితులను చేస్తుంది. అత్యధికులకు పాత బాధలు, తిప్పలు, సమస్యలనే కొనసాగిస్తుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,

కథకుడుగా కవనచంద్రుడు

ముకుంద రామారావు కవిత్వ పక్షపాతి. వేలెత్తి చూపించకుండా ఉండడానికి కొన్ని కథలు రాసి వదిలేశారు. అది నాకు నచ్చలేదు. కవిత్వం ఎలాగూ రాస్తాడాయన. రాయకుండా చదవకుండా ఉండలేడు. పుంజీడు కథలు మాత్రం రాసి ఎందుకూరుకున్నారు? అందుకనే పై నిందా వాక్యంతో మొదలుపెట్టేను.

ముకుంద రామారావు మంచి కవి. ఇటీవల అనువాదాల కోసం ఆయన ఎంత శ్రమపడ్డారో నాకు తెలుసు. ఆ కృషి సామాన్య విషయం కాదు. ఆయన నిగర్వి, పెద్దమనిషి, స్నేహశీలి — కేవలం పొడగరి అవడం వల్ల కాదు. తన కోసం ఒక నిలయ వాద్య బృందాన్ని ఆయన చేరదీయలేదు. తనకంటే చిన్నవాళ్లయిన కవుల్ని మచ్చిక చేసుకోలేదు. ఆయనకి చదువుకోవడం, రాసుకోవడం ఇష్టం. మిగతా ప్రయాసలు పడలేదాయన. ఆయన రచనలో లోపం ఏదైనా ఎత్తి చూపించినా, నచ్చలేదన్నా నొచ్చుకోడాయన. అటువంటి తెలుగు రచయితలు ఎంతమంది ఉన్నారో చెప్పండి.

ముకుంద రామారావు పద్నాలుగు కథలు రాశారు. అందులో రెండు అనువాదాలు. మళ్లీ ఎందుకో కథల జోలికి పోలేదు. ఈ రాసిన కథలు కూడా ఆయన అనువాద కవిత్వ సముద్రంలోకి దిగకముందు రాసినవి. ఈ కథలన్నీ అందరూ ఏదో ఒక సందర్భంలో గమనించినవీ, అనుభవించినవీ. కారణం, వాటిలో అనూహ్యమైన మలుపులు గానీ, గహనమైన వస్తుక్లిష్టత గానీ లేకపోవడమే. చిన్న చిన్న అలవాట్లలో, మాటల్లో, ఇష్టాయిష్టాలలో, కోరికల్లో, లోపాల్లో మనలో ఉన్న నిజమైన వ్యక్తి బయటపడతాడు. కేవలం మంచి చెడులనే కాదు. మనలో నిద్రలో ఉన్న ఆకాంక్షలు, ఆశలు వగైరా అనేక చిన్న విషయాల్లో వ్యక్తం అవుతూంటాయి. వీటిని మనం గమనించం. అనేక సందర్భాలలో మనం నోరు జారి మాట్లాడే మాటల్ని పొరపాటని సర్దుకుపోతుంటాం. కానీ నువ్వు అనదల్చుకున్న మాట అదేనని నీక్కూడా తెలియదు. దీన్నే 'ఫ్రాయిడియన్ స్లిప్' అంటారు. నిత్యజీవితంలో సర్వసాధారణం అనుకునే శతానేక విషయాలను జాగ్రత్తగా రచయిత, మానసిక శాస్త్రవేత్త గుర్తించగలరు. ఈ కథల్లో ముకుంద రామారావు ఈ పనే చేశారు. కథా వస్తువుగా ఉన్న స్పష్టత, సారళ్యం రచయిత కథనంలో కూడా కనిపిస్తుంది. ఆయన కథన శైలి ఆయనలాగే ఉంటుంది.

'నా ఇల్లెక్కడ!' కథ చూడండి. మతిమరుపు మనుషులు మనందరికీ గొప్ప కాలక్షేపం. వృద్ధాప్యంలో అన్నీ మర్చిపోతుండటం సహజం. అల్జీమర్స్ అనే మతిమరుపు వ్యాధి మాత్రం భయంకరమైనది. అంటే ఈ వ్యాధి లక్షణం అటువంటిది. మనం ఎవరో మనం మర్చిపోతాం. ఏదీ జ్ఞాపకం ఉండదు. మనకు అస్తిత్వం ఉండదు. ఈ వ్యాధి పూర్తిగా ముదరక ముందు ఏర్పడే మానసిక స్థితి గురించిన కథ అది. కథ చదివిన తరువాత అనేక విషయాల గురించి ఆలోచిస్తారు పాఠకులు.

'అసలు రంగులు' అని మరో ఆసక్తికరమైన కథ. కథలో మెహతా అనే వ్యక్తి ప్రధాన పాత్ర. ఒక ఐటీ కంపెనీలో ఉన్నత స్థాయి అధికారి. ఆయనంటే అందరికీ భయం. ఎవర్నీ మెచ్చుకోడు. మృదువైన మనిషి కాడు. అదే అతని ఇమేజ్. కథకుడు ఆయనతో స్పెయిన్ వెళ్ళవలసి వస్తుంది. అటువంటి బాస్‌తో విదేశాలకు వెళితే ఏమి సంతోషం మిగుల్తుంది? మొత్తానికి బార్సిలోనా వెళ్లారు. అనేక నగరాల్లో విదేశీయులని పసిగట్టి ఏదోరకంగా మోసం చేసే జ్ఞానులుంటారు. అట్లా వీళ్లిద్దరూ కూడా మోసపోయి డబ్బులు పోగొట్టుకుంటారు. సర్వం తెలుసుననీ, ఏదైనా నిర్వహించుకు రాగలనని మెహతా నమ్మకం. కానీ, మోసపోయాడు. చండశాసనుడనుకునే ఒక అధికారి మామూలు మనిషని తేలిపోయింది. జరిగిన విషయం ఎవరికీ చెప్పవద్దనీ, తన పరువుపోతుందనీ మెహతా మాట తీసుకుంటాడు. మెహతా వ్యక్తిత్వం, గాంభీర్యం, ఆత్మవిశ్వాసం అతి చిన్న సంఘటన మీద ఆధారపడి ఉండడం, దాన్ని కాపాడుకోవడం కోసం ఆయన పడే తాపత్రయం కథ వస్తువు. కొంతమంది వ్యక్తులను మనం ఒక నేపథ్యంలో చూసి అలాగే ఫోటో ఫ్రేమ్ లా గుర్తుంచుకోవడానికి అలవాటుపడతాం. ఉదాహరణకి ఒక జిల్లా కలెక్టర్ ఎవరూ లేని చోట జారిపడి, లేచి ఎవరైనా చూశారేమోననే భయంతో బట్టలు దులుపుకొని, ఏమీ కానట్టు నటించడం మన కళ్లబడితే బిగించి ఉంచిన ఆ దర్పం ఫ్రేము ఊడిపోతుంది. ఈ వివరణ అంతా రచయిత చెయ్యడు, మనకి వదిలేస్తాడు.



ముకుంద రామారావు పద్నాలుగు కథలు రాశారు. అందులో రెండు అనువాదాలు. మళ్లీ ఎందుకో కథల జోలికి పోలేదు. ఈ రాసిన కథలు కూడా ఆయన అనువాద కవిత్వ సముద్రంలోకి దిగకముందు రాసినవి. ఈ కథలన్నీ అందరూ ఏదో ఒక సందర్భంలో గమనించినవీ, అనుభవించినవీ. కారణం, వాటిలో అనూహ్యమైన మలుపులు గానీ, గహనమైన వస్తుక్లిష్టత గానీ లేకపోవడమే.

ఇంటర్–జెనరేషనల్ ప్రాబ్లమ్ అంటూంటారు. గంభీరంగా ఉంటుంది వినడానికి. అది తరాల మార్పు అనుకుంటే చాలు. అయితే దీనికి అనేక పార్శ్వాలున్నాయి. ఒక తరం పెద్దలకి కుర్ర కారు దుస్తులు గానీ, భాష గానీ, తినే తిండి గానీ ఏదీ నచ్చదు. మార్పు సహజం అనుకోరు. తమ ఆలోచనలూ, అలవాట్లూ, అభిరుచులూ పిల్లల మీద రుద్దాలని పెద్దరికం ఆయుధంతో ప్రయత్నిస్తుంటారు. మధ్యతరగతి ఇళ్లల్లో మనం రోజూ ఒకసారైనా వినే మాట 'మా రోజుల్లో'. అత్తగారు తాను ఒకప్పుడు కోడల్నని మరిచిపోయినట్టు, పెద్దలు కూడా ఒకప్పుడు 'మా రోజుల్లో' వినే ఉంటారు గదా. ఈ అంతరం అనివార్యం. నొప్పింపక తానొవ్వక సూత్రం కొంతవరకు పనికి వస్తుంది గానీ, ఘర్షణ తప్పదు. గాయాలు తప్పవు. మానవు. కొన్ని దశాబ్దాల క్రితం కంటే ఇప్పుడు ఈ బాధ ఎక్కువగా ఉంది ప్రతి ఇంట్లో. ఈ తరాల సమస్య యావత్ సమాజాన్ని బలంగా కుదిపేస్తోంది. ఇటువంటి ఎన్నో ఆలోచనలనూ, అనుభవాలనూ రేకెత్తించే చిన్న కథ 'న్యూడ్రెస్', కొత్త బట్టలు. కథగా ఇది అల్పమైన వస్తువనిపిస్తుంది. కారణం ఇది దరిదాపు రోజూ చూస్తుంటాం. మరి అంత అల్పమైన, అతి సాధారణ విషయాలు ఎందుకు ఎంచుకున్నట్టు రచయిత? ముందే ప్రస్తావించాను. నిత్యజీవితంలో మనకు నిత్యం కనిపించే సాధారణ విషయాలు, సంఘటనల వెనుక కొండంత కథలుంటాయి. ఆ కొండంత విషయాన్ని సూచనప్రాయంగా చెప్పి మిగతాది పాఠకుల ఊహకు విడిచిపెడతాడు రచయిత. ఈ కథ అటువంటిదే. రోజుకి కనీసం పదిసార్లు మనకు ఎదురవుతుంది.

బెంగాలీ, ఒరియాల నుంచి రెండు అనువాద కథలు కూడా ఉన్నాయి. ముకుంద రామారావు పదమూడు కథలలో కేవలం మూడు కథల్నే పరామర్శించడానికి కారణం, మిగతా కథలు కూడా అందరికీ సుపరిచితమైన సంఘటనలు కావడమే. ఉదాహరణకి ఉద్యోగించే ఊరొకటీ, ఉంటున్న ఊరొకటీ అయినప్పుడు, వాటి మధ్య దూరం ఎక్కువ కానప్పుడు అనేకమంది ఉదయం రైలెక్కి మళ్లీ సాయంత్రం ఇంటికి చేరతారు. ఈ క్రమంలో ఇబ్బందులు అలా ఉంచి బాగా కాలక్షేపంగా ఉండి ప్రయాణ క్లేశం ఒక అనుభవంగా మిగిలిపోతుంది. మధ్యలో మిత్ర బృందంలో ఎవరికైనా బదిలీ అవుతూంటుంది. గొప్ప స్నేహాలు ఏర్పడతాయి. కష్ట సుఖాలు పంచుకుంటారు. ఇవన్నీ కళ్ళకు కట్టినట్లు చూపించారు రచయిత 'ఉద్యోగం ఒక జీవిత ప్రయాణం' అనే కథలో. అలా తిరిగి ఉద్యోగించి విశ్రాంత జీవితం గడుపుతున్న వాళ్ళకి గతం సంతోషంగా జ్ఞాపకం వస్తుంది. రేగువడియం లాగ.

కవిత్వం కొన్నాళ్ళు పక్కనపెట్టి, విస్తృతమైన తన జీవితానుభవంలోంచి కథలు రాయమని ముకుంద రామారావు గారిని కోరుతున్నాను. మిత్రుడికి హార్దిక శుభాకాంక్షలు.

▪ తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి

(ముకుంద రామారావు జనవరి 7న ఆజో–విభో–కందాళం ఫౌండేషన్ వారి 'ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం' అందుకుంటున్న సందర్భంగా)

రాజ్యాంగ స్ఫూర్తికే అవమానం

డిసెంబర్ 27న ఆంధ్రజ్యోతిలో 'కశ్మీర్ సమస్యపై సుప్రీం విజయం' పేరిట పగుడాకుల బాలస్వామి వెలిబుచ్చిన అభిప్రాయాలు సరైనవి కావు. స్వతంత్ర భారతంలో ఆఖరున విలీనమైన కశ్మీర్‌ను కాపాడుకోవడం కోసం అన్ని భారత ప్రభుత్వాలు చిత్తశుద్ధితోనే కృషి చేశాయి. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఆర్టికల్ 370 రద్దు అంశంలోనే దేశ ప్రజలలో భిన్నాభిప్రాయాలున్నాయి.

ఆర్టికల్ 370ని రద్దు చేయడమే కశ్మీర్ సమస్యకు పరిష్కారమన్న ప్రచారాన్ని జనసంఘ్ కాలం నుంచి బీజేపీ వరకూ కొనసాగించారు. అసలు ఆర్టికల్ 370ని రాయడానికి డా. బి.ఆర్. అంబేడ్కర్ అంగీకరించలేదన్నంత వరకు మోదీ ప్రభుత్వం వెళ్లింది. ఇక 1977 నుంచి 1979 వరకు జనసంఘ్ భాగస్వామిగా ఉన్న కాంగ్రెసేతర తొలి ప్రధాని మొరార్జీ దేశాయ్ (జనతాపార్టీ ప్రభుత్వం) కానీ, లాల్ బహదూర్ శాస్త్రి తర్వాత భారతదేశానికి అంత గొప్ప ప్రధాని లభించారని లాల్‌కృష్ణ అద్వానీ కీర్తించిన కాంగ్రెస్ ప్రధాని పీవీ నరసింహారావు కానీ, అంతెందుకు బీజేపీ తొలి ప్రధాని వాజ్‌పేయి కానీ ఆర్టికల్ 370ని ఎందుకు రద్దు చేయలేదు?

కశ్మీర్‌లో కాంగ్రెస్ వ్యతిరేక పక్షాలైన నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ పార్టీలతో కేంద్రంలోను, కశ్మీర్‌లోను బీజేపీ అధికార భాగస్వామ్యం పంచుకున్నది. భారత్‌లో విలీనమైన తరువాత అనేక ప్రాంతీయ ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వాలకు తలనొప్పిగా మారిన కొన్ని ఈశాన్య రాష్ట్రాలలాగే కశ్మీర్‌లో కూడా అంతర్గత, విదేశీ శక్తుల వలన చిరకాలంగా కొన్ని అవాంఛనీయ, అమానవీయ సంఘటనలు జరిగాయి. అక్కడి పరిస్థితులు చక్కదిద్దేందుకు నెహ్రూ మొదలు వాజ్‌పేయి వరకు ప్రధానులందరూ చాలా కృషి చేశారు. దురదృష్టవశాత్తూ మెజారిటీ మీడియాను మేనేజ్ చేస్తున్న మోదీ ప్రభుత్వం సుప్రీం తీర్పు పూర్తి పాఠం దేశంలో సామాన్యులకు తెలియకుండా చేసింది.

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వ పాలనా తీరు పట్ల, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు మౌనం వహించవలసిన దుస్థితి దాపురించింది. ఆర్టికల్ 370 రద్దుకు కొంతకాలం ముందు వరకు అక్కడి ప్రాంతీయ పార్టీలతో పాలనలో పాలు పంచుకున్న బీజేపీ మోదీ నాయకత్వం, కేవలం భావోద్వేగాల పైనే ఆధారపడి పరిపాలన సుస్థిరం చేసుకోవాలని చూస్తోంది. నీటిబుడగల లాంటి భావోద్వేగాలు, బీజేపీ అధికార నావను ఎంతవరకు ఒడ్డుకు చేరుస్తాయో... ప్రజాస్వామ్య, శాంతి సామరస్య జీవన విధానానికి అలవాటుపడిన భారత ప్రజలు తప్పకుండా నిర్ణయిస్తారు.

— ఆశాజ్యోతి

మోదీ 'వికసిత భారత' స్వప్నం

నరేంద్ర మోదీ మన దేశానికి ప్రధానమంత్రి కావడానికి ముందే 'అంత్యోదయ' స్ఫూర్తితో 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) కోసం కలలు కన్నారు. ఇందుకోసం విదేశాంగ విధానంలో రాజీపడకుండా, దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో నిర్మాణాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నారు. దశలవారీగా ఒక క్రమపద్ధతిలో నిర్దేశించుకున్న షెడ్యూల్ ప్రకారం దేశం, ప్రజల ముఖ్య అవసరాలను వర్గీకరించి, ప్రజలు అత్యుత్తమ జీవన ప్రమాణాలను సాధించడం కోసం, 'సమ్మిళిత అభివృద్ధి' కోసం మోదీ తన పాలన నిర్ణయాలను అమలు చేస్తున్నారు. తొమ్మిదిన్నరేళ్ల ఆయన సేవను జాగ్రత్తగా పరిశీలిస్తే, దార్శనికతతో 'భారత్‌ను విశ్వగురువు'గా తీర్చిదిద్దేందుకు రాబోయే 25 ఏళ్ల 'అమృతకాలం' రోడ్ మ్యాప్‌ను అందించడం ద్వారా 100వ స్వాతంత్ర్య దినోత్సవం(2047) పూర్తయ్యేసరికి వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించారని అర్థమవుతుంది.

అర్హులైన లబ్ధిదారులందరికీ సహాయాన్ని అందించాలనే లక్ష్యంతో నరేంద్ర మోదీ గత నవంబర్ 15న జార్ఖండ్‌లోని కుంతీ నుంచి గిరిజన దిగ్గజం బిర్సా ముండా జయంతి నాడు 'వికాస్ భారత్ సంకల్ప్ యాత్ర'ను ప్రారంభించారు. అంత్యోదయ భావన స్ఫూర్తితో అర్హులైన లబ్ధిదారులందరికీ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు, వారి ప్రత్యక్ష అనుభవాలను పంచుకోవడానికి, పథకాలు ఇంకా అందని లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు అందించడానికి, కొత్తగా నమోదు చేసుకోవడానికి మోదీ గ్యారంటీ వాహనాలు ఈ యాత్రలో భాగంగా ప్రతి గ్రామానికి చేరుకుంటున్నాయి. దేశంలో 2.60 లక్షల పంచాయతీలు, 4 వేలకు పైగా పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని ప్రస్తుత లబ్ధిదారులు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నోడల్ ఏజెన్సీగా అమలు చేసే రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఒంగోలు పార్లమెంట్ సెగ్మెంట్, కొండపి అసెంబ్లీలోని టంగుటూరు మండలం జయవరం, కాకుటూరివారి పాలెం పంచాయతీలు, దర్శి రూరల్ మండలం రాజంపల్లి పంచాయతీతో పాటు బాపట్ల పార్లమెంట్ సెగ్మెంట్, సంతనూతలపాడు అసెంబ్లీ పరిధిలోని నాగులుప్పలపాడు మండలం కండ్లగుంట పంచాయితీలలో వికసిత భారత్ సంకల్ప యాత్ర సమావేశాలకు నేను హాజరయ్యాను. కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు అందుకున్న లబ్ధిదారులతో సంభాషించి వారి కుటుంబాలు ఎలా ప్రగతిపథంలో ముందడుగు వేస్తున్నాయో తెలుసుకున్నాను.

చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే ప్రధాని ఆకాంక్షల మేరకు 'ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' కింద ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 50 లక్షల రైతు కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. 2019 నుంచి పంట పెట్టుబడి సహాయం కింద మూడు సమాన వాయిదాలలో సంవత్సరానికి రూ. ఆరు వేలు రైతులకు అందించింది మోదీ ప్రభుత్వం. దేశంలో 11 కోట్ల కుటుంబాల లబ్ధిదారులకు 2.60 లక్షల కోట్ల రూపాయలు ఈ పథకం కింద అందాయి. అంతేకాక రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఎరువుల బస్తాపై రూ. 2,000 సబ్సిడీ చెల్లిస్తోంది. ఈ పథకం కింద ఏపీకి అందే సహాయం దాదాపు రూ.15వేల కోట్లు. అలాగే, అనిశ్చిత పరిస్థితుల వల్ల వచ్చే పంట నష్టం భర్తీ కోసం 'ఫసల్ బీమా యోజన'తో కేంద్రం మద్దతునిస్తోంది, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 7 మిలియన్ల 'కిసాన్ క్రెడిట్ కార్డ్‌లు' జారీ అయ్యాయి. వీటితో బ్యాంకుల నుంచి రుణాలు పొందడం సులభమయింది. వ్యవసాయ రుణాలపైనా 2శాతం వడ్డీ రాయితీ లభిస్తోంది. సకాలంలో ఈ రుణాలు తిరిగి చెల్లిస్తే 3శాతం వడ్డీ ప్రోత్సాహకం అనంతరం కేవలం 4శాతం నికర వడ్డీకి కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు రుణాలు అందుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం ద్రవ యూరియా కోసం కొత్త 'నానో టెక్నాలజీ' అందుబాటులోకి తేవడం వల్ల యూరియా వినియోగం వృథా గణనీయంగా తగ్గింది. ఈ యూరియా వాడడం వల్ల వ్యవసాయ భూములు దెబ్బతినడం కూడా తగ్గింది. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి, పంట ఉత్పాదకత పెరిగింది. ఇంకా, చిన్న–సన్నకారు రైతులకు నానో యూరియా మిశ్రమాన్ని డ్రోను ద్వారా వ్యవసాయ భూముల్లో చల్లడం కోసం పంచాయతీలోని స్వయం సహాయక బృందాల ద్వారా 50శాతం సబ్సిడీతో 'డ్రోన్స్'కు కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తోంది. ఇది కాకుండా, ప్రధాన లేదా చిన్న నీటిపారుదల వ్యవస్థలతో నీటి నిర్వహణను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 'కృషి సంచాయ్ యోజన' ద్వారా 25 నుంచి 60శాతం సబ్సిడీని అందిస్తోంది.

'వికాస్ భారత్ సంకల్ప యాత్ర' ద్వారా అర్హులైన బీపీఎల్ కుటుంబాలకు 'అంత్యోదయ' స్ఫూర్తితో లబ్ధి చేకూరే విధంగా ప్రణాళికలు రచించారు. నేడు అనేక రాజకీయ పార్టీలు తమ పథకాలను భవిష్యత్తు కోసం 'గ్యారంటీలు'గా పేర్కొంటున్నాయి, అయితే 'మోదీ గ్యారంటీ' వాహనాలు దేశంలోని మారుమూల గ్రామాల్లో నివసించే అర్హులైన ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు వస్తున్నాయి. దేశంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలు, ఎస్టీ తాండాలకు 'వికసిత భారత్ సంకల్ప యాత్ర'లో ప్రాధాన్యం ఇచ్చారు. 'గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' కింద ఏప్రిల్ 2020లో లాక్‌డౌన్ ప్రారంభమయినప్పటి నుంచి బీపీఎల్ కుటుంబాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని 2.67 కోట్ల మందితో సహా దేశంలో 80 కోట్ల మంది వ్యక్తులకు 5 కిలోల ఉచిత బియ్యం పంపిణీ చేసింది. తర్వాత ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్లు పొడిగించింది. దీంతోపాటు 'జాతీయ ఆహార భద్రతా చట్టం' ప్రకారం పీడీఎస్ ద్వారా ఇప్పటికే ఉన్న సబ్సిడీ రేషన్‌ను కొనసాగించింది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, సగటున ఒక సంవత్సరానికి జాతీయ ఆహార భద్రతా చట్టం, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సబ్సిడీ విలువ రూ.16,000 కోట్లు.

ఇది కాకుండా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశంలోని పేదల కోసం మూడు కోట్లకు పైగా గృహాలు మంజూరయ్యాయి, అందులో ఆంధ్రప్రదేశ్‌కు 25 లక్షలు ఉండగా, గృహాల నిర్మాణం పురోగతిలో ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణాలు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో పాటు, ప్రతి గ్రామంలోని ఇంటికీ సురక్షితమైన కుళాయి తాగునీటి కోసం జల్ జీవన్ మిషన్‌ను మోదీ 2019 ఆగస్టు 15న ప్రకటించారు. దీనికి 3.75 లక్షల కోట్ల రూపాయలు అవసరం కాగా, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు 50శాతం చొప్పున నిధులు సమకూర్చాలి. 9000 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకపోవడం వల్ల సకాలంలో ఫలాలు అందడం లేదు.

దేశంలో దాదాపు 11 కోట్ల మంది అర్హులైన కుటుంబాలకు సంబంధించిన 50 కోట్ల మంది ప్రజలు 'ఆయుష్మాన్ భారత్' కింద రూ. ఐదు లక్షల రూపాయల ఆరోగ్య బీమాను పొందుతున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో 2,322 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో అర్హులై ఉండి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందని పేదలకు గృహాలను మంజూరు చేయడానికి, ఆయుష్మాన్ భారత్ కార్డ్‌లు, ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్‌ను అక్కడికక్కడే జారీ చేయడానికి మోదీ హామీ ఇచ్చారు. 'మోదీ గ్యారెంటీ వాహనం' రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను చేరువకు తెస్తోంది. మోదీ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేళ్లుగా 50 కోట్ల జనధన్ ఖాతాలకు 35 లక్షల కోట్ల రూపాయలను నేరుగా బదిలీ చేసింది. అందులో ఏపీకి 3 లక్షల కోట్లకు పైగా నిధులు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా బదిలీ అయ్యాయి. ఇప్పుడు, అర్హులైన లబ్ధిదారులకు కొత్త జనధన్ ఖాతాలు ఈ యాత్రలో ప్రారంభించబోతున్నారు.

కొవిడ్ లాక్‌డౌన్ అనిశ్చితి వల్ల చిన్న, వీధి వ్యాపారుల రోజువారీ ఆర్థిక అవసరాల సర్దుబాటు కష్టతరమయింది, దీంతో 'పీఎం స్వనిధి పథకం' ద్వారా వీధి వ్యాపారులకు బ్యాంకులు వడ్డీ రాయితీతో 10 వేల రూపాయల రుణం అందించింది కేంద్ర ప్రభుత్వం. ఈ రుణాన్ని మొదటిసారి తీసుకొని సకాలంలో తిరిగి చెల్లిస్తే, మరో దఫా తక్కువ వడ్డీకే వారికి రూ.25 వేలు లోన్ ఇస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 18 కేటగిరీల హస్తకళా కార్మికులకు శిక్షణతో పాటు ఉచితంగా 15 వేల రూపాయల విలువైన పరికరాలు అందించడానికి 'విశ్వకర్మ యోజన' కింద రూ.13 వేల కోట్ల బడ్జెట్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పథకంలో కూడా అర్హులై ఉండీ ఇంకా అందని వారు మోదీ గ్యారంటీ వాహనాలు వచ్చినప్పుడు నమోదు చేసుకోవచ్చు.

వికాస్ భారత్ సంకల్ప యాత్ర స్ఫూర్తికి మూలం సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్. సబ్‌కా ప్రయాస్ (ప్రజలందరి ప్రమేయంతో) అనే అంత్యోదయ విధానంగా అన్ని వర్గాల ప్రజల సమ్మిళిత వృద్ధే లక్ష్యంగా, నరేంద్రమోదీ 2047 నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం రూపాంతరం చెందడానికి, దేశాన్ని విశ్వగురువుగా నిలపడానికి అడుగులు వేగంగా వేస్తున్నారు.

వికాస్ భారత్ సంకల్ప యాత్ర స్ఫూర్తికి మూలం సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్. ప్రజలందరి ప్రమేయంతో, అన్ని వర్గాల ప్రజల సమ్మిళిత వృద్ధే లక్ష్యంగా, నరేంద్రమోదీ 2047 నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం రూపాంతరం చెందడానికి, దేశాన్ని విశ్వగురువుగా నిలపడానికి అడుగులు వేగంగా వేస్తున్నారు.



• దినకర్ లంకా



ఆది నుంచీ అంతే!

నియోజకవర్గ ఇన్‌చార్జుల స్థానంలో వేరొకరికి ప్రోత్సాహం

ఎంపీ కేశినేని నాని.. తొలి నుంచి తన దుందుడుకు వైఖరితో వార్తల్లో ఉంటూ వచ్చారు. ఎంపీగా ఉంటూ 2017లో రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంతో ఘర్షణ పడటం.. పార్టీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌పై పార్టీ నాయకుల వద్ద, బహిరంగంగానూ కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం వంటి విషయాలతో వివాదాలకు కేంద్ర బిందువుగా ఉంటూ వచ్చారు.

- పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌పై దుందుడుకు వ్యాఖ్యలు
- ఓ దశలో కేశినేని భవన్‌లో చంద్రబాబు ఫొటోలు తొలగింపు
- తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని అధినేతకు బెదిరింపులు
- పలుమార్లు ట్విటర్‌లో అధినేతను కించపరిచేలా పోస్టులు
- 2017లో రవాణా కమిషనర్‌తో రగడ.. పార్టీకి తలవొంపులు
- వివాదాలకు కేరాఫ్‌గా ఎంపీ కేశినేని నాని వైఖరి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎంపీ నానీ వ్యవహార శైలిపై చాలా కాలం నుంచి పార్టీలో చర్చ నడుస్తోంది. 'నోటిని అదుపులో పెట్టుకోలేని ఆయన దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తాను ముక్కుసూటిగా ఉంటానని చెప్పుకుంటుంటారు. 2019లో టీడీపీ ఘోర పరాజయం తర్వాత నాని ధోరణి మరింత మారిపోయింది. పార్టీ కంటే తన చరిష్మానే ఎక్కువ అన్న తరహాలో ఆయన వ్యాఖ్యలు ఉండేవి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా గెలుస్తానని బహిరంగంగా ఆయన వ్యాఖ్యానించడమే ఆయన ధోరణికి అద్దం పడుతోంది' అని ఓ టీడీపీ నేత ఎంపీ నాని శైలిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ ధోరణి కారణంగా పార్టీ అధినేత చంద్రబాబు, లోకేశ్ విషయంలో ఆయన తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసేవారు. ఆయన చేసిన ట్వీట్లను పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది. 2019 జూలైలో.. 'చంద్రబాబు గారు.. నాలాంటి వాళ్లు పార్టీలో వద్దనుకుంటే చెప్పండి. ఎంపీ పదవికి, పార్టీకి వెంటనే రాజీనామా చేస్తా. నాలాంటి వాళ్లు పార్టీలో కొనసాగాలనుకుంటే మీ 'పెంపుడు కుక్కలను కంట్రోల్ చేయండి' అని ఓసారి, 'రాజకీయ జన్మలు, పునర్జన్మలు రాజకీయ భవిష్యత్తులు గుళ్లో కొబ్బరిచిప్ప దొంగలకి, కాల్‌మనీ గాళ్లకి, బ్రోకర్లు, పైరవీదారులకు అవసరం. నాకు అవసరం లేదు' అని మరోసారి నాని ట్వీట్ చేశారు. వీటి ద్వారా తలెత్తిన సమస్యలను సరిచేయడం పార్టీ అధిష్ఠానానికి తలనొప్పిగా మారేది.

ప్రాధాన్యత ఇచ్చినా మారని తీరు..

చంద్రబాబు ఎనాడూ కేశినేని నానికి ప్రాధాన్యతను తగ్గించలేదు. కానీ నాని మాత్రం అధినేత

- మిగతా 6లో

అవకాశాన్ని అందిపుచ్చుకున్న 'సోదరుడు'

2019 ఎన్నికల తర్వాత టీడీపీ ఇక కోలుకోవడం కష్టమని తరచూ సన్నిహితుల వద్ద నాని వ్యాఖ్యలు చేసేవారు. అదే ఉద్దేశంతో పలుమార్లు పార్టీ సమావేశాల్లో తాను 2024 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయబోనని పార్టీ అధినేతకు బెదిరింపు ధోరణిలో చెప్పేవారు. ఈ కారణంగానే విజయవాడ ఎంపీ స్థానానికి టీడీపీ అధిష్ఠానం ప్రత్యామ్నాయాన్ని అన్వేషించడం ప్రారంభించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాని సోదరుడు చిన్ని తెరపైకి వచ్చారు. కానీ పార్టీ మాత్రం ఏనాడూ చిన్నికి విజయవాడ ఎంపీ స్థానాన్ని కేటాయిస్తున్నట్టు ప్రకటించ లేదు. నాని వైపే అధిష్ఠానం మొగ్గుచూపుతూ వచ్చింది. పరిస్థితులను బట్టి చిన్నికి ఏదో ఒక స్థానంలో అవకాశం కల్పించాలన్న అభిప్రాయంలో పార్టీ అధిష్ఠానం ఉంది. కానీ నాని వైఖరి పార్టీ శ్రేణులు చిన్ని వైపు మొగ్గేలా చేస్తోంది.



ఇరుముడులతో భవానీలు



భవానీ పాహిమాం!

వన్‌టౌన్, జనవరి 5 : భవానీ దీక్షల విరమణలు మూడవరోజు శుక్రవారం నాడు ఘనంగా జరిగాయి. మహిళా భక్తులతో సహా బాలభవానీలు సైతం అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. గురువారం రాత్రి 11.30 గంటలకు ఆలయం తలుపులు మూసివేసారు. ఈ సమయంలో 80వేలకు మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పించుకున్నారు. 3.97 లక్షల లడ్డూ ప్రసాదాన్ని భక్తులు కొనుగోలు చేశారు. 20,060 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. 19,800 మంది అన్నప్రసాదం, ఉచిత ప్రసాదాలను స్వీకరించారు. ఈనెల 3న ప్రారంభమైన దీక్షల విరమణలు 7న ముగియనున్నాయి.



రా.. రమ్మని..!

నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవానికి పాఠకులు, పుస్తకప్రియుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. వివిధ జిల్లాల నుంచి గతేడాదికి మించి పుస్తకప్రియులు వస్తున్నారు. స్టాల్స్‌లో ఈ ఏడాది చిన్నారుల పుస్తకాలు ఎక్కువ సంఖ్యలో ఉండటంలో కొనుగోళ్లు పెరిగాయి.

- 6లో..

ఎస్ఎస్ఏ ఉద్యోగుల చలో విజయవాడ ఉద్రిక్తం

శ్రామిక వర్గం పోరుబాట పట్టింది. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడంపై రోడ్డెక్కి గర్జిస్తోంది. నిరవధిక దీక్షలతో అంగన్వాడీలు ప్రభుత్వానికి చెమటలు పట్టిస్తే.. మున్సిపల్ కార్మికులు ఉద్యమ శంఖారావం పూరించారు. ఇప్పుడు రాష్ట్ర సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు శుక్రవారం చలో విజయవాడలో భాగంగా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకున్నా.. అదుపులోకి తీసుకుని కనిపించిన కల్యాణ మండపాల్లో నిర్బంధించినా ఆగలేదు. బంధనాలు తెంచుకుని నిరసన తెలపడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.



మహిళను చుట్టుముట్టిన పోలీసులు

వేలాది మంది ఉద్యోగులు నగరానికి రాక

- ఎస్‌పీడీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నం
- ఉద్యోగులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఉద్యోగుల బైఠాయింపులో చంటిబిడ్డతో తల్లి నినాదాలు

- శివారుల్లోని కల్యాణ మండపాలకు తరలింపు
- ఆటోనగర్ ఏటీఏ కల్యాణ మండపం వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- గోడలు దూకి ఎస్‌పీడీ కార్యాలయం వైపు పరుగులు
- డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నా పట్టించుకోరా? : ఉద్యోగులు

ఆటోనగర్ (పెనమలూరు), జనవరి 5 : గత ఎన్నికలకు ముందు జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలుచేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన చలో విజయవాడ శుక్రవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సమగ్ర శిక్ష అభియాన్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు వేలాది మంది ఉద్యోగులు చలో విజయవాడ కార్యక్రమానికి వచ్చారు. బస్‌స్టాండ్లలో, రైల్వే స్టేషన్లలో విజయవాడ తరలివచ్చిన ఉద్యోగులను పోలీసులు అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. వారి కళ్లుకప్పి వేలాదిగా ఉద్యోగులు పటమట హైస్కూలు రోడ్డులోని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టరు కార్యాలయ సమీపానికి చేరుకొని ఆందోళన చేశారు. విజయవాడ పటమట హైస్కూలు రోడ్డులోకి చేరిన వేలాది మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులతో పంటకాల్వ రోడ్డు పరిసరాలు జనసంద్రంగా మారాయి. ఎస్ఎస్ఏ కార్యాలయం వైపు ఉద్యోగులు కదిలి వెళ్లబోతుండగా అడ్డుకున్న పోలీసులు ఎక్కడికక్కడ ఉద్యోగులను అదుపులోకి తీసుకొన్నారు. అయినా వెరవక ఉద్యోగులు పోలీసుల చెరను ఛేదించి కార్యాలయంవైపు వెళ్లే ప్రయత్నం చేశారు. ఉద్యోగులను అదుపులోకి తీసుకొని పదుల సంఖ్యలో వాహనాల్లో ఆటోనగర్ ఏటీఏ కల్యాణ మండపం, పటమట సాయిబాబా కల్యాణ మండపంలో నిర్బంధించారు. ఆ నిర్బంధాలను ఛేదించిన ఉద్యోగులు కల్యాణ మండపం గోడలు దూకి పటమట వైపు దౌడు తీయడం ప్రారంభించడంతో బిత్తరపోయిన పోలీసులు వారిని వెంబడించి తిరిగి అదుపులోకి తీసుకొని కల్యాణమండపానికి తరలించే సమయంలో

- మిగతా 6లో

ఆర్టీసీ సంక్రాంతి బస్సులు -1004

- నేటి నుంచి నడపనున్న స్పెషల్ బస్సులు
- షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు
- సొంతూళ్లకొచ్చేవారి కోసం స్పెషల్స్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీ అధికారులు శుక్రవారం సంక్రాంతి స్పెషల్ బస్సుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ దఫా పండగకు సొంతూళ్లకు రాకపోకలు సాగించటానికి రికార్డు స్థాయిలో 1004 బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. కిందటి ఏడాదిలాగానే ఈసారి కూడా అదనపు చార్జీలు లేకుండానే.. స్పెషల్ బస్సులు నడుపుతున్నట్టు ప్రకటించారు. పండగ ముందు, పండగ తర్వాత కలుపుకుని హైదరాబాద్‌కు 345 బస్సులు, రాజమండ్రికి 225 బస్సులు, విశాఖపట్నం 124 బస్సులు, బెంగళూరు 7 బస్సులు, చెన్నై 31 బస్సులు, డిమాండ్‌ను బట్టి ఇతర రూట్లకు 272 బస్సుల చొప్పున ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. జనవరి 6న 47 బస్సులు, జనవరి 7న 47, జనవరి 8న 32, జనవరి 9న 28 బస్సులు, జనవరి 10న 30 బస్సులు, జనవరి 11న 80 బస్సుల చొప్పున నడపనున్నారు. సరిగ్గా భోగి పండగకు ముందు జనవరి 12న 113 బస్సులు, జనవరి 13న 128 బస్సులు, జనవరి 14న 125 బస్సులు చొప్పున నడపనున్నారు. పండగ రోజు మాత్రం అంటే జనవరి 15న 70 బస్సులు, జనవరి 16న 23 బస్సులు చొప్పున నడపనున్నారు. కనుమ తర్వాత అంటే జనవరి 17న 141 బస్సులు, జనవరి 18న 116, జనవరి 19న 71 బస్సుల చొప్పున నడపనున్నారు.

హామీలు అమలు చేయాల్సిందే

- రిలే నిరాహార దీక్షల్లో అంగన్వాడీలు

- 6లో..



ధర్నాచౌక్ వద్ద దీక్షా శిబిరంలో అంగన్వాడీలు, సహాయకులు

కొవిడ్ తర్వాత..

ఆంగ్ల ప్రచురణలు పెరిగాయి

- వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు మనోహరనాయుడు



"ప్రచురణ రంగంలో తెలుగు పుస్తకాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లో పోటీ ఎక్కువగా ఉండేది. కొవిడ్ తర్వాత పరిస్థితి మారింది. ఆంగ్ల పుస్తకాల ప్రచురణలు బాగా పెరిగాయి. అదే సమయంలో కొనుగోళ్లు పెరిగాయి" అని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ(వీబీఎఫ్ఎస్) అధ్యక్షుడు మనోహరనాయుడు అన్నారు. పుస్తకమహోత్సవంలో ప్రస్తుతం జరుగుతున్న కొనుగోళ్లు, ప్రచురణల్లో వచ్చిన మార్పులపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

? ఆంగ్ల పుస్తకాల కొనుగోళ్లు పెరుగుతున్నాయా

అవును. ప్రస్తుతం జరుగుతున్న పుస్తక మహోత్సవంలో ఆంగ్ల పుస్తకాల కొనుగోళ్లు పెరిగాయి. వాస్తవానికి కొవిడ్ తర్వాత ప్రచురణరంగంలో మార్పులు వచ్చాయి. ఆంగ్ల పుస్తకాల ప్రచురణ విపరీతంగా పెరిగింది.

? ఏ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్నాయి

గడచిన ఏడాది పుస్తక మహోత్సవంలో ఆంగ్ల పుస్తకాల కొనుగోలు 10-25శాతం ఉండేది. ఇప్పుడు 75 శాతానికి పెరిగింది. ఆంగ్లంలో ఉన్న కథలు, నవలలు, డిటెక్టివ్ నవలలు, మ్యాజిక్ పుస్తకాలను ఎక్కువగా పాఠకులు కొనుగోలు చేస్తున్నారు. వాటితోపాటు మెడికల్, హెల్త్, సైన్స్ ప్రయోగాలకు సంబంధించిన పుస్తకాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

? ఏయే ప్రచురణలు ఎక్కువగా వచ్చాయి

ఆక్స్‌ఫర్డ్, పెంగ్విన్, ట్వింకిల్ వంటి ప్రచురణ సంస్థలు కొత్త పుస్తకాలను మార్కెట్లోకి తీసుకొచ్చాయి.

? తెలుగు పుస్తకాల విక్రయాలు ఎలా ఉన్నాయి

తెలుగు భాషను సజీవంగా ఉంచాలన్న ఆకాంక్ష విదేశాల్లో స్థిరపడిన తెలుగు వారిలో ఎక్కువగా కనిపిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు ఇచ్చి వేలాది రూపాయల పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. రామాయణం, భాగవతం, చందమామ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, బామ్మ చెప్పిన కథలు వంటి బాలసాహిత్య పుస్తకాలకు ఎక్కువ ఆర్డర్లు వస్తున్నాయి.

? ఈ ఏడాది ప్రత్యేకత ఏమిటి

డిసెంబరు నెలలో వరుసగా బుక్ ఫెస్టివల్స్ జరుగుతాయి. ముందుగా హైదరాబాద్, తర్వాత చెన్నై, ఆ తర్వాత విజయవాడ పుస్తక మహోత్సవం ఉంటుంది. ఇదొక చైన్‌లా సాగుతుంది. అన్నింటిలో ప్రచురణకర్తలు పాల్గొంటారు. ఈసారి హైదరాబాద్ బుక్‌ఫెస్టివల్ జరగలేదు. అయినా ప్రచురణకర్తలు భారీ సంఖ్యలో రావడం సంతోషకరం. **- విజయవాడ సిటీలైఫ్ (ఆంధ్రజ్యోతి)**

కథ.. కనికట్టు

›› బాలసాహిత్యంపై పిల్లలకు శిక్షణ ›› ఇదే భాషకు బలం



విద్యార్థులకు బొమ్మలు చూపి వ్యాసాలు రాయిస్తున్న ఉపాధ్యాయులు

ఎలుగుబంటి.. ఏనుగు.. చీమలు.. ఈ మూడింటిని చిన్నారులు పుస్తకాల్లో ఎల్‌కేజీ నుంచి చూస్తూనే ఉంటారు. ఈ మూడింటిపైనా ఏ వ్యాసం రాయాలన్నా వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అప్పుడే వాటి మీద కవిత అయినా, కథ అయినా పుట్టుకొస్తుంది. ఇలా చిన్నారుల్లో కథా సాహిత్యంపై అభిలాషను పెంచాలని పుస్తక మహోత్సవ నిర్వాహకులు భావించారు. ఇది భాషా పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్)

పాఠ్యపుస్తకాల పరిధితో సంబంధం లేకుండా కథలు, కవితలు, సాహిత్య పుస్తకాలను చదివించేందుకు ఇటు నిర్వాహకులు, అటు ఉపాధ్యాయులు, భాషావేత్తలు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒక అంశం చెప్పి దానితో సొంతంగా పిల్లలతో కథలు చెప్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈసారి ఈ తరహా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పుస్తక మహోత్సవంలో శ్రీరమణ ప్రతిభా వేదికపై బాలలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బొమ్మలు చూపి వాటి ద్వారా కథలు చెప్పించడం, ఒక అంశం ఇచ్చి దానిపై కథలు చెప్పించడం చేస్తున్నారు. రోజుకు ఒక పాఠశాల విద్యార్థులను గ్రూపులుగా కూర్చోబెట్టి ఒక్కొక్కరితో కథ చెప్పిస్తున్నారు. అక్కడ జడ్జిగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు చెప్పిన కథలో తప్పులు ఎక్కడ జరిగాయో తెలియజేస్తూ, వాటిని సరిచేసుకునే విధానాన్ని వివరిస్తున్నారు. కథను ప్రారంభించే విధానం, ఒక వరుస క్రమంలో చెప్పే అంశం, ముగించే విధానాన్ని తెలియజేస్తున్నారు. ముందుగా కథలు అల్లడం నేర్చుకుంటే, ఆ తర్వాత రాసే మెట్టును ఈ విద్యార్థులు ఎక్కుతారని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాలకు పుస్తక మహోత్సవంలో బాగా స్పందన లభిస్తోంది. ఈ పోటీలకు విద్యార్థులను పంపడానికి పాఠశాలలు ఆసక్తిని చూపిస్తున్నాయి.

బాలల కోసం రాజ్యాంగ పుస్తకం

విజయవాడ కల్చరల్ : దేశంలో ప్రజాస్వామ్యం, మానవ హక్కులు సురక్షితంగా వుండాలంటే చిన్నతనం నుంచే రాజ్యాంగం, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంచుకోవాలని శాసనమండలి సభ్యుడు విద్యావేత్త కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. వీజీఎస్ ప్రచురించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ



ప్రవేశిక' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్యాంగానికి పునాదిలాంటి రాజ్యాంగ పీఠికను పిల్లలకు అర్థమయ్యేలా చేసేందుకు ఈ పుస్తకాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాల్యాద్రి తదితరులు ప్రసంగించారు. వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత శీరం నారాయణరావు పాల్గొన్నారు. పుస్తకాన్ని సభలో ఉచితంగా పంపిణీ చేశారు.

కథల సాహిత్యంలో పూసపాటిది సుస్థిరస్థానం

విజయవాడ కల్చరల్ : రాజ్యాలు పోయినా భేషజాలు మిగిలిన రాజుల జీవితాలలోని విషాదాలను హాస్యంగా వ్యక్తీకరించిన రచయిత పూసపాటి కృష్ణంరాజని పాత్రికేయులు తాడి ప్రకాశ్ అన్నారు. తమ సామాజికవర్గంలోని లోపాల గురించి తామే విమర్శించుకోగలగడం విశేషమన్నారు. ప్రముఖ రచయిత కల్లూరి భాస్కరం మాట్లాడుతూ, చాలా తక్కువ కథలతో సాహిత్యంలో సుస్థిరస్థానం ఏర్పాటు చేసుకొన్న ఘనత పూసపాటి కృష్ణంరాజుకు దక్కుతుందని చెప్పారు. ఆయనను ప్రముఖ రచయిత పతంజలి తన గురువుగా భావించారన్నారు. తన కథలో మారుమూల శ్రీకాకుళం మాండలికాన్ని హృద్యంగా పొదిగారన్నారు. మహ్మద్ ఖదీర్‌బాబు మాట్లాడుతూ, పుస్తక మహోత్సవంలో స్థానిక విద్యార్థులను మిళితం చేయాలని సూచించారు. సభలో సాహితీ ప్రచురణల ప్రతినిధి సాందీపని పాల్గొన్నారు.



భాషకు, భావానికి ప్రాణం ఉచ్చారణే

విజయవాడ కల్చరల్ : సరైన ఉచ్చారణే ఏ భాషకైనా, భావానికైనా ప్రాణం పోస్తుందని మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి రచించిన 'సరైన ఉచ్చారణ' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినిమా, పొలిటికల్, స్టూడెంట్స్, పాత్రికేయులకు ఈ పుస్తకం మరింత ఉపయోగకరంగా వుంటుందన్నారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సంస్థ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు సభకు అధ్యక్షత వహించారు. ఈ పుస్తకం చదవడం వల్ల అంగ్లంలో ఉచ్చారణాదోషాలను సరిచేసుకోవడం తేలికవుతుందన్నారు.



నేడు 6గం.లకు ప్రజాశక్తి బుక్‌హౌస్ పుస్తకావిష్కరణ
7గం.లకు ఎమెస్కో పుస్తకావిష్కరణ

నడిచే విజ్ఞాన సర్వస్వం రాంభట్ల



విజయవాడ కల్చరల్, జనవరి 5 : భారతీయ తత్వశాస్త్రాలు, వేదాలు, పురాణ చరిత్ర, సాహిత్యం తదితర అంశాలను ప్రపంచంలోని ఇతర వాఙ్మయాలతో శాస్త్రీయంగా పోల్చి, సమన్వయం చేయడం రాంభట్ల కృష్ణమూర్తి ప్రత్యేకత అని ప్రముఖ పాత్రికేయులు, రచయిత కల్లూరి భాస్కరం అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవం తొవిన్దో రోజు శుక్రవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై రాంభట్ల కృష్ణమూర్తి శతజయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాంభట్లను బడిచదువు లేని బహుముఖ ప్రజ్ఞాశాలిగా వర్ణించారు. సంక్లిష్టమైన విషయాలను సరళంగా అర్థమయ్యేలా వివరించడం ఆయన ప్రత్యేకతన్నారు. దేశంలో మతం జ్ఞానానికి అడ్డంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాంభట్ల కృష్ణమూర్తి రచనలు అందరూ చదవాలన్నారు. ఆర్యావర్తం అనే భారత భౌగోళిక భూభాగానికి పరిమితమైనది కాదని రాంభట్ల నిరూపించాడన్నారు. భారతీయ నాగరికత ప్రస్తుతం బైకాల్ అని పిలిచే వైఖానస సరస్సు ఒడ్డున ప్రారంభమైందని రాంభట్ల ప్రతిపాదించారని వివరించారు. మన రామాయణ భారతాలు భారత ప్రాంతానికి పరిమితమైన కథలు కావని రాంభట్ల అనేక శాస్త్రీయ ప్రతిపాదనలు చేశారన్నారు. రాంభట్ల కృష్ణమూర్తి శాస్త్రీయమైన ఆలోచనలను తమ పరిశోధనల ద్వారా మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పండితలోకానికి వుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రముఖ పాత్రికేయులు తాడి ప్రకాశ్ మాట్లాడుతూ, రాంభట్ల తెలుగు సరళంగా సుబోధకంగా వుంటుందన్నారు. నడిచే విజ్ఞాన సర్వస్వంగా భాసిల్లిన రాంభట్ల సాహిత్య కృషి గురించి పూర్తిస్థాయి పరిశోధనలు జరగాలన్నారు. కీర్తి ప్రతిష్ఠలు, ప్రతిఫలాలు ఆశించకుండా కేవలం తమకు నచ్చిన పని చిత్తశుద్ధితో చేసుకువెళ్లిన తరానికి రాంభట్ల ప్రతినిధి అన్నారు. గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ, ఆశయం, కృషి వుంటే చదువుతో సంబంధం లేకుండా ఉన్నత విజయాలు సాధించడం సాధ్యమేనని రాంభట్ల నిరూపించాడన్నారు. 'అరసం' ప్రచురించిన రాంభట్ల స్మృతి సంచికను వేదికపై ఆవిష్కరించారు.

ఆది నుంచీ అంతే!

(5వ పేజీ తరువాయి)

విషయంలో అదేస్థాయిలో వ్యవహరించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. 2022 ఆగస్టు 15న రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమానికి నానిని చంద్రబాబు స్వయంగా తన కారులో తీసుకుని వెళ్లి, తీసుకొచ్చారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత 2023 డిసెంబరు 6న దుర్గగుడికి వచ్చారు. ఆ సమయంలో అమ్మవారి దర్శనానికి చంద్రబాబు అంతరాలయంలోకి వెళ్లగా నాని బయటే ఉండిపోయారు. ఇది గమనించిన చంద్రబాబు నానిని పిలవాలంటూ తన సిబ్బందిని ఆదేశించారు. వారు వచ్చి పిలిచినా నాని లోపలికి వెళ్లేందుకు సుముఖత చూపలేదు. చివరికి దేవినేని ఉమా వచ్చి పిలిచినా ఆయనతోనూ దురుసుగా వ్యవహరించారే తప్ప లోపలికి వెళ్లలేదు. అధినేత తీరు ఇలా ఉంటే.. నాని తీరు మాత్రం అధినేత విషయంలో భిన్నంగా ఉండేది.

● నేతపై విసుర్లు

2022ఆగస్టులో చంద్రబాబు ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో ఎంపీలు గల్లా జయదేవ్, కింజారపు రామ్మోహన్ నాయుడు, నాని ఆయనకు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వచ్చారు. అధినేతకు ఇవ్వాలంటూ జయదేవ్ పుష్పగుచ్ఛాన్ని నానికి ఇవ్వగా ఆయన దాన్ని విసురుగా పక్కకు తోసేశారు. దీంతో గల్లా జయదేవ్ తానే పుష్పగుచ్ఛాన్ని అధినేతకు ఇచ్చారు. ఈ వీడియోను వైసీపీ శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం చేశాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల తర్వాత తన పార్టీ కార్యాలయమైన కేశినేని భవన్‌లో చంద్రబాబు ఫొటోలను నాని తొలగించేశారు.

● ఇన్‌చార్జులన్నా చిన్నచూపే

విజయవాడ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ అధిష్ఠానం ఇన్‌చార్జులను నియమించింది. కానీ వీరికి ప్రత్యామ్నాయంగా నాని మెజారిటీ నియోజకవర్గాల్లో వేరే వ్యక్తులను ప్రోత్సహించడం ప్రారంభించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. విజయవాడ పశ్చిమ, మైలవరం, తిరువూరు, నందిగామ నియోజకవర్గాల విషయంలో నాని ఉన్న ఇన్‌చార్జుల స్థానంలో వేరే వ్యక్తులను ప్రోత్సహిస్తూ వచ్చారు. ఈ పరిణామాలను పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోయాయి.

చలో విజయవాడ ఉద్రిక్తం

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకొంది. మహిళా పోలీసులు మహిళా ఉద్యోగులను ఎక్కడికక్కడ లాగేశారు. ఏటీఏ భవనం వద్ద ఉద్యోగులను పోలీసులు హాలులో కిందనే కూర్చోబెట్టి గేట్లు వేసి తీవ్ర నిర్బంధకాండను అమలుచేయడంతో ఉద్యోగులు పోలీసులతో వాగ్వాదానికి పాల్పడ్డారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎస్పీడీ శ్రీనివాసరావు పిలుపు మేరకు ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, సంఘం గౌరవాధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు ఆయన్ను కార్యాలయంలో కలిసి చర్చలు జరిపారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఆయన హామీ ఇవ్వడంతో ఉద్యోగులు వెనక్కి తగ్గారు.

● సమ్మె చేస్తున్నా చలించరా?

నవంబరు 20న సమ్మె నోటీసు ఇచ్చి డిసెంబరు 20 నుంచి సమ్మె ప్రారంభించినా కనీసం తమతో చర్చలు జరిపి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆగ్రహించారు. సమ్మెలోని ఉద్యోగులను, ప్రత్యేకించి కేజీబీవీలలో పనిచేసే మహిళా ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేయడం, తిట్టడం, టెర్మినేట్ చేయడం వంటిచర్యలు అప్రజాస్వామికమని, చట్టవ్యతిరేకమని నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే బేషరతుగా కేజీబీవీల్లోని మహిళా ఉద్యోగులను, టెర్మినేట్ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతన విధానాన్ని అమలు చెయ్యాలని, అందరికీ మినిమం టైంస్కేల్, డీఏ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.



హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయలక్ష్మి

హస్తకళల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

వన్‌టౌన్, జనవరి 5 : రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బడిగించల విజయలక్ష్మి శుక్రవారం గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె తనకు బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్మోహన రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను త్వరలో రాష్ట్రమంతా పర్యటిస్తానని వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను హస్తకళాకారులకు, చేనేత కళాకారులకు వివరించి తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు బడిగించల చంద్రమౌళి, నాయకుడు మొలక వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తంబి పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనలు

ఉంగుటూరు, జనవరి 5 : పెదఅవుటపల్లిలోని సుప్రసిద్ధ కథోలికా పుణ్యక్షేత్రంలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాలను పురస్కరించుకుని నవదిన ప్రార్థనలు రెండోరోజు కొనసాగాయి. శుక్రవారం సాయంత్రం 5.30గంటలకు బిషప్ తుమ్మాబాల స్కూల్ కరస్పాండెంట్(వరంగల్) రెవ.ఫాదర్ తాటికొండ జోసఫ్ దివ్యబలిపూజను సమర్పించారు. అనంతరం నిరీక్షణ క్రైస్తవ జీవితసత్యము అంశంపై సందేశమిచ్చారు. బ్రదర్ జోసఫ్ తంబి గొప్ప నిరీక్షణతో జీవించాడని ఆయన మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని సూచించారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో విచారణ గురువులు గోపు ప్రవీణ్, గోపు అభిలాష్, కచ్చా కిషోర్‌కుమార్, గుడిపెద్దలు, సంఘపెద్దలు, కన్యాస్త్రీలు, పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.



దివ్యబలిపూజను సమర్పిస్తున్న ఫాదర్ తాటికొండ జోసఫ్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శీలం

బీజేపీకి బుద్ధి చెప్పేందుకు కూటమి సిద్ధం

›› ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జేడీ శీలం

మచిలీపట్నం టౌన్, జనవరి 5 : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాట తప్పిందని, ఇందుకు ఇండియా కూటమి తగిన బుద్ధి చెబుతుందని కేంద్ర మాజీ మంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జేడీ శీలం అన్నారు. శుక్రవారం స్థానిక కళ్యాణ మండపంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం జరిగింది. సమావేశంలో జేడీ శీలం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో సుస్థిరమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి పనిచేయాలన్నారు. రానున్న కాలంలో అన్ని నియోజకవర్గాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ, సీపీఎం, వివిధ ప్రజా సంఘాలు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని కోరారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజన, క్రైస్తవ సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు గొల్లు కృష్ణ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లాం తాంతియాకుమారి, సీపీఐ, సీపీఎం నాయకులు, ముస్లిం చైతన్య వేదిక నాయకులు తదితరులు మాట్లాడారు.

హామీలు అమలు చేయాల్సిందే

›› రిలే నిరాహార దీక్షలో అంగన్వాడీలు

ధర్నాచౌక్, జనవరి 5 : కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు గత 24 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక ధర్నాచౌక్‌లో రిలే నిరహార దీక్షలు శుక్రవారం ప్రారంభించారు. ఆల్ ఇండియా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి ఏఆర్ సింధు దీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీలు అడిగేది గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలనే అన్నారు. మోదీ, జగన్ ప్రభుత్వాలు ఎటువంటి అభివద్ధి చేయలేదని విమర్శించారు. ఏపీలో పిల్లలు పౌష్టికాహార లోపంతో ఎందుకు చనిపోతున్నారని ప్రశ్నించారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీల మీద ఆధారపడ్డారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడతామన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ నేతలు వి.ఉమామహేశ్వరరావు, నర్సింగరావు, రవీంద్రనాథ్, జి.ఓబులేసు, ఎ.రవిచంద్ర పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడీల ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అంగన్వాడీల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని అన్నారు. తక్షణమే స్పందించి వీరి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



అంగన్వాడీలనుద్దేశించి ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఆర్ సింధు

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

ఉయ్యూరు : కాంట్రాక్టు కార్మికులను అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో పర్మినెంట్‌చేసి సమానపనికి సమాన వేతనం చెల్లిస్తామని ఎన్నికల ముందు పాదయాత్రలో హామీఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు కావస్తున్నా హామీని తుంగలో తొక్కారని సీఐటీయూ నేత బి.రాజేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సమాన పనికి సమానవేతనం, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉయ్యూరులో పారిశుధ్య కార్మికులు జోలెపట్టి భిక్షాటన చేశారు. తమపట్ల ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం బాధాకరమన్నారు. వర్కర్స్ యూనియన్ నాయకులు రామయ్య, చింతయ్య తదితరులు పాల్గొన్నారు.



దుర్మార్గపు, చేతగాని పాలనకు ముగింపు పలకాలి

›› రా కదలిరా సభ ఏర్పాట్లలో టీడీపీ నేతలు

ఇబ్రహీంపట్నం/మైలవరం/రెడ్డిగూడెం, జనవరి 5 : రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గపు, చేతగాని పాలనకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందని మాజీమంత్రులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావులు అన్నారు. ఈనెల 7న తిరువూరులో 'రా కదలిరా' భారీ బహిరంగ సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలో సన్నాహక సమావేశంలో మంత్రులు పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అక్రమ అరెస్టు తర్వాత ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో భారీ బహిరంగ సభ జరుగుతుందని, పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. చంద్రబాబు కనిగిరి నుంచి శంఖారావం పూరించారని, ఐదు కోట్ల ఆంధ్రులు, జగన్మోహన్‌రెడ్డికి జరగబోతున్న ప్రజా పోరాటంలో టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. 18న గుడివాడలో సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో దారు నాయక్, జంపాల సీతారామయ్య, చెన్నుబోయిన చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు

● మైలవరం, రెడ్డిగూడెంలలో ఉమా సన్నాహక సమావేశం నిర్వహించారు. మైలవరం నియోజకవర్గం నలుమూలల నుంచి సుమారు 40 వేలమంది తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో లంక లితీష్, ముప్పిడి నాగేశ్వర రెడ్డి, ఉయ్యూరు అంజిరెడ్డి, రాయుడు వెంకటేశ్వరరావు, జానలపాటి వేణుగోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : సైకో పాలనకు చరమగీతం పాడే కార్యక్రమంలో భాగంగా తిరువూరులో చంద్రబాబు సభకు ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ కోరారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాసంలో ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు.

బ్యాంకు సిబ్బంది వేధింపులు.. వ్యక్తి ఆత్మహత్య

మైలవరం రూరల్, జనవరి 5 : తీసుకున్న అప్పు చెల్లించాలంటూ ప్రయివేటు బ్యాంక్ సిబ్బంది ఒత్తిడి చేయడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గణపవరంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. గణపవరానికి చెందిన దొప్పల హరిబాబు (45) మరి కొందరు గ్రూపుగా ఏర్పడి కీర్తన అనే బ్యాంక్‌లో రూ.50 వేల చొప్పున రుణం తీసుకున్నారు. రెండు నెలలుగా హరిబాబు రుణం చెల్లించకపోవడంతో శుక్రవారం రాత్రి బ్యాంకు సిబ్బంది ఇంటికి వచ్చి హరిబాబును దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడు. స్థానికులు బ్యాంకు సిబ్బందిని వెంబడించి వారి వాహనం స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఎస్సై హరిప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బ్యాంకు సిబ్బంది ఒత్తిడి మేరకే హరిబాబు ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

బాలికపై అసభ్యప్రవర్తన

›› ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

›› ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కోడూరు, జనవరి 5 : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే చదువుకునేందుకు వచ్చిన బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామంలో వెలుగుచూసింది. ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఉల్లిపాలెం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న బాలిక ఈనెల 3న పాఠశాలకు వెళ్లగా, ఉపాధ్యాయుడు సుబ్బారావు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక విషయాన్ని ఇంటికి వెళ్లి తల్లికి చెపింది. దీంతో గ్రామానికి చెందిన పలువురు మహిళలు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిపై దాడిచేశారు. సదరు ఉపాధ్యాయుడు స్థానిక ఎమ్మెల్యేకు సమీప బంధువు కావటం, బాలిక పెదనాన్న కూడా వైసీపీ గ్రామస్థాయి నేత కావటంతో విషయం బయటకు పొక్కకుండా రాజీ చేసినట్టు తెలుస్తోంది.


సామాజిక మాధ్యమాల్లో వైరల్.. కేసు నమోదు

బాలికపై ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన విషయం సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో విద్యాశాఖ విచారణ ప్రారంభించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా, అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్ విచారణ ప్రారంభించారు. ఎంఈవో రామదాసు శుక్రవారం పాఠశాలలోనూ, సదరు బాలిక బంధువులను, సహచర విద్యార్థులను వివరాలు అడిగి విద్యాశాఖకు నివేదిక అందజేసినట్టు సమాచారం.

నూరుశాతం అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి

›› ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 5 : నూటికి నూరుశాతం సంతృప్త స్థాయిలో అర్హత వున్న ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సంక్షేమ పథకాలకు అర్హత వుండి నిర్ణీత సమయంలో దరఖాస్తు, బ్యాంకు ఖాతా వివరాలు తదితర కారణాల వల్ల నిలిచిపోయిన వారికి నవరత్నాలు-ద్వైవార్షిక నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా కలెక్టర్ ఢిల్లీరావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులతో హాజరయ్యారు. ఈసందర్భంగా పథకాల లబ్ధిదారులు, విద్యార్థులకు రూ.4.37 కోట్ల మెగా చెక్కును అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత వుండి ఏ కారణంచేతనైనా లబ్ధి చేకూరకుండా వుంటే వెంటనే గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకొంటే లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ద్వైవార్షిక నగదు మంజూరు కింద జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహనమిత్ర తదితర పథకాలకు సంబంధించి 2,934 మంది లబ్ధిదారులకు రూ.4.37 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ వివరించారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

జన్‌మన్‌తో గిరిజనుల జీవితాలకు భరోసా

కృష్ణలంక : గిరిజన ఉప వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకాన్ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టర్ ఢిల్లీరావు, గిరిజన సంక్షేమ అధికారి జె.సునీతతో కలిసి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారులతో శుక్రవారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 11 గిరిజన వర్గాల (పీవీటీజీ) ప్రజలు, వారి స్థితిగతులకు సంబంధించి ఎంపీడీవోలు సమగ్ర సమాచారంతో నివేదికలు అందించాలన్నారు. సొంతిళ్లు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, పోషణ, టెలికం అనుసంధానం తదితర ముఖ్యమైన సేవలు అందుబాటులో వుండేలా చూడాలని స్పష్టం చేశారు.



భవానీలకు అన్నదానం

భవానీపురం, జనవరి 5 : విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లోని నాగేంద్రస్వామి బాల భక్త సమాజం సభ్యులు బొడ్డుపల్లి శ్రీనివాస్, బడుగు గణేష్‌ల ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీ భక్తులకు పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ నాయకుడు ఎంఎస్.బేగ్ శుక్రవారం అన్నదానం చేశారు. జి. ఏడుకొండలు పాల్గొన్నారు.



రా..కదలిరాతో టీడీపీ విజయం తథ్యం

తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విద్యాధరపురం, జనవరి 5: తిరువూరులో ఈ నెల 7న జరగనున్న రా..కదలిరా సభతో టీడీపీ విజయం తథ్యమని, 2024 ఎన్నికల తీర్పును ఈ విధంగా ముందే చెప్పాలని పార్టీ శ్రేణులకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం శ్రీరాముడి తరహాలో చంద్రబాబు కష్టపడుతున్నారని చెప్పారు. తిరువూరు సభకు టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై జగన్ రాక్షసపాలనకు ఆ సభ ద్వారానే చరమగీతం పాడినట్లు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. 74 సంవత్సరాల వయస్సులో చంద్రబాబు జైలులో పడిన బాధను తిరువూరు సభ ద్వారా మరచిపోయేలా విజయవంతం చేయాలన్నారు. పరిశీలకుడు కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలకు ముందు జరిగే అతిపెద్ద బహిరంగ సభ తిరువూరులోనే అని పేర్కొన్నారు. దాదాపుగా ఇకపై రోడ్డు షోలు తప్ప జిల్లా స్థాయి బహిరంగ సభలు ఉండవని సూచించారు. దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కొనకళ్ల బుల్లయ్య, వెలగపూడి శంకరంబాబు, ఎస్.ఫిరోజ్, చెన్నుపాటి గాంధీ, క్రాంతిశ్రీ, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి, సిద్ధం నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న నవనీతం సాంబశివరావు

తిరువూరు సభను జయప్రదం చేయండి

అజిత్‌సింగ్‌నగర్ : తిరువూరులో ఈనెల 7న జరగనున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగ సభను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవనీతం సాంబశివరావు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ నేతలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈ నెల 29 వరకు టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా 22 పార్లమెంట్ పరిధిలో తమ అధినేత చంద్రబాబు భారీ బహిరంగ సభలు తలపెట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 7న తిరువూరులో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేతలు పిరియా సోమేశ్వరరావు, పైడి శ్రీను, దెందుకూరి మురళీకృష్ణం రాజు, లబ్బా వైకుంఠం, బత్తుల కొండ, పాల్గొన్నారు.

కార్మిక చైతన్య బస్సు యాత్రను ..

టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం టెక్కలిలో ప్రారంభించనున్న కార్మిక చైతన్య బస్సు యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు, పరుచూరి ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ కార్మిక బస్సు యాత్ర వివరాలను వెల్లడించారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం టెక్కలిలో జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించనున్నారని తెలిపారు.

సెంట్రల్‌లో అభివృద్ధి శూన్యం: బొండా ఉమా

పాయకాపురం, జనవరి 5 : గత టీడీపీ ప్రభుత్వంలో తాను అధికారంలో ఉన్నప్పుడు సెంట్రల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధే తప్ప, వైసీపీ పాలనలో ఒక్కశాతం కూడా అభివృద్ధికి నోచుకోలేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. స్థానిక 58వ డివిజన్, పీఎన్‌టీ కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం- జనసేన కలయికతో వైసీపీ నేతలకు గుండెల్లో దడ మొదలయ్యిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తుంటే అడుగడుగునా మహిళలు తమ గోడు చెప్పుకుంటున్నారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి నిజస్వరూపం ఈ నాలుగు సంవత్సరాల 9 నెలల కాలంలోనే బట్టబయలైందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ- జనసేనల విజయం తథ్యమని అన్నారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నూకాలమ్మ గుడిలో అమ్మవారిని దర్శించుకున్న బొండా ఉమా

గ్రూప్-2 పరీక్షలపై అవగాహన

పటమట, జనవరి 5 : సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యాన శుక్రవారం గ్రూప్-2 పరీక్షలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రతిరోజు అన్ని దినపత్రికలలో కరెంట్ అఫైర్‌లను పరిశీలించాలని, కఠోర శ్రమతో సాధన చేస్తే విజయాన్ని సాధిస్తారని తెలిపారు. గ్రూప్-2 సిలబస్, ప్రశ్నల సరళితో పాటు గతంలో జరిగిన పరీక్ష పేపర్లను అవగాహన చేసుకుని నోట్స్ తయారు చేసుకోవాలని సూచించారు. పలువురు అభ్యర్థులు ఆయనను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. గ్రంథాలయ కార్యదర్శి రావి శారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హాజరైన అభ్యర్థులకు కేఎస్. లక్ష్మణరావు రచించిన భారత సమాజం, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ పుస్తకాలను ఉచితంగా అందజేశారు.



తన రచనలను విద్యార్థులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు



అన్న క్యాంటీన్ ద్వారా భోజనం అందజేత

సత్యనారాయణపురం, జనవరి 5: టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని) సహకారంతో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం దేవినగర్, మధురానగర్ వంతెన వద్ద అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందజేశారు. మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొని పేదలకు భోజనం అందజేశారు. నాయకులు చౌదరి సూర్యనారాయణ, గరిమెళ్ల రాధిక, అనురాధ, కోటేశ్వరమ్మ, సంతోష్ హరికుమారి, కొండలరావు, పోలేరమ్మ, మరియమ్మ, శ్రీదేవి, లత, మాధురి పాల్గొన్నారు.

జన్‌భాగిదారి, ఆడుదాం ఆంధ్రా, ఆరోగ్యరక్ష-2

విజయవంతం చేయాలి

వన్‌టౌన్, జనవరి 5: జన్‌భాగిదారి, ఆడుదాం ఆంధ్రా, ఆరోగ్యరక్ష- 2 ఓ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) సత్యవతి అన్నారు. నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆదేశాల మేరకు తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆడుదాం ఆంధ్రా, జన్‌భాగిదారి, ఆరోగ్యరక్ష-2 కార్యక్రమాల నిర్వహణపై జోనల్ అధికారులకు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిరహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 19న స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభం సందర్భంగా అంబేడ్కర్ మార్గదర్శకాలపై ప్రతి సచివాలయంలోను ఈ నెల 9 నుంచి 18 వరకు జన్‌భాగిదారి నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో క్రీడాకారుల విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య రక్ష -2 ఓ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. అంతకు ముందు కార్యక్రమాలపై వచ్చిన నివేదికలను పరిశీలించి సూచనలు ఇచ్చారు.

ఠాగూర్ గ్రంథాలయంలో మెగా వైద్య శిబిరం నేడు

గవర్నర్‌పేట, జనవరి 5: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని, లైబ్రరీ ఉద్యోగులు, పాఠకులు, ఇతరులు వైద్య శిబిరం సేవల్ని వినియోగించుకోవాలని ఠాగూర్ గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, దంత పరీక్షలు, చెవుల వినికిడి టెస్టింగ్, బీపీ, ఆర్‌బీస్, ఆర్థోపెడిక్, జనరల్ వైద్య పరీక్షలు, సలహా, సూచనలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి. జమల పూర్ణమ్మ శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.



పైపులరోడ్డులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

పాయకాపురం, జనవరి 5 : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విజయవంతంగా సమ్మె జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ స్పష్టం చేశారు. స్థానిక పైపులరోడ్డు సెంటర్‌లో శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రైవేటు వ్యక్తులను పనిలో పెడుతున్నారని, అలాంటి వారిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అసులు రంగనాయకులు, నాయకులు విక్కీ, జక్కి, జేమ్స్, ఆకుల యేసు, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

విద్యాధరపురం, జనవరి 5: చికిత్స పొందుతూ వేముల నాగేంద్రమ్మ(45) శుక్రవారం మృతి చెందింది. పరిటాల సాయిబాబా గుడి సమీపంలో ఉంటున్న నాగేంద్రమ్మ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ రాజీవ్‌నగర్‌లో ఉన్న కుమార్తె వద్దకు బస్సులో బయలుదేరింది. అయితే గొల్లపూడిలో ఉన్న అల్లుడిని పలకరిద్దామని సారా కొట్టు సెంటర్ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ఇబ్రహీంపట్నం నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడింది. అల్లుడు ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు కళ్యాణ్ బాబు ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గొల్లపూడి అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం భవానీపురం పోలీసులకు తెలిసింది. ఎస్‌ఐ ప్రసాద్ తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వారి వద్ద నుంచి రూ.6వేలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.



కృష్ణలంక సర్వీసు రోడ్డులో ఆర్చ్ వద్ద



మెట్లబజారులో..



ఊర్మిళానగర్‌లో..

ఎటుచూసినా చెత్త కుప్పలే

పారిశుధ్య కార్మికుల సమ్మెతో దుర్వాసనతో అల్లాడుతున్న 20, 21, 22 డివిజన్‌వాసులు

కృష్ణలంక, జనవరి 5: పారిశుధ్య కార్మికులు గత 11 రోజుల నుంచి సమ్మె చేస్తుండటంతో కృష్ణలంకలోని 20, 21, 22 డివిజన్లలో చెత్త గుట్టలుగుట్టలుగా రోడ్డుపై పేరుకుపోతోంది. చెత్త తీసుకువెళ్లే సీఎన్‌జీ వాహనాలు వీధుల్లోకి రాగానే స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను వాహనాల్లో పోస్తున్నారు. వాహనాలు వెళ్లిన తర్వాత, వాహనాలు వెళ్లలేని ప్రాంతాల నుంచి చెత్తను తెచ్చిన ప్రజలు రోడ్డుపైన వేస్తుండటంతో అవి గుట్టలుగా పేరుకుపోయాయి. మూడు, నాలుగు రోజులకొకసారి 20, 21వ డివిజన్లలో మాత్రం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ శానిటేషన్ సెక్రటరీ నాగరాజులు గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను లారీలో ఎత్తించి వేస్తున్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు వారితో ఘర్షణపడి 'మేము సమ్మెలో వుంటే మాకు సహకరించకుండా మీరు చెత్తను ఎత్తుతారా' అంటూ వారితో గొడవలకు దిగుతున్నారు.

● ఇక 22వ డివిజన్‌లో అయితే ఎక్కడపడితే అక్కడ గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోయింది.



భారతీనగర్ మెయిన్ రోడ్డు

ఈ డివిజన్‌లో సీఎన్‌జీ వాహనాలు కూడా కొన్ని సందుల్లోకి వెళ్లలేని పరిస్థితి. అసలే జ్వరాలు, మలేరియా, టైఫాయిడ్‌లతో అల్లాడుతుంటే ఇప్పుడు రోజుల తరబడి చెత్త పేరుకుపోవడం వలన దుర్వాసన భరించలేకున్నామని, దోమలు విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆయా డివిజన్ల కార్పొరేటర్లు మాత్రం స్థానికుల సమస్యలు తమకు పట్టనట్టే విన్నకుండిపోతున్నారు.

భవానీపురం: ఊర్మిళానగర్, విద్యాధరపురం, నాలుగు స్తంభాల సెంటర్, హెచ్‌బీ కాలనీ, జోజినగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్త పోగులే దర్శనమిస్తున్నాయి. సుమారు 70 మంది వరకు ఒక్కో డివిజన్‌కు విధులు నిర్వహించే వారు. కాగా వీరి స్థానంలో ఒక్కో డివిజన్‌లో 10 మంది కాంట్రాక్టు సిబ్బందితో పారిశుధ్య పనులను చేయిస్తున్నా ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతోంది. డ్రెయిన్లలో చెత్తను పారబోస్తుండటంతో డ్రెయిన్లు అధ్వానంగా మారాయి.

భారతీనగర్: 4వ డివిజన్‌లోని పలు ప్రధాన కాలనీల్లో భారతీనగర్, గురునానక్ కాలనీ, సుబ్బారావు కాలనీ, శ్రీనివాస్‌నగర్ బ్యాంక్ కాలనీ, కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ అంతర్గత రోడ్లలో చెత్త తొలగించకపోవడంతో రోడ్లన్నీ చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. దుర్వాసన భరించలేకపోతున్నామని, చెత్త వలన వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని కాలనీ వాసులు వాపోతున్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై మహిళా రిపోర్టర్ దురుసు ప్రవర్తన

ముగ్గురిపై కేసు నమోదు

విద్యాధరపురం, జనవరి 5: భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో తన భర్త వాహనాన్ని ఆపిన వన్‌ట్రాఫిక్ కానిస్టేబుల్ దరావత్ నాగరాజుపై మహిళా రిపోర్టర్ సీఐ సమక్షంలోనే చెంప చెళ్లుమనిపించిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 2న స్వాతి సెంటర్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కానిస్టేబుల్ నాగరాజు నాయక్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో రామకృష్ణ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా రావడంతో పాటు భవానీదీక్షా ధారులు కూడా ఇబ్బంది కలిగించడంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆయనను నిలిపారు. దీంతో నన్నే ఆపుతావా అంటూ కానిస్టేబుల్‌పై రామకృష్ణ దురుసుగా ప్రవర్తించి ఎదురుదాడికి దిగాడు. దీంతో కానిస్టేబుల్ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి రామకృష్ణను స్టేషన్‌కు తరలించాడు. ఆ రోజు రాత్రి 11 గంటల సమయంలో రామకృష్ణ భార్య ఒక చానల్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తున్న క్రాంతి, ఆమె సహోద్యోగి వసంత్‌తో భవానీపురం స్టేషన్‌కు వచ్చారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన కానిస్టేబుల్‌ను స్టేషన్‌కు పిలిపించారు. జరిగిన సంఘటనపై సీఐ చాంబర్‌లో విచారణ జరుగుతుండగా రిపోర్టర్ క్రాంతి ఒక్కసారిగా ఆవేశానికి గురై నేనెవ్వరో తెలుసా..? నా భర్తనే అడ్డుకుంటావా..? నన్నే ప్రశ్నిస్తావా అంటూ కానిస్టేబుల్ నాగరాజు నాయక్‌పై విరుచుకుపడి చెంప చెళ్లుమనిపించింది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రామకృష్ణ దురుసుతనంపై, విధులు ఆటంకం కలిగించినందుకు, సీఐ చాంబర్‌లో క్రాంతి తనపై చేయి చేసుకున్నందుకు, ఆమె దురుసుప్రవర్తనపై కానిస్టేబుల్ నాగరాజు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు రామకృష్ణపై 3/2024 ఒక కేసు, రామకృష్ణ, వసంత్, క్రాంతిలపై 4/2024 కేసు నమోదు చేశారు.

వయోజన విద్య శిక్షణా కేంద్రం ఏర్పాటు

మొగల్రాజపురం, జనవరి 5: జనశిక్షణా సంస్థాన్ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాత రాజరాజేశ్వరీ పేటలో వయోజన విద్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ కో- ఆర్డినేటర్ ఏ. రమేష్, జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాల్లో చాలా మంది చదువుకు దూరంగా ఉంటున్నారని, అలా అక్షరాస్యత లేని వారిని గుర్తించి వారు చదువుకోవడానికి ఈ కేంద్రాలకు రావాలని పిలుపు ఇచ్చారు. మహిళలు ముఖ్యంగా ముందుకు రావాలని, అక్షరాస్యత ఉంటే కుటుంబ అభివృద్ధి, జీవన విధానం మెరుగుపడుతుందని చెప్పారు. సంస్థాన్ సిబ్బంది, మహిళలు, శిక్షకులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

శనివారం • 6 జనవరి 2024

cinema@andhrajyothy.com





రామ్‌చరణ్ సినిమాలో శివన్న?

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందనున్న 'రామ్‌చరణ్ 16' పై వస్తున్న అప్‌డేట్‌లు మెగా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. కోస్తా నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ డ్రామాకు సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ తీసుకున్నారు. సీనియర్ హీరోయిన్ లయ ఈ సినిమాతో రీఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇక ఇందులో చరణ్‌కు జోడీగా ముందు జాన్వీకపూర్ పేరు వినపడింది. తర్వాత ఆ స్థానంలో సాయిపల్లవి వచ్చి చేరింది. కథానాయికగా ఆమె దాదాపు ఖరారైనట్లు తెలిసింది. ఇప్పుడు మరో విశేషమేంటంటే.. ఈ సినిమాలో కన్నడ అగ్ర నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించనున్నారట. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే చెన్నయ్‌లోని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 'ఆర్‌సీ16'లో తను నటించనున్నట్లు, ప్రస్తుతం ఆ విషయం చర్చల దశలో ఉన్నట్లు ఆయన తెలిపారు. శివరాజ్‌కుమార్ ఇటీవలే రజనీకాంత్ 'జైలర్'లో ప్రత్యేకపాత్రలో మెరిశారు. నిడివి తక్కువే అయినా.. ఆ పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలిచింది. మళ్లీ 'ఆర్‌సీ 16'లో కనిపించనున్నారు. ఇది మెగా అభిమానులకు నిజంగా శుభవార్తే.

స్నేహానికి అద్దంపట్టే నా సామిరంగ



నాగార్జున సంక్రాంతి కోడిపుంజు 'నా సామిరంగ'పై రోజురోజుకీ అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. చాలాకాలం తర్వాత నాగ్ పూర్తిస్థాయి మాస్ పాత్ర చేయడంతో అభిమానులు సినిమాకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. దర్శకుడు విజయ్ బిన్నీ వినూత్నమైన కాన్సెప్ట్‌తో సినిమాను తెరకెక్కించినట్లు చిత్రబృందం చెబుతోంది. ఇప్పటివరకూ విడుదలైన పాటలు యువతరాన్ని బాగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం 'దేవుడే తన చేతిలో..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఎం.ఎం.కీరవాణి రాసి స్వరపరిచిన ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. నాగార్జున, అల్లరి నరేశ్ పాత్రల స్నేహాన్ని అద్దంపట్టేలా ఈ పాటను చిత్రీకరించడం జరిగిందని, స్నేహం గొప్పతనం తెలిసేలా కీరవాణి సాహిత్యం సాగిందని వారు అన్నారు. ఆశికా రంగనాథ్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో రాజ్‌తరుణ్, మిర్నామీనన్, రుక్సార్ థిల్లాన్ ఇతర తారాగణం కాగా, ఈ చిత్రానికి రచన: ప్రసన్నకుమార్ బెజవాడ, కెమెరా: శివేంద్ర దాశరథి.



బ్రహ్మారాక్షసుడు వచ్చాడ్రా

గోపీచంద్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. కన్నడ దర్శకుడు ఎ హర్ష తెరకెక్కిస్తున్నారు. కేకే రాధామోహన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసి ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'రాక్షసుల్ని వేటాడే బ్రహ్మారాక్షసుడు వచ్చాడ్రా' అనే బ్యాగ్రౌండ్ వాయిస్‌తో మొదలైన టీజర్ గోపీచంద్ పాత్ర ఎలా ఉండబోతోందో చెప్పింది. పరిచయ సన్నివేశంలో గోపీచంద్ ఖాకీ యూనిఫాంలో ఎద్దుపై కూర్చొని మాస్ ఎంట్రీ ఇచ్చిన తీరుతో ఆయన పాత్ర ఎంత శక్తిమంతంగా ఉండబోతోందో తెలుస్తోంది. రవి బస్రూర్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. సినిమాటోగ్రఫీ: స్వామి గౌడ



తనేంటో నాకు తెలుసు

'ప్రేమకు పునాది నమ్మకం. ప్రేమించిన తర్వాత నమ్మాలి. నమ్మకం లేని చోట ప్రేమ నిలువదు' అంటున్నారు ఇలియానా. ఇటీవల తన ప్రియుడు మైకేల్ గురించి తన వ్యక్తిగత సాంఘిక మాధ్యమంలో మాట్లాడారు ఇలియానా. అంతేకాదు, ప్రియుడితో తన జీవితాన్ని, కుటుంబసభ్యుల భరోసానీ అన్నీ ఈ సందర్భంగా పంచుకున్నారు. 'ప్రసవం తర్వాత చాలామంది స్త్రీలు డిప్రషన్‌లోకి వెళ్లిపోతారని విన్నాను. నేనూ అలాగే డిప్రషన్‌లోకి వెళ్లిపోయాను. కొన్ని రోజులు గది నుంచి బయటకు రాలేదు. ఆ సమయంలో నా కుటుంబం నాకు అండగా నిలిచింది. నేను అమ్మని అయ్యాక కానీ కుటుంబం గొప్పతనం నాకు తెలీలేదు. మైకేల్ నన్ను పసిపాపలా చూసుకున్నాడు. నిజంగా మైకేల్ లాంటి పార్ట్నర్ దొరకడం నా అదృష్టం. మా ప్రేమ గురించి తెలియగానే చాలామంది తన గురించి చెడుగా మాట్లాడారు. అందుకే.. మా ఇద్దరికి సంబంధించిన విషయాలను అందరితో పంచుకునేదాన్ని కాదు. ఇప్పుడు తన గురించి ఎవరు ఏం మాట్లాడినా ఐ డోంట్ కేర్. తనేంటో నా మనసుకు తెలుసు.' అంటూ తన అభిప్రాయాలను పంచుకున్నారు ఇలియానా.

వెంకటేశ్‌తో సినిమా కోరిక తీరింది

వెంకట్ బోయనపల్లి




అందరూ 'సైంధవ్' చిత్రంలో పోరాట ఘట్టాల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు కానీ మనసుకు హత్తుకునే కుటుంబ అనుబంధాల గురించి దర్శకుడు హృద్యంగా తెరకెక్కించారు. థియేటర్ నుంచి బయటికొచ్చేటప్పుడు ప్రేక్షకుల కళ్లు చెమ్మగిల్లుతాయి' అని నిర్మాత వెంకట్ బోయనపల్లి అన్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- వెంకటేశ్ గారు నా అభిమాన హీరో. ఆయనతో నిర్మాతగా ఓ సినిమా చేయాలనేది నా కోరిక. దర్శకుడు శైలేష్ కొలను చెప్పిన కథ నచ్చడంతో ఆయన వెంటనే 'సైంధవ్' చిత్రం చేసేందుకు అంగీకరించారు. ఒక్క రోజులోనే ప్రాజెక్ట్ ఓకే అవ్వడం ఆశ్చర్యం కలిగించింది. వెంకటేశ్ గారి 75వ చిత్రం చేసే అవకాశం నాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను.
- ఈ సినిమాకు వెంకటేశ్‌గారిని ఒప్పించిన ఘనత శైలేష్‌కే దక్కుతుంది. మా ప్రయత్నం మేం చేశాం. ఇలాంటి కాంబినేషన్ కుదరడం విధిరాత అని వెంకటేశ్ అన్నారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, ఆండ్రియా లాంటి అగ్ర తారలు భాగమవడం, భారీ స్థాయిలో నిర్మించడం వల్ల ఖర్చు ఎక్కువే అవుతుందని తెలుసు. అందుకు ముందుగానే సిద్ధమయ్యాం. సంతోష్ నారాయణ్ సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. అన్నీ కుదిరితే నాని, వెంకటేశ్ గారితో మల్టీస్టారర్ చేయాలనుంది.

అందగత్తెకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకుడు. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే కథానాయిక. శుక్రవారం ఆమె పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం దీపిక లుక్‌తో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. దేన్నో అన్వేషిస్తున్నట్లు సీరియస్ లుక్‌లో దీపిక కనిపించారు. ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో దీపికకు



శుభాకాంక్షలు తెలిపారు. 'గొప్ప సౌందర్యవతి దీపికా పదుకొనేకు జన్మదిన శుభాకాంక్షలు, ఈ ఏడాది మీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

యువతరం శ్రీరంగనీతులు



'యువతరం తమకు తాము ఐడెంటిఫై చేసుకునే పాత్రలతో.. భావోద్వేగాలతో.. కథలతో.. మనసుకు హత్తుకునే సన్నివేశాలతో.. సహజత్వానికి దగ్గరగా ఉండే సినిమాలు అరుదుగా వస్తుంటాయి. సరిగ్గా అలాంటి సినిమానే 'శ్రీరంగనీతులు'.. శుక్రవారం విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రారంభంలో వినిపించే తనికెళ్ల భరణి మాటలివి. అందుకు తగ్గట్టే సినిమా కూడా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. సుహాస్, కార్తీక్‌రత్నం, రుహానిశర్మ, విరాజ్ అశ్విన్ కీలక పాత్రధారులుగా, ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా టీజర్‌ని విడుదల చేశారు. ఈతరం యువతరం ఆలోచనలు, వారి ఉద్వేగాలు ఎలా ఉంటున్నాయో ఇందులో చూపించామని, ఆసక్తికరమైన కథ, కథనాలతో మనసుకు హత్తుకునేలా సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: టీజో టామీ, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, అజయ్ అరసాడ.

మూడు తరాలు ఒకే ఫ్రేమ్‌లో

మోహన్‌బాబు మనవడు, విష్ణు తనయుడు అవ్రామ్ బాలనటుడిగా వెండితెరకు పరిచయమవబోతున్నాడు. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రంతో అతడు తెరంగేట్రం చేయనున్నాడు. ఇందులో మోహన్‌బాబు కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అంటే మోహన్‌బాబు విష్ణు, అవ్రామ్ ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల నటులు ఒకే ఫ్రేమ్‌లో అలరించనున్నారన్నమాట. శుక్రవారం విష్ణు ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నా కొడుకు అవ్రామ్ 'కన్నప్ప' చిత్రంలో కీలకపాత్రలో నటిస్తున్నందుకు గర్వంగా ఉంది. ఇది మా కుటుంబంలోని మూడు తరాల కలయికలో వస్తున్న అరుదైన చిత్రం. మా కుటుంబంలో నూతన అధ్యాయానికి 'కన్నప్ప' నాంది పలుకుతుంది' అని చెప్పారు. ఈ చిత్రంలో ప్రభాస్ శివుడి పాత్రలో కనిపించనున్నారు. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం ప్రధాన తారాగణం.



భుజం తట్టి ప్రోత్సహించారు





ఇటీవలే దివంగతులైన తమిళ హీరో విజయ్‌కాంత్‌ను తలచుకొని సూర్య కన్నీరు పెట్టుకున్నారు. విజయ్‌కాంత్ కన్నుమూసిన సమయంలో సూర్య విదేశాల్లో షూటింగ్‌లో ఉన్నారు. దాంతో చివరి చూపు దక్కలేదు. తిరిగొచ్చాక ఆయన గురువారం చెన్నైలోని విజయ్‌కాంత్ సమాధి వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంలో విజయ్‌కాంత్‌ను గుర్తు చేసుకొని సూర్య తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కెరీర్ ఆరంభంలో అపజయాలు రావడంతో నిరాశలో ఉన్న నన్ను విజయ్‌కాంత్ ఎంతగానో ప్రోత్సహించారు అని చెప్పారు. 'పెరియన్నా' సినిమాలో ఆయనతో కలసి నటించాను, ఆ సమయంలో ఆయన నన్ను ఆదరించిన తీరు ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో నటి జాన్వీ కపూర్



నటి శ్రీదేవి కుమార్తె, బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన పిన్నమ్మ అయిన నటి మహేశ్వరి, స్నేహితులతో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల (ఆంధ్రజ్యోతి)

భాస్కర్ నారాయణ రాగాలు



శివ కందుకూరి, రాశి సింగ్ జంటగా రూపొందుతోన్న క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర్ నారాయణ'. పురుషోత్తంరాజ్ దర్శకుడు. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మాతలు. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు చెందిన టైటిల్‌సాంగ్‌ని శుక్రవారం విడుదల చేశారు. పురుషోత్తంరాజ్, సురేశ్ బనిశెట్టి రాసిన ఈ పాటను శ్రీచరణ్ పాకాలా స్వరపరిచారు. యువతరం మెచ్చే సంగీత సాహిత్యాలతో ఈ పాట రూపొందిందని, విజువల్స్ కూడా ఎట్రాక్టివ్‌గా వున్నాయని మేకర్స్ చెప్పారు. అరుణ్‌కుమార్, దేవిప్రసాద్, వర్షిణి సౌందరరాజన్, శివకుమార్, షఫీ, శివన్నారాయణ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: గౌతమ్ జార్జ్.

ఆ పాత్ర చేస్తున్నప్పుడు నాలో తెలీని వైబ్రేషన్..




'నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా 'ఎమర్జన్సీ'. ఒక నటిగా, ఒక దర్శకురాలిగా, నిర్మాతగా నేను చేస్తున్న పెద్ద సాహసం ఈ సినిమా. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం. ప్రేక్షకుల స్పందన కోసం ఇప్పటినుంచే ఆతృతతో ఉన్నా..' అన్నారు కంగనా రనౌత్. ఆమె స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తూ, నటిస్తున్న చిత్రం 'ఎమర్జన్సీ' నిర్మాణం పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా గురించి కంగనా మాట్లాడారు. ' లెజెండ్ అనే పదానికి నిర్వచనం ఇందిరాగాంధీ. స్త్రీలను తల ఎత్తుకునేలా చేసిన మహాశక్తి ఆమె. ఆ పాత్ర చేస్తున్నప్పుడు నాలో ఏదో తెలీని వైబ్రేషన్. మహా మహా మగధీరులను ఒంటికాలిపై నిలబెట్టిన ఘనత ఇందరది. సాహసోపేతమైన నిర్ణయాలు, దేశంకోసం ఏమైనా చేసే తెగువ ఇవన్నీ ఒక స్త్రీలో ఆనాడే ఉండటం నిజంగా ఆశ్చర్యం. నేడు స్త్రీలు పురుషులకు దీటుగా ఎదుగుతున్నారని అందరూ అంటుంటారు. కానీ ఆ రోజుల్లోనే శ్రీమతి ఇందిరాగాంధీ పురుషాధిక్య సమాజాన్ని సైతం శాసించగలిగారు. ఆమె పాత్ర చేయడం పట్ల ఒక స్త్రీగా గర్విస్తున్నా. దర్శకురాలిగా ప్రాణంపెట్టి పనిచేశాను. ఫలితం కోసం ఎదురు చూస్తున్నా..' అంటూ ఉద్వేగంగా చెప్పుకొచ్చారు కంగనా..

మహాభారతం తీస్తే ముఖ్య పాత్రధారులు వారే..



'హను-మాన్'తో టాక్ ఆఫ్ ఇండస్ట్రీ అయ్యారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ఇండియన్ ఒరిజినల్ సూపర్‌హీరో కాన్సెప్ట్‌తో ఆయన రూపొందించిన 'హను-మాన్' ఈ సంక్రాంతికి విడుదల కానుంది. ఆంజనేయుని శక్తి సామాన్యుడిలో ప్రవేశించడం వల్ల ఎదురైన పరిణామాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ప్రశాంత్‌వర్మ ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆసక్తికరమైన విషయాలను మీడియాకు వెల్లడించారు. 'మహాభారతం' తీయడం తన జీవితాశయమని, రాజమౌళి నుంచి చాలామంది దర్శకుల జీవితాశయం ఇదే అయినా.. తాను మాత్రం దైవం సహకరిస్తే 'మహాభారతం' చేస్తానని ఆయన అన్నారు. ఇప్పటికిప్పుడు చేస్తే అందులో పాత్రలకు ఎవరెవరు సరిపోతారు? అనే విషయంపై ఆయన మాట్లాడుతూ 'ధర్మరాజు పాత్రకు మెగాస్టార్ చిరంజీవి, అర్జునుడి పాత్రకు రామ్‌చరణ్, భీముడిగా తారక్, సహదేవుడిగా విజయ్‌దేవరకొండ, నకులుడిగా నాని, కృష్ణునిగా మహేశ్‌బాబు, దుర్యోధనుడిగా డా.మోహన్‌బాబు, కర్ణుడిగా పవన్‌కల్యాణ్, ద్రౌపదిగా నయనతార బావుంటారని ఆయన సరదాగా చెప్పుకొచ్చారు. ఇందులో ఒకరిద్దరు మినహా మిగతావారంతా సరిగ్గా సరిపోతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



బలాన్నిచ్చే... ప్రొటీన్ ఫుడ్

తినే తిండి బలాన్ని ఇవ్వకపోతే ఉపయోగమే లేదు. అందుకే తరచుగా ప్రొటీన్ ఫుడ్ తీసుకోమంటారు వైద్యులు. కండ కలగాలంటే.. శరీరం గట్టిగా ఉండాలంటే ప్రొటీన్లుండే ఆహారాన్ని తీసుకోవాల్సిందే. పిండి చోలె, ఓట్స్ ఆమ్లెట్, కజ్జు సోయాలాంటి రుచికరమైన ప్రొటీన్ వంటకాలను సులువుగా చేసుకోండిలా..

పిండి చోలె

కావాల్సిన పదార్థాలు

తెల్ల శనగలు- కప్పు, టీబ్యాగ్స్-2, దాల్చిన చెక్క-1, బిర్యానీ ఆకులు- 2, యాలకులు-6, లవంగాలు-5, బేకింగ్ సోడా- పావు టీస్పూన్, ఉప్పు- అర టీస్పూన్, జీరా- అర టీస్పూన్, ధనియాలు- టీస్పూన్, సాజీరా- పావు టీస్పూన్, యాలకులు- పావు టీస్పూన్, సోంపు- పావు టీస్పూన్, కసూరి మేథి- 1 టీ స్పూన్, ఎండు మిరపకాయలు-3, ఆమ్‌చూర్- పావు టీస్పూన్, పసుపు- కొద్దిగా, నూనె- మూడు టీస్పూన్లు, ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), అల్లం, వెల్లుల్లి పేస్ట్- 1 టీస్పూన్, పచ్చిమిర్చి-2, టొమాటోలు- 2 (చిన్న ముక్కలుగా తరగాలి),



తయారీ విధానం

బౌల్‌లో శనగలు వేశాక నీళ్లు వేసి రాత్రంతా కనీసం ఎనిమిది గంటలపాటు నానబెట్టాలి. వంట చేసేప్పుడు నీళ్లను తీసేసి నానబెట్టిన శనగలను కుక్కర్‌లో వేయాలి. అందులో రెండు చిన్న టీబ్యాగ్స్, దాల్చిన చెక్క, ఒక బిర్యానీ ఆకు, మూడు యాలకులు, మూడు లవంగాలు, బేకింగ్ సోడా, ఉప్పు వేసిన తర్వాత మూడు కప్పుల నీళ్లు పోసి కుక్కర్‌పై మూత పెట్టాలి. ఐదు విజిల్స్ వచ్చేంత వరకూ ఉండాలి. ఆ తర్వాత కుక్కర్ మూత తీసి టీబ్యాగ్స్ తీసేయాలి.

ప్యాన్‌లో జీరా, ధనియాలు, సాజీరా, యాలకులు, సోంపు, మూడు లవంగాలు, రెండు యాలకులు, ఎండు మిరపకాయలు వేశాక లోఫ్లేమ్‌లో రోస్ట్ చేసుకోవాలి. మంచివాసన వస్తుంది. దీన్ని చల్లార్చి మిక్సీ పట్టుకోవాలి. మరో ప్యాన్ తీసుకుని అందులో మసాలా మిశ్రమంతో పాటు పసుపు, ఆమ్‌చూర్ వేసి కలిపి పక్కన ఉంచుకోవాలి. అదే ప్యాన్‌లో నూనె వేశాక బిర్యానీ ఆకు, ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకూ కలపాలి. అల్లం- వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి వేసి బాగా రెండు నిముషాల పాటు కలిపి మసాలా పౌడర్ వేసి బాగా కలిపాక టమోటా ముక్కలు వేయాలి. గరిటెతో కదుపుతూ ఉంటే నూనె పైకి తేలినట్లు ఉంటే బాగా వేగినట్లు. వెంటనే కుక్కర్‌లోని శనగల మిశ్రమం వేసి ఉప్పును చెక్ చేసుకోవాలి. లేకుంటే సరిపడినంత ఉప్పు వేయాలి. మిశ్రమాన్ని కలిపి ప్యాన్ మూత మూసేసి పదిహేను నిముషాల పాటు లోఫ్లేమ్‌లో కుక్ చేయాలి. మాష్ చేసినట్లు గరిటెతో కదపాలి. కొత్తిమీరతో సర్వ్ చేసుకుని దింపిన తర్వాత.. పూరీ, దోశ, చపాతీ, పరోటాల్లో తినాలి.

ఓట్స్ ఆమ్లెట్

కావాల్సిన పదార్థాలు

ఓట్స్- పావు కప్పు, పాలు- అరకప్పు, కోడిగుడ్లు-2, ఉప్పు- తగినంత, పసుపు- పావు టీస్పూన్, బ్లాక్ పెప్పర్- అర టీస్పూన్, పింక్ హిమాలయన్ సాల్ట్- కొద్దిగా, క్యాప్సికమ్ ముక్కలు- 2 టేబుల్ స్పూన్లు, టొమాటో- 1 (చిన్నది), ఉల్లిపాయ ముక్కలు- 2 టేబుల్ స్పూన్లు, క్యారెట్ ముక్కలు- 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- టీస్పూన్, మునగాకు- 2 టేబుల్ స్పూన్లు, నూనె- 2 టేబుల్ స్పూన్లు,

తయారీ విధానం

ప్యాన్‌లో ఓట్స్ వేసి లోఫ్లేలో వేయించాలి. వీటిలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇక రంగుమారిన తర్వాత ఓట్స్‌ను ఇంకో ప్లేట్‌లోకి తీసుకుని చల్లబర్చాలి. ఆ తర్వాత మిక్సీ పట్టి మెత్తటి పిండిలా చేసుకున్న తర్వాత పాలను కొద్ది కొద్దిగా పోస్తూ స్పూన్‌తో కలపాలి. ఐదు నిముషాల పాటు అలానే ఉంచాలి.

బౌల్‌లో రెండు కోడిగుడ్ల సొన తీసుకున్న తర్వాత తగినంత ఉప్పు, పసుపు బ్లాక్ పెప్పర్ వేశాక ఫోర్క్ సాయంతో గిలక్కొట్టినట్లు వేగంగా మిశ్రమాన్ని కలిపితే బుడగల్లా వస్తుంది. ఆ తర్వాత ఓట్స్ పిండి మిశ్రమంలో హిమాలయన్ సాల్ట్ వేసి కలిపాక క్యాప్సికమ్ ముక్కలు, టమోటా ముక్కలు, క్యారెట్ ముక్కలు, కొత్తిమీర, ఉల్లిపాయ ముక్కలు వేశాక మునగాకును తుంచి వేయాలి. ఈ మిశ్రమాన్నంతా బాగా కలపాలి. అవసరం అనుకుంటే మష్రూమ్ ముక్కలను కూడా వేసుకోవచ్చు. ఓట్స్ మిశ్రమంలోకి కోడిగుడ్ల సొన వేసి మిశ్రమాన్ని బాగా కలపాలి. చివరగా ప్యాన్‌మీద నూనె వేసిన తర్వాత ప్యాన్ అడుగంతా కదిలేట్లు తిప్పిన తర్వాత ఆమ్లెట్ వేసుకోవాలి. దోశలా రెండు వైపులా కాల్చుకోవాలి. ఈ ఆమ్లెట్‌లో ఫైబర్‌తో పాటు ప్రొటీన్లు ఉండటం వల్ల బరువు తగ్గేవాళ్లు ఇలాంటి ఫుడ్ చేసుకుని తినొచ్చు.

కజ్జు సోయా

కావల్సిన పదార్థాలు

సోయా ముక్కలు- 1 కప్పు, నూనె- మూడు టేబుల్ స్పూన్లు, బిర్యానీ ఆకులు-2, మీడియం సైజ్ ఉల్లిపాయలు-2 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి-2 (నిలువునా చీరి రెండుగా కట్ చేసుకోవాలి), కరివేపాకు- ఆరు ఆకులు, అల్లం,వెల్లుల్లి పేస్ట్- అర టీస్పూన్, ఉప్పు- తగినంత, పసుపు- చిటికెడు, కారం- టీస్పూన్, జీడిపప్పు-10, ధనియాల పొడి- అర టీస్పూన్, జీలకర్ర పొడి- అరటీస్పూన్, మసాలా పౌడర్- అరటీస్పూన్,



తయారీ విధానం

ముందుగా గ్యాస్‌మీద చిన్న గిన్నెలో నీళ్లు పోసి బాగా వేడి చేసుకోవాలి. ఇందులో సోయా గ్రాన్యుల్స్ వేయాలి. గరిటెతో సోయా ముక్కలను వేడి నీళ్లలో ముంచుతూ కలపాలి. ఆ తర్వాత పది నిముషాలపాటు అలానే వదిలేయాలి. ఆ తర్వాత వడగట్టుకోవాలి. సోయా గ్రాన్యుల్స్‌లో నీళ్లు లేకుండా వత్తుకోవాలి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి. దీన్నే సోయా కీమా అంటారు.

ప్యాన్‌లో నూనె వేసి బిర్యానీ ఆకులు, ఉల్లిపాయ ముక్కలు వేసి గరిటెతో కలియబెట్టాలి. ఉల్లిపాయల రంగు మారిన తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి రెండు నిముషాల పాటు కుక్ చేయాలి. అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేశాక నిముషం పాటు గరిటెతో కలిపిన తర్వాత ఉప్పు, పసుపు, కారం వేసి గరిటెతో మూడు నిముషాల తర్వాత జీడిపప్పు వేసి కలపాలి. జీలకర్ర పొడి, ధనియాల పొడి, మసాలా పౌడర్ వేసి నిముషం పాటు కలిపిన తర్వాత నానబెట్టిన సోయా గ్రాన్యుల్స్ వేయాలి. మిశ్రమాన్ని కలిపిన తర్వాత కొత్తిమీర వేసుకుని దించేసుకోవాలి. నాలుగైదు జీడిపప్పులతో గార్నిష్ చేసుకుని చపాతీలోకి తినాలి. రుచిగా ఉంటుంది.

'అల్లం చల్ల' పానీయం

తక్రం చిరం క్వథితమర్పిత శృంగవేరం బాహ్లీక సైంధవ రజోమరీచాల్పచూర్ణమ్!

ఏలాభవేన రజాసా సురభీకృతం తత్ తూర్ణ ప్రదీప యతి శాంతతనూనపాదమ్!!

చల్లని మజ్జిగ అని కూడా వ్యవహరిస్తుంటారు. ఆరోగ్యం రీత్యా పాల కన్నా పెరుగు మంచిది. పెరుగు కన్నా చల్ల మంచిది. ఏకవచనంలో ఉన్న పెరుగుని చల్ల కవ్వంతో చిలకగానే చల్ల అనే బహువచనంగా మారిపోతోంది. 'పెరుగు ఉంది' అంటాం. 'మజ్జిగ ఉన్నాయి' అంటాం. పాలు, పెరుగుల్లో లేని సుగుణాలేవో అదనంగా ఉన్నాయి కాబట్టే, చల్ల లేదా మజ్జిగ బహువచనంలా ద్విగుణం బహుళంగా మారిపోతున్నాయి.

చల్ల తాగితే జలుబు చేస్తుందని కొందరి అపోహ. చల్లను ఫ్రిజ్‌లో పెట్టటంవల్లే జలుబు వస్తుంది. చల్ల తాగితే సరిపడదనే వారు ఇలా అల్లపు చల్లని తాగి చూడండి. సాధారణంగా సరిపడకపోవటం అనేది ఉండదు. చల్లని సగానికి సగం మరిగించటంవల్ల దానిలోని దోషాలు చాలావరకూ పోయి సౌమ్యత కలుగుతుంది.



కవ్వంతో చిలకడం వల్ల ఆ చల్లలో లఘుత్వం ఏర్పడి, తేలికగా వంటబట్టే స్వభావం సమకూరుతుంది. ఇంతకన్నా ఏం కావాలి? పెరుగులో లేని గుణం ఇది. ఎంత చిలికితే అంత తేలికదనం వస్తుంది. వెన్న శాతం ఎక్కువగా ఉన్న చిక్కని పాలను తోడు పెట్టుకుని, చిలికి వెన్న తీస్తే కమ్మని ఆరోగ్యదాయకమైన చల్లతో పాటు వెన్న కూడా సమృద్ధిగా దక్కుతుంది.

ఈ చల్లని 'ప్రోబయాటిక్' అంటారు. ఇందులో... ఉపయోగపడే బాక్టీరియా సమృద్ధిగా ఉంటుంది. ఈ బాక్టీరియా మన పేగుల్ని బలసంపన్నం చేసి, చెడ్డ బాక్టీరియాని ఎదుర్కొంటుంది. పేగుల్లో జరిగిన నష్టాన్ని సరి చేస్తుంది. జీర్ణప్రక్రియను వేగవంతం చేస్తుంది. అల్సర్లను మానేలా చేస్తుంది.



చల్ల, అల్లం ఇవి రెండూ చక్కని నేస్తాలు. ఈ రెండిటినీ కలిపితే మనం ఆశించిన ప్రయోజనం ఎక్కువగా పొందవచ్చు. అల్లం కలిసిన చల్లకు గుణాలెక్కువ. రాత్రి పడుకోబోయే ముందు ఒక గ్లాసు చిక్కని చల్ల తీసుకుని, అదే గ్లాసుతో 3 గ్లాసుల నీళ్లు కలపండి. మూతబెట్టి ఈ చల్ల నీళ్లని ఫ్రిజ్‌లో కాకుండా, బయటే ఉంచండి. ఆ చల్లలో ఉన్న మంచి బాక్టీరియా అందులో కలిపిన నీళ్లలో తెల్లవార్లూ పెరగటం మొదలెట్టి, ఒక గ్లాసు బాక్టీరియా నాలుగు గ్లాసుల బాక్టీరియా అవుతుంది. అల్లాన్ని సైంధవ లవణంతో కలిపి, మెత్తగ నూరి ఓ సీసాలో ఉంచి ఫ్రిజ్‌లో భద్రపరచుకోండి. పొద్దున్నే ఈ చల్లలో ఒక చెంచాడు అల్లం ముద్దని కలిపి తాగితే జీర్ణకోశానికి తిరుగులేని శక్తి కలుగుతుంది. ఆకలి, అరుగుదల పెరుగుతాయి. అమీబియాసిస్, ఐబియస్ లాంటి వ్యాధుల్లో, వాత వ్యాధుల్లోనూ, మలబద్ధకానికి చల్లను ఇలా తాగటమే మంచిది.

అజీర్తికి ఔషధంలా...

అజీర్తి అనేది అన్ని రోగాలకూ తలుపులు తెరిచే ఒక లక్షణం. దీన్ని సరి చేసుకోగలిగితేనే ఏ వ్యాధికైనా ఉపశమనం. కీళ్లవాతం రోగి... అజీర్తిని సరి చేసుకోకుండా ఎన్ని నొప్పిబిళ్లలు మింగినా ఉపయోగం ఉండదు. అలాగే అన్ని వ్యాధుల్లోనూ జీర్ణశక్తిని పెంచుకోవటం అనేది చికిత్సలో మొదటి అడుగు కావాలి. అందుకనే, వ్యాధులు రాకుండానూ, వచ్చిన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా మారకుండానూ, దీర్ఘవ్యాధులు త్వరగా తగ్గటానికి కూడా ఈ 'అల్లం చల్ల పానీయం' ఎంతగానో తోడ్పడుతుంది. ఇందులో కొద్దిగా కొత్తిమీర తరిగి కలుపుకొంటే కమ్మగా ఉంటుంది.

ఎలాగైనా తీసుకోవచ్చు...

అల్లం చల్లని అన్నంలో కలుపుకొని తినొచ్చు. లేదంటే నేరుగా తాగవచ్చు. శీతాకాలంలో కలిగే ఇబ్బందుల్ని ఈ పానీయం నివారిస్తుంది. వేసవిలో వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. వర్షాకాలంలో దగ్గు, జలుబు రాకుండా చేస్తుంది. మూడు కాలాలకూ ఉపయోగపడే పానీయం ఇది. పిల్లాపెద్దా అందరికీ మంచిది. బడికివెళ్లే పిల్లల్లో ఈ చల్ల మేధాశక్తిని పెంచుతుంది. ఎముక పుష్టి ఇస్తుంది. మెనోపాజ్ సమస్యలతో బాధపడే మహిళలకు ఉపశమనం కలిగిస్తుంది.

మరగ కాచి...

ఈ అల్లం కలిపిన చల్లని మరగ కాచి కమ్మని పానీయం తయారు చేసుకునే ఇంకో విధానం కూడా ఉంది. క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం' గ్రంథంలో జీర్ణశక్తిని పెంచే ఔషధంగా దీన్ని వివరించాడు. చల్లలో తగినంత నూరిన అల్లం కలిపి, సగం ఆవిరయ్యేంతవరకు మరగనివ్వాలి. దీనివల్ల అందులో ఉపయోగపడే బాక్టీరియా నశించినప్పటికీ మిగిలిన పోషకాలన్నీ బహుళం అవుతాయి. అల్లంతో మరిగించటంవల్ల అల్లపుసారం అంతా ఈ చల్లకు పట్టుకొంటుంది. ఇలా మరిగిన చల్లలో, ఇంగువ పొడి, సైంధవ లవణం, మిరియాలు, ఏలకుల పొడి తగినంత కలిపి ఇంకొద్దిసేపు మరగనివ్వాలి. ఇలా తయారైన అల్లం చల్ల పానీయం జాఠరాగ్నిని ప్రజ్వరిల్లజేస్తుందన్నాడు క్షేమశర్మ.

● గంగరాజు అరుణాదేవి

మేకప్

కాస్మటిక్స్ కొనేటప్పుడు...

మేకప్‌తో చర్మ ఆరోగ్యం దెబ్బతినకుండా, రెట్టింపు ఆకర్షణీయంగా కనిపించాలి. అందుకోసం కాస్మటిక్స్ ఎంపికలో కొన్ని చిట్కాలు పాటించాలి.

పొడిబార్చేలా ఉంటే...

వేర్వేరు కాస్మటిక్స్ వేర్వేరు చర్మాల మీద వేర్వేరు ప్రభావాలు చూపిస్తాయి. ఒక బ్రాండ్‌కు చెందిన ఐ షాడో బ్రహ్మాండంగా సూట్ అయినంత మాత్రా, అదే బ్రాండ్ లిప్‌స్టిక్ కూడా సూటవుతుంది అనుకుంటే పొరపాటు. కాబట్టి, కాస్మటిక్స్ ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలి. అలాగే చర్మాన్ని పొడిబార్చే ఫౌండేషన్‌కు దూరంగా ఉండాలి. ఏ కాస్మటిక్స్ చర్మానికి నప్పుతుందో తెలుసుకోవడం కోసం వేర్వేరు కాస్మటిక్స్‌ను ఉపయోగించి చూడాలి.

స్కిన్ టోన్ కీలకం

కాస్మటిక్స్ చర్మపు రంగును పూర్తిగా మార్చేసేలా ఉండకూడదు. చర్మపు రంగుతో మ్యాచ్ అయిపోయి, మచ్చలను చర్మంలో కలిసిపోయేలా చేసేదై ఉండాలి. చర్మపు రంగుకు సరిపోలని కాస్మటిక్స్‌ను ఎంచుకుంటే, సహజసిద్ధమైన అందం మరుగున పడిపోయి, కృత్రిమత్వం పెరుగుతుంది. కాబట్టి ఫౌండేషన్ ఎంపికలో రెట్టింపు జాగ్రత్తగా వ్యవహరించాలి.

నాణ్యమైన వాటినే...

కాస్మటిక్స్ నాణ్యత విషయంలో రాజీ పడిపోకూడదు. ఖరీదైన నాణ్యమైన కాస్మటిక్స్ చర్మం మీద అంటుకుపోయి న్యాచురల్ లుక్‌ను తెచ్చి పెడతాయి. చవక రకం కాస్మటిక్స్ చర్మం మీద పైపొరలా ఏర్పడి, ప్లాస్టిక్ లుక్‌ను తెచ్చి పెడతాయి.



నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/ntKSbuqలో చదవండి.

మార్పు సాధనం... గిరిజన 'చిత్రం'



ఎంతో శక్తిమంతమైన దృశ్య మాధ్యమాన్ని తను కోరుకొనే మార్పుకు సాధనంగా ఎంచుకున్నారు సంధ్యా లక్రా. జార్ఖండ్‌కు చెందిన ఈ 29 ఏళ్ళ మహిళ గిరిజన జీవితాల్లోని వెతలను చలనచిత్రాలుగా రూపొందిస్తున్నారు. ఈ నెలలో ఫిలిమ్ ఫెస్టివల్ నిర్వహణ ద్వారా స్థానిక యువతలో స్ఫూర్తి రగిలించేందుకు సిద్ధమవుతున్న సంధ్య కథ ఆమె మాటల్లోనే...

"మాది జార్ఖండ్ రాష్ట్రం ఛత్రా జిల్లా సంఘారీ అనే గ్రామం. ఛత్రాలో ప్రాథమిక విద్య పూర్తిచేశాను. రాంచీలో డిగ్రీ వరకూ చదివాను. మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో... ఉన్నత విద్య అభ్యసించాలన్నా కుదరలేదు. తిరిగి మా సంఘారీకి చేరుకున్నాను. మా ఊరుకు అన్ని వైపులా అడవులే. బాల్యం నుంచీ కొండలు, నదులు, జలపాతాలు, పచ్చని చెట్లే నా నేస్తాలు. చదువుకొనే సమయంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంటే ఆసక్తి ఏర్పడింది. తీరిక సమయాల్లో కెమేరా తీసుకొని అడవుల్లోకి వెళ్ళేదాన్ని. వీడియోగ్రఫీలో 'ఛేంజ్ గ్రీన్ హట్ ఫెలోషిప్' కోసం దరఖాస్తు చేసి, ఎంపికయ్యాను. ఎన్నో మెళకువలు నేర్చుకోడానికి ఆ ఫెలోషిప్ నాకు చాలా ఉపయోగపడింది. రాంచీలోని 'ఆశా సంస్థ'లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న కాలంలో... ఆ సంస్థ కార్యకలాపాల గురించి, ఇటుకల బట్టీల్లో పని చేస్తున్న పిల్లల గురించి, మానవ అక్రమ రవాణా గురించి డాక్యుమెంటరీలు తీశాను. కన్హా టైగర్ రిజర్వ్‌లో... జీవ వైవిధ్యం, ప్రకృతి పరిరక్షణపై జరిగిన మూడు రోజుల వర్క్ షాప్‌లో పాల్గొన్నాను. సత్పురా టైగర్ రిజర్వ్, టిల్గా వైల్డ్ లైఫ్ సాంక్చువరీ, కెరవా ఫారెస్ట్ లాంటి ప్రదేశాలను సందర్శించాను. ఇవన్నీ అడవులపైనా, ప్రకృతిపైనా కొత్త దృక్పథాన్ని అందించాయి. నేను చిత్రించినవాటికి గుర్తింపు రావడం మొదలైంది.

ఆ ఆవేదనతోనే...

ఈలోగా టాటా స్టీల్ ఫౌండేషన్ 'సంవాద్ ఫిలిమ్ ఫెస్టివల్' నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఇది ట్రైబల్ ఫిల్మ్‌మేకర్స్ కోసం ఉద్దేశించినది. గిరిజన వలస కుటుంబాల పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల మీద తీసిన నా డాక్యుమెంటరీని ఎంట్రీగా పంపాను. మన దేశంలో వేలాది గిరిజన కుటుంబాలు వలస వెళుతున్నాయి. వారి పిల్లలకు కనీసమైన చదువు కూడా ఉండడం లేదు. దీని వల్ల ఒక తరం నాశనమైపోతుందనే ఆవేదనతో దాన్ని చిత్రీకరించాను. నాదీ గిరిజన కుటుంబమే కాబట్టి ఈ సమస్య గురించి నాకు బాగా తెలుసు. నా డాక్యుమెంటరీ ఎంపిక కావడంతో అయిదు రోజులపాటు జరిగిన 'సంవాద్-2003'లో పాల్గొనాలని ఆహ్వానం వచ్చింది. అక్కడ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ట్రైబల్ ఫిల్మ్‌మేకర్స్‌ను కలుసుకొని, అభిప్రాయాలు పంచుకొనే అవకాశం వచ్చింది. నా డాక్యుమెంటరీని జ్యూరీ ఉత్తమమైనదిగా ఎంపిక చేసింది. ఫెలోషిప్ పూర్తయిన తరువాత... మా ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు జీవ వైవిధ్యం, ప్రకృతి సంరక్షణ గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాను. చెట్లు, మొక్కలు, పువ్వులు, ఆకులు, కాయలు, పండ్లలో ఉండే ఔషధ గుణాల గురించి, వన్య ప్రాణుల గురించీ డాక్యుమెంటరీలు ప్రదర్శించాను.

వారి కోసం ప్రత్యేకంగా...

నేను తీసే డాక్యుమెంటరీల్లో స్థానికులే ప్రధాన పాత్రధారులు. వాటిపట్ల పిల్లల ఆసక్తి చూసిన తరువాత... స్వయంగా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. ఆ దిశగా ఏర్పాట్లు ప్రారంభించాను. గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంగీతం, ఆహారం, జానపద కథలు, సమస్యలతో పాటు గ్రామీణాభివృద్ధి, విద్య, పర్యావరణ పరిరక్షణ, స్వయం ఉపాధి, సేంద్రియ వ్యవసాయం, భవిష్యత్ భారతదేశం లాంటివి ప్రధానాంశాలుగా... కేవలం జార్ఖండ్ నుంచే కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచీ చిత్రాలను ఆహ్వానించాను.



దానికి ఔత్సాహికుల నుంచే కాదు అనుభవజ్ఞులైన ఫిల్మ్‌మేకర్స్ నుంచి సైతం మంచి స్పందన వచ్చింది. ఈ నెల తొమ్మిది, పది తేదీల్లో ఛత్రా జిల్లా కేంద్రంలో నిర్వహించే ఫిల్మ్ ఫెస్టివల్‌లో... సామాజిక అంశాలపై స్థానిక యువత రూపొందించిన చిత్రాలను కూడా ఒక ప్రత్యేక విభాగంలో ప్రదర్శిస్తాం. గిరిజన గ్రామాల్లో జీవనోపాధి అవకాశాలను పొందడం అతి పెద్ద సవాలు. మా గ్రామంలో అసమానతలను, నేరాలను, హింసను నేను ప్రత్యక్షంగా చూశాను. వాటిని ఖండిస్తూ, సామాజికంగా సానుకూల మార్పును నా చిత్రాల ద్వారా తీసుకురావాలన్నదే నా లక్ష్యం. అలాగే గిరిజనుల సాంస్కృతిక గుర్తింపును ప్రధానంగా చాటిచెప్పాలి. దేశంలోని గిరిజన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ప్రోత్సహించాలి. నేను నిర్వహించబోయే ఫిల్మ్ ఫెస్టివల్ ఆ దిశగా మరికొంతమందికి స్ఫూర్తి కలిగిస్తుందని ఆశిస్తున్నాను."



కొలస్ట్రాల్‌కు విరుగుడు!

చెడు కొలస్ట్రాల్ వల్ల రకరకాల సమస్యలు ఏర్పడతాయి. చెడు కొలస్ట్రాల్ మన రక్తనాళాలలో పేరుకుపోతుంది. దాని వల్ల రక్తప్రసారానికి ఇబ్బంది కలుగుతుంది. దీనిలో గుండె జబ్బులు వచ్చే అవకాశముంటుంది. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉదయాన్నే గ్రీన్‌టీ, పసుపు పాలు, బీట్‌రూట్ క్యారెట్ జ్యూస్‌లను తాగితే మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పానీయాల వల్ల లాభాలేమిటో చూద్దాం.

గ్రీన్ టీ: గ్రీన్‌టీలో కేటిచిన్స్ అనే పదార్థం ఉంటుంది. ఈ టీలో నిమ్మరసం, తేనె కలుపుకుంటే అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉంటాయి. చాలా మంది గ్రీన్‌టీ అంటే- టీ ఆకులు వేసి బాగా మరగపెడతారు. ఇలా మరగపెట్టడం వల్ల అదనపు ప్రయోజనం ఉండదు. పైగా రుచి కూడా మారిపోతుంది.

పసుపు పాలు: పసుపులో కుర్కుమిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది కొలస్ట్రాల్ విలువలను తగ్గిస్తుంది. పసుపు పాలను ఎలా చేయాలో చూద్దాం..

● ఒక కప్పు పాలను తీసుకోవాలి. అవి బాగా కాగిన తర్వాత దానిలో ఒక పావు స్పూను పసుపు వేయాలి. రుచికి తగినట్లుగా మిరియాల పొడి కూడా వేయాలి. కొద్దిగా తేనె వేస్తే కూడా మంచిది. పాలను కిందకు దింపి చల్లార్చి తాగాలి.

బీట్‌రూట్ క్యారెట్ జ్యూస్: బీట్‌రూట్, క్యారెట్‌లలో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఫైబర్ కూడా ఉంటుంది. వీటి వల్ల కొలస్ట్రాల్ విలువలు అదుపులో ఉంటాయి. ఈ జ్యూస్‌ను ఎలా చేయాలో చూద్దాం.

● ఒక మీడియం బీట్‌రూట్, రెండు క్యారెట్‌లను తీసుకోవాలి. వీటి పైతొక్క తీసి చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. ఒక చిన్న అల్లం ముక్క కూడా వేయాలి. ఒక గ్లాసు నీళ్లు పోసి జ్యూసర్ లేదా మిక్సీలో బాగా తిప్పాలి. బీట్‌రూట్, క్యారెట్‌లలో ఫైబర్ ఎక్కువ ఉంటుంది కాబట్టి దీనిని వడగొట్టకుండా తాగటమే మంచిది.

ఆసియా కుబేరాగ్రజుడు అదానీ

సంపదలో అంబానీని దాటేశాడు..

- ఒక్కరోజే 770 కోట్ల డాలర్లు పెరిగి మొత్తం 9,760 కోట్ల డాలర్లకు చేరిక
- ప్రపంచ రిచ్ లిస్ట్‌లో 12వ స్థానం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ ఆసియాలో అత్యంత ధనవంతుడిగా అవతరించారు. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి ఆసియా కుబేర కిరీటాన్ని మళ్లీ చేజిక్కించుకున్నారు. బ్లూంబర్గ్ బిలియనీర్స్ రియల్‌టైం ఇండెక్స్ ప్రకారం.. అదానీ వ్యక్తిగత సంపద ఒక్క రోజే 770 కోట్ల డాలర్లు వృద్ధి చెంది మొత్తం 9,760 కోట్ల డాలర్లకు ఎగబాకింది. దాంతో ఆయన ప్రపంచ బిలియనీర్ల లిస్ట్‌లోనూ 12వ స్థానానికి ఎగబాకారు. కాగా, 9,700 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో అంబానీ 13 స్థానంలో కొనసాగారు. హిండెన్‌బర్గ్ ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు తీర్పు అదానీకి భారీ ఊరట కల్పించడంతో గ్రూప్ కంపెనీల షేర్లు ఈ వారంలో భారీగా పుంజుకున్నాయి. దాంతో అదానీ నెట్‌వర్త్ కూడా అనూహ్యంగా పెరిగింది. ఈ ఏడాదిలో గడిచిన ఐదు రోజుల్లో అదానీ ఆస్తి 1,330 కోట్ల డాలర్లు పెరగగా.. అంబానీ సంపదలో కేవలం 66.5 కోట్ల డాలర్ల వృద్ధి నమోదైంది. గతంలోనూ గ్రూప్ కంపెనీల షేర్లు దూసుకెళ్లడంతో 2022 సెప్టెంబరులో అదానీ 14,900 కోట్ల డాలర్ల సంపదతో ప్రపంచంలో మూడో అత్యంత ధనవంతుడిగా ఎదిగారు. కానీ, 2023 జనవరి 24న విడుదలైన హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపణలతో గ్రూప్ షేర్లు భారీగా పతనమయ్యాయి. దాంతో గత ఫిబ్రవరి చివరినాటికి గ్రూప్ మార్కెట్ విలువ 15,000 కోట్ల డాలర్లు, అదానీ సంపద 3,770 కోట్ల డాలర్ల మేర క్షీణించింది. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన ముందు రోజు నాటికి అదానీ ప్రపంచ కుబేరుల్లో నాలుగో స్థానంలో ఉన్నారు.

- టయోటా కిర్లోస్కర్ మోటార్ కంపెనీ ఈ నెల ఒకటో తేదీ నుంచి తన కార్ల ధరలు పెంచింది. మోడల్‌ను బట్టి ఈ పెరుగుదల అర శాతం నుంచి 2.5 శాతం ఉందని కంపెనీ తెలిపింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాలు తట్టుకునేందుకు ఈ పెంపు తప్పలేదని పేర్కొంది.

ఈ ఏడాది జీడీపీ వృద్ధి 7.3%



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 7.3 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. గనులు, క్వారీ, తయారీ రంగాలతో పాటు సేవల రంగంలోని కొన్ని విభాగాలు ప్రదర్శిస్తున్న అద్భుతమైన పురోగతి వృద్ధికి ఊతంగా నిలుస్తుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం విడుదల చేసిన తొలి అడ్వాన్స్ అంచనాల్లో తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం వృద్ధిని సాధించింది. ఈ ఏడాది తయారీ రంగం వృద్ధి రేటు గత ఏడాదితో పోల్చితే 1.3 శాతం నుంచి 6.5 శాతానికి పెరగవచ్చని, అలాగే గనుల రంగం వృద్ధి రేటు 8.1 శాతం (గత ఏడాది 4.1 శాతం); ఆర్థిక సర్వీసులు, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సర్వీసుల రంగం 8.9 శాతం (గత ఏడాది 7.1 శాతం) వృద్ధిని నమోదు చేయవచ్చని పేర్కొంది. మొత్తం మీద స్థిర ధరల (2011-12) ప్రకారం జీడీపీ పరిమాణం రూ.171.79 లక్షల కోట్లుండవచ్చని ఎన్ఎస్ఓ తన నివేదికలో తెలిపింది. 2022-23లో ఇది రూ.160.06 లక్షల కోట్లుంది. జీడీపీ వృద్ధిపై ఎన్ఎస్ఓ అంచనా ఆర్‌బీఐ ప్రకటించిన 7 శాతం కన్నా కూడా అధికంగానే ఉంది. అయితే ప్రస్తుత ధరల ప్రకారం (2023-24) జీడీపీ పరిమాణం రూ.296.58 లక్షల కోట్లు లేదా 3.57 లక్షల కోట్ల అమెరికన్ డాలర్లుండవచ్చని (అమెరికన్ డాలరుకు రూ. 83గా లెక్కిస్తే), అంటే గత ఏడాదితో పోల్చితే 8.9 శాతం వృద్ధి నమోదు కావచ్చని కూడా తెలిపింది.

వ్యవసాయం నీరసమే...

- ఈ ఏడాది వ్యవసాయ రంగం వృద్ధి అంతంత మాత్రంగానే ఉండవచ్చు. గత ఏడాదితో పోల్చితే ఈ రంగం వృద్ధి రేటు 4 శాతం నుంచి 1.8 శాతానికి దిగజారే ఆస్కారం ఉంది.
- వాణిజ్యం, హోటల్, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసుల రంగాల వృద్ధి 14 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గవచ్చు.
- నిర్మాణ రంగం వృద్ధి రేటు 10 శాతం నుంచి 10.7 శాతానికి పెరగవచ్చు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సేవల రంగాల వృద్ధి రేటు 7.2 శాతం నుంచి 7.7 శాతానికి చేరవచ్చు.
- మౌలిక ధరల ఆధారంగా జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.9 శాతం ఉండవచ్చు. గత ఏడాది ఇది 7 శాతం ఉంది.

ఐక్యరాజ్య సమితి అంచనా 6.2 శాతం

తయారీ, సేవల రంగాలు అందించే ఊతంతో భారత్ 2024 సంవత్సరంలో 6.2 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని ఐక్యరాజ్యసమితి తాజా అంచనాలు తెలుపుతున్నాయి. 2023 సంవత్సరానికి ప్రకటించిన అంచనా 6.3 శాతం కన్నా ఇది స్వల్పంగా దిగువన ఉంది. ఈ ఏడాది కూడా భారత్ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా తన స్థానం నిలబెట్టుకుంటుందంటూ భారత్ అందించే మద్దతుతో దక్షిణాసియా మొత్తం మీద జీడీపీ వృద్ధిరేటు 5.2 శాతం ఉండవచ్చని కూడా తాజా నివేదికలో తెలిపింది. 2025లో భారత వృద్ధి రేటు 6.6 శాతం ఉండవచ్చని కూడా అంచనా వేసింది. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం గత ఏడాదితో పోల్చితే 5.7 శాతం నుంచి 4.5 శాతానికి తగ్గవచ్చని పేర్కొంది. దేశంలో నిరుద్యోగిత కూడా సెప్టెంబరులో 7.1 శాతం ఉన్నదని, ఏడాదిలో ఇది కనిష్ఠ స్థాయి అని తెలిపింది.

రుతుపవనాలు బలహీనంగా ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత తగ్గడం విశేషమని పేర్కొంది. కాగా ప్రభుత్వం మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఇస్తున్న ప్రాధాన్యత, బహుళ జాతి సంస్థల పెట్టుబడుల ఆధారంగా భారత్ 2023లో పెట్టుబడుల ఆకర్షణలో కూడా బలంగానే ఉన్నదని సమితి స్పష్టం చేసింది. సంపన్న ఆర్థిక వ్యవస్థల కన్నా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలే పెట్టుబడుల్లో మెరుగ్గా ఉన్నాయని తెలిపింది.

విద్యుత్ ఉపకరణాలకు కొత్త నాణ్యతా నిబంధనలు

న్యూఢిల్లీ: విద్యుత్ ఉపకరణాలకు తప్పనిసరిగా పాటించవలసిన నాణ్యతా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. ప్రమాణబద్ధంగా లేని చౌకబారు ఉపకరణాల దిగుమతికి పగ్గాలు వేసి దేశీయ తయారీని ప్రోత్సహించడం దీని లక్ష్యం. డీపీఐఐటీ.. విద్యుత్ పరికరాల (క్వాలిటీ కంట్రోల్) ఆర్డర్, 2023ని జనవరి ఒకటో తేదీన జారీ చేసింది. ఈ ఆర్డర్ కింద బీఐఎస్ మార్క్ లేని వస్తువుల ఉత్పత్తి, విక్రయం, వ్యాపారం, దిగుమతి, నిల్వ వంటి కార్యకలాపాలు ఎవరూ చేయకూడదు. నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి ఆరు నెలల తర్వాత ఈ ఉత్తర్వు అమలులోకి వస్తుందని ప్రభుత్వం తెలియచేసింది. ఎవరైనా బీఐఎస్ నిబంధనలు తొలిసారి ఉల్లంఘించినట్టయితే రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష రూ.2 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. తదుపరి ఉల్లంఘనలకు కనీస జరిమానా రూ.5 లక్షలు కాగా దాన్ని వస్తువు విలువపై 10 రెట్ల వరకు పెంచే ఆస్కారం ఉంటుంది.

పోస్టాఫీసుల్లోనూ రూ.2000 నోట్ల మార్పిడి

ముంబై: ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2000 నోట్లను పోస్టాఫీసుల్లో కూడా మార్చుకోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రకటించింది. తమ వెబ్‌సైట్‌లో తరచుగా అడిగే ప్రశ్నలు (ఎఫ్ఏక్యూ) విభాగంలో ప్రజలు పోస్టాఫీసుల ద్వారా తమ 19 కార్యాలయాల్లో ఎక్కడికైనా ఆ నోట్లను పంపవచ్చని తెలియచేసింది. ప్రజలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఒక దరఖాస్తు ఫారం నింపి నోట్ల మార్పిడి అభ్యర్థన పంపవచ్చని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,270 ▼	58,000 ▼	78,100 ▲
ముంబై	62,540 ▼	57,287 ▼	71,550 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	582	విజయవాడ	585
6 జనవరి		విశాఖపట్నం	625
చిత్తూరు	598	వరంగల్	584
గోదావరి	585	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	75	గోదావరి	84
వరంగల్	75		
కరీంనగర్	75	విజయవాడ	84
మహబూబ్‌నగర్	75	గుంటూరు	82
		ఒంగోలు	82
కర్నూలు	75	చిత్తూరు	80
విశాఖపట్నం	79		

మళ్లీ 72,000పైకి సెన్సెక్స్

వరుసగా రెండో రోజూ లాభాల్లో సూచీలు

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజు లాభాల్లో ముగిశాయి. ఐటీ, టెక్నాలజీతో పాటు క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో కొనుగోళ్లతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు వారాంతంలో మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో 309 పాయింట్ల వరకు పెరిగి 72,156 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసుకున్నప్పటికీ, చివరికి 178.58 పాయింట్ల లాభంతో 72,026.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 52.20 పాయింట్లు పెరిగి 21,710.80 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో సగం లాభపడ్డాయి.

- గత నెల 29తో ముగిసిన వారానికి విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు మరో 275 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 62,320 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. 2021 అక్టోబరులో ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైం రికార్డు స్థాయి 64,500 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

కావేరీ సీడ్స్ రూ.325 కోట్ల షేర్ల బైబ్యాక్

హైదరాబాద్‌కు చెందిన కావేరీ సీడ్స్ బోర్డు శుక్రవారం రూ.325 కోట్ల విలువైన సొంత షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్)కు ఆమోదం తెలిపింది. టెండర్ ఆఫర్ పద్ధతిన జరగనున్న ఈ బైబ్యాక్‌లో ఒక్కో షేరుకు చెల్లించనున్న ధరను కంపెనీ రూ.725గా నిర్ణయించింది. ప్రస్తుత షేరు ధరతో పోలిస్తే దాదాపు 10 శాతం అధికమిది. వారాంతం ట్రేడింగ్‌లో కావేరీ సీడ్స్ షేరు బీఎస్ఈలో 1.18 శాతం పెరిగి రూ.662.60 వద్ద ముగిసింది. బైబ్యాక్‌లో భాగంగా కంపెనీ గరిష్ఠంగా 44,82,758 షేర్లను కొనుగోలు చేయనుంది. కంపెనీ పెయిడప్ క్యాపిటల్‌లో 8.01 శాతం వాటాకు సమానమిది.

కాగా, ధామ్‌పూర్ షుగర్ మిల్స్ కంపెనీ మొత్తం పెయిడప్ క్యాపిటల్‌లో 1.50 శాతం వాటాకు సమానమైన 10 లక్షల షేర్లను ఒక్కోటి రూ.300 చొప్పున తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది.

ఐటీ సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థ టీడీ సాఫ్ట్‌వేర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో తన చానల్ పార్ట్‌నర్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్ఠం చేస్తున్నట్లు ప్రకటించింది. రెండు రాష్ట్రాల్లో 600కు పైగా చానల్ పార్ట్‌నర్స్‌ను చేర్చుకోవటం ద్వారా సైబర్ సెక్యూరిటీ పరిశ్రమలో మరింత పట్టును చేజిక్కించుకోవచ్చని భావిస్తోంది. ఏపీ, తెలంగాణలో చిన్న తరహా పరిశ్రమల రంగం గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని ఇది తమకు కలిసిరానుందని తెలిపింది. అంతేకాకుండా దక్షిణాది మార్కెట్లలో కార్యకలాపాలు విస్తరించేందుకు దోహదపడుతుందని పేర్కొంది.

షార్ట్ సెల్లింగ్ లావాదేవీలకు చెక్

మార్కెట్ ఆటుపోట్లకు బ్రేక్!

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో తీవ్ర ఆటుపోట్లను కట్టడి చేసేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక చర్య తీసుకుంది. ఇక నుంచి షార్ట్ సెల్లింగ్ చేసే సంస్థాగత మదుపరులు షార్ట్ సెల్లింగ్ పొజిషన్లు తీసుకుంటుంటే.. ఆ విషయం ఆర్డర్ ప్లేస్ చేసేటప్పుడే వెల్లడించాలని స్పష్టం చేసింది. రిటైల్ మదుపరులు మాత్రం ఈ విషయాన్ని ఆర్డర్ ప్లేస్ చేసిన ట్రేడింగ్ రోజు చివర్లో వెల్లడించాలని కోరింది. బ్రోకర్లు ఈ విషయాన్ని అదే రోజు షార్ట్ సెల్లింగ్‌లో ఉన్న షేర్ల వివరాలను, షేర్ల వారీగా స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ వివరాలను కనీసం వారానికి ఒకసారి తమ వెబ్‌సైట్స్‌లో అప్‌డేట్ చేయాలని కోరింది.

షార్ట్ సెల్లింగ్ అంటే: ఒక కంపెనీ షేరు ధర పడిపోతుందనే నమ్మకం ఉంటే.. ఆ కంపెనీ షేర్లు తమ వద్ద లేకపోయినా ప్రస్తుత ధరకు అమ్మి.. ఆ షేర్ల ధరలు తగ్గగానే కొని లావాదేవీని పూర్తి చేయడాన్ని షార్ట్ సెల్లింగ్ అంటారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వంటి సంస్థాగత మదుపరులు కావాలని దుష్ప్రచారం చేసి.. తమ గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను షార్ట్ సెల్లింగ్ ద్వారా పడగొట్టి సొమ్ము చేసుకున్నాయన్న అదానీ గ్రూప్ ఆరోపణల నేపథ్యంలో సెబీ ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు.

టాటా 'పంచ్ ఈవీ' బుకింగ్స్ షురూ

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్.. కాంపాక్ట్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'పంచ్ ఈవీ' బుకింగ్స్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్‌లో రూ.21,000 డౌన్ పేమెంట్‌తో ఈ మోడల్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపింది. దీనికి తోడు 'యాక్టి.ఈవీ' పేరుతో మరో ఈవీ మోడల్‌ను అభివృద్ధి చేస్తోంది. అత్యాధునిక ఫీచర్లతో అభివృద్ధి చేస్తున్న ఈ ఎలక్ట్రిక్ కారు బ్యాటరీ ఒకసారి చార్జింగ్ చేస్తే 300 నుంచి 600 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది. ఈ ప్లాట్‌ఫామ్ ఆధారంగా వచ్చే ఏడాదిన్నరలో ఐదుకు పైగా ఈవీ మోడల్స్ మార్కెట్లోకి విడుదల చేస్తామని కంపెనీ ప్రకటించింది.

మరిన్ని ఈవీ మోడల్స్: ఆడి

దేశంలో ఈవీలకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని ఈవీ మోడల్స్ విడుదల చేయాలని జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి ఇండియా భావిస్తోంది. కంపెనీ ప్రస్తుతం భారత్‌లో నాలుగు మోడల్స్‌లో ఈవీ కార్లు విక్రయిస్తోంది. వచ్చే కొన్నేళ్లలో మరిన్ని మోడల్స్ విడుదల చేస్తామని కంపెనీ కంట్రీ హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. ప్రస్తుతం ఆడి ఇండియా అమ్మకాల్లో ఈవీల మూడు శాతం మాత్రమే. 2030 నాటికి ఇది 50 శాతానికి చేరుతుందని ధిల్లాన్ చెప్పారు. గత ఏడాది ఆడి ఇండియా దేశంలో 7,931 కార్లను విక్రయించింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 89 శాతం ఎక్కువని ధిల్లాన్ తెలిపారు.

స్పోర్ట్స్

బోణీ ఘనంగా..

- షఫాలీ, మంధాన అర్ధసెంచరీలు
- 9 వికెట్ల తేడాతో భారత్ విజయం
- టిటాస్‌కు నాలుగు వికెట్లు
- తొలి టీ20లో ఆసీస్ ఓటమి





ముంబై: వన్డేల్లో వరుస ఓటములతో డీలా పడిన భారత మహిళల క్రికెట్ జట్టు పొట్టి ఫార్మాట్ తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంది. శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టీ20లో 19 ఏళ్ల టీనేజర్ టిటాస్ సాధు కెరీర్‌లో ఉత్తమ గణాంకాల (4-0-17-4)తో చెలరేగింది. ఆ తర్వాత స్వల్ప ఛేదనను ఓపెనర్లు షఫాలీ వర్మ (44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 నాటౌట్), స్మృతి మంధాన (52 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 54) సునాయాసంగా ఛేదనను ముగించారు. దీంతో 9 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించిన భారత్ మూడు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 19.2 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. లిచ్‌ఫీల్డ్ (49), పెర్రీ (37) ఆకట్టుకున్నారు. ఛేదనలో భారత్ 17.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 145 పరుగులు చేసి గెలిచింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా టిటాస్ సాధు నిలిచింది.

ఓపెనర్లే బాదేశారు: ఛేదనలో భారత ఓపెనర్లు షఫాలీ, మంధాన తొలి వికెట్‌కు 137 పరుగుల భారీ భాగస్వామ్యం అందించడం విశేషం. భారత్‌కు పవర్‌ప్లేలో జట్టు 59 పరుగులు సాధించింది. ఇక 12వ ఓవర్‌లో షఫాలీ 6,4తో అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. ఈ ఓవర్‌లో మొత్తంగా 24 పరుగులు వచ్చాయి. ఛేదనను ఓపెనర్లే ముగిస్తారనిపించినా ఫిఫ్టీ పూర్తి చేశాక మంధానను వేర్‌హమ్ అవుట్ చేసింది. దీంతో తొలి వికెట్ భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి 5 పరుగులే చేయాల్సి ఉండగా జెమీమా (6 నాటౌట్) ఫోర్‌తో మరో 14 బాల్స్ ఉండగానే మ్యాచ్‌ను ముగించింది.

వహ్వా.. టిటాస్ : టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ తొలి వికెట్‌కు 28 పరుగులు జత చేరినా.. టిటాస్ ధాటికి పవర్‌ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో తను మూడు ఓవర్లలో 8 రన్స్‌కు మూడు వికెట్లు తీయడం విశేషం. మొదట జోరు మీదున్న ఓపెనర్ మూనీ (17) వికెట్ తీయగా.. ఆరో ఓవర్ వరుస బంతుల్లో తహిలా, గార్డ్‌నర్‌లను డకౌట్లుగా పెవిలియన్ చేర్చింది. హీలీ (8)ని రేణుక అవుట్ చేసింది. 33/4 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన జట్టును పెర్రీ, లిచ్‌ఫీల్డ్ ఆదుకున్నారు. లిచ్‌ఫీల్డ్‌ను అవుట్ చేయడం ద్వారా ఈ జోడీని 15వ ఓవర్‌లో అమన్‌జోత్ విడదీసింది. అనంతరం వికెట్ల పతనం వేగంగా సాగింది.

స్కోరుబోర్డు


ఆస్ట్రేలియా: హీలీ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుకా సింగ్ 8; మూనీ (సి) హర్మన్‌ప్రీత్ (బి) టిటాస్ 17; తహిలా (సి) వస్త్రాకర్ (బి) టిటాస్ 0; ఎలిస్ (సి) అమన్‌జోత్ (బి) దీప్తి శర్మ 37; గార్డ్‌నర్ (సి అండ్ బి) టిటాస్ 0; లిచ్‌ఫీల్డ్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) అమన్‌జోత్ 49; హ్యారిస్ (ఎల్బీ) శ్రేయాంక 1; సదర్లాండ్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) టిటాస్ 12; వేర్‌హమ్ (సి) అమన్‌జోత్ (బి) శ్రేయాంక 5; మెగాన్ షట్ (ఎల్బీ) దీప్తి శర్మ 1; బ్రౌన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 19.2 ఓవర్లలో 141 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-28, 2-32, 3-32, 4-33, 5-112, 6-119, 7-135, 8-135, 9-137, 10-141; **బౌలింగ్:** రేణుక 4-0-24-1; వస్త్రాకర్ 2-0-28-0; సాధు 4-0-17-4; శ్రేయాంక 3.2-0-19-2; దీప్తి శర్మ 4-0-24-2; అమన్‌జోత్ 2-0-23-1.

భారత్: మంధాన (సి) తహిలా (బి) వేర్‌హమ్ 54; షఫాలీ (నాటౌట్) 64; జెమీమా (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 17.4 ఓవర్లలో 145/1. వికెట్ పతనం:** 1-137. **బౌలింగ్:** బ్రౌన్ 2-0-10-0; షట్ 4-0-26-0; సదర్లాండ్ 2-0-21-0; గార్డ్‌నర్ 4-0-24-0; మెక్‌గ్రాత్ 2-0-31-0; వేర్‌హమ్ 3.4-0-20-1.

టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ వచ్చేసింది

జూన్ 9న భారత్-పాక్ పోరు

- న్యూయార్క్‌లో సమరం
- 20 జట్లు..4 గ్రూపులు
- గత టోర్నీకంటే నాలుగు టీమ్‌లు అదనం



న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్న పురుషుల టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ వచ్చేసింది. వెస్టిండీస్/అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ జూన్ ఒకటిన మొదలవనుంది. అదేనెల 29న బార్బడోస్‌లో జరిగే ఫైనల్‌తో ముగియనుంది. శుక్రవారం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. మొత్తం 20 జట్లు 4 గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. ఆస్ట్రేలియాలో జరిగిన గత ప్రపంచ కప్‌లో 16జట్లు తలపడ్డాయి. ఈసారి కెనడా, అమెరికా, ఉగాండ జట్లు తొలిసారి బరిలో దిగుతున్నాయి. గ్రూపు దశలో ప్రతి జట్టూ మరో జట్టుతో ఒకసారి ఆడతాయి. ప్రారంభ మ్యాచ్‌లో అమెరికా-కెనడా జట్లు డాలస్‌లో ఢీకొంటాయి. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జూన్ 8న ఆస్ట్రేలియాతో మ్యాచ్‌తో టోర్నీని ఆరంభిస్తుంది. ఇక టోర్నమెంట్ బ్లాక్‌బస్టర్ భారత్-పాకిస్థాన్ పోరు జూన్ 9న జరగనుంది. న్యూయార్క్ లోని ఐసెన్ హోవర్ పార్క్ స్టేడియం ఈ సమరానికి వేదిక కానుంది. మెన్ ఇన్ బ్లూ తన ప్రారంభ మ్యాచ్‌లో జూన్ 5న ఐర్లాండ్‌ను ఢీకొంటుంది. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-8కి క్వాలిఫై అవుతాయి. సూపర్-8లో నాలుగేసి జట్లు రెండు గ్రూపులుగా తలపడతాయి. రెండు గ్రూపుల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన జట్లు సెమీస్‌కు చేరతాయి.

టీమిండియా గ్రూప్ షెడ్యూల్

గ్రూప్ 'ఎ'లో బరిలో దిగుతున్న టీమిండియా.. మొదటి మూడు మ్యాచ్‌లను న్యూయార్క్‌లో, నాలుగో పోటీని ఫ్లోరిడాలో ఆడుతుంది.

- జూన్ 5: ఐర్లాండ్‌తో
- జూన్ 9: పాకిస్థాన్‌తో
- జూన్ 12: అమెరికాతో
- జూన్ 15: కెనడాతో

మొత్తం 55 మ్యాచ్‌లు..

టోర్నీలో మొత్తం 55 మ్యాచ్‌లు.. వెస్టిండీస్‌లోని ఆరు వేదికల్లో, అమెరికాలో మూడు స్టేడియాల్లో జరుగుతాయి. గ్రూప్ 'ఎ' టీమ్‌ల మ్యాచ్‌లన్నీ అమెరికాలో నిర్వహిస్తారు. గ్రూప్ 'బి', గ్రూప్ 'సి' జట్లన్నీ.. వెస్టిండీస్‌లో తమ మ్యాచ్‌లు ఆడతాయి. గ్రూప్ 'డి' టీమ్‌ల మ్యాచ్‌లు మాత్రం వెస్టిండీస్/అమెరికాల్లో జరుగుతాయి. జూన్ ఒకటి నుంచి 18 వరకు గ్రూపు దశ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

గ్రూప్ 'ఎ'	భారత్, పాకిస్థాన్, ఐర్లాండ్, కెనడా, యూఎస్ఏ
గ్రూప్ 'బి'	ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, నమీబియా, స్కాట్లాండ్, ఒమన్
గ్రూప్ 'సి'	న్యూజిలాండ్, వెస్టిండీస్, అఫ్ఘానిస్థాన్, ఉగాండ, పపువా న్యూ గినీ
గ్రూప్ 'డి'	సౌతాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్

సూపర్-8లో ఇలా.. (జూన్ 19-24)

మొదటి గ్రూపు	ఎ1, బి2, సి1, డి2
రెండో గ్రూపు	ఎ2, బి1, సి2, డి1
జూన్ 26	తొలి సెమీఫైనల్ (గయానా)
జూన్ 27	రెండో సెమీఫైనల్ (ట్రినిడాడ్)
జూన్ 29	ఫైనల్ (బార్బడోస్)

ఓటమిబాటలో పాక్

రెండో ఇన్నింగ్స్ 68/7



సిడ్నీ: పాకిస్థాన్‌తో మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా విజయం దిశగా సాగుతోంది. ప్రత్యర్థికి స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో హాజెల్‌వుడ్ (4/9) విజృంభణతో మ్యాచ్‌పై పూర్తిగా పట్టు బిగించింది. అతడి ధాటికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆట ఆఖరికి 68 పరుగులకే 7 వికెట్లు చేజార్చుకుంది. సాయిమ్ అయూబ్ (33), బాబర్ ఆజమ్ (23) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మొదటి ఇన్నింగ్స్‌లో లభించిన 14 రన్స్‌తో కలిపి పర్యాటక జట్టు మొత్తంగా..82 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అంతకు ముందు ఓవర్‌నైట్..116/2 స్కోరుతో మూడోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్..పేసర్ ఆమెర్ జమాల్ (6/69) ధాటికి 299 రన్స్‌కే ఆలౌటైంది. లబుషేన్ (60), మిచెల్ మార్ష్ (54) అర్ధ శతకాలు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 313 రన్స్ చేసిన సంగతి తెలిసిందే.

టెస్టుల్లో నెంబర్1 ఆసీస్

దుబాయ్: ఐసీసీ టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానానికి దూసుకెళ్లింది. పాకిస్థాన్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో ఉన్న ఆసీస్ 118 రేటింగ్ పాయింట్లతో భారత్ (117)ను వెనక్కినెట్టింది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకోవడంతో భారత్ రెండో స్థానానికి పడిపోయింది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో మాత్రం భారత్ టాప్‌లో కొనసాగుతోంది. ఆడిన 4 టెస్టుల్లో 2 విజయాలు, ఒక ఓటమి, ఒక డ్రా ఉన్నాయి. సౌతాఫ్రికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సురేఖ ఆవేదనలో అర్థం ఉంది!

- ఖేల్‌రత్న కోసం ఆమె వినతిని పరిగణించండి
- ఈ నెల 8లోగా నిర్ణయాన్ని వెల్లడించండి
- కేంద్ర క్రీడాశాఖ మంత్రికి హైకోర్టు ఆదేశం
- అనురాగ్ ఠాకూర్, ఎంపిక కమిటీకి నోటీసులు
- విచారణ ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా



అమరావతి (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు తనను ఎంపిక చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ దాఖలుచేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు ఖేల్‌రత్న అవార్డు ఎంపిక కమిటీకి నోటీసులు జారీచేసింది. ఖేల్‌రత్న కోసం సురేఖ ఇచ్చిన వినతిపత్రంపై ఈ నెల 8లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌ను ఆదేశించింది. కోర్టుముందు ఉంచిన రికార్డులను పరిశీలిస్తే జ్యోతి సురేఖ ఆవేదనలో న్యాయం ఉందనిపిస్తోందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. అయితే వ్యాజ్యంపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొంది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న అవార్డు ఎంపిక కమిటీ ఛైర్మన్, సభ్యులకు నోటీసులు జారీచేసింది. విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

2023 ఏడాదికిగానూ ఖేల్‌రత్న అవార్డుకు తన పేరును ఎంపిక చేసేలా ఎంపిక కమిటీని ఆదేశించాలని కోరుతూ ఆర్చర్ జ్యోతి సురేఖ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది ఉన్నం శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. ఖేల్‌రత్న అవార్డుకు పిటిషనర్ అన్నివిధాలా అర్హురాలని వివరించారు. ఆమె తీసుకున్న అవార్డులు, సాధించిన పాయింట్లను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, ఎంపిక విధానాన్ని పరిగణలోకి తీసుకొంటే పిటిషనర్‌కు 148.74 శాతం పాయింట్లు ఉన్నాయన్నారు. పిటిషనర్ కన్నా తక్కువ పాయింట్లు ఉన్న ఆటగాళ్లను ఖేల్‌రత్న అవార్డుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు.

ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ రేసులో కోహ్లీ, జడేజా

దుబాయ్: విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్-2023 అవార్డుకు నామినేట్ అయ్యారు. సర్ గ్యారీఫీల్డ్ సోబర్స్ పేరిట బహూకరించే ఈ ట్రోఫీ కోహ్లీకి లభిస్తే అత్యధిక సార్లు (3) గెలుచుకున్న ఆటగాడిగా నిలుస్తాడు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌తో పాటు ట్రావిస్ హెడ్ కూడా ఈ అవార్డు రేసులో ఉన్నారు.

మజుందార్ శతకం

బెంగాల్ 289/4
ఆంధ్రతో రంజీ

విశాఖపట్నం (స్పోర్ట్స్): తన అద్భుత ఫామ్‌ను కొనసాగించిన అనుస్తుప్ మజుందార్ (125) శతకంతో దుమ్మురేపాడు. ఓపెనర్ సౌరవ్ పాల్ (96) అర్ధ శతకంతో సత్తా చాటడంతో ఆంధ్రతో శుక్రవారం మొదలైన రంజీట్రోఫీ ఎలీట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో మొదటి రోజు ఆఖరికి బెంగాల్ 289/4 స్కోరు చేసింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగాల్ 62 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. అయితే మజుందార్, సౌరవ్ మూడో వికెట్‌కు 189 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దారు. మోహన్ 2, నితీశ్ రెడ్డి ఓ వికెట్ తీశారు.

జైలు నుంచి పిస్టోరియస్ విడుదల



ప్రిటోరియా: ఒలింపిక్, పారా ఒలింపిక్ రన్నర్ ఆస్కార్ పిస్టోరియస్ శుక్రవారం జైలు నుంచి పెరోల్‌పై విడుదలయ్యాడు. గర్ల్‌ఫ్రెండ్ రీవా స్టీన్‌క్యాంప్‌ను 2013లో దారుణంగా హత్య చేసిన పిస్టోరియస్‌ను 2015లో కోర్టు దోషిగా తేల్చి 13 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దాదాపు తొమ్మిది సంవత్సరాలు శిక్ష పూర్తి చేసుకున్న 37 ఏళ్ల ప్రిటోరియస్ పెరోల్‌పై బయటకు వచ్చాడు.

సెమీస్‌లో తెలుగు యోధాస్

కటక్: అల్టిమేట్ ఖో-ఖో లీగ్‌లో సెమీఫైనల్ బెర్త్ దక్కించుకున్న తొలి జట్టుగా తెలుగు యోధాస్ నిలిచింది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో యోధాస్ 38-30 పాయింట్ల తేడాతో చెన్నై క్విక్ గన్స్‌ను ఓడించింది. ఇప్పటిదాకా 8 మ్యాచ్‌లాడిన తెలుగు జట్టు 6 విజయాలు, 2 ఓటములతో 18 పాయింట్లు సాధించి టేబుల్ టాపర్‌గా సెమీస్ చేరింది.

వైసీపీలో కలకలం

జగన్‌కు 'కాపు' గుడ్‌బై!



నమ్మించి గొంతు కోశారు!

- మంత్రి పదవి ఇస్తానని ఇవ్వలేదు.. మా జీవితాలు సర్వనాశనం
- వైఎస్ కొడుకు వంచిస్తాడని అనుకోలేదు: రామచంద్రారెడ్డి
- రాయదుర్గం, కల్యాణదుర్గంలో పోటీచేసి తీరతామని స్పష్టీకరణ

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీలో మరో వికెట్ పడింది. సీఎం జగన్‌కి అత్యంత సన్నిహితుడైన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పార్టీకి గుడ్‌బై చెప్పారు. సర్వేల పేరు చెప్పి రాయదుర్గం టికెట్ నిరాకరించి.. తన గొంతు కోశారని వాపోయారు. వారం రోజులుగా ఆయన సీఎం అపాయింట్‌మెంట్ కోసం తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎట్టకేలకు శుక్రవారం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి లోపలకు పిలిచారు. 'సర్వేలు నీకు అనుకూలంగా లేవు.. టికెట్ ఇవ్వలేనని సీఎం చెప్పమన్నారు' అని అనడంతో తీవ్ర మనస్తాపం చెందారు. 'మీరు చెప్పినవన్నీ చేశా.. రాత్రింబవళ్లు పార్టీ కోసం కష్టపడ్డా.. గడప గడపకు తిరిగా.. ఆ దరిద్ర పు సర్వేల పేరుతో గొంతు కోస్తారా.. నమ్మినందుకు తగిన శాస్తి చేశారు..' అని సజ్జలతో అని ఆవేదనతో బయటకు వచ్చారు. అక్కడున్న మీడియా ప్రతినిధులు పలకరించగా.. 'ఇంత అవమానం నా జీవితంలో ఎన్నడూ జరగలేదు.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమారుడు ఇంతగా వంచిస్తాడని అనుకోలేదు' అన్నారు. జగన్ కోసం కాంగ్రెస్‌ను, ఐదేళ్ల పదవిని వదిలేసి వైసీపీలోకి వచ్చానన్నారు. 'మంత్రి పదవి ఇస్తానని మాటిచ్చాడు.. గడప గడపకు తిరగమన్నాడు.. చెప్పిన ప్రతిదీ చేశా.. చివరికి సర్వేల పేరుతో సీటు లేదని సజ్జలతో చెప్పించాడు.. జగన్‌కు గుడ్ బై' అని అన్నారు. ఏ పార్టీ టికె ట్ ఇచ్చినా రాయదుర్గంలో పో టీచేస్తానని.. ఒక వేళ ఇవ్వకుం టే తన భార్య లేదా కుమారు డు రాయదుర్గంలో, తాను కల్యాణదుర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని చెప్పారు. 'జగనే మాకు సర్వస్వమని నమ్మాం. దేవుడితో సమానంగా భావించాం. మా ఇంట్లో లైట్లు వేస్తే కనిపించే ఫొటోలన్నీ జగన్‌వే. నమ్మించి గొంతు కోస్తాడని ఊహించలే దు. మా జీవితాలు సర్వనాశనమయ్యాయి. 2014, 2019లో పోటీ చేయనని చెప్పా. కానీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటిదాకా నెరవేర్చలేదు. రాయదుర్గంలో రామచంద్రారెడ్డి అంటే వైఎస్, జగన్‌కు వీరాభిమాని అంటారు. అలాంటి మమ్మల్నే కలిసేందుకు ఆయన ఇష్టపడ డం లేదు. జగన్ నమ్మించి గొంతు కోసే రకం. వైసీపీ నుంచి మేం వెళ్లిపోతున్నాం. గుడ్ బై చెబుతున్నా. ఆయనకో దండం' అన్నారు.

తిరుగుబాట్లు

సీఎం జగన్‌పై తిరుగుబాట్లు పెరుగుతున్నాయి. ఇటీవల మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీకి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి షర్మిల వెంట నడిచేందుకు వెళ్లిపోయారు. ఇప్పుడు రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కూడా వెళ్లిపోయారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కూడా ప్రత్యామ్నాయాలు వెతుక్కుంటున్నారు. విశాఖ ఎమ్మెల్సీ వంశీకృష్ణ జనసేనలో చేరిపోయారు. హిందూపురంలో ఎంపీ గోరంట్ల మాధవ్ రగిలిపోతున్నారు. ఎందుకు టికెట్ ఇవ్వరని సలహాదారు సజ్జలపైనే కేకలు వేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, జనసేనాని పవన్ కల్యాణ్‌ను విమర్శించాలనిజగన్ షరతులు పెడుతున్నారు. ఇవి నచ్చని కందుకూరు ఎమ్మెల్యే ఎం. మహీధర్‌రెడ్డిలాంటి వాళ్లు టికెట్ ఇస్తే ఇచ్చారు.. లేదంటే లేదని.. ఎవరినీ తిట్టబోమని తేల్చిచెప్పారు.



కనిగిరి సభలో చంద్రబాబు ప్రసంగానికి స్పందనగా చేతులెత్తి నినదిస్తున్న మహిళలు, మద్దతుగా నినదిస్తున్న యువత

రా.. కదలిరా!

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కనిగిరి నుంచి చంద్రబాబు ప్రారంభించారు. పట్టణ సమీపంలో వెలిగొండ సాధన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఒంగోలు పార్లమెంటు స్థాయి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉందన్నది ప్రజలంతా గుర్తించాలి. సైకో పాలన పోవాలి, సైకిల్ పాలన రావాలనే నినాదంతో రానున్న వంద రోజులు రోడ్డెక్కి ప్రచారం నిర్వహించాలి. అందుకు నాడు 'టీడీపీ పిలుస్తోంది రా.. కదలిరా..' అన్న ఎన్టీఆర్ నినాదానికి ప్రభంజనంలా కదలి వచ్చినట్లుగానే నేడు టీడీపీ, జనసేన ఇస్తున్న 'రా.. కదలిరా' పిలుపునకు అంతకు మించి రావాలి' అని విజ్ఞప్తి చేశారు. 2024వ సంవత్సరం తెలుగు జాతికి స్వర్ణయుగం కావాలన్నారు. ఇందుకోసం బ్రిటిష్ వాడికి ఎదురొడ్డిన ప్రకాశం పంతులు స్ఫూర్తితో ఒంగోలు గిత్తల్లా ప్రజానీకం ముందుకు రావాలని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

ఐదేళ్ల నుంచి ఒక్కరూ సంతోషంగా లేరు

వైసీపీ పాలనలో ఐదేళ్లుగా రాష్ట్రంలో ఏ ఒక్క వ్యక్తి కూడా సంతోషంగా లేరు. ఎవరికీ న్యాయం జరుగలేదు. సంక్షేమం పేరుతో జగన్ రూ.10 ప్రజలకు ఇచ్చి వారి నుంచి రూ.100 దోచుకుంటున్నాడు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. రూ.13 లక్షల కోట్ల అప్పులు చేసిన ఈ సీఎం ఒక్కరికైనా ఉపాధి కల్పించలేదు. జాబ్ కేలెండర్ అని చెప్పి అధికారంలోకి వచ్చి ఎవరికి ఉద్యోగాలు ఇచ్చాడు? టీడీపీ పాలనలో దేశంలో అధికంగా ఉద్యోగాలిచ్చే జాబితాలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంటే.. నేడు నిరుద్యోగుల జాబితాలో ముందుంది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలో వారి సేవా గుణానికి ప్రాధాన్యం ఇవ్వడం రాజకీయ పార్టీల కర్తవ్యం. అందుకు భిన్నంగా జగన్ నీచ సంస్కృతి తెచ్చాడు. నన్ను, పవన్ కల్యాణ్‌ను, లోకేశ్‌ను తిట్టే వారికే సీట్లు ఇస్తానని చెబుతున్నాడు. ఇలాంటి వారికి అసలు రాజకీయాల్లో ఉండే అర్హతే లేదు. జగన్‌ను శాశ్వతంగా రాజకీయాల్లో లేకుండా చేయాలి. సీటు కావాలంటే మమ్మల్ని తిట్టాలన్న షరతులను వ్యతిరేకిస్తున్న వైసీపీలోని ఎంపీ, ఎమ్మెల్యేలను అభినందిస్తున్నా. అలాగే జగన్ తాజాగా తెచ్చిన భూ చట్టం వల్ల ప్రజల చేతుల్లో భూమి ఉండే అవకాశం లేదు. ప్రకాశం జిల్లాలో జరిగిన భూదందాలపై సిట్ వేసి తేలుస్తాం.

సంకల్పం ఉంటే..

రాష్ట్రాన్ని జగన్ అప్పులకుప్పగా మార్చాడు.. మీరొచ్చాక ఎలా నడుపుతున్నారని కొందరు నన్ను అడుగుతున్నారు. సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే. సంపదను పెంచి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడతాం. సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేస్తాం. అదే సమయంలో ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనులనూ పూర్తి చేస్తాం. మార్కాపురం కేంద్రంగా పశ్చిమ ప్రకాశంను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తాం. క్లైమోర్‌మైన్స్ ఘటనలో కూడా బాధపడని నేను.. అసెంబ్లీలో నా భార్యను నిందించిన రోజు ఎంతో బాధపడ్డాను. ఈ కౌరవ సభకు ఇక రానని గౌరవ సభ ఏర్పడ్డాక వస్తానని ప్రకటించాను. త్వరలో జరిగే ఎన్నికల్లో గౌరవ సభ ఏర్పడేలా ప్రజలు సహకరించాలని అన్నారు. కాగా, ప్రతి లోక్‌సభ స్థానంలో 'రా.. కదలిరా' పేరిట 25 బహిరంగ సభలు నిర్వహించాలన్న లక్ష్యంలో భాగంగా చంద్రబాబు తొలుత కనిగిరిని ఎంచుకున్నారు. శుక్రవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. కనిగిరి నియోజకవర్గంతోపాటు ఒంగోలు పార్లమెంటు పరిధిలోని ఇతర నియోజకవర్గాల నుంచి కూడా నేతల అంచనాలకు మించి టీడీపీ శ్రేణులు, జనసేన కార్యకర్తలు తరలివచ్చారు. ఇటీవల విశాఖ వద్ద యువగళం పాదయాత్ర ముగింపు సభకు హాజరైన జనంతో సమానంగా కనిగిరి సభకు వచ్చారని బాబు నేతలను అభినందించారు. ఇదే ఉత్సాహంతో ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపునకు పనిచేయాలని కోరారు. రాత్రికి ఆయన కనిగిరిలోనే బస చేశారు. శనివారం ఉదయం ఉమ్మడి జిల్లా నేతలతో భేటీ అవుతారు. అనంతరం హైదరాబాద్ బయల్దేరతారు. సభలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నాడు పెట్టుబడులు, పరిశ్రమలు.. నేడు గంజాయి, డ్రగ్స్

(మొదటి పేజీ తరువాయి)

దళిత బాలికపై 13 మంది అత్యాచారం చేశారంటే శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. జగన్ పాలనలో మద్యం, మైన్స్ అన్నింటిలోనూ కుంభకోణాలే. వాటాలు తాడేపల్లి కొంపకు చేరుతున్నాయి. ఈ సీఎం పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరగ్గా ప్రాజెక్టులు రివర్స్ అయ్యాయి. నాసిరకం మద్యంతో ప్రజలను అనారోగ్య పాల్జేసి వారి రక్తాన్ని జలగల్లా తాగుతున్నాడు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తగ్గింపు ధరలకు నాణ్యమైన మద్యం సరఫరా అయ్యేలా చూస్తాం. రాష్ట్రంలో సైకో పాలనపోవాలన్నా.. రాష్ట్రానికి, తెలుగు జాతికి మంచి రోజులు రావాలన్నా.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలన్నా.. 100 రోజులు ప్రతి ఒక్క టీడీపీ, జనసేన కార్యకర్తా రోడ్డెక్కి పనిచేయాలి. లేదంటే యువత తిరిగి గంజాయి మత్తుకు బానిసలు కావలసిందే' అని చంద్రబాబు పేర్కొన్నారు.

నిందేసి వెళ్లే ఎత్తుగడ!

- చంద్రబాబు లక్ష్యంగా కేశినేని నాని వ్యాఖ్యలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)



విజయవాడ ఎంపీ కేశినేని నాని తొలినుంచి పార్టీ అధినేత చంద్రబాబును, లోకేశ్‌ను లెక్కచేయని ధోరణితో వ్యవహరించేవారు. తాజాగా ఆయన పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని ఆయన చేస్తున్న వ్యాఖ్యలే స్పష్టం చేస్తున్నాయి. విజయవాడ ఎంపీగా తాను హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని, ఢిల్లీ వెళ్లాలంటే ఒకే ఫ్లైట్ కాదని, ఏదో ఒక ఫ్లైట్ ఎక్కి వెళ్లవచ్చన్న వ్యాఖ్యలతో నాని పార్టీని వీడతారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. టీడీపీ చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. కృష్ణా జిల్లా తిరువూరులో 7వ తేదీ రెండో బహిరంగ సభ జరగనుంది. ఈ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు ఎన్టీఆర్ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం 3వ తేదీన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వెళ్లిన ఎంపీ కేశినేని నాని, ఆయన సోదరుడు, టీడీపీ నాయకుడు కేశినేని చిన్ని వర్గాల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. ఈ ఘటనపై టీడీపీ అధిష్ఠానం దృష్టి సారించింది. వివాదాన్ని సద్దుమణిగేలా చేసేందుకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల టీడీపీ అధ్యక్షులు నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లను చంద్రబాబు గురువారం నాని వద్దకు పంపారు. నానితో వారు చర్చించారు. తిరువూరు సభ సన్నాహక కమిటీలో కేశినేని చిన్ని కూడా ఉంటారని, ఎంపీ నాని సభ నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని చంద్రబాబు సూచించినట్లు ఈ ముగ్గురు తెలిపారు. వీరు నానిని తిరువూరు సభకు ఆహ్వానించినప్పుడు.. తాను సభకు రానని, తాను అక్కడికి వస్తే గొడవలు జరుగుతాయని ఆయన వారికి తెలిపారు. ఇదే విషయాన్ని వారు టీడీపీ అధిష్ఠానానికి తెలియజేశారు. అయితే ఈ కమిటీతో జరిగిన చర్చల సారాంశాన్ని వక్రీకరిస్తూ శుక్రవారం ఉదయం నాని 'ఫేస్‌బుక్‌'లో పెట్టిన పోస్టు టీడీపీ వర్గాల్లో కలకలం రేపింది. తనకు టికెట్ ఇవ్వడం లేదని, సభకు హాజరుకావద్దని చంద్రబాబు....కమిటీ సభ్యుల ద్వారా తెలియజేశారంటూ నాని తన పోస్టులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యులు తప్పుపడుతున్నారు. నానికి కాకుండా వేరొకరికి విజయవాడ ఎంపీ టికెట్ ఇస్తారన్న ప్రస్తావన కానీ, తిరువూరు సభకు నానిని రావద్దని చెప్పడం కానీ ఈ చర్చల్లో ఎక్కడా జరగలేదని కొనకళ్ల నారాయణ తెలిపారు. మరోవైపు శుక్రవారం ఉదయం 'ఫేస్‌బుక్' పోస్టులో చంద్రబాబు ఆదేశాలు పాటిస్తానని చెప్పిన నాని, గంటల వ్యవధిలోనే మాట మార్చి విజయవాడ ఎంపీగా హ్యాట్రిక్ సాధిస్తానని పేర్కొనడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు ఆయన పార్టీని వీడుతున్నారన్న సంకేతాలను పంపుతున్నాయి.

పొంతన లేని వాదన...

ఎంపీ కేశినేని నాని ధోరణి చంద్రబాబుపై నింద వేసి పార్టీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరహాలో ఉందని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. చంద్రబాబుకు తాను వెన్నుపోటు పొడవలేదని, పొడిస్తే ఇంకా మంచి పదవిలో ఉండేవాడినని నాని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఆయన ఇలా చేస్తున్నారని అంటున్నాయి.

లావు, గుమ్మనూరు అవుట్!

- మంత్రికి అసెంబ్లీ టికెట్ లేనట్లే!!
- ఎంపీగా పోటీ చేయాలని జగన్ సూచన
- ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు పేట లేదు
- గుంటూరు ఎంపీగా పోటీ చేయాలని హుకుం



కర్నూలు, గుంటూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు రాబోయే ఎన్నికల్లో వైసీపీ టికెట్ లేదని సీఎం జగన్ తేల్చేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి పిలుపు రావడంతో మంత్రి వైసీపీ నాయకురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మతో కలసి శుక్రవారం విజయవాడ చేరుకున్నారు. సాయంత్రం 4:45 గంటల సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌ను కలిశారు. సీఎం, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో అధికారి ధనుంజయరెడ్డితో పావు గంట చర్చించారు. ఆలూరు టికెట్ మళ్లీ తనకే ఇవ్వాలని మంత్రి కోరగా.. కర్నూలు ఎంపీగా పోటీ చేయాలని జగన్ సూచించినట్లు తెలిసింది. తనకు ఇవ్వకపోతే కప్పట్రాళ్ల బొజ్జమ్మకైనా ఇవ్వాలని.. గెలిపించుకువస్తానని జయరాం ప్రతిపాదించారు. రెండు మూడ్రోజుల్లో అభ్యర్థుల లిస్టు వస్తుంది.. చూసుకోవాలని జగన్ ఒక్కముక్కలో తేల్చేసినట్లు సమాచారం. దీంతో చేసేది లేక తాడేపల్లి ప్యాలెస్ నుంచి జయరాం నిరుత్సాహంగా బయటకు వచ్చేశారు. జగన్ నిర్ణయంపై మంత్రి వర్గీయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో జయరాం ఎంపీగా పోటీ చేస్తారా.. లేక మరో మార్గం ఎంచుకుంటారా అనే అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎంపీని మారమనడంపై విస్మయం

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు కూడా మార్పు తప్పలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గుంటూరు ఎంపీగా పోటీ చేయమని హుకుం జారీచేశారు. శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయానికి ఆయనను పిలిపించి ఇదే విషయం చెప్పగా, ఆయన ఎంపీ సుముఖత కనబరచలేదు. తాను నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి అయితేనే ఎన్నికల్లో పోటీ చేస్తానని, కాదంటే బరి నుంచి తప్పుకొంటానని స్పష్టం చేసినట్లు సమాచారం. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి ఎంపీని వైసీపీ అధిష్ఠానం పిలిచిందన్న విషయం ముందుగానే తెలుసుకొన్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు కాసు మహేశ్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మర్రి రాజశేఖర్ సీఎంవోకి వెళ్లి తమకు శ్రీకృష్ణదేవరాయలునే ఎంపీ అభ్యర్థిగా కేటాయించాలని చెప్పి వెనుదిరిగినట్లు సమాచారం. అయినప్పటికీ సీఎం జగన్ వారి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదు.

నరసరావుపేటలోనే పోటీ చేస్తా: గోపిరెడ్డి

నరసరావుపేట అసెంబ్లీ టికెట్ తనకే ఖరారైందని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. లింగంకొండ అగ్రహారం భూముల విషయమై చర్చించేందు కు సీఎంవోకు వచ్చానని, ఆ సమస్య పరిష్కరించుకున్నామని చెప్పారు. కాగా. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చారు. పార్లమెంట్ ఇన్‌చార్జి మార్పుపై పార్టీ ముఖ్య నేతలతో చర్చించినట్లు తెలిసింది.

మేం దళితులం.. అడుక్కుంటామే తప్ప ఫైట్ చేయం: ఎంఎస్ బాబు

'మేం దళితు లం.. న్యాయం కోసం అడుక్కుంటామే తప్ప ఫైట్ చేసే అలవాటు మాకు లేదు' అని చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. టికెట్ నిరాకరించారనే ఆగ్రహంతో ఇటీవల జగన్‌పై ఘాటు వ్యాఖ్య లు చేసిన ఆయన శుక్రవారం విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో.. 'నా మా టలను వక్రీకరించారు. ఎక్కడో ఉన్న నన్ను తీసుకొచ్చి ఎమ్మెల్యేను చేశారు. ఊపిరి ఉన్నంతవరకు వైసీపీలోనే ఉంటా' అని బాబు అన్నారు.



అన్నతో 'ఢీ'!

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ కూడా పాల్గొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... జగన్ పాలనపై షర్మిల తన అభిప్రాయాలను సూటిగా చెప్పారు. "జగన్ పాలన చాలా అస్తవ్యస్తంగా ఉంది. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జగన్ ఏ ప్రజా ప్రతినిధినీ కలుసుకోరు. తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమవుతున్నారు" అని చెప్పారు. ఇక.. తన రాజకీయ ఆకాంక్షలపై జగన్ నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన జైలు పాలైనప్పుడు రాష్ట్రమంతటా తిరిగి వైసీపీని నిలబెట్టానని షర్మిల వివరించారు. తమ మధ్య సంబంధాలు సరిగా లేవని చెప్పారు. తన తండ్రి వైఎస్ కలను నెరవేర్చేందుకే తాను కాంగ్రెస్‌లో చేరానని, కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జగన్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, బాబాయి వివేకానంద రెడ్డి హత్య, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోవడం, ఒంటెత్తు పోకడలు అవలంబించడం తదితర అంశాలను ఆమె సమగ్రంగా వివరించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వైసీపీలో ఉన్న పలువురు సీనియర్లు, నేతలు తనతో టచ్‌లో ఉన్నారని కూడా ఆమె చెప్పినట్లు సమాచారం.

పీసీసీ... రాజ్యసభపై సంకేతాలు..

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు శాయశక్తులా పోరాడాలని షర్మిలను అధిష్ఠానం పెద్దలు కోరారు. ఆమెకు పీసీసీ పగ్గాలు అప్పగించాలని రాహుల్‌గాంధీ భావిస్తున్నారని, ఆయన అంచనాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఏప్రిల్‌లో కర్ణాటక నుంచి షర్మిలకు రాజ్యసభ సీటు ఇచ్చేందుకు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. "కాంగ్రెస్ పార్టీకి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు మరువలేం. కానీ... జగన్ మూలంగా ఏపీలో పార్టీ తీవ్రంగా దెబ్బతింది. ఆ నష్టాన్ని పూరించే బాధ్యతను మీకు అప్పగిస్తున్నాం" అని షర్మిలకు ఖర్గే, వేణుగోపాల్ చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ పునరుత్థానానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించాలని, ఇతర పార్టీల నుంచి, ముఖ్యంగా వైసీపీ నుంచి సీనియర్ నేతలను చేర్చుకోవడం, జగన్ పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ శ్వేతపత్రాన్ని రూపొందించడం వంటి అంశాలపై షర్మిలతో చర్చించినట్లు తెలుస్తోంది. జగన్ ఓటు బ్యాంకుగా భావిస్తున్న దళిత క్రైస్తవులను ఆకర్షించేందుకు తాను బ్లూప్రింట్‌ను రూపొందిస్తానని షర్మిల భర్త అనిల్ కూడా చెప్పినట్లు సమాచారం. త్వరలో ఆయన పర్యటించనున్నట్లు తెలిసింది. కాగా... తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా షర్మిల పార్టీ పెద్దల్ని ఆహ్వానించారు. ఢిల్లీలో, హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఏ బాధ్యతలు అప్పగించినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, దీనిపై చర్చలు జరుగుతున్నాయని, ఒకటి రెండు రోజుల్లో స్పష్టత లభిస్తుందని షర్మిల చెప్పారు.

ఖర్గేతో రుద్రరాజు చర్చలు

శుక్రవారం సాయంత్రం పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మశ్రీ సుంకర తదితరులు మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో జగన్ పాలన ఘోరంగా ఉన్నదని వారు ఖర్గేకు వివరించారు. త్వరలో రాష్ట్రంలో పర్యటించాలని ఖర్గేను కోరామని, ఆయన అందుకు సుముఖత వ్యక్తం చేశారని రుద్రరాజు తెలిపారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడంవల్ల పార్టీలో కొత్త ఉత్సాహం నెలకొందని తెలిపారు.

ఢిల్లీ వెళ్లాలంటే ఏదో ఫ్లైట్ చూసుకోవాలి

- నన్ను బాబు వద్దనుకున్నారు.. నేను కాదు: కేశినేని

విజయవాడ జనవరి 5 (ఆంధ్రజ్యోతి): "మూడోసారి విజయవాడ ఎంపీగా హ్యాట్రిక్ సాధిస్తా. ఢిల్లీ వెళ్లడం ఖాయం. ఢిల్లీ వెళ్లాలంటే ఒక ఫ్లైట్ కాకుంటే ఇంకొకటి చూసుకోవాలి. ఏ ఫ్లైట్ ఖాళీ లేకపోతే ప్రైవేట్ జెట్‌లో అయినా వెళ్లాలి." అంటూ విజయవాడ ఎంపీ కేశినేని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తాను చంద్రబాబుకు వెన్నుపోటు పొడవలేదని, పొడిస్తే ఇంకా మంచి పదవిలో ఉండేవాడినన్నారు. "నన్ను వద్దని చంద్రబాబు అనుకున్నారు. నేను అనుకోలేదు. విజయవాడ ప్రజలపై నాకు నమ్మకం ఉంది. నేను ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా గెలుస్తానని గతంలోనే చెప్పా. నేనేం చేయాలో కాలమే నిర్ణయిస్తుంది. పదేళ్లుగా విజయవాడను ఎంతో అభివృద్ధి చేశా. అటువంటి నేను ఖాళీగా అంటే అభిమానులు, కార్యకర్తలు ఊరుకుంటారా?" అని నాని అన్నారు. "ఫేస్‌బుక్ పోస్టులో అన్ని వివరాలు సవివరంగా పెట్టా. అంతకుమించి కొత్తగా చెప్పేదేమీ లేదు. రాముడికి ఆంజనేయ భక్తి తరహాలోనే అధినేత ఆదేశాలు శిరసా వహిస్తానని స్పష్టంగా ఫేస్‌బుక్‌లో పెట్టా. మీడియాకు కావాల్సింది మసాలేగా. త్వరలోనే ఆ మసాలా ఉంటుంది. తినబోతూ రుచులెందుకు.. అన్ని విషయాలు ఒకే రోజెందుకు?" అని అన్నారు. "ఈ రోజు విషయం రేపటికి కరెక్ట్ కాకపోవచ్చు, రేపటి విషయం ఎల్లుండికి కరెక్ట్ కాకపోవచ్చు. ఇది ఎవరికి ఎలా అర్థమైతే అలా రాసుకోండి." అని వ్యాఖ్యానించారు. మీడియాను పట్టించుకోవటం ఎప్పుడో మానేశానన్నారు. "2024, మే వరకు నేనే విజయవాడ ఎంపీని. నా రాజకీయ భవిష్యత్తు ఏంటో విజయవాడ ప్రజలే నిర్ణయిస్తారు. గొడవలు పడటం నా నైజం కాదు, అంతమాత్రాన అది చేతకానితనం కాదు" అని కేశినేని నాని పేర్కొన్నారు. "జనవరి 4న ఆలపాటి రాజా, కొనకళ్ల నారాయణ, నెట్టెం రఘురాం నన్ను కలిశారు. తిరువూరులో జరిగే సభకు వేరే వారిని ఇన్‌చార్జిగా నియమించారు. కాబట్టి నన్ను కలగజేసుకోవద్దని చంద్రబాబు చెప్పారని తెలిపారు" అని ఫేస్‌బుక్ పోస్టులో విజయవాడ ఎంపీ కేశినేని నాని పేర్కొన్నారు.

నా నిర్ణయానికి కట్టుబడి ఉన్నా

- జగన్‌కు స్పష్టం చేశా: అన్నా రాంబాబు



అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఎన్నికల్లో పోటీ చేయ ను' అన్న నిర్ణయాన్ని పునరాలోచించుకో అని సీఎం జగన్ అడిగినట్లు గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు చెప్పారు. ఇటీవల గిద్దలూరు ఇన్‌చార్జిని మార్చిన తరువాత పైవ్యాఖ్యలు చేసిన అన్నాతో సీఎం మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేయబోనన్న నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరారు. గిద్దలూరు నుంచే పోటీ చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే రాంబాబు మీడియాతో మాట్లాడారు. 'పోటీ చేయబోననే నా నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు సీఎంకు స్పష్టం చేశా. వీటన్నింటిపై స్పందించాల్సిన సమయంలో స్పందిస్తా. అంతా మంచే జరుగుతుంది' అని అన్నారు.

సీటు ఇవ్వకుంటే ఆలోచిస్తా: వేణుగోపాల్



సీఎంతో భేటీ అయిన దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో సీటు గురించి చెబుతానని జగన్ అన్నారు, ఇప్పటి వరకూ జనసేన తప్ప ఎవ్వరూ నాతో మాట్లాడలేదు, నేనూ మాట్లాడలేదు.. సీఎం జగన్, సీటు ఇవ్వకుంటే అప్పుడు ఆలోచిస్తా' అని చెప్పారు. ముఖ్యమంత్రికి నేను కొన్ని విషయాలు చెప్పా.. ఆయన కొన్ని చెప్పి వేరే నియోజకవర్గానికి వెళ్లాలని సూచించారు.. రెండు రోజుల తర్వాత మళ్లీ కలిసి నిర్ణయం చెబుతా' అన్నారు.

దోచుకున్న ఆస్తుల రక్షణకే చట్టం

భూ యాజమాన్య హక్కు చట్టంపై ప్రజలను చైతన్యం చేస్తాం: పవన్



అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జగన్ తన పాలనలో విశాఖతో పాటు రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో దోచుకున్న ప్రజా ఆస్తులను చట్టబద్ధంగా హస్తగతం చేసుకునేందుకు ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం తీసుకొచ్చినట్లు కనిపిస్తోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న న్యాయవాదులతో శుక్రవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పవన్ మాట్లాడుతూ.. ఈ చట్టం క్రూరమైనదని మండిపడ్డారు. రాజ్యాంగానికి లోబడి పనిచేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కనీస ధర్మాన్ని పక్కనపెట్టి పరిపాలన సాగిస్తోందని ఆరోపించారు. సామాన్యుల ఆస్తులకు రక్షణ ఇవ్వని భూ యాజమాన్య హక్కు చట్టంలోని లోగుట్టును అందరికి అర్థమయ్యేలా చెప్పి చైతన్యం చేస్తామని న్యాయవాదులకు భరోసా ఇచ్చారు. ప్రజల ఆస్తి హక్కుకు శాశ్వత యాజమాన్య హక్కు కల్పించే పేరుతో వైసీపీ ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చిన విధానం పరిశీలిస్తే రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను ధిక్కరించినట్టే కనిపిస్తోందన్నారు. అడ్డగోలుగా చట్టాన్ని చేసినట్లు అర్థమవుతోందన్నారు. తల్లిదండ్రులు వారసత్వంగా ఇచ్చిన ఆస్తికి సంబంధించిన పట్టాదార్ పుస్తకాల్లో జగన్ ఫొటో ఎందుకని ప్రశ్నించారు. కష్టపడి సంపాదించుకున్న భూముల్లో పాతే సర్వే రాళ్లపైనా జగన్ బొమ్మ ఏమిటని నిలదీశారు. ప్రజల ఆస్తులన్నీ పాలకుడి గుప్పిట్లో ఉన్నట్లు, అతను ఇచ్చేవాడు, మిగిలివాళ్లంతా చేయి చాచేవాళ్లు అనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నట్లు ఉందన్నారు.

ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలి

"భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. ఆమోదం పొందకముందే అందులోని అంశాలను అమలు చేయడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఎవరి ఆస్తులను అయినా తమ కబంధహస్తాల్లో పెట్టుకునేలా చట్టం చేశారు. నీతి ఆయోగ్ ఒక సదాశయంతో భూ హక్కులకు సంబంధించిన యాజమాన్య నిర్ధారణ చేయాల్సిన ముసాయిదాను అన్ని రాష్ట్రాలకు పంపించింది. 2019 డిసెంబరులో ఏపీ ప్రభుత్వం దీన్ని చట్టం రూపంలో కేంద్రానికి పంపింది. అప్పటి నుంచి ఈ చట్టానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర పడటానికి ఎన్నో సవరణలు, ఇంకెన్నో ప్రయాసలు పడ్డారు. చివరకు ప్రజల సొంత ఆస్తులకు రక్షణ లేనివిధంగా చట్టం తయారైందని తెలుస్తోంది. కోర్టు పరిధిని దాటి రెవెన్యూ అధికారులకు, రెవెన్యూ వ్యవస్థకు హక్కులు ఇస్తే ఆస్తులకు రక్షణ ఎక్కడ ఉంటుంది? న్యాయ వ్యవస్థను కాదని, కొత్తగా ట్రిబ్యునల్ పేరుతో రెవెన్యూ వ్యవస్థకు అధికారం ఇస్తే నాయకులు దోచుకోవడం సులభమవుతుంది. ఈ ఆలోచనతోనే వైసీపీ ప్రభుత్వం ఈ అనుబంధ చట్టాన్ని చేసినట్లు కనిపిస్తోంది. రుషికొండను దోచుకుంటున్నట్టుగా భవిష్యత్తులో మరిన్ని చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీనితో ఎంత తీవ్రనష్టం జరగబోతుందో ప్రజలకు తెలియాలి. ఇది కేవలం న్యాయవాదుల సమస్య కాదు. ప్రజలందరి సమస్య. చదువుకోలేని వారికి కూడా ఈ చట్టంలో విషయాలను వివరిస్తాం. ఇది నూటికి నూరుపాళ్లు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే చట్టం. ప్రజల ఆస్తుల రక్షణ కోసం పోరాడుతున్న న్యాయవాదులకు జనసేన నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుంది. ప్రజలకు ఎంత చెడు జరుగుతుందో చెప్పడానికి త్వరలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. అవసరమైతే న్యాయవాదుల కోరిక మేరకు గుంటూరు కోర్టుకు నేను కూడా వస్తాను. ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేద్దాం" అని పవన్ అన్నారు.



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్

'ఆర్-5 జోన్'లో ఏం జరుగుతోందో తెలుసు

» సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు

» జగన్ ప్రభుత్వ పిటిషన్‌పై తక్షణ జోక్యానికి నో

న్యూఢిల్లీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అమరావతిలోని 'ఆర్-5 జోన్' వ్యవహారంపై తక్షణం జోక్యం చేసుకుని విచారణ జరపాలన్న ప్రభుత్వ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. "ఆర్-5 జోన్‌లో ఏం జరుగుతోందో మాకు తెలుసు. తక్షణం జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు" అని ధర్మాసనంలోని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ధర్మాసనం ఏప్రిల్‌కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. పేదలకు సెంటు భూమి ఇచ్చి ఇళ్లు నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రాజధానిపై దాఖలుచేసిన ప్రధాన పిటిషన్ ఇదే ధర్మాసనం ముందు ఉందని అమరావతి రైతుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

'స్కిల్' కేసులో డాక్యుమెంట్లు ఇవ్వండి

» ఏసీబీ కోర్టులో ఏ2 తరఫు లాయర్ల వినతి

విజయవాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): 'స్కిల్ డెవలప్‌మెంట్' కేసులో సీఐడీ అధికారులు కోర్టుకు సమర్పించిన డాక్యుమెంట్లను తమకు ఇవ్వాలని కోరుతూ ఈ కేసులో రెండో నిందితుడి(ఏ2)గా ఉన్న ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ తరఫు న్యాయవాదులు విజయవాడ ఏసీబీ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై పిటిషన్ దాఖలు చేయాలని న్యాయాధికారి హిమబిందు ఆదేశించారు. ఈ నెల 18న ఆదేశాలు ఇస్తానని తెలిపారు. మరోవైపు, ఇదే కేసులో నిందితుడిగా ఉండి, అప్రూవర్‌గా మారిన శిరీష్ చంద్రకాంత్ షా వాంగ్మూలాన్ని ఏసీబీ కోర్టు శుక్రవారం నమోదు చేయాల్సి ఉంది. అయితే, ఆయన తరఫు న్యాయవాదులు విచారణను ఈ నెల 17కి వాయిదా వేయాలని అభ్యర్థించారు. దీనికి న్యాయాధికారి హిమబిందు ఆలోచించుకుని చెబుతానని పాస్ ఓవర్ తీసుకున్నారు. అనంతరం, సీఐడీ అధికారులు షాను కోర్టుకు తీసుకువచ్చారు. అయితే, ఆయన వాంగ్మూలాన్ని ఎప్పుడు రికార్డు చేస్తామన్న విషయాన్ని ఈ నెల 18న చెబుతానని న్యాయాధికారి వెల్లడించారు.

తంతా.. నా కొడకా!

» వైసీపీ ఎస్టీ నాయకుడిపై ఎమ్మెల్యే ఉదయభాను బూతుపురాణం

విజయవాడ, జనవరి5 (ఆంధ్రజ్యోతి): 'నా దగ్గరకు రాకపోతే తంతా. లం.. కొ.. ఏం పీకుతావురా నా..'.. అంటూ జగ్గయ్యపేట వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సొంతపార్టీకి చెందిన ఎస్టీ నాయకుడిని అసభ్య పదజాలంతో దూషించారు. ఆర్థికంగా దెబ్బతీస్తానంటూ హెచ్చరించారు. ప్రస్తుతం ఈ ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. జగ్గయ్యపేట నియోజకవర్గం బూదాడకు చెందిన వైసీపీ నాయకుడు బానావతు బుచ్చిబాబు తొలి నుంచి ఉదయభానుకు అనుచరుడిగా ఉండేవారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవ చేసినా ఎలాంటి గుర్తింపు ఉండడం లేదన్న ఆవేదనతో కొంతకాలంగా ఆయన దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో బుచ్చిబాబుకు ఉదయభాను గురువారం ఫోన్ చేసి తన వద్దకు రావాలని కోరారు. బుచ్చిబాబు నిరాకరించారు. బూదాడ వస్తే మాట్లాడతానని చెప్పారు. సహనం కోల్పోయిన ఉదయభాను అసభ్యంగా దూషించారు.

భారతీ సిమెంట్స్‌కు సుప్రీం షాక్

(మొదటి పేజీ తరువాయి)

ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. దీనిపై విచారణ ముగిసిందని.. అభ్యంతరాలుంటే హైకోర్టులోనే తేల్చుకోవాలని పేర్కొంది. బ్యాంకు గ్యారెంటీలను తీసుకున్న తర్వాత కూడా ఎఫ్‌డీలను ఈడీ జప్తు చేసుకుందని భారతీ సిమెంట్స్ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. ఎఫ్‌డీలను జప్తు చేసినా కనీసం వాటిపై వచ్చిన వడ్డీనైనా విడుదల చేయాలంటూ ఆ సంస్థ దాఖలు చేసిన మరో పిటిషన్‌పైనా హైకోర్టుకే వెళ్లాలని సుప్రీంకోర్టు సూచించింది. బ్యాంకు గ్యారెంటీలను వెనక్కి తీసుకోవడంపై నిర్ణయాన్ని భారతీ సిమెంట్స్‌కు వదిలిపెట్టింది.

వివేకా హత్యలో శివశంకర్‌రెడ్డిదే కీలక పాత్ర





» ఆధారాలు చెరిపేశారని తప్పించుకోలేరు
» హత్యకు ముందు రెక్కీ నిర్వహించారు
» కుట్ర అమలు చేసేందుకు డబ్బులిచ్చారు
» అందరి కదలికలపై శివశంకర్ నిఘా ఉంది
» మా ప్రాణాలకు సైతం ముప్పుంది
» వివేకా కుమార్తె సునీత వాదనలు
» సాక్షులను బెదిరించారు: సీబీఐ అధికారులు
» ఆధారాల చెరిపివేతకే జైలా: శివశంకర్
» బెయిల్ పిటిషన్‌పై టీహైకోర్టు తీర్పు రిజర్వు

హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యా కేసులో ఏ-5గా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిది కీలకపాత్ర అని వివేకా కుమార్తె సునీతారెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. శివశంకర్‌రెడ్డి దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌లో ఇంప్లీడ్ అయిన సునీతారెడ్డి తరపున న్యాయవాది టి. స్వేచ్ఛ వాదనలు వినిపిస్తూ.. శివశంకర్‌రెడ్డికి బెయిల్ ఇవ్వరాదని అభ్యర్థించారు. హత్యా స్థలంలో ఆధారాల చెరిపివేత అభియోగాలు మాత్రమే ఉన్నాయంటూ పిటిషనర్ తప్పించుకోవాలని చూస్తున్నారని, వివేకాను హత్య చేయడానికి కుట్ర చేశారనడానికి స్పష్టమైన ఆధారాలున్నాయని పేర్కొన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి తదితరులతో శివశంకర్‌రెడ్డి హత్యకు కుట్ర చేశారని.. దీనిని అమలు చేయడానికి ఏ-1 గంగిరెడ్డిని ఎంచుకున్నారని తెలిపారు. అంతా మేం చూసుకుంటామని దస్తగిరికి స్వయంగా ఫోన్‌లో భరోసా ఇచ్చారని తెలిపారు. అవినాశ్‌రెడ్డి తదితరులతో శివశంకర్‌రెడ్డి చర్చలు జరిపిన వాట్సాప్‌కాల్ డేటా, గూగుల్ టేకౌట్ డేటా ఉందన్నారు. రెండేళ్లుగా శివశంకర్‌రెడ్డికి, వివేకాకు మాటలు లేవని.. అయినప్పటికీ వివేకా ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారని తెలిపారు. హత్య కుట్ర అమలుకు రూ.40 కోట్లు అందజేశారని తెలిపారు. ఎమ్మెల్సీ సీటు రాకపోవడానికి వివేకానే కారణమనే కోపం ఉందని, కడప జిల్లాల్లో పోలీసు యంత్రాంగం మొత్తం శివశంకర్‌రెడ్డి చెప్పుచేతల్లో ఉందని పేర్కొన్నారు. కానిస్టేబుల్ నుంచి ఎస్పీ వరకు బదిలీలు, ప్రమోషన్లు ఆయన చేతిలోనే ఉన్నాయన్నారు. అదనపు ఎస్పీ స్థాయి వ్యక్తి ప్రమోషన్ గురించి చర్చించిన కాల్‌డేటా కూడా ఉందన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులతో మాట్లాడిన డేటా ఉందని తెలిపారు. 'సునీత ఉంటే కదా' అని బీటెక్ రవిని బెదిరించారని, రవి జైల్లో ఉన్నప్పుడు ఆయనను కలిసిన ఎంపీ సీఎం రమేశ్‌కు ఈ విషయం రవి చెప్పారని కోర్టుకు వివరించారు. సునీత, ఆమె భర్తపైనా కేసులు పెడుతున్నారని, వారికి ప్రాణభయం ఉందని తెలిపారు. ఈ హత్య కేసుకు సంబంధించి శివశంకర్‌రెడ్డి అరెస్టు కాకముందు నుంచి అందరిపైనా నిఘా పెట్టారని చెప్పారు. సాక్షుల స్టేట్‌మెంట్‌లు, ప్రెస్‌మీట్ల వివరాలు, సునీతారెడ్డి చార్జిషీట్ కాపీ తీసుకున్న విషయాలు వంటి వివరాలను శివశంకర్‌రెడ్డి సేకరించారని తెలిపారు.

భయభ్రాంతులకు గురిచేశారు: సీబీఐ

సీబీఐ తరఫున స్పెషల్ పీపీ అనిల్ తల్వార్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ శివశంకర్‌రెడ్డి సాక్షులను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. అందుకే సీఐ శంకరయ్య, గంగాధర్‌రెడ్డి వంటివారు కోర్టులో వాంగ్మూలం ఇవ్వడానికి రాలేదన్నారు. సీబీఐ దర్యాప్తు అధికారిపైనే కేసులు పెట్టారని పేర్కొన్నారు. శివశంకర్‌రెడ్డి బయటకు వస్తే సాక్షులు తీవ్రంగా ప్రభావితమవుతారని కోర్టుకు విన్నవించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య కుట్రలో శివశంకర్‌రెడ్డి భాగస్వామ్యం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలూ లేవన్నారు. పిటిషనర్‌పై ఉంది ఆధారాల చెరిపివేత అభియోగాలు మాత్రమేనని.. ఏడేళ్లలోపు జైలుశిక్ష పడే అభియోగాలే కాబట్టి బెయిల్ ఇవ్వాలని కోరారు. ఆధారాల చెరిపివేతకే దీర్ఘకాలం జైల్లో ఉంచడం సరికాదన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

వివేకా కుమార్తె పిటిషన్‌పై 10న విచారణ

» అనుబంధ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పులివెందుల పోలీసులు తమపై నమోదుచేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణను హైకోర్టు ఈ నెల 10కి వాయిదా వేసింది. కేసు నమోదు చేసి విచారణ జరపాలంటూ పులివెందుల పోలీసులను ఆదేశిస్తూ పులివెందుల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులు, పోలీసు ఎఫ్ఐఆర్, చార్జిషీట్లను రద్దుచేయాలని కోరుతూ వేసిన ప్రధాన వ్యాజ్యంలో అభ్యర్థనను సవరించాలన్న అనుబంధ పిటిషన్‌ను కోర్టు అనుమతించింది. విచారణను సాగించేందుకు సమయం లేకపోవడంతో ఈ నెల 10కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అధికారి ఎస్పీ రామ్‌సింగ్ కోరిన విధంగా సాక్ష్యం చెప్పాలని, లేకుంటే హత్య కేసులో ఇరికిస్తామని వివేకానందరెడ్డి కూతురు సునీత, అల్లుడు నర్రెడ్డి ఒత్తిడి చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని ఆరోపిస్తూ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు కేసు నమోదు చేసి జనవరి 4లోగా తుది నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. దీంతో సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్, సునీత, రాజశేఖరరెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా చార్జిషీట్ వేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించిన వారు పులివెందుల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఉత్తర్వుల ఆధారంగా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని అభ్యర్థించారు.

మంగళవారం!

(మొదటి పేజీ తరువాయి)

అనుమతి రావడంలో జరిగిన జాప్యం, అనుకోకుండా కొన్నిసార్లు మంగళవారం సెలవులు రావడమే దీనికి కారణం. లేదంటే.. ప్రతి మంగళవారం అప్పుల కోసం ఆర్బీఐ తలుపు తట్టేవారు.

హమ్మో... అప్పుల కుప్పలు..

జగన్ సర్కారు ఈ ఆర్థిక సంవత్సరం కేవలం మంగళవారాలు తెచ్చిన అప్పే రూ.58,450 కోట్లు. ఇవి కాకుండా ఎంప్లాయిస్ కటింగ్స్, నాబార్డు, ఈఏపీ, కేంద్రం ఇచ్చే రుణాలు ఇతర మార్గాల ద్వారా మరో రూ.15వేల కోట్లు తెచ్చారు. ఇక.. ఇప్పటివరకు రూ.15,000 కోట్లు వాడారు. కేంద్రం అనుమతిలేకుండా కార్పొరేషన్ల నుంచి తెచ్చిన రుణాలు రూ.25,000 కోట్లు ఉంటాయని అంచనా. ఈ అప్పులన్నింటికీ రాష్ట్రప్రభుత్వం గ్యారంటీ ఇస్తోంది. వీటికి కేబినెట్ ఆమోదం కూడా ఉంది. ఇలా కేబినెట్‌లో ఆమోదంపొందిన గ్యారంటీ అప్పులే దాదాపు రూ.25,000కోట్లు ఉన్నాయి. ఇవన్నీ కలుపుకొంటే 9 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.98,450 కోట్లు అప్పు తెచ్చినట్లు. వచ్చే మంగళవారం కూడా తెస్తే.. లక్ష కోట్లు దాటుతుంది.

ఏం చేస్తున్నట్లు....

నవ్యాంధ్రలోనే కాదు... ఉమ్మడి ఏపీ చరిత్రలోనే ఇలా వారం వారం బాండ్ల వేలం ద్వారా అప్పులు తెచ్చుకున్న ప్రభుత్వం మరొకటి లేదు. అప్పుచేసి తెచ్చే నిధులను నిర్మాణాత్మకంగా, సంపద సృష్టికి, భవిష్యత్తులో రాబడి వచ్చేందుకు ఖర్చు చేస్తే మంచిదే. టీడీపీ హయాంలో ఇదే జరిగింది. అమరావతి, పోలవరం, పల్లె సందుల్లో సీసీ రోడ్లు, ఎల్ఈడీ లైట్లు, టిడ్కో ఇళ్లు, నాబార్డు సాయంతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు... ఇలా ఎన్నో ఉదాహరణలున్నాయి. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం పైసా ఆదాయం కూడా తిరిగి రాని పనుల కోసం అప్పులను అడ్డగోలుగా ఖర్చు చేస్తోంది. దీని వల్ల నష్టపోయేది రాష్ట్రం, రాష్ట్ర ప్రజలే!

కేంద్ర నిధులూ వాడలేని అసమర్థత

రాష్ట్ర ప్రభుత్వ వాటాగా కొంత మ్యాచింగ్ గ్రాంట్ భరిస్తే.. కేంద్రం ఇచ్చే అనేక పథకాల ద్వారా ప్రయోజనాలు పొందవచ్చు. కానీ.. మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేక కేంద్ర పథకాలను వాడుకోలేని దయనీయ స్థితి నెలకొంది. వారం వారం తెస్తున్న అప్పుల్లో కొంత మొత్తాన్ని మ్యాచింగ్ గ్రాంట్ల కోసం వాడినా రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగేది. టీడీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకున్నారు. ముఖ్యంగా కార్మిక శాఖకు సంబంధించి అసంఘటిత రంగంలో కార్మికులకు బీమా, ఉపాధి హామీ పథకాన్ని వాడుకోవడంలో టీడీపీ ప్రభుత్వం ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపింది. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లతో పాటు అన్ని ప్రయోజనాలు ఠంచనుగా అందేవి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇవేవీ లేవు!

పనికొచ్చే ఖర్చు ఏదీ?

- తెచ్చిన అప్పులు, వచ్చిన ఆదాయాన్ని నిర్మాణాత్మకంగా ఖర్చు చేశారా, లేదా అని చెప్పే గీటురాయి... మూల ధన వ్యయమే. (అభివృద్ధికోసం పెట్టే ఖర్చు) టీడీపీ ప్రభుత్వ హయాంలో చివరి ఏడాది 2018-19లో అభివృద్ధి కోసం జరిగిన ఖర్చును, ఈ ఐదేళ్లలో వైసీపీ సర్కార్ అభివృద్ధిపై పెట్టిన ఖర్చును పోల్చి చూస్తే అసలు విషయం అర్థమవుతుంది.
- 2018-19లో అప్పటి బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం కేటాయించిన మొత్తంలో 73 శాతాన్ని ఖర్చు చేశారు. అదే వైసీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన మూలధన వ్యయంలో 2019-20లో 52 శాతం, 2020-21లో 63 శాతం, 2021-22లో 55 శాతం, 2022-23లో కేవలం 30 శాతం మాత్రమే అభివృద్ధి వ్యయంగా చూపించారు.
- 2020-21లో కొవిడ్ సందర్భంగా రాష్ట్రాలకు ఎక్కువ అప్పులిచ్చేందుకు కేంద్రం పలు సంస్కరణలు సూచించింది. దాని కారణంగా ఆ ఏడాది కొంత ఎక్కువ మూలధన వ్యయం కనిపిస్తోంది.
- వైసీపీ సర్కారు జగనన్న కాలనీల ఖర్చు, హడ్కో ఇళ్లపై పెట్టిన ఖర్చు, ఇతర రెవెన్యూ ఖర్చులను కూడా మూలధన వ్యయంగా చూపిస్తోంది. చివరికి కాగ్‌కు కూడా అవే తప్పుడు లెక్కలు పంపుతోంది.
- ఏ ప్రభుత్వంలోనైనా ప్రతిఏటా మూలధన వ్యయం పెరుగుతుంది. కానీ.. జగన్ హయాంలో ఇది తిరోగమనంలో ఉండటం గమనార్హం.

అయోధ్యకు తిరుమల లడ్డూలు



తిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రతిష్ఠ, శ్రీరామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా భక్తులకు శ్రీవారి లక్ష లడ్డూలను అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 25 గ్రాముల బరువు కలిగిన లక్ష లడ్డూలను అయోధ్యకు చేరుస్తామన్నారు. సనాతన హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు తిరుమలలో ప్రముఖ పీఠాధి, మఠాధిపతులు, ధార్మిక సంస్థలతో సదస్సు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అన్నప్రసాదాల నాణ్యత పెంచేందుకు మిల్లర్ల ద్వారా బియ్యం కొనుగోలు చేసే విధానాన్ని గత నెల 10వ తేదీ నుంచి ప్రారంభించామని.. దాదాపు రోజుకు 50 టన్నుల బియ్యాన్ని అన్నప్రసాదాలకు వినియోగిస్తున్నామన్నారు. నకిలీ వెబ్‌సైట్ల కారణంగా శ్రీవారి భక్తులు మోసపోకుండా టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీడేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్'లో మాత్రమే ఆర్జితసేవలు, దర్శనం, విరాళాలు, వసతి బుక్ చేసుకోవాలని సూచించారు. అలిపిరిలోని సప్తగోప్రదక్షిణ మందిరంలో జరుగుతున్న శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమంలో పాల్గొనే భక్తులకు తిరుమలలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం క్యూలైన్‌లో టికెట్ కొనుగోలు చేసి శ్రీవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో బెజవాడ, మంగళగిరి, గుంటూరుకు చెందిన న్యాయవాదులు

టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే

భూ హక్కు చట్టం-2022ను రద్దు చేస్తాం

● న్యాయవాదులకు పవన్‌కల్యాణ్ హామీ

విజయవాడ లీగల్, జనవరి 5: టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఏపీ భూ హక్కు చట్టం-2022ను రద్దు చేస్తామని న్యాయవాదులకు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన బెజవాడ, మంగళగిరి, తెనాలి, గుంటూరు బార్‌లకు చెందిన న్యాయవాదులతో ఆయన మాట్లాడారు. చట్టం అమలులోకి వస్తే కలిగే నష్టాలను బెజవాడ బార్ ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసరావు, బార్ మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాస్, సోము కృష్ణమూర్తిలు పవన్‌కు వివరించారు. భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలకు తన మద్దతును పవన్ తెలిపారు. రెండు రోజుల్లో గుంటూరు బార్‌కు వెళ్తానని, ఆ తర్వాత బెజవాడ బార్‌కు విచ్చేస్తానని అన్నారు. జనసేన పార్టీ ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల్లోకి వెళ్లి చట్టం వలన కలిగే నష్టాన్ని తెలియజేస్తానని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. నామాల కోటేశ్వరరావు, కొప్పెర కోటేశ్వరరావు ఉన్నారు.

12 వరకు న్యాయవాదుల దీక్షలు

విజయవాడ లీగల్: భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలను ఈనెల 12 వరకు పొడిగించాలని బార్ నిర్ణయించినట్లు బార్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కేబీ సుందర్, పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నాటికి దీక్షలు 16 రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు సీహెచ్‌వీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, వేపాటి రాజారత్నం, వి.కోటేశ్వరరావు, ఎస్.శ్యాంబాబు, ఎస్.ఎ.జిలానీ, కె.క్రాంతికుమార్, కె.రాధిక పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో..

జగన్‌రెడ్డిని ఇంటికి పంపుదాం

● ఆయన అన్ని వర్గాల నమ్మకాన్ని కోల్పోయారు

● ప్రజలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం పిలుపు

విద్యాధరపురం, జనవరి 5: అన్ని వర్గాల నమ్మకాన్ని కోల్పోయిన సీఎం జగన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో ఇంటికి పంపుదామని ప్రజలకు టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం పిలుపునిచ్చారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డిపై పెల్లుబికుతున్న ప్రజాగ్రహాన్ని చూసి తట్టుకోలేక వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీకి గుడ్‌బై చెబుతున్నారన్నారు. ఆ పార్టీ లోని చాలామంది ఎంపీలకు వారి భవిష్యత్తు ఏమిటో అర్థం కావడం లేద న్నారు. "ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టు కుంది. దీంతో ఎమ్మెల్యేలను, ఎంపీలను ఒక నియోజకవర్గం నుంచి ఇంకొక నియోజకవర్గానికి మారుస్తున్నారు. ఇప్పటివరకు 38 మంది సిట్టింగ్ ఎమ్మె ల్యేలు సొంత నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా లేరు. ఎమ్మె ల్యేలు ప్రజలకు సేవ చేయడంలో విఫలమై, నిర్దాక్షిణ్యంగా దోపిడీకి పాల్ప డడం వల్లే వైసీపీకి ఈ పరిస్థితి దాపురించింది. మరో 50 మంది నాయ కులు పార్టీ మారే ఆలోచనలో ఉన్నారు." అని నెట్టెం పేర్కొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తును మార్చేందుకు రా..కదలిరా

● ఎంఎస్ బేగ్, వర్ల కుమార్ రాజా పిలుపు

విద్యాధరపురం, జనవరి 5: రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదలాలంటే ఆదివారం తిరువూరులో నిర్వహించే రా..కదలి రా సభ ఊహించని రీతిలో విజయవంతం కావాలని, సీఎం జగన్ రాక్షస పాలనతో విసుగెత్తిపోయిన ప్రజలు రా..కదలిరా సభను విజయవంతం చేసి భవిష్యత్తును కాపాడుకో వాలని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా, పార్టీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం పశ్చిమ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని నాని ఆదేశాలతో టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని టీడీపీ పశ్చిమ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. తిరువూరు సభకు ప్రజలంతా స్వచ్ఛందంగా తరలి వెళ్లేం దుకు సిద్ధంగా ఉన్నారని కుమార్‌రాజా తెలిపారు. రా..కదలిరా సభ వైసీపీ ప్రజా వ్యతిరేకపాలనకు చరమగీతం పాడేందుకు నాంది కావాలని, సభ నుంచే వైసీపీ ఓటమి ఖరారు కావాలని బేగ్ అన్నారు.

రా..కదలి రా సభకు తరలిరండి: డూండీ రాకేష్

విద్యాధరపురం, జనవరి 5: విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తిరువూరులో ఆదివారం నిర్వహిస్తున్న రా..కదలి రా సభకు పశ్చిమ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలిరావాలని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేష్, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లాలు పిలుపునిచ్చారు. శుక్రవారం వన్‌టౌన్ లోని ఫతావుల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లా డారు. సంక్షేమం పేరుతో పది రూపాయలు ఇచ్చి వందరూపాయలను జగన్‌రెడ్డి లాక్కుంటున్నాడని విమర్శించారు. చంద్రబాబు రూ.15 ఇచ్చి రూ. 100 సంపాదించే మార్గాన్ని చూపుతారన్నారు. ప్రజలు వీరిద్దరిలో వ్యత్యా సాలను అర్థం చేసుకోవాలని సూచించారు. పశ్చిమ నియోజకవర్గంలో దుర్మార్గమైన పాలన సాగించారని మరో మూడు నెలలు ఓపిక పడితే చంద్రబాబు నాయకత్వంలో పశ్చిమ నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అన్సర్, జహేద్ పాల్గొన్నారు.

జగన్ పల్లకీని మోస్తున్న ఆర్.కృష్ణయ్య

● కృష్ణయ్య ఒక్కరికి ఎంపీ పదవిస్తే బీసీల అభ్యున్నతికి పాటుపడినట్టేనా?

● బీసీలకు సీఎం జగన్ చేసిన మోసంపై కృష్ణయ్య చర్చకు రావాలి: పోతిన మహేష్

వన్‌టౌన్, జనవరి 5: "చరిత్రలో ఎవ్వరూ చేయనంతగా సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీలను మోసం చేశారు. బీసీల అభ్యున్నతికి పాటుపడడ మంటే ఆర్.కృష్ణయ్య ఒక్కరికే ఎంపీ పదవి ఇవ్వడమా? జగన్ పల్లకీని ఆర్.కృష్ణయ్య మోస్తున్నారు. బీసీలకు జగన్ చేసిన మోసంపై ఆయన బహి రంగ చర్చకు రావాలి." అని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజ కవర్గ ఇన్‌చార్జి పోతిన వెంకటమహేష్ విమర్శించారు. శుక్రవారం కొత్తపేట లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "బీసీల ద్రోహిగా వెన్నుపోటుదారుడుగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు. సీఎం బీసీలకు ఒక్క మేలు కూడా చేయలేదు. ఒక్క పథకాన్ని అయినా ప్రవేశపెట్టలేదు. రూ.75,000 కోట్లు బీసీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారు. 56 బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించలేదు. స్థానిక సం స్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్లను తగ్గించి 16,800 మందికి బీసీలను ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కాకుండా చేశారు. పెళ్లి కానుక, విదేశీ విద్య పథకాలను రద్దు చేశారు. వీటిపై కృష్ణయ్య చర్చకు రావాలి. జగన్ వంటి పెట్టుబడు దారులు, పెత్తందారులకు కృష్ణయ్య కొమ్ము కాయడం ఏంటి? ఇలాంటివి బీసీలు చూస్తూ ఊరుకోరు." అని పోతిన హెచ్చరిం చారు.

మల్లాది విష్ణుకే సెంట్రల్ టికెట్ కేటాయించాలి

● వైసీపీ 29వ డివిజన్ నాయకుల డిమాండ్

మధురానగర్, జనవరి 5: "సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు టికెట్ నిరాకరించిన అధిష్టానం మరోకసారి పునరాలోచించాలి. విష్ణునే అభ్యర్థిగా ప్రకటించాలి" అని వైసీపీ 29వ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. మధురానగర్‌లో కార్పొరేటర్ కొంగి తల లక్ష్మీపతి అధ్వర్యంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భారీ సంఖ్యలో డివిజన్లను గెలిపించిన విష్ణు పట్ల అధిష్టానం ధోరణి సరికాదన్నారు. ఇప్పటికైనా అధిష్టానం పునరాలోచించక పోతే కార్యకర్తలు, ప్రజల అభీష్టం మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వారు హెచ్చరించారు. ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ కంభం కొండలరావు, అర్బన్ నాయకులు శింగంశెట్టి హరిబాబు, వేణు, దేవినేని సుధాకర్, గోవింద్, జాక్సన్, పలువురు కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.









రామవరప్పాడు బల్లెంవారి వీధిలో, రామలింగేశ్వరనగర్‌లో, కరెన్సీనగర్ కాలువలో, కానూరు మురళీనగర్‌లో పేరుకుపోయిన చెత్త

ఎక్కడ చూసినా చెత్తే!

పారిశుధ్య కార్మికుల సమ్మెతో 11 రోజులుగా నిలిచిన చెత్త సేకరణ

● నగరంలోని రోడ్లపై పేరుకుపోయిన 2500 టన్నుల చెత్త

● పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

చిట్టినగర్, జనవరి 5: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని 11 రోజులుగా సమ్మె చేస్తుండడంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. దీంతో నగరంలోని వీధులన్నీ పేరుకున్న చెత్తతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో ప్రజల నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు ప్రత్యామ్నాయ సిబ్బందితో పని చేయిస్తున్నా పూర్తిస్థాయిలో చెత్త సేకరించలేక పోతున్నారు. సగం చెత్త కూడాతరలించలేకపోతున్నారు. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి పరిసరాలు కంపు కొడుతున్నాయి. నగరంలో సుమారు 2500 టన్నుల చెత్త పేరుకుపోయినట్లు అంచనా. దోమల వ్యాప్తి పెరిగి, సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉందని ప్రజలు భయపడుతున్నారు. నగరపాలక సంస్థలో 4వేల మంది ఆప్కాస్ సిబ్బంది సమ్మెలో ఉన్నారు. నగరవ్యాప్తంగా రోజుకు 500 టన్నుల చెత్త వస్తుంది. 11 రోజులుగా ప్రైవేట్ క్లాప్ ఆటోలు 225, కార్పొరేషన్ ఆటోలు 25 అదనంగా 10 చక్రాల లారీలు 20, 20 ట్రాక్టర్లతో రోజుకు సుమారు 250 టన్నుల మేరకు చెత్తను నగరపాలక సంస్థ తరలిస్తోంది. వీఎంసీ పర్మినెంట్ సిబ్బంది 472 మంది, రోజువారీ కూలీలు 100 నుంచి 200 మందితో పనులు చేయిస్తోంది. ఇంకా సుమారు 250 టన్నుల చెత్త విగిలిపోతోంది. కొండ ప్రాంతాల్లో చెత్త ఎక్కువగా ఉంది. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో డోర్ టు డోర్ చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ, కొండప్రాంతాల్లో చెత్త సేకరణ జరగకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపేట, చిట్టినగర్, పాల ఫ్యాక్టరీ, ఆంజనేయవాగు, చెరువు సెంటర్ కొండప్రాంతం, కబేళా కొండప్రాంతంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీఎన్‌జీ ఆటోలు వెళ్లే అవకాశమూ లేదు. కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు పారుదల జరగక డ్రెయిన్లు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ప్రభుత్వం వెంటనే సమ్మె విరమింప జేయాలని ప్రజలు కోరుతున్నారు.

నగరంలో మంచినీటి సమస్య

నగరంలో మంచినీటి సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సమ్మెలో మూడు సర్కిల్స్‌కు చెందిన 300 మంది వాటర్ సప్లయ్ కార్మికులు పాల్గొనటంతో నీటి సరఫరాకు ఆటంకం కలిగింది. సర్కిల్‌కు 60 మంది వాటర్ సప్లయ్ వాల్స్ తిప్పే కార్మికులు ఉన్నారు. రోజూ రెండు పూటలా ఆయా ప్రాంతాల్లో వాల్స్ తిప్పి సమయం అయ్యాక వాటిని మూసేస్తుంటారు. వారం రోజులుగా మూడు సర్కిల్స్‌లో వాటర్ సప్లయ్ కార్మికులు సమ్మెలో పూర్తిస్థాయిలో పాల్గొనటంతో పర్మినెంట్ సిబ్బంది కొండ క్రింద ప్రాంతాల్లో వాల్స్ తిప్పి అరకొర మంచినీటి ప్రజలకు అందిస్తున్నారు. దీంతో కొండప్రాంతాల్లో మంచినీటి సమస్య తీవ్రమైంది. కొన్ని ప్రాంతాలలో స్థానిక కార్పొరేటర్లు అరకొర ట్యాంకర్లతో మంచినీటిని అందిస్తున్నా ప్రజలకు నీటి కష్టాలు తప్పటం లేదు. కొన్ని ప్రాంతాల్లో వాటర్ టిన్‌లు కొనుగోలు చేసుకొని తీసుకెళుతున్నారు. ఇంకా మాకు ఎన్ని రోజులు వాటర్ కష్టాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భవానీ దీక్షాధారుల నిలువు దోపిడీ



మహామండపం ఎదురుగా అనధికారికంగా నిర్వహిస్తున్న కూల్‌డ్రింక్ స్టాల్

● సోడా రూ.30, వాటర్ బాటిల్ రూ.25

● మూడు కత్తెర్లు వేయించుకునే మహిళల నుంచి రూ.100 వసూలు

● మహామండపం ఎదురుగా అనధికారిక కూల్‌డ్రింక్ స్టాల్

వన్‌టౌన్, జనవరి 5: ఇంద్రకీలాద్రికి వస్తున్న భవానీ దీక్షాధారులు, భక్తులను ఆలయ పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులు, కేశఖండన శాలలో క్షురకులు, కూల్‌డ్రింక్ స్టాల్ నిర్వాహకులు, పూజా సామగ్రి విక్రయదారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. ఎంఆర్‌పీ కంటే అదనంగా రూ.5 వసూలు చేస్తూ మంచినీటి బాటిళ్లను విక్రయిస్తున్నారు. సోడా రూ.10 అయితే ఇక్కడ రూ.30 వసూలు చేస్తున్నారు. మహామండపం వద్ద అనధికారికంగా కొన్ని స్టాళ్లు పెట్టి, పూజా సామగ్రి, కూల్‌డ్రింక్‌లు, ఇతరత్రా వస్తువులను అత్యధిక ధరలకు విక్రయిస్తున్నారు. రూ.25 కూల్‌డ్రింక్ బాటిల్‌కు అదనంగా రూ.5 వసూలు చేస్తున్నారు. టెంకాయలు, పూజాసామగ్రి అంటూ వాటిల్లో అరముక్కలను పెట్టి చీరలని నమ్మించి అధిక ధరలను వసూలు చేస్తున్నారు. కేశఖండనశాలలో ఒక్కో టికెట్టుకు రూ.40 దేవస్థానం వసూలు చేస్తుంటే క్షురకులు పురుషుల తలనీలాలు తీసినందుకు ఒక్కొక్కరి నుంచి రూ.50, రూ.100 ఇంకా అంత కంటే ఎక్కువ కూడా వసూలు చేస్తున్నారు. మహిళలు కొంత మంది మూడు కత్తెరలు ఇస్తుంటారు. అంటే పూర్తిగా తలనీలాలు ఇవ్వకుండా మొక్కుకున్న మేరకు జుట్టు చివరన ఒక అంగుళం మేర మూడు చోట్ల తలనీలాలను సమర్పిస్తారు. ఈ మాత్రం దానికే క్షురకుడు రూ.100 వసూలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. అధిక ధరలపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా పట్టించుకోని వారు లేరు. అనధికార స్టాళ్లను తొలగించాలని, అధిక ధరలను నియంత్రించాలని, వాటిపై దేవస్థానం అధికారులు దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.



అధిక ధరలకు అమ్ముతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విజయనగరానికి చెందిన భవానీలు

దుర్గమ్మ కానుకగా వెండి త్రిశూలం

కనకదుర్గమ్మకు శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన ములగాడ విజయలక్ష్మి, చిట్టిబ్బాయి కుటుంబసభ్యులు కిలో బరువుగల వెండి త్రిశూలాన్ని కానుకగా ఈవో కేఎస్ రామారావుకు అందజేశారు. నటి పడాల కల్యాణి(కరాటే కల్యాణి) వారితో ఉన్నారు.



ఈవో రామారావుకు వెండి త్రిశూలాన్ని కానుకగా అందిస్తున్న దాతలు, సినీ నటి కరాటే కల్యాణి



ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు

పట్టించుకునే తీరిక ముఖ్యమంత్రికి లేదా?

● 11వ రోజు దీక్షలో సీపీఎం రాష్ట్రనేత సీహెచ్ బాబూరావు

ధర్నాచౌక్, జనవరి 5: "మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలి. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ప్రజారోగ్యాన్ని కాపాడే కార్మికుల సమస్యలను పట్టించుకునే తీరిక ముఖ్యమంత్రికి లేకపోవడం శోచనీయం." సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ధర్నాచౌక్ వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన ధర్నా 11వ రోజు శుక్రవారం కొనసాగింది. లెనిన్‌సెంటర్ నుంచి ప్రదర్శనగా కార్మికులు ధర్నాచౌక్‌కు చేరుకున్నారు. "కరోనా కేసులు పెరుగున్న తరుణంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదు. బలహీనవర్గాలకు చెందిన మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరికాదు."అని బాబూరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక వైపు చర్యలు అంటూ మరోవైపు సమ్మె విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సిగ్గుచేటు అని సీఐటీయూ రాష్ట్ర నేత వి.ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

డిమాండ్లు ఆమోదించాలి

● మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా




ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ధర్నాచౌక్, జనవరి 5: గతంలో జగన్ పాదయాత్రలో పార్టీ అధికారంలోకి వస్తే రూ.10 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని మధ్యాహ్నభోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా చేశారు. 23 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, ప్రతీ నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెమో చార్జీలు రూ.20లకు పెంచాలని, పథకానికి బడ్జెట్ పెంచాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్నిప్రమాదానికి గురైన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి వీరి దీక్షకు సంఘీభావం తెలిపారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మహిళలతో వెట్టిచాకిరి చేయిస్తు న్నారని ధ్వజమెత్తారు. సీఐటీయూ రాష్ట్ర నేత వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ధర్నాకు వస్తున్న కార్మికులను ఆయా జిల్లాల్లో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లలో పెట్టారన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేంద్ర పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకే సంకల్పయాత్ర

పటమట, జనవరి 5: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల అభ్యున్నతికి కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అనుకున్నంతగా అవి ప్రజలకు చేరువకావటం లేదని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకే వికసిత భారత సంకల్ప యాత్ర చేపట్టామని ఆ పార్టీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. బీజేపీ ఆశయాలు, సిద్ధాంతాలు, సంక్షేమ పథకాల వివరాలతో ఆ పార్టీ నాయకుడు కిలారు దిలీప్ ముద్రించిన పాకెట్ డైరీని ఆమె పటమట ఆర్టీసీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఈ మినీ పాకెట్ డైరీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఎన్టీఆర్ జిల్లాలో బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళతామని కిలారు దిలీప్ అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొబ్బూరి శ్రీరామ్, ఎన్టీఆర్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు, శ్రీనివాసు, బొమ్మదేవర రత్నకుమారి, భోగవల్లి శ్రీధర్ పాల్గొన్నారు.



కేంద్రప్రభుత్వ వివరాలతో ముద్రించిన పాకెట్ డైరీని ఆవిష్కరిస్తున్న దగ్గుపాటి పురందేశ్వరి

నాకు మద్దతివ్వండి

● మేయర్ భాగ్యలక్ష్మిని కోరిన వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

లబ్బీపేట, జనవరి 5: వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జ్‌గా ప్రకటించిన తనకు మద్దతు తెలపాలని నియోజకవర్గ నాయకులను షేక్ ఆసిఫ్ కలుస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మిని వన్‌టౌన్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు మద్దతివ్వమని కోరారు. నియోజకవర్గంలో తన గెలుపునకు పూర్తి సహకారం అందిస్తానని మేయర్ తెలిపారని, రాబోయే రోజుల్లో నియోజక వర్గంలో అన్ని విషయాలపై చర్చించడంతో పాటు నాయకులందరని కలుపుకొనిపోతానని తెలిపారు.



మేయర్ రాయన భాగ్యలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న షేక్ ఆసిఫ్

వచ్చే ఎన్నికల్లో రెండు ఎంపీ సీట్లు

మాదిగలకు కేటాయించాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ డిమాండ్

ధర్నాచౌక్, జనవరి 5: టీడీపీ, వైసీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే పార్లమెంట్ సీట్లను మాదిగ, మాదిగ ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం కేటాయించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరుసుపాటి బ్రహ్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. నాలుగు ఎస్సీ రిజర్వ్‌డ్ పార్లమెంట్ స్థానాల్లో రెండు మాదిగలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 39 ఎస్సీ రిజర్వ్‌డ్ ఎమ్మెల్యే స్థానాల్లో మాదిగ, మాదిగ ఉపకులాలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. అలా కాకుండా ఒక వర్గానికే ఎక్కువ సీట్లు కేటాయిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఓట్ల ద్వారా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్ర కన్వీనర్ మానికొండ శ్రీధర్‌మాదిగ, వైఎస్.రాజు, సరస రామయ్య, కోటా సుబ్బు పాల్గొన్నారు.

అంగన్వాడీలనూ వదల్లేదు

● అసభ్య పదజాలంతో పోస్టులు

● వైసీపీ సోషల్ మీడియాపై పోలీసులకు అంగన్వాడీల ఫిర్యాదు

● సోషల్ మీడియా కన్వీనర్ క్షమాపణలు.. పదవికి రాజీనామా చేసిన అజయ్

మంగళగిరి సిటీ, జనవరి 5: తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన అంగన్వాడీలను సైతం వైసీపీ సోషల్ మీడియా వదల్లేదు. తీవ్ర విమర్శలు, దుర్భాషలతో వారిని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టింది. దీనిపై ఆగ్రహించిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలు.. వైసీపీ సోషల్ మీడియా విభాగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అంగన్వాడీలు గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. మంగళగిరి నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వ్యాసం అజయ్‌కుమార్, మరికొందరు అంగన్వాడీల వృత్తిని కించపరుస్తూ అసభ్య పదజాలంతో ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో సందేశాలను పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తమను మానసికంగా ఇబ్బందికి గురిచేసిందన్నారు. అజయ్‌కుమార్‌తోపాటు తమపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారిని విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. అంగన్వాడీల ఆగ్రహానికి గురైన సోషల్ మీడియా కన్వీనర్ వ్యాసం అజయ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం తన రాజీనామా లేఖను మంగళగిరి వైసీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవికి అందజేశారు.

కొత్తగా మరో 1,11,321 రేషన్ కార్డులు

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా మరో 1,11,321 మందికి రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు కొత్త రైస్ కార్డులు, కార్డుల విభజన కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హులైనవారందరికీ కొత్త బియ్యం కార్డులు మంజూరు చేసినట్టు పౌరసరఫరాలశాఖ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కార్డులు మంజూరైనవారికి ఈ నెల నుంచే బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని అన్ని జిల్లాల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేసినట్టు ఆయన వివరించారు.

10 వరకు ఇంటర్ పరీక్షల

ఫీజు చెల్లింపులకు గడువు

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈ నెల 10వ తేదీ వరకు ఫీజులు చెల్లించవచ్చని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ ఓ ప్రకటనలో తెలిపారు. రూ.2500 అపరాధ రుసుముతో కలిపి ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజుల చెల్లింపునకు ఇదే చివరి అవకాశమని స్పష్టంచేశారు.

అందుబాటులోకి సమగ్రశిక్ష వెబ్‌సైట్

▸▸ 'ఆంధ్రజ్యోతి' కథనంతో చర్యలు.. ముందే ఉన్నట్టు బుకాయింపు


[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

అమరావతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సమగ్రశిక్ష సంస్థ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. వెబ్‌సైట్ లేకుండానే విద్యాశాఖ మంత్రితో హడావుడిగా ప్రారంభోత్సవం చేయించిన విషయాన్ని 'అయ్యో.. ఇదేంది బొత్స!' పేరుతో 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో ఉలిక్కిపడిన సమగ్రశిక్ష అధికారులు హుటాహుటిన చర్యలు చేపట్టి శుక్రవారం మధ్యాహ్నానికి సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. కాగా 'ఆంధ్రజ్యోతి' కథనంతో సైట్‌ను ఇంటర్నెట్‌లో హోస్ట్ చేసినా ముందే ఇంటర్నెట్‌లో ఉందంటూ బుకాయించే ప్రయత్నం చేశారు. దీనిపై స్పందించిన సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటన విడుదల చేశారు. సైట్ ఓపెన్ కావడం లేదనేది అసత్యమని, అప్రతిష్ఠపాలు చేసేలా కథనం ప్రచురించారని ఆరోపించారు. అదే నిజమనుకుంటే తాజా ప్రకటనలో వెబ్‌సైట్ పేరుతో సహా సవివరంగా ప్రకటన జారీచేసిన ఆయన బుధవారం నాటి ప్రకటనలో సైట్ పేరేంటో ఎందుకు చెప్పలేదు? సైట్ ఓపెన్ కావడం లేదని సమగ్రశిక్ష కార్యాలయాన్ని సంప్రదించినా ఎందుకు స్పందించలేదో ఆయన సమాధానం చెప్పాలి.

సీఆర్డీయేకు భూములిచ్చిన

రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్ల కేటాయింపు

కృష్ణలంక, జనవరి 5: ఏపీసీఆర్డీఏ పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను సీఆర్డీఏకు అప్పగించి ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందేం దుకు అంగీకారం తెలిపిన భూ యజమానులకు శుక్రవారం నగరం లోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ కమిషనర్ వివేక్ యాదవ్ పర్యవేక్ష ణలో అదనపు కమిషనర్ షేక్ అలీమ్ బాషా ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఈ - లాటరీ తీసి ప్లాట్ల కేటాయింపు పత్రాలను అందిం చారు. భూములిచ్చిన రైతులకు గతంలో నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించామన్నారు. వాటిలో 3,356 ప్లాట్లు భూ సమీకరణ పరిధిలోని భూ సేకరణ పూర్తికాని భూమిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. 780 మంది రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు. తొలి విడత ఈ-లాటరీలో 44 మందికి, రెండో విడత 48 మంది రైతులకు 51 ప్లాట్లు అందించామ న్నారు. 11 గ్రామాల పరిధిలోని భూ యజమానులకు 30 నివాస, 21 వాణిజ్య ప్లాట్లు అందజేశారు. స్పెషల్ కలెక్టర్ ల్యాండ్స్ టి.చిరంజీవి, ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్‌రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సాయి శ్రీనివా సనాయక్, ప్లానింగ్ అధికారి ఆర్.నాగేశ్వరరావు, ఎం.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



ప్లాట్ల కేటాయింపు పత్రాలను అందిస్తున్న సీఆర్డీయే అదనపు కమిషనర్ షేక్ అలీమ్ బాషా

ఏసీఏ అండర్-14 సెంట్రల్‌జోన్ విజేత కృష్ణా

విజయవాడస్పోర్ట్స్, జనవరి 5: గుంటూరు జిల్లా నరసరావు పేటలోని పేరేచర్ల క్రికెట్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-14 సెంట్రల్‌జోన్ క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కృష్ణా జట్టు కైవసం చేసు కుంది. గుంటూరుపై నిర్వహించిన చివరి మ్యాచ్‌లో కృష్ణా టీమ్ 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. టీమ్‌ను, కోచ్ ఎస్.జ్యోతి సాయికృష్ణలను కేడీసీఏ అడహక్ కమిటీ కన్వీనర్ ఎం.రవిశంకర్, చైర్మన్ టి.త్రినాథరాజు, క్రికెట్ హెడ్ వి.విజయసారధి ప్రత్యేకంగా అభినందించారు.

జగన్ సర్కారు చాలా తప్పులు చేసింది

వాటన్నింటికీ ఖండించాలని బీజేపీ నిర్ణయించింది: రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చాలా తప్పులు చేసిందని, వాటన్నింటికీ తమ పార్టీ తరఫున తీవ్రంగా ఖండించాలని బీజేపీ నేతలు నిర్ణయించారని తెలిసిందని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. వైసీపీకి బీజేపీ అనుకూలమనే అపవాదుని తొలగించుకోవాలని ఆ పార్టీ నేతలు చెబుతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయని ఆయన చెప్పారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి ముందుకు వెళ్లాలని తాను ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేనతో కలిసి బీజేపీ ముందుకెళితే.. ఉద్యోగులంతా కూటమికి మద్దతిచ్చే దిశగా సముచిత నిర్ణయం తీసుకోవాలని రఘురామ కోరారు.

పొత్తులపై బీజేపీ నేత వ్యాఖ్యలు అర్థరహితం

వారి సహకారంతోనే బాబును జైలుకు పంపిన వైసీపీ: రామకృష్ణ

గుంటూరు(తూర్పు), జనవరి 5: 'బీజేపీ నేత సత్యకుమార్ పొత్తులపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితం. ఆయన బెదిరిస్తున్నారో, బ్లాక్ మెయిల్ చేస్తున్నారో, ఆదేశిస్తున్నారో అర్థం కాలేదు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. 'మాతో పొత్తు కావాలని కోరుకుంటున్న నేతలు మా అధిష్ఠానంతో మాట్లాడాలి. మాతో పొత్తు కావాలని పవన్ కల్యాణ్ చెప్పడం కాదు. టీడీపీతో కూడా చెప్పించాలి. యువగళం వేదిక మీద బీజేపీతో పొత్తుపై లోకేశ్‌తో పవన్ మాట్లాడించి ఉండాల్సింది' అంటూ బీజేపీ నేత సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలపై రామకృష్ణ మండిపడ్డారు. గుంటూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. 'మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు వెనుక కేంద్రంలోని బీజేపీ ఉందనే విషయం రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. బీజేపీ, వైసీపీలు కూడబలుక్కొని ఇదంతా చేశాయనేది సుస్పష్టం. సుప్రీం కోర్టులో వాదనలు ముగిసి 70 రోజులు పైబడినా తీర్పు వెలువరించకపోవడం వెనుక బీజేపీ ఉంది' అని రామకృష్ణ అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాగర్ నుంచి ఏపీకి 5 టీఎంసీలు

హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల కోసం ఏపీకి నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి శుక్రవారం వాటర్ రిలీజ్ ఆర్డర్ జారీ చేసింది.

ఖాతాదారులకు కుచ్చుటోపీ

ప్రైవేటు ఫైనాన్స్ మహిళా ఉద్యోగి ఘరానా మోసం

బంగారం తాకట్టు పేరిట రూ.3కోట్ల సొమ్ము స్వాహా

కడప (క్రైం), జనవరి 5: ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో క్యాషియర్‌గా పనిచేస్తున్న మహిళ పలువురు ఖాతాదారులకు టోపీ పెట్టింది. ఖాతాదారులతో బంగారు నగలను తాకట్టు పెట్టించి, వారికి వడ్డీ ఆశ చూపి, దాదాపు రూ.3 కోట్ల మేర స్వాహా చేసి ఉడాయించింది. బాధితులు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్‌ను కలిసి తమ ఆవేదన వెళ్లబోసుకున్నారు. బాధితుల కథనం మేరకు.. కడప నగరంలోని అక్కాయపల్లెకు చెందిన సౌజన్య (33) అప్సరా సర్కిల్ సమీపంలోని శ్రీరామ్‌ఫైనాన్స్ కార్యాలయంలో క్యాషియర్‌గా పనిచేస్తోంది. తమ కార్యాలయానికి వచ్చే కస్టమర్లను మాటలతో ఆకట్టుకునేది. తమకు గోల్డ్ లోన్‌లు చేయించాలనే టార్గెట్ ఉందని, ఎవరైనా బంగారు ఆభరణాలను తమ సంస్థలో తాకట్టు పెడితే తాను వడ్డీ వేసి నెల లేదా 15 రోజుల్లోనే విడిపిస్తానని నమ్మబలికేది. ఈ క్రమంలో బాధితులు ఆమె మాటలు నమ్మి వడ్డీలకు ఆశపడి తమ ఇళ్లలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకు వచ్చి తాకట్టు పెట్టారు. ఆ డబ్బులో కొంత వారికిచ్చి వడ్డీ ఇస్తానంటూ మిగిలిన డబ్బంతా తీసుకునేది. ఇలా చాలా రోజులుగా ఒకరికి తెలియకుండా ఒకరి నుంచి బంగారు ఆభరణాలు తీసుకుని తాకట్టు పెడుతూ వచ్చింది. ఇలా దాదాపు రూ.3 కోట్ల మేర స్వాహా చేసింది. ఈ క్రమంలో కొందరు తమ ఆభరణాలను తాకట్టు నుంచి విడిపించాలని ఆమెను నిలదీశారు. మరికొందరు సంస్థ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. కానీ, 'మీ పేర్లతోనే బంగారు ఆభరణాలు తాకట్టులో ఉన్నాయి.. డబ్బు చెల్లించి ఆభరణాలను విడిపించుకుని వెళ్లాల'ని అధికారులు తేల్చి చెప్పడంతో బాధితులు ఖంగుతిన్నారు. మహిళా ఉద్యోగి సౌజన్యను నిలదీసేందుకు బాధితులు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు. గతనెల 16నుంచి తన భార్య కనిపించడంలేదని సౌజన్య భర్త నిత్యానందరావు ఫిర్యాదు చేశారు. కాగా, పోలీసుల అదుపులో సౌజన్య ఉన్నట్టు తెలుస్తోంది.

23న హైకోర్టు వద్ద టీడీపీ లీగల్ సెల్ రక్తదాన శిబిరం

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని హైకోర్టు వద్ద 23న టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ద్వితీయ వార్షిక రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు ప్రకటించారు. రక్తదాన శిబిరం పోస్టర్లను మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, లీగల్ సెల్ సభ్యులతో కలిసి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. సామాజిక బాధ్యతగా న్యాయవాదులు ఎన్టీఆర్ ట్రస్ట్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

లారీని ఢీకొన్న బస్సు

ఇద్దరు డ్రైవర్ల దుర్మరణం.. నలుగురికి గాయాలు



పెళ్లకూరు, జనవరి 5: లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం కొత్తూరు వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్ నుంచి ట్రావెల్స్ బస్సులో 20మంది విహారయాత్రకు బయలుదేరారు. శుక్రవారం కొత్తూరు వద్ద అదుపుతప్పిన బస్సు తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి నెల్లూరుకు కంకర లోడ్డుతో వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ దినేష్ ప్రతాప్ సింగ్(48) అక్కడికక్కడే మృతిచెందాడు. తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ ఇలగవరన్(55) లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు రెండు క్రేన్ల ద్వారా అతికష్టమ్మీద బస్సును లారీని విడదీసి డ్రైవర్‌ను బయటకు తీశారు. ఇలగవరన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.



ఇటలీ నుంచి వచ్చి.. ఆటో కొని..!

పర్యాటక ప్రాంతాలను చుట్టేస్తున్న విదేశీయులు

మోతుగూడెం, జనవరి 5: ఇటలీ నుంచి వచ్చిన ముగ్గురు ఔత్సాహిక పర్యాటకులు భారత్‌లో ఆటో కొనుగోలు చేసి మరీ పర్యాటక ప్రాంతాలను చుట్టేస్తున్నారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం, పొల్లూరులో గురువారం నుంచి ముగ్గురు ఇటలీ దేశస్థులు సందడి చేశారు. వీరు తొలుత ఇటలీ నుంచి ఢిల్లీ వచ్చారు. ఢిల్లీ నుంచి కేరళ వెళ్లి కొచ్చిలోని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. తర్వాత ఆటో కొనుగోలుచేసి కొచ్చి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం ప్రాంతంలోని ప్రకృతి అందాలను చూడ్డానికి వచ్చామన్నారు. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న పొల్లూరు జలపాతం, ఫోర్‌బై కెనాల్, డొంకరాయి డ్యామ్ చూసి మేఘాలయ పయనమయ్యారు.

కంది.. అందేనా?!

సవాళ్లను అధిగమించేనా..!

కందిపప్పు క్వింటాకు రూ.7 వేల మద్దతు ధర

పౌరసరఫరాల సంస్థ ముమ్మర కసరత్తు

4 జిల్లాల్లో 50వేల టన్నుల సేకరణ లక్ష్యం

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు క్రమం తప్పకుండా రాయితీపై కందిపప్పును అందించడంలో విఫలమవుతున్న పౌరసరఫరాల సంస్థ.. సవాళ్లను అధిగమించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు.. మరీ ముఖ్యంగా కందిపప్పు ధర అప్రతిహతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో.. ఏడాది కాలంగా రేషన్ సరుకుల్లో కందిపప్పు కోటాను పూర్తిగా కట్ చేసేసి పేదలకు షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో జగన్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత టీడీపీ హయాంలో రేషన్ కార్డుదారులకు కందిపప్పును పంపిణీ చేసేవారు. అప్పట్లో ఒక్కొక్క రేషన్‌కార్డుపై 2 కిలోల చొప్పున కందిపప్పు పంపిణీ చేశారు. అది కూడా 50శాతం రాయితీపై కిలో రూ.40కే ఇచ్చారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత పండుగల సందర్భంగా ఇచ్చే కానుకలను తీసేసింది. పైగా టీడీపీ ప్రభుత్వం కందిపప్పుపై ఇచ్చే సబ్సిడీని 50 శాతం నుంచి 20 శాతానికి తగ్గించి కిలో కందిపప్పు ధరను రూ.67కు పెంచారు. అది కూడా ప్రతినెలా క్రమంగా సరఫరా చేయడం లేదు. గత ఏడాది వినాయక చవితి, దీపావళి, దసరా.. ఇలా ఏ పండక్కీ రాయితీపై కందిపప్పు ఇవ్వలేదు. దీంతో కార్డుదారుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో మళ్లీ ఈ జనవరి నెల రేషన్ సరుకుల్లో కందిపప్పును చేర్చారు. ఇక నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

రైతుల నుంచి కందుల సేకరణ ఇలా..

పౌరసరఫరాల సంస్థ కొన్నేళ్లుగా నాఫెడ్ నుంచి కందిపప్పు కొనుగోలు చేస్తూ రేషన్‌కార్డుదారులకు కిలో



రూ. 67 లకు సరఫరా చేస్తోంది. మార్కెట్ రేటుకే నాఫెడ్ దగ్గర కొంటున్నా సరిపడా నిల్వలు లేవనే కారణంతో అరకొరగానే సరఫరా చేస్తున్నారు. అది కూడా నాసిరకంగా ఉంటోందన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాశాఖ గత ఏడాదంతా దాదాపుగా రేషన్ సరుకుల్లో కందిపప్పును కట్ చేసేసింది. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో మళ్లీ ఈ జనవరి నుంచి కార్డుదారులకు కందిపప్పు సరఫరాను ప్రారంభించారు. రాష్ట్రంలో పీడీఎస్ అవసరాలకు సరిపడా బియ్యం కోసం రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న తరహాలోనే.. కందిపప్పు నిల్వలను కూడా సమకూర్చుకునేందుకు రాష్ట్రంలోని రైతుల నుంచి నేరుగా మద్దతు ధరకు కందుల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ఈ- క్రాప్ డేటా ఆధారంగా ప్రకాశం, అనంతపురం, పల్నాడు, శ్రీసత్యసాయి జిల్లాల్లోని రైతులు ఎక్కువగా కందులను సాగు చేసినట్లు గుర్తించారు. ఈ జిల్లాల నుంచి ఈ సీజన్‌లో ఒక లక్ష మెట్రిక్ టన్నులకు పైగా కందుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ కందులను పండించిన రైతుల నుంచి క్వింటాకు రూ. 7 వేల చొప్పున మద్దతు ధర చెల్లించడంతోపాటు అదనంగా గోనెసంచులు, హమాలీలు, రవాణా ఖర్చుల కింద ఒక మెట్రిక్ టన్నుకు రూ. 756 లు చొప్పున రైతులకు చెల్లిస్తామంటూ పౌరసరఫరాల సంస్థ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

అనంతపురం జిల్లాలో ఆర్బీకేల ద్వారా ఇప్పటికే కందుల కొనుగోలు ప్రారంభమైందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన జిల్లాల్లో కూడా కందుల సేకరణను వేగవంతం చేసే అంశంపై చర్చించేందుకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండియన్ శుక్రవారం ఆ నాలుగు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ సంయుక్త సంచాలకులు, డీఎస్‌వోలు, డీఎంలతో విజయవాడలో సమావేశమయ్యారు. జిల్లాల్లో ఎక్కువ కందులను సేకరించేలా చూడాలని అధికారులను కోరారు. అయితే ప్రకాశం జిల్లా నుంచి 33,595, అనంతపురం జిల్లా నుంచి 3,369, పల్నాడు జిల్లా నుంచి 5000, శ్రీ సత్యసాయి జిల్లా నుంచి 600 మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 42,564 మెట్రిక్ టన్నుల కందులను సేకరించగలమని ఆయా జిల్లాల అధికారులు ప్రతిపాదనలు ఇచ్చారు. ప్రస్తుతం క్వింటా

సేకరణ సాధ్యమేనా?

కందులకు ప్రభుత్వం నిర్ణయించిన రూ. 7 వేల మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు ముందుకు రాకపోతే ఇంకా ఎక్కువ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, దీనిపై మీ జిల్లాల్లోనే కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రొక్యూర్‌మెంట్ కమిటీలను ఏర్పాటు మద్దతు ధర నిర్ణయించాలని ఎండీ వీరపాండియన్ సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రేషన్‌కార్డుదారులకు కిలో చొప్పున కందిపప్పు సరఫరా చేయాలంటే నెలకు 14 వేల మెట్రిక్ టన్నులకు పైగా కందిపప్పు అవసరమవుతుంది. ఈ సీజన్‌లో రైతుల నుంచి గరిష్ఠంగా 50 వేల టన్నుల కందులను సేకరించినా 3 నెలలకు మించి సరిపోవు. ఈ నేపథ్యంలో స్థానిక రైతుల నుంచి కందులను సేకరించి.. కార్డుదారులందరికీ కందిపప్పు సరఫరా చేయడం అసాధ్యమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వైసీపీ బ్రోకర్ కార్యాలయంగా ఏయూ

మాజీ వీసీ ప్రసాదరెడ్డి కాళ్లకు మొక్కిన వారికే పదవులు

అందుకు ఆత్మాభిమానం అడ్డొచ్చే పార్టీ నుంచి బయటకు వచ్చా: ఎమ్మెల్సీ వంశీకృష్ణ

మద్దిలపాలెం(విశాఖపట్నం), జనవరి 5: 'ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ప్రసాదరెడ్డి వీసీగా ఉన్న సమయంలో వైసీపీ బ్రోకర్ కార్యాలయంగా తయారు చేశారు. కార్పొరేటర్ అభ్యర్థులు, నామినేటెడ్ పోస్టుల లిస్టులు అక్కడ నుంచే వెళ్లేవి. ఆయన కాళ్ల మీద పడ్డవాళ్ల పేర్లే లిస్టుల్లో ఉండేవి. పోస్టు వచ్చాక మళ్లీ వెళ్లి ప్రసాదరెడ్డి కాళ్లకు మొక్కాలి. ఇదే వైసీపీ సంప్రదాయం. ఆయన కాళ్లకు మొక్కడానికి ఆత్మాభిమానం అడ్డొచ్చే పార్టీ నుంచి బయటకు వచ్చా' అని జనసేన విశాఖ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ.. "కష్టపడి పనిచేసేది నాయకులైతే... ఏయూలో కూర్చొని సీట్లు, పదవులు ఇవ్వడానికి ప్రసాదరెడ్డి ఎవరు? వైసీపీ నవరత్నాల్లో ప్రసాదరెడ్డి ఒక రత్నం. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ జీవీ.. మరో రెండు రత్నాలు. ఈ మూడు రత్నాల వల్లే ఉత్తరాంధ్రలో వైసీపీకి బీసీలు, దళితులు దూరమయ్యారు. మూడేళ్ల పాలనలో ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని బ్రోకర్ కార్యాలయంగా మార్చిన ప్రసాదరెడ్డికి మళ్లీ ఉపకులపతి పదవి ఇస్తే ఏయూ భ్రష్టుపట్టిపోవడం ఖాయం. ఏ రోజూ జెండా మోయని జీవీకీ చైర్మన్ పదవిచ్చారు" అని వంశీ తెలిపారు.

వైసీపీ సర్పంచ్‌లకు టీడీపీ తీర్థం

బాబు సమక్షంలో పాడేరు నియోజకవర్గం నేతల చేరిక

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఈ నెల 3న పంచాయతీరాజ్ చాంబర్ నిర్వహించిన సర్పంచ్‌ల సమర శంఖారావం సభలో ఇచ్చిన హామీలతో వైసీపీ సర్పంచ్‌లు ఆ పార్టీని వదిలిపెడుతున్నారు. గురువారం పాడేరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ సర్పంచ్‌లు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ కాదు

ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ కాదని గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఎస్టీ, వాల్మీకి కులానికి చెందిన వారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ 2016లో ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పీల్ చేశారు. ఆ మేరకు గిరిజన సంక్షేమ శాఖ స్పందించింది.

31న ఎమ్మెల్సీల రాష్ట్రస్థాయి సదస్సు

భీమవరం, జనవరి 5: శాసన మండలిలో ఎమ్మెల్సీలు పాటించాల్సిన విధి, విధానాలపై పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 31న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తెలిపారు. శుక్రవారం భీమవరంలో ఆయన మాట్లాడుతూ శాసన మండలి విధి విధానాల్లో వ్యవహరించాల్సిన తీరు, నిబంధనలపై ఎమ్మెల్సీలకు అవగాహన కల్పిస్తామన్నారు.

నాపై విషప్రయోగం చేశారు: పాల్

విశాఖపట్నం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తనను చంపాలని చూస్తున్నారని, పది రోజుల క్రితం విష ప్రయోగం చేశారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ విశాఖపట్నంలో శుక్రవారం ఆరోపణలు చేశారు. 9 రోజులుగా తాను చికిత్స తీసుకుంటున్నానని చెప్పారు.

మిర్చి ఎగుమతులపై వైసీపీ పడగ

ఒక్క లారీ కూడా లేని నేత చేతుల్లో సంఘం

తమను కాదంటే లోడింగ్‌లే ఉండవంటూ బెదిరింపు

పర్సంటేజీల పేరుతో అధిక రవాణా చార్జీ డిమాండ్

గిట్టుబాటు కాదంటూ తెలంగాణకు వెళ్తున్న ఎక్స్‌పోర్టర్లు

అసోసియేషన్ బ్యాంకు ఖాతాలో రూ.కోటి

తీర్మానం లేకుండానే వైసీపీ నేతకు 20 లక్షలు

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): దోచుకోవడానికి కాదేది అనర్హం అన్నట్లుగా గుంటూరు జిల్లాలో కొంతమంది వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ఆఖరికి లారీ యజమానులను కూడా వదలకుండా దోచుకొంటున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు గుంటూరు నగరం నుంచి ఎక్కువగా ఎగుమతి జరిగే మిర్చి లోడింగ్‌లను తమ చేతుల్లోకి తీసుకొన్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ లేని ఒక అసోసియేషన్‌ని ఏర్పాటు చేసి ఏ ఎక్స్‌పోర్టర్ అయినా ఎగుమతి చేయాలంటే తమని సంప్రదించాలన్న నిబంధన పెట్టారు. తద్వారా లారీ కిరాయి ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తూ అందులో పర్సంటేజీలు దండుకొంటున్నారు. ఎవరైనా ట్రాన్స్‌పోర్టు ఆఫీసు పెట్టి స్వంతంగా ఎక్స్‌పోర్టు లోడింగ్ మాట్లాడుకొంటే నిమిషాల వ్యవధిలో అక్కడికి వెళ్లి వాలిపోతున్నారు. లోడింగ్ జరగకుండా అడ్డుకొంటున్నారు. ఒకవేళ లోడింగ్ చేసినా బలవంతంగా మిర్చి టిక్కీలను దింపేయిస్తున్నారు. వీళ్ల అనుమతితో లోడింగ్‌కు లారీని పెడితే నెలకు ఒక ట్రిప్పు కూడా పడటం లేదని లారీ యజమానులు వాపోతున్నారు. దాంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని ఆవేదన చెందుతున్నారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి లేదని, ఇక్కడ వేధింపులు తాళలేక తాము ఖమ్మం జిల్లా మధిర వెళ్లి అక్కడ ఎక్స్‌పోర్టర్లను సంప్రదించి లారీలు కిరాయికి పెడుతున్నామని తెలిపారు.

తట్టుకోలేక పక్క రాష్ట్రానికి...

దేశ వ్యాప్తంగా మిర్చి ఎగుమతులకు గుంటూరు నగరం పెట్టింది పేరు. సంక్రాంతి పండగ తర్వాత ప్రారంభమయ్యే సీజన్‌లో నిత్యం 20 నుంచి 30 లారీల వరకు ఈశాన్య రాష్ట్రాల మీదగా బంగ్లాదేశ్ సరిహద్దుకు వెళుతుంటాయి. అన్‌సీజన్‌లో 10 నుంచి 15 లారీలు వెళతాయి. మిర్చి ఎగుమతిదారులు ఎవరూ స్వంతంగా ట్రాన్స్‌పోర్టు యజమానులతో మాట్లాడి లారీ కిరాయికి పెట్టుకోవడానికి లేదు. ఏ ఎక్స్‌పోర్టు అయినా వైసీపీ నేత అధ్యక్షుడిగా ఉన్న అసోసియేషన్‌కి నివేదించాల్సిందే. కాగా ఈ అసోసియేషన్ కింద ప్రస్తుతం 600 లారీల వరకు ఉన్నాయి. సీరియల్ ప్రకారం కిరాయిలు కేటాయిస్తామని చెబుతూ వైసీపీ నేతలకు చెందిన లారీలకు మాత్రం ఎలాంటి క్రమపద్ధతి పాటించకుండా నెలలో ఎక్కువ లోడింగ్‌లు చేసుకొంటున్నారు. దీని వలన తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని మిగతా లారీ యజమానులు చెబుతున్నారు. గుంటూరు నుంచి కిరాయితో పోల్చితే మధిర నుంచి కిరాయి రూ.30 వేలు తక్కువగా ఉండటంతో ఎక్స్‌పోర్టర్లు తెలంగాణ వైపు వెళ్లిపోతున్నారు. దాని వలన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నష్టపోతున్నది. అదే ఎగుమతి ఇక్కడి నుంచి జరిగితే మార్కెట్ ఫీజు 1% వస్తుంది. వందల సంఖ్యలో కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ఏపీ నుంచి తెలంగాణ వెళ్లి లారీలను పెడుతున్న యజమానులు కొందరు... 'అక్కడ మాకు నెలకు నాలుగైదు ట్రిప్పులు పడుతున్నాయి. ఇక్కడైతే ఒక్కటే వస్తుంది' అంటున్నారు.

అసోసియేషన్ ఖాతాలో కోటి...

అసోసియేషన్ పేరుతో లారీ యజమానుల వద్ద వైసీపీ నేతలు ట్రిప్పునకు కొంత వసూలు చేస్తున్నారు. అది సుమారు రూ.కోటికి పైగా ఉంది. ఇందులో రూ.20 లక్షలను సంఘం అనుమతి లేకుండానే గత ఎన్నికల్లో వైసీపీ నేతలకు సర్దుబాటు చేశారు. తాజాగా లారీ కిరాయి మరో రూ.10 వేలు పెంచుతామని ఎక్స్‌పోర్టర్లకు చెప్పారు. బెంబేలెత్తిన వ్యాపారస్తులు ఇక్కడ వ్యాపారం తమవల్ల కాదని చెప్పారు. ఈ విషయం గుంటూరు ఏఎంసీ చైర్మన్, మార్కెటింగ్ అధికారుల వద్దకు చేరడంతో వారు చర్చలు జరుపుతున్నారు. సంక్రాంతి తర్వాత తుది నిర్ణయం తీసుకొందామని చెప్పినట్లు తెలిసింది. అసలు ఒక్క లారీ కూడా లేని వైసీపీ నేత ఈ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా గత కొన్నేళ్లుగా కొనసాగుతుండటం కొసమెరుపు.

సిబ్బందితో చెడుగుడు

పనివాళ్లను ఫుట్‌బాల్ ఆడేస్తారు.. ఆ ఐఏఎస్‌ల నివాసమే ఓ నరకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తమ కింద పనిచేసే చిన్నచిన్న ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న ఇద్దరు ఐఏఎస్ అధికారుల ఇంటి బాగోతం చర్చనీయాంశమైంది. ఒక అధికారి ఇంట్లో సిబ్బందిని చిత్రహింసలకు గురి చేస్తే.. మరో అధికారి ఇంట్లో పనివాళ్ల తలలు పగలకొడుతున్నారు. ఆయన గత ప్రభుత్వంలో కీలక స్థానంలో పనిచేశారు. జగన్ ప్రభుత్వంలో మొదట్లో ఈ ఐఏఎస్‌ను కొంతకాలం పక్కన పెట్టారు. ఆ తర్వాత తిరిగి కీలక స్థానాల్లో పోస్టింగ్ పొందారు. ఆయన ఇంట్లో 18 మంది పనివాళ్లు ఉన్నారు. వారికి ప్రభుత్వ ఖజానా నుంచే జీతాలు వెళ్తాయి. ఆయన, కుటుంబం వాడే 4 కార్లకు ప్రభుత్వం నుంచి డ్రైవర్లు ఏర్పాటు చేశారు. ఇంట్లో అధికారి కోసం ఒక కారు, ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు అటెండర్లు పని చేస్తారు. భార్య ఇద్దరు పిల్లల కోసం మూడు కార్లు, నలుగురు డ్రైవర్లు, నలుగురు అటెండర్లు పని చేస్తున్నారు. వీరు కాకుండా ఇంట్లో ప్రతి రోజు ముగ్గురు చొప్పున ఆరుగురు చిన్న స్థాయి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మరో ఐఏఎస్ అధికారి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన కూతురు పనివాళ్లను ఫుట్‌బాల్ ఆడేస్తున్నారు. ఆమె ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందో.. ఎప్పుడు ఎవరితో దురుసుగా ప్రవర్తిస్తుందో చెప్పలేని పరిస్థితి! సదరు అధికారి ఇంట్లో కూడా ఒకటికి రెండుసార్లు పనివాళ్ల తలలు పగిలాయి. దీంతో ఈ ఇద్దరు అధికారుల ఇళ్లల్లో డ్యూటీ అంటేనే ఉద్యోగులు భయపడిపోతున్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు ఇవ్వండి: జాస్తి

న్యూఢిల్లీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): 2023-24వ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రావలసిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కార్యదర్శి మమతా వర్మకు అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయాల్లో సర్పంచులకు చాంబర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏపీలోని స్థానిక సంస్థలకు, గ్రామ పంచాయతీలకు 2022-2023 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నుంచి రావలసిన కేంద్ర నిధులు రూ.1,000 కోట్లు విడుదల చేసి ఏపీ ప్రభుత్వానికి పంపినట్టు ఆమె చెప్పారని వారు తెలిపారు.

ఎఫ్‌డీసీ పదవికి వైసీపీలో పోరు

దేవేందర్ రెడ్డి పదవికి మధుసూదన్ రెడ్డి ఎసరు

తాడేపల్లి ప్యాలెస్‌కు తలనొప్పి.. జగన్ లేక ఆగిన జీవో

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్(ఏపీఎఫ్‌డీసీ) పదవి కోసం వైసీపీలోని ఇద్దరు రెడ్ల మధ్య పోటీ నెలకొంది. సోషల్ మీడియా ద్వారా ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసి.. జగన్‌రెడ్డి మనసు గెలిచిన గుర్రంపాటి దేవేందర్ రెడ్డికి, కేంద్రం చీవాట్లతో పొడిగింపు కోల్పోయిన మాజీ పీసీసీఎఫ్ మధుసూదన్ రెడ్డికి సర్ది చెప్పలేక ప్యాలెస్‌లోని ముఖ్యులు తలపట్టుకొంటున్నారు. ఒకే పదవి కోసం ఇద్దరు పోటీ పడుతుండటంతో సకల శాఖల మంత్రి, సీఎంవోలో చక్రం తిప్పే అధికారి సర్ది చెప్పలేక, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లలేక సతమతమవుతున్నారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా ఇంచార్జిగా పనిచేసిన దేవేందర్ రెడ్డిని 2019లో సమాచార పౌర సంబంధాల శాఖ చీఫ్ డిజిటల్ డైరెక్టర్‌గా నియమించింది. ఆ పదవి పూర్తయ్యాక ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. కాగా, కేంద్ర ప్రభుత్వం సర్వీసు పొడిగించకపోవడంతో పదవి కోల్పోయిన రిటైర్డ్ పీసీసీఎఫ్ మధుసూదన్ రెడ్డిని ఏపీఎఫ్‌డీసీ ఎండీగా నియమించాలని సీఎం జగన్ ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. దీనిపై ఈ నెల 4న జీవో జారీ చేయాల్సి ఉండగా మధుసూదన్ రెడ్డి తనకు సీఎండీ పదవి కావాలని మెలికపెట్టడంతో జీవో ఆగిపోయినట్లు తెలుస్తోంది. చైర్మన్ ఉండగా ఎండీని మాత్రమే నియమించే అవకాశం ఉందని, చైర్మన్‌ను తప్పించి సీఎండీగా నియమించాలంటే సీఎం చెప్పకుండా సాధ్యం కాదన్నారు. మరోవైపు గుర్రంపాటి దేవేందర్ రెడ్డి జామాయిల్ చెట్లు నరికి తరలించే దాంట్లో ఎన్ని కోట్లు తినేశారు.. అవినీతి ఏవిధంగా జరిగింది, దశాబ్దాలుగా తిష్టవేసిన రిటైర్డ్ సిబ్బంది చేస్తున్న కలెక్షన్లు, అటవీ ఉత్పత్తుల ప్రాంతంలోని మేనేజర్లు చైర్మన్‌తో ఎదుర్కొంటున్న ఇబ్బందులన్నింటిపై ఓ ఫైలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. టూర్ల పేరుతో కోట్లు ఖర్చు చేయడం, భోజనాల ఖర్చు లక్షల్లో చూపించడం, నరకడమే తప్ప కొత్తగా చెట్లు నాటక పోవడం, చెన్నైకి తరలిస్తున్న కర్రలో వాటాలు కుదరక వివాదాలు రేగడం.. లాంటి విషయాలన్నీ వివరించేందుకు నడుంబిగించినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో 4 తప్పుడు పోస్టులు పెట్టి నాలుగున్నరేళ్లకు పైగా పదవి అనుభవిస్తున్న వ్యక్తుల్ని ఇంకా ఉపేక్షించడం ఏమిటనే వాదన మధుసూదన్ రెడ్డిని సమర్థించే వారి నుంచి వినిపిస్తోంది. అటవీ భూములు అభివృద్ధి చేసి.. దిగుబడి పెంచి.. ప్రభుత్వానికి రాబడి చూపించాల్సిన ఏపీఎఫ్‌డీసీ చేస్తున్న ఖర్చు కంటే ఆదాయం తక్కువ వస్తోంది. అరకు కాఫీ తోటల నిర్వహణకు గత ఆర్థిక సంవత్సరంలో ఏపీఎఫ్‌డీసీ 16కోట్లు ఖర్చు చేస్తే వచ్చిన ఆదాయం 6.2 కోట్లు మాత్రమే. మిరియాలు, జీడి తోటల్లోనూ ఏటా ఆదాయం తగ్గుతూనే ఉందని కాగ్ తేల్చింది.

ఈ నేపథ్యంలో అనేక అక్రమాలకు నెలవుగా ఉన్న అటవీ శాఖలో పదవి కోసం ఇద్దరు పార్టీ ముఖ్యులు పోటీ పడుతుండటం వైసీపీకి తలనొప్పిగా మారింది.

నచ్చినోళ్లకు ఇచ్చేయ్!

ఉన్నత విద్యామండలిలో ఇష్టారాజ్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యామండలిలో నిధుల వినియోగం ఇష్టారాజ్యంగా మారింది. పారదర్శకతను బుట్టదాఖలు చేస్తూ నచ్చిన కంపెనీలను తీసుకొచ్చి ఏదో ఒక పేరుతో కాంట్రాక్టులు కట్టబెడుతున్నారు. టెండర్లు పిలవకుండా, జీవోలు జారీచేయకుండా నామినేషన్ పద్ధతిలో ఓ ప్రైవేటు కంపెనీకి కాంట్రాక్టు కట్టబెట్టిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ కంపెనీకి డిసెంబరు 21న రూ.51.21 లక్షలను ఉన్నత విద్యామండలి చెల్లించింది. హైదరాబాద్‌కు చెందిన 'బ్లాక్ బక్స్' అనే కంపెనీ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు కల్పించినట్లు ఉన్నత విద్యామండలి బిల్లుల చెల్లింపు పత్రంలో పేర్కొంది. అయితే, ఈ కంపెనీని ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారనేది ఎవరికీ తెలియదు. కనీసం దీనికి సంబంధించి జీవో కూడా ఇవ్వలేదు. అలా ఏకపక్షంగా ఓ కంపెనీకి రూ.అర కోటి నగదు ఇచ్చే ప్రాజెక్టు ఎవరి కోసమనే అనుమానాలు వస్తున్నాయి. ఈ కంపెనీ అన్ని జిల్లాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులకు టెస్టులు నిర్వహించినట్లు మండలి తెలిపింది. అయితే, కేవలం టెస్టులు మాత్రమే నిర్వహించారా? శిక్షణ ఇచ్చారా? అనేది కూడా వెల్లడించలేదు. ఒకవేళ టెస్టులు మాత్రమే నిర్వహించి ఉంటే ఇంత భారీ ఎత్తున నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రయోజనం లేకున్నా కాంట్రాక్టు కంపెనీకి రూ.51 లక్షలు చెల్లించడంపై మండలివర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి.

ఎన్నికల వేళ రుణాల ఎర!

జీవాల పెంపకందార్లను ఆకర్షించే ప్రయత్నం

జగనన్న జీవ సురక్ష రుణాల పేరిట సర్కారు హడావుడి

అమరావతి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకందారులు లక్షలాది మంది ఉన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో వారికి నయాపైసా కేటాయించని జగన్ సర్కారు.. ఎన్నికల వేళ జీవాల పెంపకందార్లకు రుణాల వల విసురుతోంది. నవరత్నాల్లో లేని జగనన్న జీవ సురక్ష పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టి, స్వల్ప రుణాలతో వారిని ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికోసం రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య పెద్దలు హడావుడిగా శుక్రవారం సమావేశం నిర్వహించి, రుణ పథకంపై చర్చించారు. ఈ సమాఖ్య సభ్యుల బాండ్లను ఆప్కాబ్‌లో తనఖా పెట్టి, రాష్ట్రంలోని రెండున్నర లక్షల మంది గొర్రెలు, మేకల పెంపకందారులకు 50% సబ్సిడీ, 40% రుణం, 10 శాతం లబ్ధిదారుని వాటాగా ఒక్కొక్కరికి రూ.3,400 చొప్పున మంజూరు చేయాలని సమాఖ్య పెద్దలు ప్రతిపాదించినట్లు చెబుతున్నారు. ఈ సమాఖ్య లబ్ధిదారులకు రుణాలివ్వాలంటే సహకార చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏదైనా ఆస్తిని మార్టిగేజ్ చేయాలి. అయితే సభ్యుల సేవింగ్ డిపాజిట్ సొమ్మును ఆప్కాబ్‌లో తనఖా పెట్టి, లబ్ధిదారుల బాండ్లును మార్టిగేజ్ చేయించాలని ప్రతిపాదన తెచ్చినట్లు సమాచారం. సమాఖ్య ఇప్పించే రుణం 40% అంటే ఒక్కో లబ్ధిదారుడికి రూ.1,360 రుణంగా వస్తుంది. దీనికి మార్టిగేజ్ ప్రక్రియకే రూ.350దాకా ఖర్చవుతుందని, కొందరు సభ్యులు ప్రస్తావించినట్లు తెలిసింది. ఒకవేళ లబ్ధిదారులు రుణాలు సకాలంలో చెల్లించకపోతే, వడ్డీల భారం పెరుగుతుందని, ఎవరైనా సొమ్మంతా చెల్లించకపోతే, ఆప్కాబ్‌లో తనఖా పెట్టిన సేవింగ్ డిపాజిట్ బాండ్లు జప్తు అయితే, సమాఖ్య నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో ఈ ప్రతిపాదనపై ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. కాగా, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్యను ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. ఇది విభజన చట్టంలో 9, 10 షెడ్యూల్‌లో ఉంది. అయితే ఏపీ, తెలంగాణ మధ్య ఆస్తుల పంపకాన్ని కేంద్ర ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. దీనిపై సుప్రీం కోర్టులో వ్యాజ్యం కూడా నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఈ సమాఖ్య నిధులకు ప్రభుత్వ పెద్దలు ఎసరు పెట్టినట్లు ఆరోపణలొస్తున్నాయి. విభజన తర్వాత ఈ సమాఖ్యకు రూ.115 కోట్లు ఉండగా, గతంలో ఈ నిధుల నుంచి రూ.30కోట్లను ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించింది. మిగిలిన రూ.85 కోట్లను కూడా దారి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. అలాగే జాతీయ సహకార అభివృద్ధి సంస్థ 2వ విడత రుణాల కింద విడుదలైన రూ.88 కోట్లను కూడా ప్రస్తుత ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించింది. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆరు జిల్లాల్లో జీవాల పెంపకందార్లకు 100 శాతం రాయితీతో రూ.15 వేలు చొప్పున విడుదల చేసిన నిధుల్ని అమూల్‌కు పాలు పోసిన లబ్ధిదారులకు మళ్లించారని చెబుతున్నారు.

గుజరాత్ మారిటైమ్ వర్సిటీలో ఎంబీఏ, ఎల్ఎల్ఎం

గాంధీనగర్‌లోని గుజరాత్ మారిటైమ్ యూనివర్సిటీ (జీఎంయూ)- ఎంబీఏ, మాస్టర్ ఇన్ లా(ఎల్ఎల్ఎం) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి.

ఎంబీఏ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్

దీనిని సంస్థ ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మారిటైమ్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తుంది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 106 క్రెడిట్స్ నిర్దేశించారు. ఈ ప్రోగ్రామ్‌ని డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్ బిజినెస్ స్కూల్ రూపొందించింది. ఆలిండియా కోటా కింద 30 సీట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: జాతీయ స్థాయిలో సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ రిమోట్‌లీ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వెర్బల్ ఎబిలిటీ అండ్ కాంప్రహెన్షన్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం గంటన్నర. నెగెటివ్ మార్కులు లేవు. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు 70 శాతం, ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఉంటుంది. సీమ్యాట్/క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎల్ఎల్ఎం

సంస్థ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ లీగల్ స్టడీస్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. మారిటైమ్ లా, ఇంటర్నేషనల్ ట్రేడ్ లా స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో మూడు కంపల్సరీ కోర్సులు, రెండు స్పెషలైజేషన్ కోర్సులు; రెండో సెమిస్టర్‌లో నాలుగు స్పెషలైజేషన్ కోర్సులు, ఒక డిజర్టేషన్ ఉంటాయి. సెమిస్టర్‌కు 13 చొప్పున మొత్తం 26 క్రెడిట్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు, క్లాట్ అర్హత పొందినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ టెస్ట్: కంప్యూటర్/ల్యాప్‌టాప్/ట్యాబ్లెట్/మొబైల్ ద్వారా ఎగ్జామ్ రాయవచ్చు. ఆడియో, వీడియో సౌకర్యాలతోపాటు వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇందులో మొత్తం 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్‌బీ స్థాయిలోనే ఉంటాయి. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, క్రిమినల్ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, టీచింగ్ ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్ అంశాల ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంట.

పర్సనల్ ఇంటర్వ్యూ: ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు సాధించిన వారిని పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా సమాచారమిస్తారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో కూడా పోస్ట్ చేస్తారు.

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో క్లాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు అవకాశం ఇస్తారు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **మాక్/డెమో ఆన్‌లైన్ టెస్ట్:** జూన్ 7
- **ఆన్‌లైన్ ప్రాక్టోర్డ్ అడ్మిషన్ టెస్ట్:** జూన్ 9
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 12, 13
- **ఎంపికైన అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** జూన్ 18
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** gmu.edu.in



ఐఐటీ మద్రాస్‌లో డేటాసైన్స్ అండ్ అప్లికేషన్స్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీఎం)- బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ (2024 జనవరి బ్యాచ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇప్పటికే వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఉద్యోగార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్ట్‌లుగా రాణించవచ్చు.



ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి. ఇందులో నాలుగు దశలు ఉన్నాయి. అవి ఫౌండేషన్ లెవెల్, డిప్లొమా లెవెల్, బీఎస్సీ డిగ్రీ లెవెల్, బీఎస్ లెవెల్.
- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు అసైన్‌మెంట్స్ స్కోర్, క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ఫౌండేషన్ లెవల్‌కు అర్హత సాధిస్తారు. దీన్ని పూర్తి చేసిన తరవాత డిప్లొమాకు ఆ తరవాత బీఎస్సీ డిగ్రీకి, తరవాత బీఎస్‌కి అడ్మిషన్ లభిస్తుంది.
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023కి అర్హత పొందినవారు కూడా అడ్మిషన్ పొందవచ్చు. వీరు క్వాలిఫయర్ ఎగ్జామ్‌నకు బదులు నాలుగు గంటల క్విజ్‌లో అర్హత పొందాల్సి ఉంటుంది. క్విజ్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- ప్రోగ్రామ్ నుంచి ఏ దశలోనైనా అభ్యర్థులు నిష్క్రమించే వీలుంది. పూర్తిచేసిన కోర్సులకు సంబంధించి సంస్థ సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తుంది.
- ఫౌండేషన్ లెవెల్లో ఎనిమిది కోర్సులు ఉంటాయి. 32 క్రెడిట్లు నిర్దేశించారు.
- డిప్లొమా లెవెల్లో ఆరు థియరీ కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. 27 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ లెవెల్లో ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒకదాన్ని లేదా రెంటినీ ఎంచుకోవచ్చు.
- బీఎస్సీ, బీఎస్ లెవెల్లో ఒక్కోదానికి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.
- లెవెల్ వారీగా నిర్దేశించిన ఒక్కో అంతర్గత కోర్సు 12 వారాలు ఉంటుంది. ప్రతి వారం వీడియో క్లాసులు, అసైన్‌మెంట్స్ ఉంటాయి. మంత్లీ క్విజ్‌లు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఉత్తీర్ణులు; కనీసం అయిదు సబ్జెక్టులతో ఎన్ఐఓఎస్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: రెగ్యులర్/జేఈఈ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు మొదట నెల రోజులు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లీష్, మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్, కంప్యూటేషనల్ థింకింగ్ కోర్సులపై తరగతులు ఉంటాయి. ఒక్కో కోర్సుకు సంబంధించి వారానికి 2 నుంచి 3 గంటల వీడియో కంటెంట్ పంపుతారు.

- ప్రతి కోర్సులో అభ్యర్థులకు ఇచ్చిన అసైన్‌మెంట్లను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసి ఆన్‌లైన్‌లో పంపాలి. వీటికి మార్కులు ఉంటాయి. మొదటి మూడు అసైన్‌మెంట్లలో మంచి స్కోర్ వచ్చిన రెంటి యావరేజ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ప్రతి కోర్సులో కనీసం 40 శాతం యావరేజ్ అసైన్‌మెంట్ స్కోర్ సాధించినవారిని మాత్రమే క్వాలిఫయర్ ఎగ్జామ్/ఇన్ పర్సన్ క్విజ్‌కు అనుమతిస్తారు. రిజర్వుడు వర్గాలకు 30 శాతం వస్తే చాలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష సమయం 3 గంటలు. ఒక్కో కోర్సుకు 45 నిమిషాలు ఇస్తారు. ఒక్కో కోర్సులో కనీసం 40 శాతం చొప్పున మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఈ స్కోర్ వ్యాలిడిటీ ఏడాది వరకు ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; జనరల్ కేటగిరీ దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **క్వాలిఫయర్ ఫేజ్ ప్రారంభం:** జనవరి 19 నుంచి
- **క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** ఫిబ్రవరి 25
- **ఫలితాలు విడుదల:** మార్చి 1
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** మార్చి 6 నుంచి 7 వరకు
- **వెబ్‌సైట్:** study.iitm.ac.in

మహా జనపదాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ



క్రీ.పూ.6వ శతాబ్దంలో ఏర్పడిన 16 రాజ్యాలను షోడశ మహా జనపదాలు అంటారు. దీనిని రెండో పట్టణీకరణ అని కూడా అంటారు. మగధ, అంగ, ఛేది, మల్ల, మత్స్య, కురు, గాంధార, అస్మక, కోసల, పాంచాల, కాంభోజ, వజ్జి మొదలైనవి వీటిలో ప్రధాన రాజ్యాలు.

క్రీ.పూ.600 నాటికి షోడశ మహాజనపదాలు 16 రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ప్రస్తుత భారతదేశం అవతల గాంధార, కాంభోజ రాజ్యాలు ఏర్పడ్డాయి. దక్షిణ భారతదేశంలో ఏకైక రాజ్యం అస్మక. ఇది నేటి నిజామాబాద్ జిల్లా. దీని రాజధాని పోతలి(బోధన్). మిగతా రాజ్యాలన్నీ ఉత్తర భారతదేశంలో ఏర్పడ్డాయి. ఈ రాజ్యాల గురించి 'అంగుట్టనికాయ' అనే బౌద్ధ సాహిత్యంలో ఉంది. అవి...

అంగ: బెంగాల్, బిహార్‌లోని భాగల్‌పూర్, మాంఘర్ జిల్లాల ప్రాంతం. దీని రాజధాని చంప.

కాశీ: గంగానది తీరంలో మధ్య ఉత్తరప్రదేశ్ ప్రాంతం. దీని రాజధాని వారణాశి. వరుణ, అసి నదుల మధ్య ఉంది.

కోసల: ఉత్తరప్రదేశ్‌లోని సరయూ నది తీర ప్రాంతం. దీని రాజధాని శ్రావస్తి, అయోధ్య

ఛేది: మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతం. దీని రాజధాని శక్తిమతి

వత్స: యమునా నదీ తీరంలో ఈ మహాజనపదం ఉంది. దీని రాజధాని కౌశాంబి.

కురు: ఢిల్లీ పరిసర ప్రాంతం. దీని రాజధాని ఇంద్రప్రస్థం. నేటి ఆధునిక ఢిల్లీ. మలివేద కాలంలో భరత, పురు తెగలు కలిసి 'కురు' తెగగా ఏర్పడింది.

పాంచాల: ఉత్తర ప్రదేశ్‌లోని బదౌని, ఫరుకాబాద్ జిల్లాల్లో పాంచాల జనపదం ఉంది. దీని రాజధాని అహిచ్ఛిత్ర.

అవంతి: పశ్చిమ మధ్యప్రదేశ్ ప్రాంతం. దీని రాజధాని ఉజ్జయిని.

అస్మక: దక్షిణాపథ రాజ్యం. రాజధాని నిజామాబాద్ జిల్లాలోని బోధన్

మగధ: బిహార్‌లోని పట్నా, గయ జిల్లాల మధ్య ప్రాంతం. రాజధాని గిరివ్రజం, రాజగృహం, పాటలీపుత్రం.

శూరసేన: మధుర కేంద్రంగా యమునా నది తీర ప్రాంతం. రాజధాని మధుర

మత్స్య: రాజస్థాన్‌లోని జైపూర్ ప్రాంతం. దీని రాజధాని విరాట నగరం.

గాంధార: నేటి ఆఫ్ఘానిస్థాన్‌లోని కాందహార్ ప్రాంతం. దీని రాజధాని తక్షశిల నేటి రావల్పిండి.

కాంభోజ: నేటి ఆఫ్ఘానిస్థాన్

మల్ల: కుశినగర్, పావాపురి ప్రాంతాల్లో ఏర్పడిన జనపదం. రాజధాని పావపురి.

వజ్జి: ఉత్తర బిహార్ ప్రాంతం. దీని రాజధాని వైశాలి ప్రాంతం.

ముఖ్యమైన జనపదాలు:

1. మగధ, 2. అవంతి, 3. కోసల, 4. వారణాశి పై రాజ్యాల్లో మగధ రాజ్య విస్తరణకు దోహదపడిన రాజవంశాలు వరుసగా...హర్యంక, శిశునాగ, నంద, మౌర్య.

హర్యంక వంశం

బింబిసారుడు ఈ వంశ స్థాపకుడు. భారతదేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా సిద్ధ సైన్యం ఏర్పాటు చేశాడు. అంగరాజైన బ్రహ్మదత్తున్ని ఓడించి వారి రాజధాని 'చంప'ను ఆక్రమించాడు. బింబిసారుడు కోసల రాకుమార్తెను వివాహం చేసుకొని 'కాశీ' మహాజనపదాన్ని కట్నంగా పొందాడు. అవంతి రాజైన చంద్రప్రద్యోత మహాసేనతో యుద్ధాలు చేసి చివరికి సంధి కుదుర్చుకున్నాడు. బింబిసారుని ఆస్థానంలో 'జనకుణ్ణి' లేదా జీవకుడు అనే వైద్యుడు ఉండేవాడు.

ఆజాత శత్రు: తన తండ్రి బింబిసారుడిని సంహరించి రాజు అయ్యాడు. పాటలీపుత్రం పేరుతో నూతన నగరాన్ని నిర్మించాడు. ఇది ప్రస్తుత బిహార్ రాష్ట్ర రాజధాని పట్నా. కోసల రాజు ప్రసేన జిత్తు కుమార్తె వజ్జీరను వివాహం చేసుకున్నాడు. మహాశిల, రథముశాల అనే నూతన ఆయుధాలు తయారు చేశాడు.

ఉదయనుడు: పాటలీపుత్రను తన రాజధానిగా చేసుకున్నాడు. గంగ, శోణ, సరయూ, గండకి నదుల సంగమ స్థానంలో పాటలీపుత్రం ఉంది. కాబట్టి పాటలీపుత్రం నగరాన్ని గొప్ప జలదుర్గం అని అంటారు. ఉదయనుడు తరవాత అనిరుద్ధ, మండ రాజు, నాగదాసకుడు వరుసగా పరిపాలించారు.

శిశునాగ వంశం

శిశునాగుడు: నాగ దాసకున్ని సంహరించి శిశునాగుడు ఈ వంశాన్ని స్థాపించాడు. వీరి రాజధాని వైశాలి.

కాల అశోకుడు: ఈ వంశంలో మరొక రాజు కాల అశోకుడు. ఇతడు బౌద్ధమతాన్ని ఆదరించాడు. ఈ వంశంలో చివరి వాడు కాకవర్ధిన్

నంద వంశం

శిశునాగ వంశాన్ని ఓడించి, నందవంశాన్ని మహాపద్మనందుడు స్థాపించాడు. ఇతనికి 'రెండో పరశురాముడు', 'ఏకరాట్' అనే బిరుదులు ఉన్నాయి. మహాపద్మనందుడు శూద్ర స్త్రీకి జన్మించినట్లు పురాణాల్లో ఆధారాలున్నాయి. మహాపద్మనందుడు కళింగ(ఒడిశా)పై దండెత్తి కొన్ని జైన విగ్రహాలను పాటలీపుత్రానికి తరలించాడు.

ధననందుడు: ఈ వంశంలో చివరి రాజు ధననందుడు. నంద రాజులను నవనందులు అని కూడా అంటారు. ఈ నంద రాజులను గ్రీకులు 'ఉగ్రసేనులు'గా వర్ణించారు. ధననందుని కాలంలో వాయువ్య ప్రాంతంలో అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తాడు. ధననందుడిని చంద్రగుప్త మౌర్యుడు ఓడించి మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

విదేశీ దండయాత్రలు

పర్షియన్లు: భారతదేశంపై తొలిసారిగా దండయాత్ర చేసిన విదేశీయులు పర్షియన్లు. పర్షియన్స్ అంటే ఇరానీయులు. వీరినే పారశీకులు అని కూడా పిలుస్తారు.

డేరియస్: పర్షియన్లను పాలించిన మొదటి డేరియస్ క్రీ.పూ.516లో పంజాబ్, సింధూ ప్రాంతాలను జయించి తన రాజ్యంలో కలుపుకొన్నాడు. ఆ కాలంలో రాష్ట్రాలను 'సంతృపి' లేదా 'సాత్రపి' అని పిలిచేవారు. ఈ రాజు కాలంలోనే పర్షియా రాజ్యంలో పంజాబ్, సింధూ ప్రాంతాలను 20వ సాత్రపిగా చేర్చారు.

గ్రీకులు: భారతదేశంపై దండయాత్రను చేసిన రెండో వారు గ్రీకులు. క్రీ.పూ. 356లో అలెగ్జాండర్ జన్మించాడు. ఇతని గురువు అరిస్టాటిల్. గ్రీకులకు, పర్షియన్లకు మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. వీటి గురించిన పూర్తి సమాచారం 'హిస్టోరికా' గ్రంథంలో ఉంది.

- క్రీ.పూ.336లో తన తండ్రి మరణాంతరం అలెగ్జాండర్ సింహాసనం అధిష్టించాడు. అనేక గ్రీకు రాజ్యాలను జయించి ఏకీకృతం చేశాడు. తరవాత 'ఆసియా మైనర్' ప్రాంతాలపై దండెత్తాడు. ఈజిప్టును ఆక్రమించి నైలు నది ఒడ్డున అలెగ్జాండ్రియా అనే నగరాన్ని అలెగ్జాండర్ నిర్మించాడు. గౌగమేళ యుద్ధంలో పర్షియా రాజైన మూడో డేరియస్‌ను ఓడించాడు. వారి రాజ్యాన్ని కూడా ఆక్రమించాడు. వారి రాజధాని పెర్సిపోలిస్‌ను ధ్వంసం చేశాడు. అలెగ్జాండర్‌కు వ్యతిరేకంగా గౌగమేళ యుద్ధంలో పర్షియన్లతో కలిసి భారతీయులు కొంతమంది యుద్ధం చేశారు. దాంతో అలెగ్జాండర్ కాబుల్ ప్రాంతాలను ఓడించి కైబర్ కనుమల ద్వారా భారతదేశంలోకి ప్రవేశించాడు.
- అలెగ్జాండర్ తక్షశిల రాజైన 'అంబి'తో సైనిక ఒప్పందం చేసుకున్నాడు. అతనిని తన సామంతుడిగా మార్చుకున్నాడు. క్రీ.పూ.326వ సంవత్సరంలో అలెగ్జాండర్‌కు పురుషోత్తమ్(పోరస్)కు మధ్య హైడాస్పస్(జీలం నది) ఒడ్డున కర్రమైదాన ప్రాంతంలో యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అలెగ్జాండర్ విజయం సాధించాడు. అంబి చక్రవర్తి అలెగ్జాండర్‌ను ఆహ్వానించి సహాయం చేశాడు. ఈ సందర్భంగా భారతీయుల పోరాటపటిమను అలెగ్జాండర్ ప్రశంసించాడు. పురుషోత్తమ్‌ను సత్కరించి, అతని రాజ్యాన్ని అతనికి ఇచ్చి ఒక రాజుగా గుర్తించాడు.
- భారతదేశ వాయువ్య ప్రాంతంలో అలెగ్జాండర్ తాను జయించిన ప్రాంతాలను, కాబుల్‌లోని ప్రాంతాలను కలిపి తన సైన్యాధ్యక్షుడైన సెల్యూకస్ నికేటర్‌ను గవర్నర్‌గా నియమించాడు.
- ఈ క్రమంలో తన సైనిక తిరుబాటు కారణంగా అలెగ్జాండర్ పాటలీపుత్రంపై దాడి చేయకుండానే మాతృదేశానికి పయనమయ్యాడు. మార్గమధ్యలో క్రీ.పూ.323లో ఇరాక్‌లోని బాబిలోనియా ప్రాంతంలో విష జ్వరంతో అలెగ్జాండర్ మరణించినట్లు గ్రీకు చరిత్రకారులు పేర్కొన్నారు. అయితే మరికొన్ని మత గ్రంథాల్లో మాత్రం.. పురుషోత్తమ్‌తో జరిగిన యుద్ధంలో గాయపడి, దాని ప్రభావం చేతనే అలెగ్జాండర్ మరణించినట్లు రాసి ఉంది.
- గ్రీకుల దండయాత్రతో భారతదేశంలో చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.


డాక్టర్ ఐ.నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సూర్యాపేట



మీకు తెలుసా?


- చూడటానికి కాకి లుక్, నెమలిలాంటి చర్మ సోయగం, ఎర్ర పెద్ద ముక్కు ఉండే ఈ పక్షి పేరు 'తకాహె'. రైల్ అనే పక్షి జాతికి చెందినవి. ఇవి కేవలం న్యూజిలాండ్‌లోనే కనిపిస్తాయి.
- 1847లో ఈ పక్షి ఆనవాళ్లు యూరోపియన్లకు తెలిశాయి. అప్పుడే వీటికి ఈ పేరు పెట్టారు.
- రెండున్నర కేజీ వరకూ బరువు పెరిగే ఈ పక్షులు కనీసం 18 సంవత్సరాల పాటు జీవిస్తాయి.
- పురుగులు, ఆకులు, చిన్న గింజలను తిని బతుకుతాయి.
- ఇవి కేవలం మూడు గుడ్లను మాత్రమే పెడతాయి.
- వీటి పెరుగుదల తక్కువ. పుట్టిన పిల్లల్లో 22 నుంచి 85 శాతం మాత్రమే బతికే అవకాశం ఉంది. 2013 లెక్కల ప్రకారం ఇవి కేవలం 263 పక్షులే




ఉండేవి. ఇప్పుడు 500 దాకా ఉన్నాయి. అంటే ఇవి అంతరించిపోయే జాతి అన్నమాట.

- ఇవి సోషల్ బర్డ్స్ కాదు. జూలో ఉంచితే మనుషులతో దగ్గరగా ఉన్నా.. వీటిని చీటికి మాటికి తాకరు. అవి ప్రమాదంలో పడతాయేమోనని వాటికి దూరంగా ఉంచుతారు.
- ఈ పక్షులు వేరే పక్షులతో కొట్లాడటానికి రెడీగా ఉంటాయి. అగ్రెసివ్‌గా ఉంటాయి. కొట్లాడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటాయి. అందుకే వీటిని సంరక్షించటం కత్తిమీద సామే.
- చిన్నపిల్లలు నల్లగా ఉంటాయి. యుక్త వయసుకు వచ్చినప్పుడే బూడిద రంగు, డీప్ బ్లూ రంగులొస్తాయి. దీంతో పాటు ముక్కు కూడా ఎర్రగా మారుతుంది.
- గ్రాస్‌లాండ్స్‌లో తిరిగే ఈ పక్షులు వేటగాళ్లకు సులువుగా దొరికిపోతాయి. ఇందుకు కారణం వాటి సోమరితనమే.

చుక్కలు కలిపి బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 197

	8		2	3				6
					6	3	4	
			8				1	5
				1		7		
	3		7		8		2	
		8		2				
8	9				4			
	4	2	5					
6				7	2		9	

సుడోకు - 196 సమాధానం

8	9	2	3	6	7	5	4	1
5	3	6	4	1	9	8	2	7
4	1	7	8	5	2	6	9	3
9	6	4	5	7	8	1	3	2
1	2	5	6	9	3	7	8	4
3	7	8	2	4	1	9	5	6
7	5	1	9	3	4	2	6	8
2	4	9	7	8	6	3	1	5
6	8	3	1	2	5	4	7	9


ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

చార్జింగ్ స్పీడ్ తగ్గించేందుకు
యాంపియర్ యాప్

బ్యాటరీ డౌన్ అయితే చార్జింగ్ పెట్టడం మనకు తెలిసిన విద్య. అయితే ఆ చార్జింగ్ ఎలా జరుగుతుందో తెలియాలంటే ఏం చేయాలన్నది ప్రశ్న. అందుకు సమాధానమే యాంపియర్ యాప్. చార్జింగ్ వేగాన్ని ఈ యాప్ లెక్కిస్తుంది. ఏ మేరకు కరెంట్ డిస్‌చార్జ్ అయిందో కూడా తెలియజేస్తుంది. మొత్తమ్మీద బ్యాటరీ హెల్త్, పవర్ వినియోగాన్ని ఈ యాప్ వివరిస్తుంది. దశాబ్దం క్రితం అయిదు, పది వాట్స్ చార్జింగ్ సదుపాయం మాత్రమే ఉండేది. ఈ రోజుల్లో రియల్‌మి జీటీ5 అంటే కేవలం పన్నెండు నిమిషాల వ్యవధిలో జీరో నుంచి వందశాతం చార్జింగ్ అవుతోంది. ఈ నేపథ్యంలో యాంపియర్ యాప్ ప్రొ వెర్షన్ బాగా ఉపయోగపడుతుంది. దీని వినియోగం ఎలా అంటే...

- స్మార్ట్‌ఫోన్‌లో యాంపియర్ యాప్‌ను ఓపెన్ చేయాలి. అది రన్ అవుతూ ఉంటుంది. అలా ఆటోమేటిక్‌గా లెక్కింపు పని జరుగుతుంది.
- కొద్ది నిమిషాల తరవాత ఫలితం స్ర్కీన్‌పై కనిపిస్తుంది.
- చార్జ్ లెవెల్, హెల్త్, స్టాటస్, టెక్నాలజీ, మేగ్జిమమ్ కెపాసిటీ, టెంపరేచర్, ఓల్టేజ్ తదితరాలన్నీ ఆ సమాచారంలో ఉంటాయి.

ఎంఏ(మిలియంపియర్)లో ఫలితం ఉంటుంది. దాన్ని వాట్స్‌లోకి మార్చుకోవాలి. గరిష్ఠంగా వినియోగంలో ఉందా లేదా అన్నది కూడా చూసుకోవచ్చు. అయితే ఈ యాప్‌నకు సంబంధించి పెయిడ్ వెర్షన్ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.



అప్‌డేట్

మార్కెట్లోకి నయా స్మార్ట్‌ఫోన్

షావోమి తాజాగా రెడ్‌మి నోట్ 13 సిరీస్ స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో మూడు ఫోన్లు ఉన్నాయి. రెడ్‌మి నోట్ 13, రెడ్‌మి నోట్ 13 ప్రొ, రెడ్‌మినోట్ 13ప్రొ+ పేరిట అవి మూడూ వచ్చాయి.

- రెడ్‌మి నోట్ 13 ప్రొ, రెడ్‌మి నోట్ నోట్ 13ప్రొ+లో ఓలెడ్ డిస్‌ప్లేకు తోడు 12జీబీ ర్యామ్ ఉన్నాయి. 200ఎంపీ మెయిన్ కెమెరా ఉంది. ఆండ్రాయిడ్ 13 ఆపరేటింగ్ సిస్టమ్‌పై ఇవి రన్ అవుతున్నాయి.
- రెడ్‌మి నోట్ 13 ప్రొ - 8జీబీ + 128 జీబీ, 8జీబీ + 256జీబీ, 12జీబీ + 256జీబీ - మూడు వేరియంట్లు కాగా వీటి ధరలు వరుసగా రూ.25,999, 27,999, 29,999గా ఉన్నాయి. ఆర్కిటిక్ వైట్, కోరల్ పర్పుల్, మిడ్‌నైట్ బ్లాక్ రంగుల్లో ఇవి లభ్యమవుతున్నాయి.
- రెడ్‌మి నోట్ 13 ప్రొ+ - ఫ్యూజన్ వైట్, ఫ్యూజన్ పర్పుల్, ఫ్యూజన్ బ్లాక్ రంగుల్లో అందుబాటులోకి వచ్చింది. 8జీబీ + 256 జీబీ, 12జీబీ + 256జీబీ, 12జీబీ + 512జీబీ - మూడు వేరియంట్లు కాగా వీటి ధరలు వరుసగా రూ.31,999, 33,999, 35,999గా ఉన్నాయి.
- రెడ్‌మి నోట్ 13 ప్రొ, రెడ్‌మి నోట్ 13 ప్రొ+ - రెంటిలోనూ 6.67 ఇంచీల 1.5కె ఓలెడ్ డిస్‌ప్లేకు తోడు 1220 x 2712 పిక్సెల్ రిజల్యూషన్‌తో డిస్‌ప్లే ఉంటుంది. ఈ రెండూ 12హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు కలిగి ఉన్నాయి. టాప్‌పై కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ లేయర్ ఉంది.

ప్రొడక్ట్

- రెడ్‌మి నోట్ 13 ప్రొ - ఆక్టా-క్వాల్కామ్ స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జన్2 చిప్‌సెట్, అదే ప్రొ+ విషయానికి వస్తే ఆక్టా-కోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 7200 అల్ట్రా చిప్‌సెట్ కలిగి ఉన్నాయి. డ్యూయల్ సిమ్‌కి రెంటిలోనూ అవకాశం ఉంది. 200ఎంపీ మెయిన్ కెమెరా, 8ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ లెన్స్ 2ఎంపీ మేక్రో షూటర్, ఫ్రంట్‌లో 16ఎంపీ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. ఫింగర్ ప్రింట్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లు ఉన్నాయి. ఐపీ54 రేటింగ్, డస్ట్ - వాటర్ రెసిస్టెంట్‌గా మలిచారు. 13ప్రొలో 5100 ఎంఏహెచ్ బ్యాటరీ, 67 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్, 13ప్రొ+లో 5000ఎంఏహెచ్ బ్యాటరీ, 120 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ కలిగి ఉన్నాయి.

రెడ్‌మి నుంచి బడ్స్!

చైనాలో విడుదల చేసిన రెడ్‌మి బడ్స్‌5ని ఇండియన్ మార్కెట్లోనూ దింపుతారని భావిస్తున్నారు. గ్లాసీ డెకరేటివ్ స్ట్రైప్స్ దీని సొంతం. షావోమీకి చెందిన గోల్డెన్ ఇయర్స్ టీమ్ వీటికి సంబంధించి మంచి సౌండ్ ఎక్స్‌పీరియెన్స్‌ని హామీ ఇస్తోంది. 12.4 ఎంఎం డైనమిక్ డ్రైవర్ యూనిట్ ఇందులో ఉంది. నెట్ ఈజ్ సౌండ్ సర్టిఫికేషన్ కూడా లభించింది. 46 డెసిబిల్స్ మేర యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్ సపోర్ట్ ఉంది. ఈజీ టచ్ కంట్రోల్స్ ఉన్నాయి. షావోమీ హెడ్‌ఫోన్స్ యాప్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. 40 గంటల బ్యాటరీ బ్యాకప్ ఉంది. అయిదు నిమిషాల చార్జింగ్‌తో రెండు గంటల సేపు మ్యూజిక్ వినొచ్చు.

ఇన్‌స్టా మెసేజ్‌లూ కరెక్ట్ చేయొచ్చు

దాదాపుగా యాప్‌లన్నీ మెసేజ్‌లను ఎడిట్ చేసే ఆప్షన్ ఇచ్చాయి. అలాగే 'ఎడిటెడ్' అన్న ట్యాగ్ సైతం ఉంటుంది. అయితే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంపిన మెసేజ్‌లను ఎడిట్ చేసుకోవచ్చు. ఎడిట్ చేసినట్టు మాత్రం తెలియదు. ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు. ఇదో బిల్ట్-ఇన్ ఫీచర్. రెండు ఫీచర్ల కలియకగా ఇది పనిచేస్తుంది. ఇందు కోసం...

- ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంపిన మెసేజ్ తాలూకా చాట్‌విండోని మొదట కనుగొనాలి.
- మెసేజ్ టాప్, లాంగ్ ప్రెస్, తదుపరి కాపీ చేయాలి. మళ్ళీ అదే చర్యను రిపీట్ ఆపై డిలీట్ చేయాలి. దీన్ని ఇన్‌స్టాగ్రామ్ నోటీస్ చేయదు.
- మెసేజ్‌ను మళ్ళీ చాట్ బాక్స్‌లో పేస్ట్ చేయాలి. ఈ పద్ధతిలో మెసేజ్‌ని ఎడిట్ చేసినట్టు ఎవరికీ తెలియదు. అలాగే ఇన్‌స్టాగ్రామ్ నిర్దేశించిన టైమ్ ఫ్రేమ్‌ని యూజర్ గుర్తుంచుకోవాలి. లిమిట్ దాటితే మాత్రం ఈ ప్రాసెస్ పనిచేయదు.

ఇన్‌స్టాగ్రామ్ స్కామ్స్ కట్టడి ఇలా...

విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌కు చెందిన పాత వెర్షన్స్‌కు మద్దతును అధికారికంగా నిలిపివేస్తున్నట్టు ఈ ఏడాది మొదట్లోనే 'వాల్వ్' ప్రకటించింది. పాపులర్ పీసీ లైబ్రరీ, స్టీమ్ ఈ సపోర్టు అందని వాటిలో ఉన్నాయి.

అయితే విండోస్ 7, 8, 8.1 కు స్టీమ్ సపోర్ట్ ఈ ఏడాది మొదటి తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. అందుకు అనుగుణంగా అప్‌గ్రేడ్ కావాలని స్టీమ్ యూజర్లకు కంపెనీ సూచించింది. ఫలితంగా అప్‌గ్రేడ్ చేసుకోవడం లేదంటే అన్‌సపోర్టెడ్ వెర్షన్‌తో రన్ కావడం అన్న రెండు ఆప్షన్లు మాత్రమే యూజర్లకు ఉన్నాయి. స్టీమ్ యూజర్లలో 0.81 శాతం మంది 7, 8, 8.1 వెర్షన్స్‌ను ఉపయోగిస్తున్నారని ఒక సర్వేలో వెల్లడైంది. 53.53 శాతం మంది విండోస్ 10, 42.04 మంది విండోస్ 11పై పనిచేసుకుంటున్నారు. విండోస్ 7 నుంచి 11 వరకు ఉచితంగా అప్‌గ్రేడ్‌కు అనుమతించింది. అయినప్పటికీ అప్‌గ్రేడ్ చేసుకునే విషయంలో కొద్దిపాటి కష్టాలు యూజర్లకు తప్పటంలేదు. గత సెప్టెంబర్‌లో మైక్రోసోఫ్ట్ ఒక లూప్‌హోల్‌ను ఫిక్స్ చేసింది. అందుకు అవసరమైన అప్‌గ్రేడ్ ఇది.

విండోస్ 11 ల్యాప్‌టాప్ మైక్రోఫోన్ పనిచేయకుంటే...?

విండోస్ 11 ల్యాప్‌టాప్‌లో మైక్రోఫోన్ పనిచేయకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సదరు సమస్యను పరిష్కరించేందుకు పలు మార్గాలు ఉన్నాయి.

- మైక్రోఫోన్ హార్డ్‌వేర్‌ను మొదట చెక్ చేయాలి. కంప్యూటర్‌కు దాన్ని సరిగ్గా కనెక్ట్ చేసుకున్నామా లేదా అని సరిచూడాలి. మైక్రోఫోన్ లేదంటే కేబుల్ ఏమైనా దెబ్బతిన్నాయా అన్నది చూడాలి. వేరే యూఎస్‌బీ పోర్ట్ లేదంటే సానుకూలత విషయాలను పరిశీలించాలి.
- ఔట్ డేటెడ్ ఆడియో డ్రైవర్స్‌తోనూ ఇబ్బందులు తలెత్తుతాయి. అలాంటప్పుడు డివైజ్ మేనేజర్ ఆపై ఆడియో డివైజ్‌లను లోకేట్ చేయాలి. దానిపై రైట్ క్లిక్ కొట్టి, అప్డేట్ డ్రైవర్‌ని సెలెక్ట్ చేసుకోవాలి. అప్డేట్ అందుబాటులో ఉంటే ఇన్‌స్టాల్ చేసుకునేందుకు విండోస్‌కు అనుమతి ఇవ్వాలి. అవసరమైతే లేటెస్ట్ డ్రైవర్స్ కోసం ఉత్పత్తిదారు వెబ్‌సైట్‌లోకి వెళ్ళాలి.
- మైక్రోఫోన్‌లో డిఫాల్ట్ రికార్డింగ్ డివైజ్‌గా సెట్ అయి ఉందా లేదా అన్నది చూడాలి. సిస్టమ్ ట్రేలోని స్పీకర్‌పై రైట్ క్లిక్ తదుపరి 'సౌండ్ సెట్టింగ్స్'ను సెలెక్ట్ చేసుకోవాలి. ఇన్‌పుట్ సెక్షన్‌కు వెళ్ళాలి. డిఫాల్ట్‌గా ఉన్న జాబితా నుంచి మీ మైక్రోఫోన్‌ను ఎంపిక చేసుకోవాలి. మైక్రోఫోన్ మ్యూట్‌లో లేకుంటే వాల్యూమ్‌ను అడ్జస్ట్ చేసుకోవాలి.
- విండోస్ 11లో బిల్ట్-ఇన్ ట్రబుల్‌షూటర్స్ ఉంటాయి. కామన్ సమస్యలను అవి ఆటోమేటిక్‌గా ఫిక్స్ చేస్తాయి. సెట్టింగ్స్ - సిస్టమ్ - ట్రబుల్‌షూట్ - అడిషనల్ ట్రబుల్‌షూటర్స్ ఎంపిక - రికార్డింగ్ ఆడియో ట్రబుల్‌షూటర్ రన్ చేయాలి. ఆన్‌స్ర్కీన్ ఇన్‌స్ట్రక్షన్స్ ఫాలో అవ్వాలి. తద్వారా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి.
- మైక్రోఫోన్ యాక్సెస్‌కు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నది చూడాలి. సెట్టింగ్స్ - ప్రైవసీ - మైక్రోఫోన్ తదుపరి టోగెల్ స్విచ్ టర్న్ అయిందా లేదా చెక్ చేసుకోవాలి. ప్రత్యేకించి కొన్ని యాప్స్ విషయంలోనూ ఇదే విషయమై సమీక్షించుకోవాలి.

ఇవేవీ పనిచేయకుంటే సిస్టమ్ రిస్టోర్ చేయాలి. అలా చేసేటప్పుడు ముఖ్యమైన ఫైల్స్ బ్యాకప్‌పై శ్రద్ధవహించాలి. సమస్య అప్పటికీ పరిష్కారం కాకుంటే మైక్రోసాఫ్ట్ సహకారం తీసుకోవాలి.

విండోస్‌కు స్టీమ్ సపోర్ట్ బంద్

విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌కు చెందిన పాత వెర్షన్స్‌కు మద్దతును అధికారికంగా నిలిపివేస్తున్నట్టు ఈ ఏడాది మొదట్లోనే 'వాల్వ్' ప్రకటించింది. పాపులర్ పీసీ లైబ్రరీ, స్టీమ్ ఈ సపోర్టు అందని వాటిలో ఉన్నాయి.

అయితే విండోస్ 7, 8, 8.1 కు స్టీమ్ సపోర్ట్ ఈ ఏడాది మొదటి తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. అందుకు అనుగుణంగా అప్‌గ్రేడ్ కావాలని స్టీమ్ యూజర్లకు కంపెనీ సూచించింది. ఫలితంగా అప్‌గ్రేడ్ చేసుకోవడం లేదంటే అన్‌సపోర్టెడ్ వెర్షన్‌తో రన్ కావడం అన్న రెండు ఆప్షన్లు మాత్రమే యూజర్లకు ఉన్నాయి. స్టీమ్ యూజర్లలో 0.81 శాతం మంది 7, 8, 8.1 వెర్షన్స్‌ను ఉపయోగిస్తున్నారని ఒక సర్వేలో వెల్లడైంది. 53.53 శాతం మంది విండోస్ 10, 42.04 మంది విండోస్ 11పై పనిచేసుకుంటున్నారు. విండోస్ 7 నుంచి 11 వరకు ఉచితంగా అప్‌గ్రేడ్‌కు అనుమతించింది. అయినప్పటికీ అప్‌గ్రేడ్ చేసుకునే విషయంలో కొద్దిపాటి కష్టాలు యూజర్లకు తప్పటంలేదు. గత సెప్టెంబర్‌లో మైక్రోసోఫ్ట్ ఒక లూప్‌హోల్‌ను ఫిక్స్ చేసింది. అందుకు అవసరమైన అప్‌గ్రేడ్ ఇది.

యూపీఐ రికార్డ్

యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) గత ఏడాది డిసెంబర్‌లో లావాదేవీలకు సంబంధించి రికార్డు సృష్టించింది. పన్నెండు వందల కోట్ల లావాదేవీలు పద్దెనిమిది లక్షల కోట్ల మొత్తం మేర జరిగాయి. అంతకు ముందు నవంబర్ నెలలో ఈ మొత్తం 17.4 లక్షల కోట్లు మాత్రమే. 2022తో పోల్చుకుంటే వాల్యూమ్(59 శాతం), వాల్యూ(45శాతం)పరంగా పెరిగిందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) వెల్లడించింది. నవంబర్, డిసెంబర్‌లలో జరిగిన వ్యవహారాన్ని పరిశీలిస్తే వాల్యూపరంగా పెరుగుదల 4.2 శాతం అధికంగా నమోదైంది. ఫెస్టివల్ సీజన్ అక్టోబర్ నుంచి ఈ ఎదుగుదల క్రమంగా ఉంది.



ఇదే సందర్భంలో తాము 'యూపీఐ ఫర్ సెకండరీ మార్కెట్'ని బేటా దశలో ఆరంభిస్తున్నట్టు ఎన్‌పీసీఐ ప్రకటించింది. దీంతో యూపీఐ సభ్యులకు ఫోన్లలోనే 'టాప్ అండ్ పే' సౌలభ్యం లభించనుంది. దేశంలోనే తొలిసారి యూపీఐ ఏటీఎంని హిటాచీ పేమెంట్ సర్వీసెస్ పరిచయం చేసింది. ఎన్‌పీసీఐతో కలిసి దీన్ని నిర్వహిస్తోంది. దీంతో క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి నగదును డ్రా చేసుకోవచ్చు.



ఇతరుల రియల్ టైమ్ లొకేషన్ తెలుసుకోవచ్చు



గూగుల్ కొత్త అప్డేట్‌తో ఆండ్రాయిడ్ యూజర్లకు సరికొత్త వెసులుబాటును కల్పించింది. గూగుల్ మ్యాప్స్ సహాయంతో ఇతరుల రియల్ టైమ్ లొకేషన్‌ను యూజర్లు తెలుసుకోవచ్చు. దీని కోసం కాంటాక్ట్ యాప్ లేటెస్ట్ వెర్షన్‌ది అయి ఉండాలి. నిజానికి ఇది కొత్త విషయం ఏమీ కాదు. ఇప్పటికే ఉనికిలో ఉంది. ఎందుకంటే మెసేజింగ్ యాప్‌లతో రియల్‌టైమ్ లొకేషన్‌ను షేర్ చేసుకునే సదుపాయం ఉంది. అయితే కాంటాక్ట్ యాప్‌లో ఉన్న వారితో జోడింపు ఇది. ఉదాహరణకు యూజర్ ఎవరికైనా కాల్ చేయాలని అనుకుంటే, సదరు వ్యక్తి లొకేషన్ కూడా కొత్త సదుపాయంతో తెలుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మనం ఫోన్ చేయాలనుకునే వ్యక్తి లొకేషన్ తెలుస్తుంది.

అయితే ఈ విషయంలో కొన్నింటిని యూజర్ దృష్టిలో ఉంచుకోవాలి. అవి..

- వేరే వ్యక్తి జీమెయిల్ - యూజర్ అకౌంట్‌లోని కాంటాక్ట్ కార్డులో సేవ్ అయి ఉండాలి.
- యూజర్ చూపించే లొకేషన్ - గూగుల్ మ్యాప్స్‌లోనూ షేరింగ్‌పరంగా ట్యూన్ అయి ఉండాలి. అయితే అవతలి వ్యక్తి లొకేషన్ తెలుసుకోవాలని అనుకున్నప్పుడు మాత్రమే ఈ షేరింగ్ ఆస్కారం ఉండాలి. అలాగే దీన్ని పొందేందుకు లేటెస్ట్ వెర్షన్ 4.22.37.586680692 పై కాంటాక్ట్‌లు అప్డేట్ కావాల్సి ఉంటుంది. అప్డేటెడ్ వెర్షన్‌పై రన్ అవుతోందని తెలుసుకునేందుకు కాంటాక్ట్ యాప్‌పై లాంగ్ ప్రెస్ చేయాలి. యాప్ ఇన్ఫోపై టాప్ చేయాలి. చెక్ చేసినప్పుడు పాత వెర్షన్‌పై ఉన్నట్టు తేలితే వెంటనే గూగుల్ ప్లే స్టోర్‌లో లేటెస్ట్‌ది తీసుకోవాలి.
- గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ షేరింగ్ కోసం, యాప్ ఓపెన్ చేయాలి. ప్రొఫైల్ పిక్చర్‌పై టాప్ చేయాలి. ఎనేబుల్ లేదా డిజేబుల్ కోసం లొకేషన్ -షేరింగ్‌ని టాప్ చేయాలి. అలాగే ఈ ఆప్షన్‌ను నిర్దేశిత కాలానికి పరిమితం చేసుకోవచ్చు.
- ఈ రెండు సెట్టింగులను పొందిన తరవాత వ్యక్తి కాంటాక్ట్ కార్డుపై చిన్నగా గూగుల్ మ్యాప్స్ మాడ్యూల్ ప్రత్యక్షమవుతుంది.


ఆ మాడ్యూల్‌ని టాప్ చేయాలి. అవసరమైన చోట అది మ్యాప్‌ని తీసుకుంటుంది. రియల్ లొకేషన్‌కు చేరుకున్న తదుపరి అలెర్ట్ వస్తుంది. లేదా ఎక్కడ ఉన్నారన్నది తెలుస్తుంది. అంటే సంబంధిత డైరెక్షన్స్ యూజర్ పొందుతారు.

కొనుగోలుదారులకు క్రోమా హెచ్చరిక

గాడ్జెట్ అలాగే ఎలక్ట్రానిక్ కొనుగోలుదారులకు జరుగుతున్న మోసాలకు సంబంధించి టాటా గ్రూప్‌నకు చెందిన క్రోమా హెచ్చరించింది. క్రోమా ఏజెంట్లు లేదా ఉద్యోగులం అంటూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. కస్టమర్లకు ఆ మేరకు 'ఫ్రాడ్ అలెర్ట్ అండ్ డిస్‌క్లయిమర్' పేరిట అలెర్ట్ మెసేజ్‌ను విడుదల చేసింది. క్రోమా పేరిట డూప్ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. కన్జూమర్ ఎలక్ట్రానిక్ చైన్‌కు ఇవి లింక్ అవుతున్నాయి. ఇవి రెండు వెబ్‌సైట్స్‌ను cromawholesellers.com, cromawholesale.com సూచిస్తున్నాయి. ఇవి మరికొన్ని వెబ్‌సైట్లను కలుపుతున్నాయి. అయితే ఈ డూప్ వెబ్‌సైట్ల బారినపడి మోసపోవద్దు. క్రోమా ఉద్యోగులం అని ఎవరు చెప్పినా నమ్మి పేమెంట్స్ చేయవద్దంది. వ్యాలిడ్ పేమెంట్ మెథడ్స్‌ను మాత్రమే ఉపయోగించుకోవాలి. అమ్మకాలకు డీల్స్ అంటూ కాల్స్ కాని గిఫ్ట్ కార్డులు ఇవ్వచూపడం వంటివి గానీ అనుమతించదు. కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌పైనే ఆఫర్లు అన్నీ పొందుపరిచి ఉంటాయి. క్రోమా వాట్సాప్ చానల్, టాటాన్యూ యాప్ లేదా ఇండియాలోని 450కిపైగా ఉన్న స్టోర్స్ నుంచి మాత్రమే లావాదేవీలు జరుగుతాయి. టాటా క్రోమ్ వ్యవహారాలన్నీ అధికారికంగానే ఉంటాయని, మధ్యవర్తులు ఎవరూ ఉండరని కంపెనీ ఈ సందర్భంలో స్పష్టం చేసింది.

అలర్ట్

క్లోన్డ్ కాల్‌ని గుర్తించవచ్చు!



ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) క్లోనింగ్ టెక్నాలజీ ముఖ్యంగా స్కామర్లకు వరంగా మారుతోంది. మనం నమ్మే వ్యక్తిని పోలిన గొంతుతో మోసాలకు పాల్పడేందుకు వీలుచిక్కుతోంది. అయినప్పటికీ అప్రమత్తంగా ఉంటే వీటి నుంచి బైటపడొచ్చు.

క్లోన్డ్ కాల్‌ని గుర్తించడానికి నాలుగు సూచికలు ఉన్నాయి. అందులో మొదటిది అనూహ్యమైన కాల్. అదీ తమకు బాగా తెలిసిన వ్యక్తి నుంచి వస్తుంది. వెంటనే స్పందించకుండా ఒకసారి చెక్ చేసుకోవాలి. ఇంకొకటి అర్జెంట్ రిక్వెస్ట్. అంటే వెంటనే నిర్ణయం తీసుకునే పరిస్థితులను కల్పిస్తారు. ఇక్కడ కూడా 'వినినంతనే వేగ పడక..' అన్న పద్యాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. అర్జంట్‌గా మనీ కావాలనే రీతిలో ఈ కాల్స్ ఉంటాయి.

ఇంకోటి స్పీచ్ విధానం అసహజంగా ఉంటుంది. ఎంత క్లోన్ చేసినప్పటికీ మాట్లాడే తీరులో సాగతీత, ఆగి - మొదలుపెట్టే తీరు, మాట్లాడుతూ ఊపిరితీసుకోవడం వంటి కొన్ని సహజమైన పద్ధతులు ప్రతి వ్యక్తికి ఉంటాయి. దగ్గర వ్యక్తి అని చెప్పుకొన్నప్పుడు లిజనర్ వీటిని పట్టేయవచ్చు. అసహజత్వం ఒక్కటి చాలు అది క్లోన్డ్ కాల్ అని సులువుగా తెలుస్తుంది. చివరిగా వ్యక్తిగత సమాచారం కోసం అభ్యర్థన. బ్యాంక్ అకౌంట్ నంబర్ నుంచి ఏదైనా కావచ్చు. పద్ధతిగా పనిచేసే బ్యాంకులు సహా ఏ ఆర్థిక సంస్థా వ్యక్తిగత సమాచారాన్ని అడగదని గుర్తుంచుకోవాలి.

జాగ్రత్తలు

- అపరిచిత నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు రెస్పాండ్ కాకూడదు. నంబర్‌ని గుర్తించలేని పక్షంలో వాయిస్ మెయిల్ చూడాలి. అదీ మరీముఖ్యమైతే అవతలి వ్యక్తి తప్పకుండా మెసేజ్ చేస్తారు. ఖాళీ ఉన్నప్పుడు లేదా అవసరాన్ని బట్టి రెస్పాండ్ కావచ్చు.
- ఐడెంటిటీని వెరిఫై చేయాలి. మాటనుబట్టి సమాధానం ఇచ్చేయకూడదు. ఫోన్ చేస్తుంది అసలు వ్యక్తి అవునా, కాదా అని తెలుసుకునేందుకు మాటలు పొడిగించాలి. ఇద్దరికీ తెలిసిన ఇటీవలి సంఘటన లేదంటే ఇంతకమునుపు షేర్ చేసుక్న జోక్‌ని ప్రస్తావించి కన్‌ఫర్మ్ చేసుకోవచ్చు.
- తొందరపడి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎంత ఒత్తిడి వచ్చినప్పటికీ వెంటనే ఏదీ చెప్పేయాల్సిన పనిలేదు. ఆలోచిస్తామని కచ్చితంగా చెప్పేయడమే మంచి పద్ధతి. ఫోన్‌లోనే నిర్ణయం తీసుకోలేమని కూడా పద్ధతిగా చెప్పవచ్చు.
- ఏఐ క్లోన్డ్ స్కామ్ అని గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- ఆన్‌లైన్‌లో షేరింగ్‌లోనూ జాగ్రత్తగా ఉండాలి. సామాజిక మాధ్యమాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి. వీటితోనూ స్కామర్ల మోసాలకు పాల్పడుతున్నారు.
- ఈ రోజుల్లో కాల్ బ్లాకింగ్ యాప్స్ అందుబాటులో ఉన్నాయి. స్కామర్స్ సహా అన్‌వాంటెడ్ కాల్స్‌ని బ్లాక్ చేసేందుకు ఇవి ఉపయోగపడతాయి.